www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

గురువారం | 3-1-2019 | పేజీలు: 16 + 20 | వెల: రూ.6.50 | సంపుటి: 15 సంచిక: 178 | శ్రీవిళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి తె. 3.20 తదుపరి చతుర్దశి; నక్షత్రం: అనూరాధ ఉ. 11.03 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: సా. 5.05-6.48; దుర్ముహూర్తం: ఉ. 10.30-11.14, మ. 2.54-3.38; అమృతఘడియలు: తె. 3.25-5.09; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 5.50 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai



దేశమంతటా రైతుబంధు!

ఎకరాకు రూ.8 వేల సాయం
లక్ష దాకా వడ్డీ లేని రుణం!
తెలంగాణ బాటలో మోదీ
ఈ వారంలోనే కేంద్రం ప్రకటన

16



పర్రీకర్ బెడ్రూంలో రాఫెల్ పత్రాలు!

కేబినెట్‌లో సీఎం చెప్పారు
మరొకరితో సంభాషణలో
గోవా మంత్రి రాణే వెల్లడి
కాంగ్రెస్ 'ఆడియో' విడుదల
వాస్తవాలకు మసి: పర్రీకర్

దమ్ముంటే చర్చకు రా!

బెడ్రూంలోని ఫైల్లో ఏముంది?
20 నిమిషాల్లో తేల్చిపారేస్తా
మోదీకి రాహుల్ గాంధీ సవాల్
పార్లమెంటులో రాఫెల్ రభస

16



ప్రధాని అభ్యర్థి మమతే!

ప్రకటించిన తృణమూల్
మేనల్లుడి వీడియో సందేశం

ఉద్యోగులతో పీఆర్సీ కీలక చర్చలు

నేడు టీజీవో, టీఎన్జీవోతో భేటీ
తెలంగాణ ఉద్యోగులతో కూడా
త్వరగా నివేదికను ఇవ్వండి
కోరనున్న ఉద్యోగ నేతలు

6

బీవోబీ, దేనా, విజయా బ్యాంకుల విలీనం

కేంద్ర మంత్రివర్గం ఆమోదం
షేర్ల మార్పిడి నిష్పత్తి ఖరారు

12



భాజాగూడ చెరువు పక్కనే ఉన్న వివాదాస్పద భూమి లెవల్ పెంచేందుకు తోలిన మట్టి కుప్పలు

దర్జాగా కబ్జా

ప్రభుత్వ భూమితో బ్యాంకు నుంచి రుణం

కేఎల్ఎస్ఆర్ అర్బన్ ప్రాపర్టీస్ నిర్వాకం

భూమి విలువ 200 కోట్ల పైమాటే
6 ఎకరాలు సీలింగ్ భూమిగా నిర్ధారణ
నానక్‌రాంగూడకు కూతవేటు దూరంలోనే
4 దశాబ్దాల క్రితమే ప్రభుత్వం స్వాధీనం
తప్పుడు పత్రాలతో విక్రయించిన కబ్జాకోర్లు
తొలుత మిడ్‌వెస్ట్‌కు... తర్వాత కేఎల్ఎస్ఆర్‌కు
భూమితో బ్యాంకుల్లో భారీ ఎత్తున రుణాలు

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అది హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన భూమి. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నుంచి ఓఆర్ఆర్ నానక్‌రాంగూడ సర్కిల్‌కు వెళ్లే విశాలమైన రేడియల్ రోడ్డుకు ఆనుకొని ఉండే స్థలం. ల్యాంకో హిల్స్‌కు కూతవేటు దూరంలో ఉంటుంది. సైబరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్టుకు రెండు నిమిషాల ప్రయాణం. మొత్తం ఆరెకరాలు... విలువ రూ.200 కోట్ల పైనే. నాలుగు దశాబ్దాల క్రితమే ఈ భూమిని పట్టణ భూగరిష్ఠ పరిమితి చట్టం కింద ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. 1995లో ఇందుకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ కూడా ఇచ్చింది. 1997లో స్వయంగా భూమి యజమానే సదరు భూమిని ప్రభుత్వానికి అప్పగించారు. అనంతరం 2011లో ప్రభుత్వం దాన్ని రిజిస్ట్రేషన్ చేయకూడని భూముల జాబితాలో చేర్చింది. తప్పుడు పత్రాల ఆధారంగా భూమిని 2012లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఒక రియల్ ఎస్టేట్ సంస్థ

మిగతా 2వ పేజీలో...

ఏదీ వేగం?

మార్చి 31కి నిర్మాణాలు పూర్తి కావాలి

ఏప్రిల్‌లో ఎత్తిపోతల ట్రయల్ నడవాలి

జూన్‌లో రిజర్వాయర్లు నింపాలి: సీఎం



కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనలో భాగంగా అన్నారం బ్యారేజీ పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

పంప్‌హౌస్, కాల్వలు పరిగెత్తించండి.. సిబ్బందిని 4 రెట్లు పెంచండి
3 షిఫ్ట్‌ల్లో పని చేయించండి.. మేడిగడ్డ పైన కాపర్ డ్యామ్ కడదాం
బ్యారేజీలు పూర్తయ్యే వరకు ఆగలేం.. రైతులు ఎదురుచూస్తున్నారు
'కాళేశ్వరం'లో కేసీఆర్.. 15 కిలోమీటర్ల మేర కాలువల పరిశీలన
బ్యారేజీ పనులపై సీఎం అసంతృప్తి.. లైనింగ్ చేయలేదని ఆగ్రహం

పెద్దపల్లి/మహదేవ్‌పూర్/మెట్‌పల్లి/సిద్దిపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు పనులు జరుగుతున్న తీరుపై ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం రెండోరోజు పర్యటనలోనూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా పంపుహౌస్‌లు, కాలువల నిర్మాణం అనుకున్నంత వేగంగా సాగకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చి 31లోగా ఎట్టి పరిస్థితుల్లో ఈ పనులన్నీ

మిగతా 6వ పేజీలో...

6 నుంచి ఉచితంగా ఈఎన్‌టీ, దంత పరీక్షలు

పైలట్ ప్రాజెక్టు కింద 3 జిల్లాలు.. ఫిబ్రవరిలో రాష్ట్రమంతా

యాదాద్రి స్తంభాలపై నాగరికత!





యాదాద్రి ప్రాకార స్తంభాలపై చెక్కిన నాణాల చిత్రాలు

అష్టభుజి ప్రాకారంలో బాలపాద స్తంభాలు.. వాటిపై తెలంగాణ జీవనం
నాణాలు, ఆటలు, సాగు పద్ధతులు, రాష్ట్ర చిత్ర పటం, ఉద్యమరీతులు
భవిష్యత్తు తరాలకు మన చరిత్ర.. వెయ్యేళ్ల వరకు నిలిచేలా శిల్ప సంపద

కుబేర స్థానమైన ఈశాన్యం వైపు ఉన్న స్తంభంపై రెండు, ఐదు, ఇరవై, ఇరవై ఐదు పైసల సిక్కలు. వాయవ్యం వైపు ఉన్న స్తంభంపై చిర్రగోనె, అష్టాచమ్మా.. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ బొమ్మలు. నైరుతి స్తంభంపై ఆధునిక వ్యవసాయం, ప్రాజెక్టులు, చేతి వృత్తుల చిత్రాలు. ఆగ్నేయంలోని స్తంభంపై తెలంగాణ చిత్రపటం, ఉద్యమ దృశ్యం, తెలంగాణ తల్లి విగ్రహం. యాదాద్రిలో ఏ స్థంభాన్ని మీటినా తెలంగాణ నాగరికత, సంస్కృతే!!

యాదాద్రి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ చరిత్ర, సంస్కృతి, జీవన విధానాలను భవిష్యత్తు తరాలకు పదిలంగా అందించేందుకు సర్కారు సంకల్పించింది. పూర్వీకులు తమ నాగరికత, సంస్కృతిని మనకు అందించినట్టుగానే నేటి మన జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకూ అందించే ఏర్పాట్లు చేస్తోంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా యాదాద్రి ప్రాకార రాతి స్తంభాలపై వివిధ సంస్కృతి చిహ్నాలను ముద్రిస్తోంది. రాతి స్తంభాల్లో

మిగతా 2వ పేజీలో...

'ఎమ్మెల్యే నిధుల'కు మంగళం!

జిల్లాల వారీగా 'ప్రత్యేక అభివృద్ధి నిధి'!
మంత్రుల చేతికి ఖర్చు చేసే అధికారం
సీఎం ఎస్‌డీఎఫ్‌లా అమాత్యుల ఫండ్
సరికొత్త ఆలోచన దిశగా సర్కారు!
ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఇక డమ్మీలేనా



హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ప్రత్యేక అభివృద్ధి నిధి(ఎస్‌డీఎఫ్) మాదిరిగానే మంత్రుల వద్ద ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్)ని పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అమలు చేస్తున్న 'నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాన్ని(సీడీపీ)' ఎత్తేసి, దాని స్థానంలో ఎస్‌డీఎఫ్‌ను అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణ తర్వాత జిల్లాకు ఒక మంత్రి లేదా పార్లమెంటరీ కార్యదర్శిని ఇన్‌చార్జిగా నియమిస్తారు. వారి ఆధ్వర్యంలోనే అభివృద్ధి నిధులను వెచ్చిస్తారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అభివృద్ధి కార్యక్రమాల నుంచి దూరం పెట్టడానికే రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి ఆలోచన వైపు కదులుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఒక్కో ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీకి ప్రభుత్వం ఏడాదికి రూ.3 కోట్లను కేటాయిస్తుంది. ఈ మొత్తాన్నే ఇక మంత్రులకు కేటాయిస్తారు. కేటాయింపు నియోజకవర్గాల వారీగా ఉంటుందా? జిల్లాల వారీగా ఉంటుందా? అన్న స్పష్టత లేదు. నియోకవర్గాల వారీగా ఉంటే మాత్రం విపక్ష ఎమ్మెల్యేలకు తమ నియోజకవర్గం నిధులు మురిగి పోతున్నాయి కాబట్టి ఖర్చు పెట్టాలని ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశం ఉంది. అందుకే, జిల్లాల వారీగా నిధులు కేటాయిస్తారనే ఊహాగానాలు సాగుతున్నాయి. ఇది ఒక విధంగా సీడీపీని మంత్రుల ఆధ్వర్యంలో అమలు చేయడమే. కాంగ్రెస్ హయాంలో జిల్లాకు ఒక ఇన్‌చార్జి మంత్రి ఉండేవారు. నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమంలో ఇన్‌చార్జి మంత్రులు కూడా జోక్యం చేసుకునే వారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లోనూ ఇన్‌చార్జి మంత్రుల మాటే చెల్లుబాటయ్యేది. సీడీపీ స్థానంలో ఎస్‌డీఎఫ్‌ను తేవాలన్న ఆలోచనలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఉంది. ముఖ్యమంత్రి పేరుతో ఉన్న ఎస్‌డీఎఫ్ నిధులను ముఖ్యమంత్రే తన విచక్షణ మేరకు కేటాయిస్తున్నారు. ఇదే బాటలో మంత్రులూ స్వేచ్ఛగా నిధులు కేటాయించే అవకాశం కల్పిస్తారని అంచనా వేస్తున్నారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి 19 మంది, టీడీపీ నుంచి ఇద్దరు మొత్తం 21 మంది ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. ప్రభుత్వ నిధులపై ప్రతిపక్ష ఎమ్మెల్యేల పెత్తనానికి అవకాశం ఇచ్చే బదులు మంత్రులకే మంజూరు బాధ్యతలు అప్పగిస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నది అధికారపక్షం ఆలోచన. ఇది ఇంకా చర్చల దశలోనే ఉన్నట్లు తెలుస్తోంది.

కాకతీయకు 'గండి'

రూ.720 కోట్ల బకాయిలు.. పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్లు

సగం చెరువులు అభివృద్ధికి దూరం.. సీఎం దృష్టి పెడితేనే కదలిక!



హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయ పనుల్లో జోరు తగ్గింది. రాష్ట్రవ్యాప్తంగా చెరువులను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో చేపట్టిన ఈ పథకం పనులు మందగించాయి. సర్కారు ప్రాధాన్యం మారడం.. కోట్లలో బిల్లుల పెండింగ్ వంటి కారణాలతో పనులు దాదాపుగా నిలిచిపోయాయి! ఎన్నికలకు ముందే మిషన్ కాకతీయ పరిధిలోని చెరువుల అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లు నిలిపివేశారు. ఎన్నికల తర్వాత కూడా ఈ పనుల్లో కదలిక రావడం లేదు. ఫలితంగా రాష్ట్రంలోని సగం చెరువులు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఇప్పటికే చేసిన పనులకు సుమారు రూ.720 కోట్ల మేర చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిల ప్రభావం.. జరగాల్సిన పనులపై పడింది. ముఖ్యమంత్రి కేసీఆర్ జోక్యం చేసుకుంటేనే మిషన్ కాకతీయ పనులు మళ్లీ ఊపందుకునే అవకాశం ఉంది. మిషన్ కాకతీయ పథకం కింద రాష్ట్రంలోని సుమారు 46 వేల చెరువులను అభివృద్ధి పరచాలని నిర్ణయించారు. వీటిని దశల వారీగా చేపట్టి.. అభివృద్ధి పనుల్ని

మిగతా 2వ పేజీలో...



అయ్యప్ప గుడిలోకి వెళ్లిన బిందు, కనకదుర్గ

అయ్యప్ప గుడిలోకి ఇద్దరు మహిళలు

బుధవారం తెల్లవారుజామున స్వామి దర్శనం
వారికి పాతిక మంది మఫ్టీ పోలీసుల భద్రత
ప్రవేశాన్ని ధ్రువీకరించిన కేరళ సీఎం విజయన్
అయ్యప్ప భక్తుల ఆగ్రహం.. నిరసన ప్రదర్శనలు
ఒకరోజు బంద్‌కు హిందూ సంస్థల పిలుపు
కేరళ సీఎం పినరయిపై బీజేపీ, కాంగ్రెస్ ధ్వజం

16



పరంజ్యోతి



వినయంతోనే దైవానుగ్రహం

లఘుతాసే ప్రభుతా మిలే, ప్రభుతాసే ప్రభు దూరి
చీంటి లే సెక్కర్ చలీ, హాథీకే సిర్ ధూరి

అల్పునిగా నమ్రతతో అణిగిమణిగి ఉన్న చీమకు దైవ సమానమైన మధుర పదార్థం (చక్కెర) ప్రాప్తిస్తుంది. అహంకారంతో 'నేను' అంటూ గంభీరంగా నడిచే ఏనుగుకు ఏమీ లభించకపోవడంతో ధూళిని మాత్రమే తలపై చిమ్ముకుంటుందని దీని అర్థం. వినయంగా ఉన్నవాడు ఎప్పటికైనా భగవంతుణ్ణి చేరగలుగుతాడని, మనసులోని అహంకారం భగవంతుడికి దూరం చేస్తుందని ఆయన పద్యంలోని అంతరార్థం. వినయం.. వ్యక్తిత్వ నిర్మాణంలోనే కాదు, ఆధ్యాత్మిక అభివృద్ధిలో కూడా గొప్ప పాత్ర పోషించి దైవానుగ్రహానికి మార్గం సులభం చేస్తుంది. వినయసంపద గొప్పదనాన్ని తెలిపే కథ ఒకటి భారతంలో ఉంది. అదేంటంటే.. ఒకసారి సత్యభామ శ్రీకృష్ణునితో 'స్వామీ.. రామావతారంలో సీత మీ భార్యకదా! ఆమె నాకంటే అందంగా ఉండేదా?' అని అడిగింది. ఆ సమయంలో అక్కడే ఉన్న గరుడుడు 'ప్రభూ, నాకంటే వేగంగా ఈ ప్రపంచంలో ఎవరైనా ప్రయాణించగలరా?' అన్నాడు. పక్కనే ఉన్న సుదర్శన చక్రం కూడా.. 'పరంధామా, అనేక యుద్ధాల్లో పాల్గొని మీకు విజయాన్ని తెచ్చిపెట్టాను. నాతో సరితూగువారెవరు స్వామి' అన్నది. ముగ్గురి మాటలూ విన్న నందగోపాలుడు వారికి గుణపాఠం చెప్పాలనుకున్నాడు. దీర్ఘంగా ఆలోచించి.. 'సత్యా, నువ్వు సీతగా మారిపో. నేను రాముణ్ణవుతాను. గరుడా నువ్వు ఆంజనేయుని దగ్గరికి వెళ్లి సీతారాములు నిన్ను తీసుకురమ్మన్నారని చెప్పి తోడ్కొనిరా. చక్రమా, నా అనుమతి లేనిదే ఎవరూ లోపలికి ప్రవేశించకుండా చూడు' అంటూ ముగ్గురికి మూడు బాధ్యతలు అప్పగించాడు. గరుత్మంతుడు హనుమంతుని వద్దకు వెళ్లి.. సీతారాములు రమ్మన్నారని చెప్పాడు. హనుమ ఆనందంతో పులకించిపోతూ.. 'నేను నీ వెనుకే వస్తాను. నువ్వు పద' అని గరుత్మంతుని సాగనంపుతాడు. ఈ ముసలి వానరం రావడానికి ఎంతకాలమవుతుందో కదా అనుకుంటూ గరుడుడు రివ్వున ఆకాశానికి ఎగురుతాడు. కానీ.. ఆయనకంటే ముందే హనుమ ద్వారక చేరడంతో గరుత్మంతునికి మతిపోతుంది. సిగ్గుతో తలదించుకొని మౌనంగా ఉండిపోతాడు. ఇంతలో.. 'హనుమా' అన్నపిలుపుతో పులకించిన ఆంజనేయుడు తన రామునివైపు చూశాడు. 'లోనికి రావడానికి నిన్నెవరూ అడ్డగించలేదా?' అని అడగ్గా.. హనుమ తన నోటి నుండి చక్రాన్ని తీస్తూ 'ప్రభూ, ఇదిగో ఈయన నన్ను లోపలికి రాకుండా ఆపాడు. ఎన్ని చెప్పినా వినకపోవడంతో ఇక లాభం లేదని భావించి నోట్లో పెట్టుకొని మీ ముందు వచ్చి నిలిచాను' అన్నాడు చక్రం కూడా గరుడుని వలె అవమానంతో నేల చూపులు చూస్తూ ఉండిపోయాడు. ఇంతలో హనుమంతుని చూపు తన రాముని పక్కన కూర్చున్న స్త్రీపై పడి 'స్వామీ, మీ పక్కనుండవల్సింది నా తల్లి సీతమ్మకదా! ఎవరీవిడ ప్రభూ' అన్న మాటలు విన్నదే తడువుగా సత్యభామకు కూడా గర్వభంగమై ప్రభువు కాళ్ళ మీద పడింది. అలా కృష్ణ పరమాత్ముడు, ముగ్గురిలో మొగ్గతొడిగిన గర్వాన్ని తుంచివేసి వినయానికున్న విలువేమిటో తెలియచెప్పాడు.

- పరికిపండ్ల సారంగపాణి, 9849630290

తెలంగాణ హైకోర్టు జడ్జిల సంఖ్య పెంచం

- కేంద్ర న్యాయ మంత్రి రవిశంకర్ ప్రసాద్ వెల్లడి
- ఇరు రాష్ట్రాల హైకోర్టులకు అభినందనలు



న్యూఢిల్లీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టుకు న్యాయమూర్తుల సంఖ్య పెంచే ఆలోచన ప్రస్తుతానికి లేదని కేంద్ర న్యాయ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. అయితే పెంపు ప్రతిపాదనను పరిశీలిస్తామని టీఆర్‌ఎస్ ఎంపీ వినోద్ కుమార్ ప్రశ్నకు బదులిచ్చారు. ఉమ్మడి హైకోర్టు విభజన జరిగిన నేపథ్యంలో బుధవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల హైకోర్టులకు మంత్రి అభినందనలు తెలిపారు. రెండు కోర్టులూ దేశ న్యాయ వ్యవస్థలో మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. ఉమ్మడి హైకోర్టును విభజించినందుకు టీఆర్‌ఎస్ ఎంపీ వినోద్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అయితే లక్షలాది కేసులు పెండింగ్‌లో ఉండగా తెలంగాణ హైకోర్టుకు కేవలం 24 న్యాయమూర్తుల పోస్టులే కేటాయించారని చెప్పారు. దీని వల్ల పెండింగ్ కేసులను పరిష్కరించడం సాధ్యం కాదన్నారు. జడ్జిల పోస్టులను పెంచే ఉద్దేశం ఉందా అని ప్రశ్నించారు. జడ్జిల సంఖ్యను పెంచడానికి ప్రత్యేక యంత్రాంగం ఉంటుందని కూడా మంత్రి చెప్పారు.

తొలి సీజేగా గర్వపడుతున్నా

ఓపెనింగ్ బ్యాలెన్స్ 1.87 లక్షల కేసులు.. సకాలంలో తీర్పులిచ్చేందుకు కృషి


- తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ రాధాకృష్ణన్



హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): న్యాయ వ్యవస్థ పేరు ప్రతిష్ఠలను, ఔన్నత్యాన్ని కాపాడేందుకు అందరూ చిత్తశుద్ధితో పని చేయాల్సి ఉందని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ అన్నారు. "మనమంతా చేయి చేయి కలిపి ప్రజలకు ఉన్నతమైన న్యాయ సేవలు అందించేందుకు సన్నద్ధం కావాలి" అని చెప్పారు. తెలంగాణ హైకోర్టుకు తాను మొదటి ప్రధాన న్యాయమూర్తిగా, సహచర న్యాయమూర్తులతో మొదటి టీమ్‌గా ఉన్నందుకు గర్వపడుతున్నానని తెలిపారు. లక్షా 87 వేల పెండింగ్ కేసుల ఓపెనింగ్ బాలెన్స్‌తో తొలి అడుగు వేస్తున్నామని తెలిపారు. నాణ్యమైన తీర్పులు సకాలంలో అందించేందుకు మనం ప్రయత్నించాల్సి ఉందని, దాని కోసం జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ హైకోర్టు ఆవిర్భావం తర్వాత తొలిసారిగా విధులు నిర్వర్తిస్తున్న సందర్భంగా బుధవారం హైకోర్టు ప్రధాన కోర్టు హాలులో ఫుల్‌కోర్టు సమావేశం ఏర్పాటు చేశారు. జస్టిస్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ నిన్నటి వరకు ఎన్నో చారిత్రక ఘట్టాలకు ఈ అద్భుత భవనం సాక్షీభూతంగా ఉందని చెప్పారు. తెలంగాణ హైకోర్టు 2019, జనవరి 1 నుంచి అమలులోకి వచ్చిందని చెప్పారు. తాను, సహచర న్యాయమూర్తులు రాజ్యాంగం నిర్దేశించినట్లు ప్రజల ఆశీసులతో ప్రమాణ స్వీకారం చేశామన్నారు. ఆ కార్యక్రమానికి వచ్చిన గొప్ప వ్యక్తులు, న్యాయవాదులను చూసిన తర్వాత న్యాయ వ్యవస్థపై విశ్వాసమే కాకుండా పెద్ద ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోందని చెప్పారు. న్యాయమూర్తులు, రిజిస్ట్రార్లు, అడ్వకేట్ జనరళ్లు, ప్రభుత్వాలు, న్యాయవాద సంఘాలు, కోర్టు సిబ్బంది, ఇతర అధికారుల సహకారంతో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఉమ్మడి హైకోర్టు విభజన జరిగిందని చెప్పారు. తొలుత తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత న్యాయవాదుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రూ.100 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఇప్పుడు ప్రత్యేక హైకోర్టు ఏర్పడినందున సామాజిక న్యాయం కోసం అంకితం కావాలన్నారు. అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ హైకోర్టు చారిత్రక అంశాలను గుర్తుచేశారు.

హైకోర్టు విభజనపై జోక్యం చేసుకోలేం

- ఏపీ న్యాయవాదుల పిటిషన్‌పై సుప్రీం కోర్టు



న్యూఢిల్లీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి హైకోర్టు విభజనను వాయిదా వేయాలని ఏపీ న్యాయవాదుల సంఘం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. ఇప్పటికే కోర్టు విభజన పూర్తయి న్యాయమూర్తులు ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో తాము జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. పిటిషన్‌పై జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఇది చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్య అని, తాము కూడా విభజన కేసును విచారించి చివరిగా తీర్పు ఇచ్చామని ధర్మాసనం తెలిపింది. ఇలాంటి మార్పులు జరిగిన సమయంలో ఇబ్బందులు సాధారణమేనని పేర్కొంది. ఇప్పటికే కోర్టు కార్యకలాపాలు ప్రారంభమైన నేపథ్యంలో ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది.

యాదాద్రి స్తంభాలపై నాగరికథ

(మొదటి పేజీ తరువాయి)

పొందుపరుస్తున్నారు. దాదాపు వెయ్యేళ్లపాటు పటిష్ఠంగా మనగలిగే రీతిలో కొనసాగుతున్న యాదాద్రి ఆలయ అష్టభుజి ప్రాకార మండపంలోని బాలపాద స్తంభాలపై తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలైన పండుగలు.. నాణేలు.. ఆటలు.. తెలంగాణ ఉద్యమ చరిత్ర, చిత్ర పటం, ఉద్యమకారుల ప్రతిమలను రాతి స్తంభాలపై శిల్పులు చెక్కుతున్నారు. తెలంగాణలో అతి పెద్ద పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సర్కారు పునర్నిర్మిస్తోంది. దాదాపు రూ. వెయ్యి కోట్లతో ఈ విస్తరణ పనులు చేపట్టింది. ఆలయ ప్రాకార మండపాలు, సప్తగోపురాలు, ఆలయ ముఖమండపం, దివ్య విమానంతో పాటు ప్రతి నిర్మాణాన్ని ఆధారశిల నుంచి శిఖరాల వరకు రాతి శిలలతో చేపట్టారు. రాజుల కాలం తర్వాత మొట్టమొదటిసారిగా దేశంలోనే అద్భుత రాతి కట్టడంగా రూపుదిద్దుకుంటున్న యాదాద్రి ఆలయ నిర్మాణంలో కాకతీయ సంప్రదాయ కళారీతుల శిల్పాలు, భాగవత, రామాయణం, దేవతల శిల్పాలతో పాటు వైష్ణవ సంప్రదాయ భక్తాగ్రేసరులు ఆళ్వార్లు, నారసింహ మహత్యపు శిల్పాల పనులు తుదిదశకు చేరుకున్నాయి. యాదాద్రి ఆలయ నిర్మాణాల శైలి, తెలంగాణ ప్రాంతంలోని జీవనవిధానం, సంప్రదాయ సంస్కృతులను ముందుతరాలకు అందించడానికి ఆధ్యాత్మిక, పురాణ శిల్పాలతో పాటు ఆధునిక కాలపు చరిత్రను కూడా రాతిస్తంభాలపై చెక్కించి శాశ్వతంగా చరిత్రలో ఉండేవిధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

రాతి స్తంభాలపై జీవన విధానం.. తెలంగాణ ఉద్యమ చరిత్ర

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాకార రాతి కట్టడాలపై మన జీవనవిధానం, సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించనున్నాయి. ఆలయ బాహ్య అష్టభుజి ప్రాకార మండప బాలపాద స్తంభాలు ఆధునిక చరిత్ర, జీవన విధానాన్ని ఆలయ సందర్శకులకు చాటి చెప్పనున్నాయి. అష్టభుజి ప్రాకారంలోని నాలుగు కోణాల్లోని రాతి స్తంభాలపై మన చరిత్ర.. మన జీవనం ఉట్టిపడే విధంగా రాతి స్తంభాలు దర్శనం ఇవ్వనున్నాయి.

- ఆలయ బాహ్యప్రాకారంలోని అష్టభుజిలోని ఈశాన్య కోణం కుబేర స్థానం. ఈ దిశలోగల బాలపాదం స్తంభాలపై ఒక పైసా, రెండు, అయిదు, 20, 25 పైసల నుంచి ప్రస్తుతం వాడుకలోని ఒక రూపాయి. రెండు, రూ.5 నాణేలను చెక్కారు. నాణేలతో పాటు తెలంగాణ పండుగలు బతుకమ్మ, సంక్రాంతి, ఉగాది తదితర పండుగల సన్నివేశ దృశ్యాలను పొందుపరుచనున్నారు.
- వాయవ్య దిశగా గల ప్రాకార మండప బాలపాద స్తంభాలపై తెలంగాణ ప్రాచీన ఆట కర్రబిళ్ల, అష్టచెమ్మలతో పాటు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ వంటి ఆటల దృశ్యాలను చెక్కనున్నారు.
- నైరుతి దిశలోని బాలపాదం స్తంభాలపై నేటి వ్యవసాయం, ప్రాజెక్టులు, చేనేత వంటి చేతివృత్తుల బొమ్మలను చెక్కనున్నారు.

ఆగ్నేయం దిశగా గల బాలపాదం స్తంభాలపై తెలంగాణ చిత్రపటం, తెలంగాణ ఉద్యమ దృశ్యం, తెలంగాణ తల్లి విగ్రహం, తెలంగాణ ఉద్యమకారుల బొమ్మలను చెక్కి చరిత్రలో సుస్థిరస్థానం కల్పించనున్నారు. ప్రస్తుతం ఈశాన్య దిశగా గల బాలపాదం రాతిస్తంభాలకు నాణేల బొమ్మలను చెక్కారు. నిర్దేశించిన ప్రకారం ఆయా అంశాలను మిగిలిన రాతి స్తంభాలపై నిర్దేశించిన అంశాలను చెక్కడం ద్వారా మన చరిత్ర.. మన సంస్కృతిని వెయ్యేళ్ల తర్వాత కూడా భవిష్యత్తు తరాలకు అందించే ప్రయత్నం చేయనున్నారు.



భూమి లెవెల్ పెంచేందుకు తోలిన మట్టి కుప్పలు

దర్జాగా కబ్జా!

(మొదటి పేజీ తరువాయి)

గుట్టుచప్పుడు కాకుండా ఆ భూమిని బ్యాంకులో తాకట్టు పెట్టి భారీ ఎత్తున రుణం తీసుకుంది. భూమికోసం మొదట గట్టిగా పోరాడిన రెవెన్యూ అధికారులు ఆ తర్వాత ఎందుకో మౌనం వహించారు. పట్టణ భూగరిష్ఠ పరిమితి చట్టం కింద భూమిని ప్రభుత్వానికి స్వాధీనం చేయడానికి ముందే యజమాని తమకు అమ్మినట్లుగా కొందరు పత్రాలు సృష్టించారు. అయితే.. ఈ పత్రాలు చెల్లవని ప్రభుత్వం తేల్చిచెప్పింది. గత నవంబరులో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగమంతా అసెంబ్లీ ఎన్నికల హడావిడిలో ఉండగా ఇక్కడ భూమిని నిర్మాణాలకు వీలుగా చదును చేసే ప్రయత్నం జరిగింది. గతంలో ఈ భూమి చుట్టూ సరిహద్దు గోడ కడితే కూల్చేశారు. ఇప్పుడు భూమి లెవల్ పెంచేందుకు పెద్ద ఎత్తున మట్టి తోలుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.



గతంలో అధికారులు కూల్చేసిన గోడ

వివాదాస్పద భూమి

తెలంగాణ స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లోకి వెళ్లి రంగారెడ్డి జిల్లా పుప్పాలగూడ లోని సర్వే నెంబరు 451 కోసం పరిశోధించగానే 28,330.46 చదరపు అడుగులు(సుమారు 6 ఎకరాలు) సీలింగ్ భూమి ఉన్నట్లుగా కనిపిస్తుంది. ఈ భూమిని అమ్మొద్దు, కొనొద్దు అని హెచ్చరిక చేస్తూ 2011 ఆగస్టు 4న నోటిఫికేషన్ జారీ అయింది. మిగులు భూమి కింద ప్రభుత్వం దీన్ని స్వాధీనం చేసుకుంది. పంచనామా నిర్వహించిన రాజేంద్రనగర్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు 1997 నవంబరు 28నే ఈ భూమిని అప్పగించారు. ఎస్.మల్లయ్య అనే అతను మిగులు భూమి కింద దీన్ని ప్రకటించినట్లు హైదరాబాద్ అర్బన్ ల్యాండ్ సీలింగ్ తహసీల్దారు, ప్రత్యేక అధికారి తేల్చారు. మల్లయ్యకు మొత్తం 9.16 ఎకరాలు ఉండగా అందులో 6 ఎకరాలను అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద మిగులు భూమిగా ప్రకటించారు. సుదీర్ఘ కసరత్తు అనంతరం దీన్ని మిగులు భూమిగా గుర్తించిన ప్రభుత్వం 1995లోనే గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుత మార్కెట్‌లో 200-300 కోట్ల రూపాయలు వరకూ ఈ భూమి విలువ ఉంటుంది. ఈ పరిస్థితుల్లోనే.. మల్లయ్య ప్రభుత్వానికి భూమిని దఖలు పరచకముందే, అంటే 1969 లోనే ఎం.నర్సింహ అనే వ్యక్తికి అమ్మినట్లు పత్రాలు తయారు అయ్యాయి. 1994లో మరో అమ్మకమూ జరిగిపోయింది. అమ్మకం పత్రాలు నకిలీవని అధికారులు తేల్చారు. అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టం ప్రకారం భూమి స్వాధీనానికి జారీ చేసిన ప్రొసీడింగ్స్‌పై నర్సింహ ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదని, పైగా ఆయన డిక్లరేషన్ కూడా ఇవ్వలేదని అధికారులు ప్రస్తావించారు. ప్రభుత్వ భూమి కబ్జాకే ఈ పత్రాలు సృష్టించారని చెప్పారు. అధికారులు భూస్వాధీనానికి శ్రద్ధ చూపకపోవడంతో ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి మారింది. నర్సింహ నుంచి మిడ్‌వెస్ట్ అనే సంస్థకు, అక్కడి నుంచి కెఎల్‌ఎస్‌ఆర్ అర్బన్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు వెళ్లింది. ఇంత జరిగినా రెవెన్యూ పుస్తకాల్లో అది ప్రభుత్వ భూమిగానే ఉంది.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

పుప్పాలగూడ సర్వే నంబరు 451లో సీలింగ్ భూమి అన్యాక్రాంతం విషయం ఇప్పుడే మా దృష్టికి వచ్చింది. ఈ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకుని బ్యాంకులో తాకట్టుపెట్టిన వ్యవహారంపై విచారణ జరుపుతాం. ఇది నిజమని తేలితే భూములను స్వాధీనం చేసుకుంటాం. దీనిపై తగిన విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

- లోకేష్ కుమార్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్

కళ్లకు గంతలు!

మిడ్‌వెస్ట్ (ఇండియా) ఇండస్ట్రీస్ వ్యవహారం అటు కోర్టుకు, ఇటు ఆర్‌బీఐ దృష్టికి వెళ్లింది. కంపెనీ ఆస్తులను స్వాధీన పరుచుకోవాలని కోర్టు ఆదేశించింది. లిక్విడేటర్‌ను కూడా నియమించింది. 2011లో కంపెనీ ఆస్తులను వేలం వేశారు. రూ.18 కోట్లకు కెఎల్‌ఎస్‌ఆర్ డెవలపర్స్ సంస్థ ఆస్తులను కొనుగోలు చేసింది. పుప్పాలగూడ సర్వే నెంబరు 451లోని 9.16 ఎకరాల భూమి ఆ సంస్థ పరమైంది. ఈ మేరకు 2012 మే 3న సేల్‌డీడ్ అయింది. ఆస్తుల్లో ఆరెకరాలు ప్రభుత్వ భూమి అని, పంచనామా అనంతరం 1997లోనే ప్రభుత్వం స్వాధీనమైందని, మిగులు భూమికి సంబంధించి ఎవరికీ ఎలాంటి హక్కులు ఉండవని అంతకుముందు న్యాయస్థానంలో అధికారులు స్పష్టంగా చెప్పారు. కోర్టు ముందు గట్టిగానే వాదించిన ప్రభుత్వ అధికారులు ఆ తర్వాత ఫాలోఅప్ చర్యలు తీసుకోలేదు. ఇది ప్రభుత్వ భూమి అని వెబ్‌సైట్‌లో సమాచారం ఉంచి చేతులు దులిపేసుకున్నారు. దీన్నే కేఎల్‌ఎస్‌ఆర్ సంస్థ అవకాశంగా తీసుకుంది. 2012లోనే ఈ భూమిని రూ.30 కోట్లకు ఒక బ్యాంకులో తనఖా పెట్టింది. రూ.30 కోట్లు మాత్రమే కాకుండా మరికొన్ని బ్యాంకుల నుంచి కూడా భారీ మొత్తంలో రుణం తీసుకున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రభుత్వ అధికారులు ఇప్పటికైనా మేల్కొని తమ భూమిని కాపాడుకుంటే అక్రమార్కుల ఆటకట్టే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేఎల్‌ఎస్‌ఆర్ అర్బన్ ప్రాపర్టీస్ వివరణ కోసం ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

జోరు తగ్గిన కాకతీయ

(మొదటి పేజీ తరువాయి)

మొదలుపెట్టారు. ఇప్పటి వరకు నాలుగు దశల్లో సుమారు 27,788 చెరువులను అభివృద్ధి పరచాలని ఎంపిక చేశారు. ఇందుకోసం సుమారు రూ.9,169 కోట్లు కేటాయించారు. కానీ, రూ.3,634 కోట్లే ఖర్చు చేశారు. ఎంపిక చేసిన వాటిలో 19,530 చెరువుల అభివృద్ధి పనుల్ని పూర్తి చేశారు. 8,258 వేల చెరువుల అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎంపిక చేయనివి 19 వేల వరకు ఉన్నాయి.

తొలి దశలు ఓకే.. తర్వాతే..!

మొదటి, రెండో దశలో ఎంపిక చేసిన చెరువుల అభివృద్ధి పనులు వేగంగా పూర్తయ్యాయి. మూడు, నాలుగో దశలో ఎంపిక చేసిన చెరువుల పనులు మాత్రం ముందుకు కదలడం లేదు. మూడో దశలో 6043 చెరువులను ఎంపిక చేయగా 3078 చెరువుల పనులనే పూర్తి చేశారు. నాలుగో దశలో 4675 చెరువులను ఎంపిక చేయగా 704 చెరువులను మాత్రమే పూర్తి చేశారు. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో చెరువుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. దాంతో మొదటి, రెండో దశ పనులు చాలా వేగంగా పూర్తవడంతో పాటు ఎంపిక చేసిన చెరువుల్లో చాలా వాటిని పూర్తి చేయగలిగారు. తర్వాత ప్రభుత్వ ప్రాధాన్యంలో కొంత మార్పు వచ్చింది. ఈ ప్రభావం మూడు, నాలుగో దశ చెరువులపై పడింది. ఈ పనుల్ని దక్కించుకున్న కాంట్రాక్టర్లు చిన్న స్థాయికి చెందిన వారు కావడంతో బిల్లులను సకాలంలో చెల్లించకపోతే వారికి కష్టమవుతుంది. అయితే ప్రస్తుతం గత కొన్ని నెలలుగా మిషన్ కాకతీయ పనులకు బిల్లులను చెల్లించడం లేదు. మొత్తం రూ.720 కోట్లను చెల్లించాల్సి ఉంది. ఈ బిల్లుల కోసం చిన్న చిన్న కాంట్రాక్టర్లు ఎదురు చూస్తున్నారు. చేసిన పనులకు బిల్లులు అందకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రస్తుతం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు. ఈ నేపథ్యంలో మిషన్ కాకతీయ పనులపై కూడా దృష్టి పెడితేనే పూర్తవుతాయన్న వాదన ఉంది. ముఖ్యంగా పెండింగ్ బిల్లులను చెల్లించడంతో పాటు నిలిచిన పనుల్ని తిరిగి ప్రారంభించడానికి వీలుగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగునీటిని అందించాలనే లక్ష్యం నెరవేరాలంటే చెరువుల అభివృద్ధి కూడా కీలకమే.

రాష్ట్రంలో మిషన్ కాకతీయ పనుల వివరాలు

దశలు	చెరువుల ఎంపిక	పూర్తయినవి	నిధుల వ్యయం (కోట్లలో)	ఆయకట్టు (లక్షల ఎకరాల్లో)
దశ-1	8004	8004	1606	6.99
దశ-2	9066	7744	1561	4.73
దశ-3	6043	3078	439	1.48
దశ-4	4675	704	28	0.19
మొత్తం	27,788	19,530	3,634	13.39

లోకం తీరు



మన పిల్లల పనేం కాదు డియర్...
ఇప్పుడే పార్లమెంట్ నుంచి వస్తున్నాను..!!

చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	6.4	28.8
రామగుండం	9.4	30.4
హైదరాబాద్	9.8	30.5
వరంగల్	11.5	31.0
నల్లగొండ	14.6	29.4

ఈశాన్యం నుంచి చల్లని గాలులు

హైదరాబాద్, జనవరి 02 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య దిశగా చల్లని గాలులు వీస్తుండంతో రాష్ట్ర వ్యాప్తంగా చలి తీవ్రత ఎక్కువగా ఉంది. వాతావరణం పొడిగా ఉన్నప్పటికీ చలి మాత్రం ఎక్కువుంది. రాత్రిపూటే కాకుండా పగటి ఉష్ణోగ్రతలు కూడా పడిపోయాయి. ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో గురువారం కూడా చల్లని గాలులు వీచే అవకాశం ఉందని, ఇదే వాతావరణం మరోరోజు ఉంటుందని తెలిపారు. హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది.



పాక్ నిజం తెలుసుకోవాలి

పాక్ఆక్రమిత కశ్మీర్ ఒక ప్రత్యేక ప్రాంతం. పాకిస్థాన్ రాజ్యాంగం కానీ, చట్టాలు కానీ దానికి వర్తించవు. ఆ దేశ న్యాయాధికారాల పరిధిలోకి అది రాదు. ఆక్రమిత కశ్మీర్‌పై తమ రాజ్యాంగాన్ని చట్టాలను రుద్దలేమని పాక్ పాలకులు తెలుసుకోవాలి.

- లార్డ్ నజీర్ అహ్మద్ (యు.కె.పార్లమెంటు సభ్యుడు)



కాబోయే సీఎం తేజస్వినే

"వచ్చే ఎన్నికల్లో నా తమ్ముడి(తేజస్వియాదవ్) కోసం పనిచేస్తా. తేజస్వినే కాబోయే ముఖ్యమంత్రి. అతనికి ఎల్లప్పుడు నా ఆశీర్వాదాలు ఉంటాయి".

- తేజ్ ప్రతాప్ యాదవ్, బిహార్ ఎమ్మెల్యే, ఆర్జేడీ నేత

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.73.01	పాత ధర 68.32
కొత్త ధర రూ.73.01	కొత్త ధర 68.32

మార్పులేదు



యోగాతో అదుపులో రక్తపోటు!

న్యూఢిల్లీ, జనవరి 2: యోగాతో రక్తపోటును కూడా అదుపులో ఉంచుకోవచ్చునని ఒక సర్వే పేర్కొంది. హైపర్‌టెన్షన్ లక్షణాలున్న రోగులు ఆరు నెలలపాటు యోగా చేస్తే అధిక రక్తపోటు నియంత్రణలోకి వస్తుందని వెల్లడించింది. సర్ గంగారామ్ హాస్పటల్ వైద్యబృందం నిర్వహించిన ఈ సర్వే వివరాలను హైపర్‌టెన్షన్ అనే జర్నల్‌లో ప్రచురించారు.

చికెన్ సూప్‌తో జలుబు దూరం!

బోస్టన్, జనవరి 2: వేడి వేడి చికెన్ నూడిల్ సూప్ వల్ల ఆరోగ్యపరమైన ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయని ఆహారనిపుణులు చెబుతున్నారు. జలుబు చేసినప్పుడు ఎంతో ఉపశమనం లభిస్తుందని, శ్వాస పీల్చుకోవడంలో సమస్యలను దూరం చేస్తుందని బోస్టన్‌కు చెందిన బెత్ ఇజ్రాయెల్ డికొనెస్ మెడికల్ సెంటర్ ప్రతినిధులు తెలిపారు. చికెన్ సూప్‌లోని ఎమినో యాసిడ్‌కు కండరాలు, రక్తనాళాలను ఉద్దీపింప చేసే గుణం ఉందని, అందుకే ఆ రసం తాగిన వెంటనే మనసు తేలిక పడుతుందని అంటున్నారు.

కోవర్టులను సస్పెండ్ చేయాలి: పిడమర్తి

సీనియర్ల అభ్యంతరం



సత్తుపల్లి రూరల్, జనవరి 2: ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన టీఆర్ఎస్ నాయకుడు మట్టా దయానంద్ విజయ్ కుమార్ ఇటీవలి ఎన్నికల్లో టీడీపీ కోవర్టుగా పనిచేశారని, అతనిని టీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవలి ఎన్నికల్లో విజయ్‌కుమార్ టీడీపీ కోవర్టుగా పని చేశారని ఆరోపించారు. సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లను మంగళవారం కలిసి ఈ విషయం విన్నవించానని వెల్లడించారు. దయానంద్‌తోపాటు మరికొందరు కూడా ఎన్నికల్లో తనకు సహకరించలేదని, వారిపై కూడా ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. దీంతో సమావేశంలో ఒకింత అలజడి చెలరేగింది. దయానంద్‌ను సస్పెండ్ చేయాలని పిడమర్తి రవి మాట్లాడుతుండగా పార్టీ సీనియర్ నాయకుడు గాదె సత్యనారాయణ, కొత్తూరి ప్రభాకర్‌రావు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇది సందర్భం కాదని, పంచాయతీ ఎన్నికల సమయంలో ఇలాంటి విషయాలు ప్రస్తావించడం సరికాదంటూ అభ్యంతరం తెలిపారు. అయినా పిడమర్తి రవి తన డిమాండ్‌ను గట్టిగా వినిపించి.. సమావేశం ముగిసిందని ప్రకటించారు.

కాంగ్రెస్ శ్రేణుల బాహాబాహీ !

ఆదిలాబాద్ కార్యకర్తల సమావేశంలో మైనార్టీల ఘర్షణ



వేదికపై ఘర్షణ పడుతున్న కార్యకర్తలు

ఆదిలాబాద్ టౌన్, జనవరి 2: ఆదిలాబాద్‌లో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం కార్యకర్తల దాడులు, ప్రతిదాడులకు వేదికగా మారింది. ఆద్యంతం రసాభాసగా సాగింది. మైనార్టీ కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. కొట్టుకుందాం రా.. అంటూ పిడిగుద్దులు కురిపించుకున్నారు. పార్టీలో సీనియర్ నాయకుడుగా ఉన్న మైనార్టీ నేత సాజిద్ ఖాన్‌ను ఉద్దేశించి మరో మైనార్టీ కార్యకర్త విమర్శించడం గొడవకు దారితీసింది. పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేసేందుకు జిల్లా కేంద్రంలో బుధవారం ఆదిలాబాద్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన రాంచంద్రారెడ్డి.. మాజీ ఎంపి రాథోడ్ రమేష్, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి సుజాత, నియోజకవర్గ ఇంచార్జి బార్గవ్ దేశ్‌పాండేలతో కలిసి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో సాజిద్ ఖాన్ వర్గానికి, మరో వర్గానికి ఉన్న విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. ఒకరిపై మరొకరు దాడులకు పాల్పడడంతో.. వేదికపై ఉన్న కాంగ్రెస్ ముఖ్య నాయకులంతా నివ్వెరపోయారు. గొడవకు దిగిన కార్యకర్తలను ఎలా ఆపాలో తెలియక తలలు పట్టుకున్నారు. చివరకు రాంచంద్రారెడ్డి, గండ్రత్ సుజాతల జోక్యంతో వివాదం సద్దుమణిగింది.

ఓటమికి ఆలస్యమే కారణం : రాంచంద్రారెడ్డి

గడిచిన శాసనసభ ఎన్నికల్లో పార్టీ ఓటమికి అభ్యర్థులు, కార్యకర్తలు కారణం కాదని.. అధికార పార్టీ ధన బలం, మద్యం పంపిణీతో పాటు టికెట్ల కేటాయింపులో అధిష్టానం చేసిన ఆలస్యమే తమ కొంప ముంచిందని.. అందువల్లే ఓటమి పాలయ్యామని రాంచంద్రారెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి కార్యకర్తలతో వచ్చింది కాదని, దానికి ఏమాత్రం చింతించే అవసరం లేదన్నారు. వచ్చే పంచాయతీ, సహకార, మున్సిపల్, లోక్‌సభ ఎన్నికల్లో కార్యకర్తలు విభేదాలను పక్కనపెట్టి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



వివరాలు వెల్లడిస్తున్న జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీనాచారి

'జాగృతి' చొరవతో మలేషియా బాధితులకు విముక్తి

నందిపేట, జనవరి 2: నిజామాబాద్ ఎంపీ, తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చొరవతో ఐదుగురు మలేషియా బాధితులకు విముక్తి లభించింది. ఒక్కొక్కరికి రూ.40వేల ఖర్చు భరిస్తూ బాధితులను సొంత గ్రామాలకు పంపించారు. పూర్తి వివరాలను బుధవారం నిజామాబాద్ జిల్లా నందిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీనాచారి వెల్లడించారు. మండలంలోని బాద్గునకు చెందిన నింగి విజయ్ కుమార్, అల్లాడి సురేష్, ఉమ్మెడ గ్రామానికి చెందిన బుక ప్రశాంత్, ఆకుల సంతోష్, మాయాపూర్ గ్రామానికి చెందిన వరగంటి బాలాగౌడ్‌ను నవీపేట మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన గల్ఫ్ ఏజెంట్ కంపెనీ వీసా పేరుతో విజిట్ వీసాపై మలేషియా దేశానికి పంపాడు. అక్కడ ఉద్యోగం లేకపోవడంతో పస్తులు ఉంటున్న ఐదుగురు బాధితులు ఉమ్మెడకు చెందిన జాగృతి జిల్లా నాయకుడు మనోజ్‌కు విన్నవించారు. దీంతో నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు నవీనాచారి మలేషియాలోని భారత రాయబార కార్యాలయం ప్రతినిధులతో మాట్లాడి ఐదుగురు బాధితులను ఇండియాకు రప్పించారు.

మహిళల ప్రవేశంపై అయ్యప్ప భక్తుల ఆందోళన

▸▸ సైదాబాద్, మహబూబ్‌నగర్‌లో నిరసన ర్యాలీలు

సైదాబాద్/హైదరాబాద్/మహబూబ్‌నగర్ న్యూటౌన్ జనవరి 2 (ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్పస్వామి దేవాలయంలోకి పోలీసుల బందోబస్తు మధ్య బుధవారం తెల్లవారుజామున ఇద్దరు మహిళలు ప్రవేశించడంపై అయ్యప్ప భక్తులు ఆందోళన చేపట్టారు. హైదరాబాద్‌లోని సైదాబాద్ ప్రధాన రహదారి నుంచి చంపాపేటలోని ఎమ్మార్వో కార్యాలయం వరకు నిరసన ర్యాలీగా వెళ్లి ధర్నా చేపట్టారు. అనంతరం శబరిమల పవిత్రతను కాపాడుదామంటూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మరోవైపు కేరళ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మహబూబ్‌నగర్‌లోని గడియారం చౌరస్తాలో అయ్యప్ప స్వాములు ధర్నా నిర్వహించారు. శబరిమలలో మహిళల ప్రవేశం అంశంపై కేంద్ర ప్రభుత్వం కల్పించుకోవాలని డిమాండ్ చేశారు.

కేంద్రీయ విద్యాలయానికి శాశ్వత భవనం

▸▸ అన్ని సౌకర్యాలతో నిర్మాణం: హరీశ్

▸▸ తాత్కాలిక భవనంలో తరగతులు షురూ



కేంద్రీయ విద్యాలయం తరగతుల ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట రూరల్/సిద్దిపేట ఎడ్యుకేషన్, జనవరి 2 : సిద్దిపేటకు మంజూరైన కేంద్రీయ విద్యాలయానికి అన్ని సౌకర్యాలతో శాశ్వత భవనం నిర్మిస్తామని ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ఇప్పుడు తరగతుల నిర్వహణ కోసం తాత్కాలిక భవనాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సిద్దిపేట జిల్లా పరిధిలోని చిన్న గుండవెల్లి శివారులో ఉన్న ఎల్లంకి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో బుధవారం కేంద్రీయ విద్యాలయం తరగతుల ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సిద్దిపేటలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ఎనిమిదేళ్ల నుంచి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ ప్రభాకర్‌రెడ్డి కృషి వల్లే కేంద్రీయ విద్యాలయం ఏర్పాటైందన్నారు. ప్రస్తుతానికి ఉన్న భవనం తాత్కాలికమేనని, సిద్దిపేట శివారులో మెడికల్ కాలేజీ సమీపంలోనే కేంద్రీయ విద్యాలయానికి శాశ్వత భవనం నిర్మిస్తామని చెప్పారు. కాగా, స్థానిక పబ్లిక్ సర్వెంట్స్ హోంలో విశ్రాంత ఉద్యోగులు, ఎన్జీవోస్ భవన్ కార్యవర్గ సభ్యులు నిర్వహించిన కృతజ్ఞత సభలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేటను అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి తగిన లక్ష్యాలను నిర్దేశిస్తే, అందరి సహకారంతో పూర్తి చేసే బాధ్యత తనదని పేర్కొన్నారు. కొత్తగా నిర్మిస్తున్న కలెక్టరేట్ వద్ద 300 ఎకరాల్లో ఆక్సిజన్ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రైల్వే లైన్ పనులు, నీటి పారుదల ప్రాజెక్టుల పనులు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. సిద్దిపేట చుట్టూ మరో రింగురోడ్డును నిర్మించుకోవడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2500 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తి కావచ్చిందని, సిద్దిపేటకు మెడికల్ కళాశాల, కేంద్రీయ విద్యాలయం తీసుకొచ్చామని గుర్తు చేశారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ఇంకేం కావాలో సూచించాలని కోరారు.

బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌పై న్యాయ పోరాటం: కృష్ణయ్య

బర్కత్‌పుర/రవీంద్రభారతి/హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం లేకుండా బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్‌ను జారీ చేయడం రాజ్యాంగ విరుద్ధమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. సీఎం కేసీఆర్ అత్యుత్సాహంతో గవర్నర్‌కు నివేదిక పంపి బీసీ రిజర్వేషన్లను పంచాయతీరాజ్ ఎన్నికల్లో తగ్గిస్తూ వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని మండిపడ్డారు. రిజర్వేషన్లపై ఆర్డినెన్స్‌కు విరుద్ధంగా న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. 12 బీసీ సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను బుధవారం బషీర్‌బాగర్ ప్రెస్‌క్లబ్‌లో ఆర్.కృష్ణయ్య వెల్లడించారు. గతంలో ఉత్తరప్రదేశ్ హర్యానా రాష్ట్రాలలో మంత్రి వర్గం ఆమోదం లేకుండా జారీ చేసిన ఆర్డినెన్స్‌ను ఆయా రాష్ట్రాల ఉన్నత న్యాయస్థానం కొట్టివేసిందని కృష్ణయ్య గుర్తుచేశారు. ఇక్కడ సీఎం కేసీఆర్ మాత్రం ఆ నిబంధనను తుంగలో తొక్కారని రాష్ట్ర గవర్నర్ కూడా ఏమీ పరిశీలించకుండానే సంతకం చేయడం సరికాదన్నారు.

జగమంతా రామమయం !

భద్రాద్రిలో వైభవంగా విశ్వరూప సేవ



108 దేవతామూర్తులను ఒకే చోటకు చేర్చి ప్రత్యేక అలంకరణ చేయడంతో భద్రాద్రి కలియుగ వైకుంఠమైంది. గరుడవాహనంపై రాముల వారు ఆసీనులవగా సాయం సమయంలో ఆయన సన్నిధిలో ఇతర ఉత్సవ మూర్తులకు ఆరాధన నిర్వహించారు. - భద్రాచలం

భద్రాద్రిలో బుధవారం రాత్రి సర్వదేవతాలంకారం (విశ్వరూప సేవ) కన్నుల పండువగా సాగింది. తిలకించిన వేలాదిమంది భక్తులు భక్తి పారవశ్యంలో ఓలలాడారు. అంతా రామమయం.. ఈ జగమంతా రామమయం.. అంటూ దేవస్థాన విద్వాంసులు కీర్తనలను ఆలపిస్తుండగా.. తన్మయత్వంతో భక్తులు రామ నామస్మరణ చేశారు. దీంతో ఆ ప్రాంతమంతా పులకించింది. వైకుంఠ ఏకాదశి తరువాత వచ్చే బహుళ ద్వాదశి ఘడియల్లో ఉత్సవమూర్తులన్నింటినీ ఒకే చోట చేర్చి ఆరాధన నిర్వహించడం భద్రాద్రి దేవస్థానంలో ప్రత్యేకత. ఈ సమయంలో ఆలయంలోని

బీసీ రిజర్వేషన్లను కుదించడం అన్యాయం : కోదండ



ఇందూరు, జనవరి 2: బీసీ రిజర్వేషన్లను 34% నుంచి 22శాతానికి కుదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావడం అన్యాయమని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం అన్నారు. బుధవారం నిజామాబాద్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో బీసీ రిజర్వేషన్లు కేవలం 18 శాతమే అమలవుతున్నాయని, దీంతో గ్రామ స్థాయిలోనే బీసీ నాయకుల ఎదుగుదల నిలిచిపోతుందన్నారు. పార్టీలకతీతంగా జరగనున్న సర్పంచ్‌ల ఎన్నికల్లో సేవాభావం గల విద్యావంతులను ప్రోత్సహించాలని, టీజేఎస్ పక్షాన గ్రామాల్లో కరపత్రాలు, పోస్టర్ల ద్వారా ప్రచారం చేస్తామని తెలిపారు.

అప్పుల బాధతో ముగ్గురు రైతుల ఆత్మహత్య

▸▸ విద్యుదాఘాతంతో ఒకరు మృతి

తంగళ్లపల్లి/మాడ్గుల/మామడ, డిసెంబరు 2 : రాష్ట్రంలో ముగ్గురు రైతులు అప్పుల బాధతో బుధవారం ఆత్మహత్య చేసుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్‌కు చెందిన యాదగిరి(42) పత్తి సాగు చేయగా తీవ్రంగా నష్టపోయాడు. కొద్ది రోజుల క్రితం ప్రమాదంలో గాయపడగా చికిత్స కోసం అప్పులు చేశాడు. ఆ తర్వాత కుమార్తె అనారోగ్యానికి వైద్య ఖర్చుల కోసం అవస్థలు పడ్డాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకున్నాడు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం ఇర్విన్‌కు చెందిన జంగయ్య (42) పత్తి సాగు చేయగా తీవ్ర వర్షాభావంతో పత్తి ఆశించిన మేర దిగుబడి రాలేదు. దీంతో అప్పులు తీర్చలేక ఇంట్లో పురుగుల మందు తాగాడు. అలాగే, నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్‌కు చెందిన రాజన్న(58) పంట సాగులో నష్టాలు రావడం, అప్పులు పెరిగిపోవడంతో మనస్థాపం చెంది పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఎల్లాపురంలో రాంబాబు (35) పొలంలో మోటార్ వద్ద విద్యుదాఘాతంతో మృతి చెందాడు.

31లోగా భూ బకాయిలు చెల్లించాలి

▸▸ ఖమ్మం జిల్లా జడ్జికి హైకోర్టు ఆదేశం

▸▸ పరిహారం చెల్లింపులో జాప్యంపై ఆగ్రహం

హైదరాబాద్, జనవరి 2(ఆంధ్రజ్యోతి):సింగరేణి కోసం సేకరించిన భూములకు పరిహారమివ్వాలని ఆదేశించినా...బకాయిలు చెల్లించక పోవడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధితులకు ఈనెల 31కల్లా పూర్తిగా బకాయిలు చెల్లించి యథార్థ నివేదిక ఇవ్వాలని ఖమ్మం జిల్లా జడ్జిని ఆదేశించింది. ఈమేరకు రాష్ట్ర హైకోర్టు సీజే రాధాకృష్ణన్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. తనకు చెందిన 5.21 ఎకరాల భూమిని సేకరించారని, పరిహారం చెల్లించాలని లోక్ అదాలత్ కోర్టు 2016లో ఆదేశాలిచ్చినా పరిహారం చెల్లించలేదంటూ... చింతల బాలభద్ర విఠలయ్య అనే రైతు హైకోర్టుకు వెళ్లారు. దీనిపై పరిహారం కోసం బాధితులు కొందరు గతంలో ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలు విచారించిన హైకోర్టు బాధితులకు పరిహారం చెల్లించాలని ఆదేశించింది. అయినా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో పిటిషనర్ మరోసారి హైకోర్టుకు వెళ్లారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది రచనారెడ్డి వాదించారు. ఎటువంటి చట్ట ప్రక్రియ పాటించకుండానే 2013 డిసెంబరు 30న 1894 నాటి భూసేకరణ చట్టం ప్రకారం అన్నీ కలుపుకొని ఎకరాకు సుమారు 3.49 లక్షలు పరిహారంగా ప్రకటించారని తెలిపారు. దీన్ని తిరస్కరించిన బాధితులు హైకోర్టుకు వెళ్లగా, హైకోర్టు స్టే ఇచ్చిందన్నారు. సుదీర్ఘ చర్చల తర్వాత లోక్ అదాలత్‌లో ఏకమొత్తంగా 89.48 లక్షలు చెల్లించేందుకు అంగీకారం కుదిరింది. భూమిలో ఉన్న చెట్లు, బావులకు అదనంగా చెల్లించేందుకు సింగరేణి సంస్థ అంగీకరించిందన్నారు.

హసీనా హ్యాట్రిక్

బంగ్లాదేశ్ ఎన్నికల్లో షేక్ హసీనా నాయకత్వంలోని అవామీలీగ్ ఘన విజయం సాధించడం భారతదేశానికి పెద్ద ఉపశమనం. మాల్దీవుల్లో భారత వ్యతిరేకి అబ్దుల్లా యామీన్ స్థానంలోకి సాలిహ్ రావడం, శ్రీలంకలో అధ్యక్షుడు సృష్టించిన రాజకీయ సంక్షోభం తరువాత రణిల్ విక్రమసింఘే తిరిగి ప్రధాని కావడం, ఇప్పుడు సరిహద్దులు పంచుకుంటున్న బంగ్లాదేశ్‌లో భారత్ అనుకూల ప్రభుత్వం కొనసాగడం మనకు అనేక తలనొప్పులనుంచి విముక్తి కలిగించే పరిణామాలు. ఆమె మూడవపర్యాయం కూడా అధికారంలో ఉండటం వల్ల వివిధ రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ, ప్రగతిబాట పడుతున్న బంగ్లాదేశ్‌లో సుస్థిరత ఏర్పడుతుంది.

హసీనా ఘన విజయం విమర్శలకు అతీతమైనదేమీ కాదు. మొత్తం మూడువందల స్థానాల్లో, అవామీలీగ్ పోటీచేసిన 299 స్థానాల్లో పదిసీట్లను మాత్రమే అది కోల్పోయింది. అలాగే, హసీనాకు రెండు లక్షల ముప్పైవేల ఓట్లు వస్తే బంగ్లా నేషనలిస్టు పార్టీ (బిఎన్‌పి) అభ్యర్థి నూటయాభై ఓట్లు కూడా తెచ్చుకోలేకపోవడం అనేకులను ఆశ్చర్యపరచింది. హసీనాకు పరాజయం తప్పదనీ, బ్యాలెట్‌పెట్టెల్లో ప్రజాగ్రహం నిక్షిప్తమై ఉన్నదని పోలింగ్ పూర్తయిన వెంటనే వ్యాఖ్యానించిన విపక్షం ఈ ఫలితాలను చూసి నిర్ఘాంత పోయింది. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయనీ, తిరిగి ఎన్నికలు జరపాలనీ, న్యాయస్థానాలకు పోతామని ఇప్పుడు అంటున్నది. ఎన్నికల్లో తీవ్రమైన హింస జరిగి, అక్కడక్కడ అక్రమాలు చోటుచేసుకున్నప్పటికీ, ఎన్నికల పరిశీలకులుగా వచ్చిన వివిధ దేశాలవారెవ్వరూ భారీ స్థాయిలో అక్రమాలు జరిగినట్టుగా నిర్ధారించిందేమీ లేదు. విపక్షమంతా కూడి యుద్ధం చేస్తున్నప్పుడు కూడా 96శాతం స్థానాలతో ఇంతటి అసాధారణ మెజారిటీ ఆమెకు ఎలా దక్కిందన్నది నిజంగా జవాబు లేని ప్రశ్నే. మంచీ చెడూ కలగలసిన అనేకాంశాలు ఈ ఘన విజయానికి కారణంగా కనిపిస్తున్నాయి. హసీనా ఏలుబడిలో విపక్షం పలురకాలుగా చావుదెబ్బ తిన్నది. బిఎన్‌పి అధినేత ఖలీదా జియాపై న్యాయస్థానాల్లో అవినీతి కేసులు రుజువై వరుస శిక్షలు పడ్డాయి. ఆమె జైల్లో కూర్చోవలసి వచ్చింది. ఆమె పరిపాలించిన కాలంలో ఆమె కుమారుడు అనేక దురాగతాలకు పాల్పడ్డాడు. రాజకీయ హత్యలు, మిలిటెంట్లకు ఆయుధ సరఫరాలు న్యాయస్థానాల్లో రుజువై శిక్షలు పడటంతో అతడు దేశం వదిలి పారిపోయాడు. ఖలీదా పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన అతివాద సంస్థలు, పార్టీలను సైతం హసీనా విడిచిపెట్టలేదు. రాజకీయ ప్రత్యర్థులను వేటాడటమే లక్ష్యంగా సాగిన చర్యలను అటుంచితే, హసీనా పాలనలో బంగ్లాదేశ్ ఎంతగానో మెరుగుపడింది. పేదరికం తగ్గి, విద్యారంగం మెరుగుపడి, ఏడు శాతం అభివృద్ధి నమోదు చేసుకొని వర్ధమాన దేశాల జాబితాలోకి అడుగు పెట్టింది. చాలా రంగాల్లో అది పాకిస్థాన్‌ను సైతం దాటింది. తనను తిరిగి అధికారంలోకి తెస్తే 9శాతం అభివృద్ధి సాధిస్తానని హసీనా ప్రజలకు వాగ్దానం చేశారు. ఈ కారణంగానే, ప్రజలు ఆమెకే పట్టంగట్టినట్టు భావించవచ్చు. హసీనా ప్రభుత్వ హయాంలోనూ బూటకపు ఎన్‌కౌంటర్లు, ప్రాజెక్టుల్లో అవినీతి, భావస్వేచ్ఛపై దాడులు ఇత్యాదివి ఉన్నప్పటికీ ప్రజలు వాటికి ప్రాధాన్యం ఇచ్చినట్టు కనబడటం లేదు.

ఖలీదా జియా ఏలుబడిలో ఈశాన్య రాష్ట్రాల్లో అగ్గిరాజేసేందుకు ఎటువంటి ప్రయత్నాలు సాగాయో తెలియనిదేమీ కాదు. పాకిస్థాన్ ఆర్థిక హార్థిక సహకారంతో, చైనా ఆయుధ సరఫరాలతో ఈశాన్యం అట్టుడికిపోయింది. భారత్–బంగ్లాదేశ్‌ల మధ్య ఉన్న నాలుగువేల కిలోమీటర్ల సరిహద్దు కాస్తంత ప్రశాంతంగా ఉన్నది హసీనా అధికారంలోకి వచ్చిన తరువాతే. ఈ ఎన్నికల్లో సైతం బిఎన్‌పి అభ్యర్థులు ఐఎస్‌ఐనుంచి సహకారం కోరుతున్న ఆడియో టేపులు కొన్ని బయటపడ్డాయి. భారత్ సహకారంతో పాకిస్థాన్ కుట్రలను హసీనా చాలా మేరకు ఛేదించగలుగుతున్నప్పటికీ, ఇప్పటికీ అక్కడ మతఛాందసం, ఇస్లామిక్ తీవ్రవాదం గణనీయమైన స్థితిలోనే ఉన్నందున నిఘా, భద్రతారంగాల్లో ఇరుదేశాల సహకారం మరింత బలంగా సాగాలి. భారతీయకంపెనీలతో భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టించి, బంగ్లాదేశ్‌లో ఉపాధి పెరిగేందుకు దోహదపడాలి. అలాగే, ప్రజలు కట్టబెట్టిన ఈ అపరిమితమైన అధికారాన్ని దుర్వినియోగం చేయకుండా, నియంతృత్వ పోకడలకు పోకుండా అభివృద్ధే లక్ష్యంగా హసీనా పనిచేస్తూ, ఆమెకు భారత్ అండగా నిలిచినప్పుడు ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయి.

కాయకల్ప చికిత్సకు బదులు కంటితుడుపు

సందర్భం



■ కె. శ్రీనివాస్

ఫెడరల్ ఫ్రంట్‌లో కలసివస్తారో తెలియదు కానీ, మమతా బెనర్జీ రైతుబంధు పథకం విషయంలో కెసిఆర్‌కు అనుయాయిగా మారిపోయారు. ఒక్క మమతాబెనర్జీ మాత్రమే కాదు, మోదీ కూడా అటువంటి పథకాన్ని కేంద్రం ద్వారా అమలుచేయించడం గురించి ఆలోచించారని విన్నాము. రైతు రుణమాఫీ కంటె రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద నగదుబదిలీ చేయడం మేలైన పథకమని ఆర్థిక వేత్తలు, విధాన నిపుణులు నిర్ధారణలు చేస్తున్నారు. ఇతరులకు స్ఫూర్తినిచ్చే పథకాన్ని మొదట అమలుచేసినందుకు కెసిఆర్‌ను అభినందించవలసిందే. అనుసరణీయమైన చర్యలు ఎవరివైనా సరే స్వీకరించేందుకు వెనుకాడనందుకు మమత వంటి వారిని కూడా మెచ్చుకోక తప్పదు.

రైతుబంధు విషయంలో కెసిఆర్ సాహసం చేశారనే చెప్పాలి. ఆయన మనసులో అటువంటి పథకం గురించిన ఆలోచన మొదటినుంచి ఉన్నదని చెప్పలేము. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో ఉన్నట్టే, వ్యవసాయ సంక్షోభం, రైతాంగ రుణగ్రస్తత తెలంగాణలో కూడా ఉన్నది. అధికంగా కూడా ఉన్నది. సమస్య తీవ్రత, రుణ భారం ఎంతటివంటే, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పార్లమెంటు ఆమోదం లభించినరోజున, అవతరించిన రోజున కూడా ఆత్మహత్యలు ఆగలేదు. తెలంగాణ రాష్ట్రసమితి పాలనలో, మొదటి రెండు మూడు సంవత్సరాలు రైతు ఆత్మహత్యలు విపరీతంగా జరగడమే కాదు, వాటి ప్రకంపనలు రాజకీయంగా కూడా తీవ్రంగా వినిపించేవి. వాటి గురించి మాట్లాడడానికి కూడా కెసిఆర్ ఇష్టపడేవారు కాదు. ఆత్మహత్యలు దేశవ్యాప్త సమస్య అని, వాటిని స్థానికంగా నివారించలేమని ఆయన భావించి ఉండవచ్చు. కానీ, ఆయన శిలాసదృశ మౌనం మాత్రం సమాజాన్ని తీవ్రంగా బాధించింది. తరువాత ఉన్నట్టుండి, ఆయన రైతుబంధు ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. ఎకరానికి ఏడాది ఒకసారికి 4వేలు అనుకున్నది తరువాత రెండుసార్లుగా సవరించారు. ఎన్నికలకు వెళ్లే ఏడాదిలో రెండు మార్లు తెలంగాణలో రైతుబంధు పంపిణీ జరిగింది. ఈ పథకంలో ఉన్న అతివ్యాప్తి, అవ్యాప్తి దోషాలను కెసిఆర్ పట్టించుకోలేదు. సాగు జరగని భూములకు కూడా అది వర్తిస్తున్నది, ఫలితంగా వ్యవసాయం పాక్షికంగానే జరిగే భూస్వాముల భూములకు పెద్ద మొత్తంలో నగదు అందగా, వ్యవసాయం చేస్తూ కూడా భూమి సొంతం కానందుకు కౌలుదారులకు ఏమీ దక్కలేదు. ఈ విమర్శలను కూడా ముఖ్యమంత్రి ఖాతరు చేయలేదు. ఒకనాడు రైతాంగ సమస్య పరిష్కారం లేనిదని అనుకున్నట్టే, ఇప్పుడు కౌలుదారుల సమస్య కూడా నిష్కృతి లేనిదని ఆయన భావిస్తూ ఉండవచ్చు.

అయితే, పదవీకాలం మధ్యలో కెసిఆర్‌కు ఉన్నట్టుండి రైతాంగసంక్షోభాన్ని ఏదో రీతిన పట్టించుకోవాలని ఎందుకు అనిపించింది? ఆ సమస్య గురించి ఆయన తీవ్రంగా ఆలోచించినందువల్ల, ఒక ఉపాయంగా ఆ పథకం ఆవిష్కృతమైందా? సాహసంతో దాన్ని అమలుచేసినందుకు ఘనత ఆయనకు చెందవలసిందే. కానీ, ఆ ఉపాయం పై పేటెంట్ హక్కు ఎవరిది?

అభివృద్ధిచర్యలకు ఎవరిది పేటెంట్ అన్న చర్చ ఈ మధ్య రాజకీయాలలో, ముఖ్యంగా ఎన్నికల ప్రచారంలో అధికంగా వినిపించింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తనకు అలవాటైన రీతిలో హైదరాబాద్ హైటెక్ అభివృద్ధి తన సొంత ఘనత అని చెప్పుకున్నారు. ఆయన పరిపాలనా కాలంలో సమాచారసాంకేతికత విస్తరణ, దానితో పాటు అనుషంగికంగా జరిగిన భౌతిక అభివృద్ధి– చంద్రబాబు మనసులో ఉండవచ్చు. హైదరాబాద్‌లోని ఫ్లైఓవర్లు, నూతనంగా అభివృద్ధి చెందిన ప్రాంతాలతో చంద్రబాబు పాలనను జోడించి గుర్తించేవారు నగరవాసులలో అనేకులున్నారు. కానీ, ఏ అభివృద్ధి అయినా ఒక సంఘటన కాదు. ప్రక్రియ. ఒకే ఒక్కరు శూన్యం నుంచి సృష్టించేదీ కాదు. పరిణామక్రమంలో సంభవించేది. చంద్రబాబు కంటె ముందే, నేదురుమిల్లి జనార్దనరెడ్డి హయాంలో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ రాజీవ్‌గాంధీ పేరిట ప్రారంభోత్సవం జరుపుకున్నదని, అదే తరువాత హైటెక్ సిటీ అయిందని ఒకరు సాక్ష్యం చెబుతున్నారు. అసలు జనార్దన్‌రెడ్డి కేపిటేషన్ ఫీజులను అనుమతిస్తూ వేలంవెర్రిగా ఇంజనీరింగ్ కాలేజీలకు అనుమతించడం వల్లనే అంతర్జాతీయంగా వచ్చిన సమాచార సాంకేతికత వెల్లువలో మన ఇంజనీర్లు లాభపడ్డారని కొందరు విశ్లేషిస్తున్నారు. పీవీ నరసింహారావు లిబరలైజేషన్ విధానాలకు తెరతీయకపోతే, ఇదంతా ఎట్లా సాధ్యం అని ఇంకొకరు ప్రశ్నిస్తున్నారు. 21వ శతాబ్దిలోకి ప్రయాణాన్ని కలగన్నది రాజీవ్‌గాంధీ కదా అని మరొకరు గుర్తు చేస్తున్నారు. ఇంత క్రమపరిణామాన్నీ అంగీకరించవలసిందే. ఒక పాలకుడి హయాంలో ఆ పరిణామం ప్రస్ఫుటంగా కనిపిస్తే అందుకు మంచిపేరునో చెడ్డపేరునో ఆ పాలకుడికి దఖలుపరచవలసిందే. పట్టణాల అభివృద్ధిని, హైటెక్ సాంకేతికతను ఎక్కువగా పట్టించుకుని, పల్లెటూళ్లను, గ్రామీణ సంక్షోభాన్ని విస్మరించాడని కదా 2004లో చంద్రబాబును ఓడించింది?

జన్మభూమి, ప్రజలవద్దకు పాలన వంటి కార్యక్రమాలు కూడా చంద్రబాబుతో ముడిపడి ఉంటాయి. నిజానికి అవి తనవేనని, సింగపూర్ స్ఫూర్తిదాయక నేత ఆత్మకథ నుంచి తానే గ్రహించి పార్టీకి నివేదించానని కెసిఆర్ అప్పుడెప్పుడో ఒకసారి అన్నారు. ఆత్మకథ తేదీకి, ఈ కార్యక్రమాల ప్రారంభ తేదీలకు ఉన్న వ్యత్యాసం వల్ల కెసిఆర్ వ్యాఖ్య వివాదాస్పదం అయింది కానీ, మొత్తానికి ప్రేరణ బయటినుంచి వచ్చిందన్నది స్పష్టం. మైక్రోఫైనాన్స్, స్వయంశక్తి బృందాల కల్పన వంటివి అంతర్జాతీయ రుణసంస్థల ప్రేరణ వల్ల ప్రారంభమైనవే.

రైతుబంధు పథకం ఎడారిలో వానచినుకు వంటిది. ఆ మాత్రం ఉపశమనం కోసం రైతాంగం ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్నది. కానీ, అది సమస్యనేమీ పూర్తిగా పరిష్కరించదు. ఆత్మహత్యలేమీ ఆగబోవడమూ లేదు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలను కల్పించే దిశగా చర్యలు తీసుకోకుండా ప్రభుత్వాలు చిట్కావైద్యాలను ఎందుకు వెదుకుతున్నాయో కూడా ఆలోచించాలి. గిట్టుబాటు ధరలకోసం నిర్దిష్ట విధానపరమైన చర్యలు అవసరం. ధరల స్థిరీకరణ నిధి వంటి వాటి ద్వారా పంటచేతికి వచ్చే సమయంలో ధరలు పడిపోకుండా, పడిపోయినా తట్టుకునేందుకు ఏర్పాట్లు చేయాలనే ఆలోచనలు మునుపుచేశారు. ఎన్నికల వాగ్దానాలలో కూడా ఈ స్థిరీకరణ నిధి ప్రస్తావనలు ఉన్నాయి. కానీ, అది ఆచరణ రూపం తీసుకోలేదు. దేశంలో గ్రామీణ, పట్టణ జీవితాలు రెండూ వేర్వేరుగా ఉండడం, వాటి మధ్య ఆదాయాలలోను, ధరలలోను, వినియోగంలోను వ్యత్యాసాలు ఉండడం కారణంగా, అతి తక్కువ ఆదాయాలతో కూడా గ్రామీణులు బతుకు ఈడ్చగలుగుతున్నారు. వారికి ఆ సదుపాయం లేకపోతే, పల్లెలనుంచి జరిగే వలసలను ఇముడ్చుకునే స్థితిలో పట్టణాలు లేవు. వ్యవసాయోత్పత్తుల ధరలను, వాటి కయ్యే పెట్టుబడి దినుసుల వ్యయం, శ్రమశక్తి ఆధారంగా నిర్ణయించగలిగితే, పల్లెలలో మనుగడల సంక్షోభం కొంతవరకు సడలుతుంది. అట్లాగే, కేంద్ర, రాష్ట్ర బడ్జెటుల్లో వ్యవసాయరంగానికి అధిక కేటాయింపులు చేయడం కూడా పరిస్థితి మెరుగుదలకు ఉపయోగపడుతుంది. కానీ, అంతర్జాతీయ విధాన నియంత్రణ సంస్థలు భారతదేశంలో అమలుచేస్తున్న 'పథకాల'ను, 'కార్యక్రమాల'ను ఎప్పటిప్పుడు వారి ప్రయోజనాల రీత్యా మదింపువేస్తూ, ఆదేశాల వంటి సూచనలు చేస్తుంటాయి. వివిధ పంటలకు కనీస మద్దతు ధరలను ప్రకటించడాన్ని కూడా ప్రపంచ వాణిజ్యసంస్థ తప్పుపడుతోంది. వీటన్నిటి మధ్య, వ్యవసాయాన్ని కర్కశమైన మార్కెట్‌శక్తులకు వదిలివేస్తూ, ఉపశమనం కింద అనేక 'పథకాల'ను అమలుచేయవలసి వస్తున్నది.



వ్యవసాయానికి అవసరమయ్యే రసాయన ఎరువులు ఇతర దినుసులకు ఇస్తున్న సబ్సిడీలను తీసివేసి, ఆ మొత్తాన్ని నగదు బదిలీ ద్వారా రైతులకు ఇవ్వాలనే ప్రతిపాదన కొంతకాలం కింద వచ్చింది. నిజానికి, హరిత విప్లవం కాలంలో రైతులను ఆధునిక వ్యవసాయంలోకి మళ్లించడానికి ప్రోత్సాహకంగా దినుసుల సబ్సిడీ అమలులోకి వచ్చింది. దాన్ని అంతర్జాతీయ విధాన నియంత్రణసంస్థలు తప్పుపడుతున్నాయి. వారి షరతులకు, ఎన్నికల రాజకీయాల అనివార్యతలకు మధ్య పార్టీలు కొత్త కొత్త చిట్కాలు వెదుకవలసి వస్తున్నది. తరచు రుణమాఫీలు చేయవలసి రావడాన్ని బ్యాంకింగ్ నిపుణులు, ఆర్థిక విధానకర్తలు అభ్యంతరపెడుతున్నారు. కానీ, గత్యంతరం లేదు. రుణమాఫీ వల్ల లాభం లేదని, ఎకరానికి ఐదువేలు చొప్పున రైతుకు నేరుగా బదిలీ చేయాలని వై.ఎస్. రాజశేఖరరెడ్డి 2008లో కాంగ్రెస్ జాతీయ నాయకత్వానికి ప్రతిపాదించారు. కెసిఆర్ రైతుబంధు పథకానికి మూలం అదే. అప్పుడు కాంగ్రెస్ నాయకత్వం దాన్ని అసాధ్యంగా భావించి, 2009 ఎన్నికలలో కూడా రుణమాఫీనే వాగ్దానాలలో చేర్చింది. ఎరువుల వంటి దినుసులలో లభించే సబ్సిడీకి అదనంగా ఇప్పుడీ ఇన్‌పుట్ సబ్సిడీ లభిస్తున్నది. ఈ ప్రక్రియ అంతా, వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించే విధానపరమైన మౌలికచర్యకు ప్రతిగా, పరిహారంగా జరుగుతున్నది మాత్రమే.

రైతులతో సహా ప్రతి ఉత్పాదకవర్గమూ తమ శ్రమకు, ఉత్పత్తికి తగిన ప్రతిఫలం పొందితే, వారి జీవనావసరాలను వారే తీర్చుకోగలుగుతారు. పెళ్లిళ్లకు, చావులకు ప్రభుత్వం వచ్చి సహాయపడాలని కోరుకోరు. పించన్ల మీద ఆధారపడి జీవనం గడపాలని భావించరు. విధానపరమైన వైఫల్యం వల్లనే ఉచిత పథకాలు అవసరమవుతున్నాయి. విద్య, వైద్యం సమాజానికి అత్యవసరమైన ప్రాథమిక సదుపాయాలన్న గుర్తింపు ఉంటే, కంటికి, పంటికి పరీక్షలు ప్రత్యేకంగా ఎందుకు? ఎవరికీ రాని ఆలోచన తమకే వచ్చిందని 'కంటి వెలుగు' పథకం గురించి టిఆర్‌ఎస్ నేతలు చెప్పుకున్నారు. 1967–69 మధ్య కాలంలో కరుణానిధి అదే పథకాన్ని 'కన్నొలి తిట్టం' పేరుతో అమలుచేశారు. దాని అర్థం కూడా కంటివెలుగు అనే. ఆడపిల్లలకు వివాహానికి ప్రభుత్వ కానుక ఇవ్వడం జయలలిత హయాంలో మొదలైంది. ఎంత కాలం గడిచినా అవే పాత పథకాలను అనువ ర్తింపజేసుకోవలసి వస్తున్నది. దైనందిన జీవనం కష్టతరంగా మారినప్పుడు, విద్య వైద్యం భారంగా మారినప్పుడు, ఈ పథకాలు అవసరమైనవే. అవి కూడా లేకపోతే, బతుకు దుర్భరమే. కానీ, అవేవీ నెప్పిని తగ్గించలేవు, కన్నీటిని తుడువ గలవు. కంటితుడుపులకు పేటెంట్లు ఎందుకు?

> **పథకం అన్న మాటే, ఏదో ప్రతికూల అర్థాన్ని స్ఫురింపజేస్తుంది. ప్రజలకు అవగాహన లేకపోయి ఉండవచ్చును కానీ, వారికి కావలసినవి పథకాలు కావు, విధానాలు. ప్రజలు తమ జీవనాన్ని తాము సాఫీగా నడుపుకోగలిగే వెసులుబాటు ఇచ్చే రహదారి– విధానం. బడ్జెట్ మొత్తం ఉపశమనాలకే ఖర్చయ్యాక, అధికారపార్టీల పెట్టుబడి, ఇతర అవసరాలను నెరవేర్చే కార్యక్రమాలకు తక్కిన మొత్తం ఖాళీ అవగా, ఇక పునాదులు తవ్వడానికి, సుస్థిర అభివృద్ధిని సాధ్యం చేసే విత్తనాలు వేయడానికి విత్తం ఎక్కడ? మన కంటితుడుపును అందరూ అనుసరిస్తున్నారని గర్విస్తున్నాము కానీ, అందరికీ దారి చూపగలిగే చూపునిస్తున్నామని చెప్పుకోలేకపోతున్నాము కదా?**

పథకం అన్న మాటే, ఏదో ప్రతికూల అర్థాన్ని స్ఫురింపజేస్తుంది. ప్రజలకు అవగాహన లేకపోయి ఉండవచ్చును కానీ, వారికి కావలసినవి పథకాలు కావు, విధానాలు. ప్రజలు తమ జీవనాన్ని తాము సాఫీగా నడుపుకోగలిగే వెసులుబాటు ఇచ్చే రహదారి– విధానం. బడ్జెట్ మొత్తం ఉపశమనాలకే ఖర్చయ్యాక, అధికారపార్టీల పెట్టుబడి, ఇతర అవసరాలను నెరవేర్చే కార్యక్రమాలకు తక్కిన మొత్తం ఖాళీ అవగా, ఇక పునాదులు తవ్వడానికి, సుస్థిర అభివృద్ధిని సాధ్యం చేసే విత్తనాలు వేయడానికి విత్తం ఎక్కడ?

మన కంటితుడుపును అందరూ అనుసరిస్తున్నారని గర్విస్తున్నాము కానీ, అందరికీ దారి చూపగలిగే చూపునిస్తున్నామని చెప్పుకోలేకపోతున్నాము కదా? ■

యుగ ద్రష్ట సావిత్రి బాయి పూలే

భారత దేశంలో ఎంతో మంది సంఘ సంస్కర్తలు జన్మించారు. సంఘంలో మార్పులు తీసుకు వచ్చే ప్రయత్నం చేశారు. కుల, మతాల నిర్మూలన కోసం ఎన్నో ఉద్యమాలు నడిపారు. అయితే కుల, మతాల ప్రభావం సమాజంలో తగ్గడానికి బదులు రోజు రోజు పెరుగుతూనే ఉంది. నిజానికి కుల, మతాల ప్రస్తావన వచ్చినప్పుడల్లా సమాజంలో ఒక యుద్ధ వాతావరణం నెలకొని ఉంటుంది. వేల సంవత్సరాల భారత దేశ చరిత్రలో ఎంతో మంది సంఘ సంస్కర్తలు జన్మించినప్పటికీ డా. అంబేద్కర్ అన్నట్లు దళిత పీడిత ప్రజలకు పెద్దగా ఏమీ ఒరగబెట్ట లేదు. బుద్ధుడి చైతన్యం గాని, జ్యోతిరావ్ పూలే ఉద్యమ స్ఫూర్తి గాని మరే సంఘ సంస్కర్తల్లో కనబడదు. బుద్ధుడి అనంతరం దళిత పీడిత జనాల ఉన్నతి కోసం నిజాయితీతో పని చేసిన వారెవరైనా ఉన్నారంటే వారు పూలే దంపతులే. అందుకే వారిని ఆధునిక భారత సామాజిక విప్లవ ప్రనేతలుగా స్మరించుకుంటాం.

పూలే దంపతుల కాలంలో రకరకాల దురాచారాలు తాండవ నృత్యం చేసేవి. బాల్య వివాహాలు యధేచ్ఛగా జరిగేవి. వితంతు వివాహాలు నిషేధించ బడ్డాయి. బహు భార్యత్వం సామాజిక గౌరవంగా భావించబడేది. సతీ సహగమనం ఒక పవిత్ర ఆచారంగా అమలులో ఉండేది. స్త్రీలను చదువుకు దూరంగా ఉంచే వారు. స్త్రీలను దేవదాసీలుగా మార్చి శారీరకంగా, మానసికంగా దోచుకునే వారు. ఆస్తి మీద స్త్రీలకూ ఎలాంటి హక్కు ఉండేది కాదు. కోర్కెలు తీర్చే సాధనాలుగానే వారిని చూసే వారు. ఒక రకంగా చెప్పాలంటే స్త్రీలు, దళితులు, బహుజనులు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న రోజలవి. ఇలాంటి అంధకార యుగంలో పూలే దంపతులు యుగ ద్రష్టలుగా అవతరించారు.

సావిత్రిబాయి పూలే జీవితాంతం స్త్రీల, దళితుల హక్కుల కోసం పోరాడారు. పాలక వర్గాల స్త్రీ, దళిత వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఎదిరించారు. పేష్వాల సామంతవాద పోకడలను నిరసించారు. ఆధిపత్య బ్రాహ్మణ భావజాలాన్ని ఎండ గట్టారు. స్త్రీ, దళిత వ్యతిరేక ఆడంబరాలను తీవ్రంగా ఖండించారు. సామాజిక కార్యక్రమాల ద్వారానే కాకుండ సాహిత్యం ద్వారా కూడా రియాక్షనరీ శక్తులను గట్టిగా ఎదుర్కొన్నారు. సాహిత్యంలో సమాజంలో వివక్షకు, అసమానతలకు తావిచ్చే అంశాలకు ప్రాధాన్యతనిచ్చారు. స్త్రీలను, దళితులను చదువుకు దూరంగా ఉంచి వారిని ఎలా దోచుకుంటున్నారో అర్థం చేసుకున్నారు. వారి దృష్టిలో విద్య పులిపాల లాంటిది. దానిని సేవిస్తే ఎవరైనా పులిలా గర్జిస్తారు. అందుకే స్త్రీల, దళితుల చదువు కోసం విశేషంగా కృషి చేశారు. తమ రచనల ద్వారా కులం, మతం, బ్రాహ్మణవాదం, పితృస్వామ్య వ్యవస్థల మీద తీవ్రంగా దాడి చేశారు.

సావిత్రిబాయి పూలే మూడు కవితలు

1. శత్రువొక్కటే మనందరికీ/ దానిని తన్ని తరిమి కొడదాం/
దానిని మించిన మరో శత్రువు లేదు మనకు/ వెతికి తీయండి/
మనసు లోపల చూసి పట్టుకోండి/ వెతికి పట్టుకున్నారా శత్రువుని?
చూసారా శత్రువుని?/ పిల్లల్లారా దాని పేరు చెప్పండి వెంటనే మరి/
మీకు తెలియదా?/ సరే ఆ దుష్ట శత్రువు పేరు/ నేనే చెప్తాను
దాని పేరు: అజ్ఞానం/ గట్టిగా పట్టుకుని దాని గొంతు పిసికేయండి
జీవితం నుంచి వెళ్ళగొట్టండి
2. కుటిల మనువు చెప్పెను/ నాగలి పట్టే వారు, వ్యవసాయం చేసేవారు/
మూర్ఖులని కుటిల మనువు చెప్పెను/ వ్యవసాయం చేయవద్దని బ్రాహ్మణులను
ఆజ్ఞాపిస్తుంది మనుధర్మ శాస్త్రం/ శూద్రుల పుట్టుక/ పూర్వ జన్మ పాపాల ఫలం
అనుభవిస్తారు ఈ జన్మలో శూద్రులు సమస్తం/
సమాజంలో వైషమ్యాల కుటిల ఆచార వ్యవహారాలూ రచిస్తారు/
ధూర్తులకే చెల్లు ఈ అమానవీయ సిద్ధాంతం
3. ఎవరైతే/ చెప్పింది చేస్తారో/ ఆ స్త్రీ పురుషులే/ నిజమైన యోగులు

■ ఆచార్య వి. కృష్ణ



మహిళా చైతన్య పతాక

భారత దేశంలో భవిష్యత్తరాలకు అవరోధంగా ఏర్పడబోయే సామాజిక రుగ్మతలను ఆనాడే అర్థం చేసుకున్న శక్తిమంతమైన చైతన్య మహిళ సావిత్రీబాయి పూలే. ఆమె ఆధునిక భారతదేశానికి జ్ఞానజ్యోతి. దేశంలో బాలికా పాఠశాలలు ప్రారంభించిన తొలి పంతులమ్మ. 1831 జనవరి 3న మహారాష్ట్రలోని సతారా జిల్లా నయ్‌గావ్‌లో లక్ష్మీ బాయి, ఖాండోజీనవ్‌సె పాటిల్ దంపతులకు సావిత్రీబాయి జన్మించింది. తల్లిదండ్రులు ఆమెకు తొమ్మిదేళ్ళకే పెళ్ళిచేశారు. అయితే భర్త జోతిరావు పూలే సహకారంతో ఆమె విద్యావతి అయ్యారు.

సావిత్రీబాయి తొలి గురువు జ్యోతిరావు పూలేనే. ఆయన స్కాటిష్ మిషన్ స్కూల్‌లో ఆంగ్ల విద్య నభ్యసించాడు. 'రైట్స్ ఆఫ్ మ్యాన్' వంటి పుస్తకాలు చదివిన జ్ఞానంతో నిమ్న కులాలకు, స్త్రీలకు బాసటగా నిలవాలని సంకల్పించాడు. తనే స్వయంగా దగ్గరుండి సావిత్రికి చదువు నేర్పించాడు. 15 ఏళ్ళ వయసులోనే ఆమెకు ఉపాధ్యాయ శిక్షణ ఇప్పించాడు. ఆంగ్ల విద్యతో సావిత్రి సరికొత్త భావజాలాన్ని అందిపుచ్చుకుంది. సమాజంలో అణగారిన వర్గాలు, దళిత ఆదివాసీలు, స్త్రీలు అణచివేయబడుతున్న నేపథ్యాన్ని అవగతం చేసుకుంది. బ్రాహ్మణ వాద కులతత్వం, పురుషాధిక్యతలపై సమరం సాగించాలని నిశ్చయించింది. ఇత్యాది సామాజిక రుగ్మతలను రూపుమాపాలంటే అందుకు బాలికా విద్యే ఆయుధమని భావించింది. ఆడపిల్లల కోసం ఈ దేశంలో 1848లో మొదటి పాఠశాలను ప్రారంభించిన మహనీయురాలు సావిత్రిబాయి. పూణెలోని ఒక ఇంటిలో నడిపిన ఆ పాఠశాలలో మొదట చేరింది 9 మంది విద్యార్థినులే. ఒడిదొడుకులతో నడిచిన ఆ పాఠశాలలో విద్యార్థినులపై సావిత్రి బోధన దృఢమైన ప్రభావాన్ని చూపింది. ముక్తాబాయి అనే దళిత బాలిక 'ధ్యానోదయ' పత్రికలో బ్రాహ్మణవాద సంస్కృతి పెత్తనాన్ని నిరసిస్తూ వ్యాసం రాసింది. ఆమె సుమారు 18 పాఠశాలలు ప్రారంభించింది. జ్యోతిరావు దంపతులపై సావిత్రి బాయి అగ్రవర్ణాల వారి ఒత్తిడి పెరగడంతో 1849లో ఇంటి నుండి వెళ్ళిపోయారు. తన భర్తతో కలిసి సాంఘిక సేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ మానవ హక్కుల గురించి, సామాజిక సమస్యలపై స్త్రీలను చైతన్యపరిచేందుకు 'మహిళా సేవా మండలి'ని స్థాపించిన సావిత్రిబాయి మహిళా చైతన్య పతాక వితంతువులు, అనాథల కోసం 'శరణాలయం' కర్షక కార్మికుల కోసం రాత్రిబడి నడిపించింది. అత్యాచారాలకు గురైన స్త్రీలకు భద్రత కల్పించేందుకు 'బాల్ హత్య ప్రతిబంధక్ గృహ'ను ప్రారంభించింది. జ్యోతిరావుపూలే స్థాపించిన 'సత్యశోధక సమాజ'లో ఆమె మహిళా విభాగ బాధ్యతలు నిర్వహించారు. సావిత్రీబాయి పూలే చేసిన సామాజిక సేవలు భవిష్యత్తరాలకు ఆదర్శనీయం. ఆమె జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రభుత్వం నిర్వహిస్తే బాగుంటుంది.

■ గుమ్మడి లక్ష్మీనారాయణ

(నేడు సావిత్రిబాయి పూలే జయంతి)

ప్రజాస్వామ్యానికి ఫిరాయింపుల తూట్లు!

> **పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో అధికార ప్రతిపక్షాలు పరస్పర పూరకాలు, నాణానికి రెండు వైపులు. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రతిపక్షాలకు ఎంతో ప్రాధాన్యత నిచ్చేవారు. ఇప్పటి పాలకులు ప్రతిపక్షం అనే మాటనే భరించే పరిస్థితిలో లేరు. స్వంత పార్టీలో భిన్నస్వరాలను వినేందుకు అసలు సిద్ధంగా లేరు. ప్రజాస్వామ్య నీడలో పరోక్ష నియంతృత్వ పాలనను ముందుకు తీసుకువస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. నాటి పాలకులకు ప్రతిపక్షమంటే గౌరవం ఉంటే, నేడు నీడ కూడా భరించలేకపోతున్నారు.**

ప్రపంచంలోనే పెద్ద ప్రజాస్వామ్య దేశాల్లో ఒకటిగా భారతదేశం గుర్తింపు పొందింది. పోటీ ప్రపంచంలో తనదైన శైలిలో ప్రత్యేకతలను చాటుకుంటున్నది. ఏడు దశాబ్దాలుగా ప్రజాస్వామ్య వ్యవస్థ పరిపక్వత సాధించి ఇతర దేశాలకు ఆదర్శప్రాయంగా నిలిచింది. ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాల వల్ల ప్రజాస్వామ్య భావన ఆటుపోట్లను ఎదుర్కొంటున్నది. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీల పాత్ర కీలకమైనది. అయితే రాజకీయ పార్టీల విధివిధానాలు ఎలా ఉన్నా, అవి రాజ్యాంగానికి లోబడి కార్యక్రమాలు నిర్వహించాల్సిందే. రాజ్యాంగానికి ఏ పార్టీ అతీతం కాదు.

గడిచిన 30 ఏళ్ళుగా, ముఖ్యంగా సరళీకృత ఆర్థిక విధానాలు అమలైనప్పటి నుండి రాజకీయాలలో విలువలు క్రమంగా పతనమైతున్నాయి. గత 15 సంవత్సరాల నుండి అది మరింత వేగంగా సాగుతున్నది. పార్టీ ఫిరాయింపులు విచ్చలవిడిగా పెరిగి పోతున్నాయి. ఈ దుష్టసంస్కృతి సర్వసాధారణంగా మారడం ఆందోళన కలిగిస్తోంది.

ఇటీవల శాసనసభ ఎన్నికల ఫలితాలు వచ్చిన వారం, పది రోజుల్లోనే కాంగ్రెస్ ఎంఎల్సిలను తమవైపు తిప్పుకోవడమే కాకుండా, ఏకంగా కాంగ్రెస్ పక్షాన్నే టిఆర్‌ఎస్ ఎల్పిలో విలీనం చేసుకోవడం సంచలనం కలిగించింది. కనీసం సిఎల్పి నాయకునికి తెలియకుండానే కొందరు ఎంఎల్‌సిలు తామే సిఎల్పి సమావేశం నిర్వహించుకొని సిఎల్పిని టిఆర్‌ఎస్ ఎల్పిలో విలీనం చేసుకోవాలని నిర్ణయించినట్లు ప్రకటించడం అందరిని ఆశ్చర్యపరిచింది. తెలంగాణలో పార్టీ ఫిరాయింపులు కొత్తేమి కాదు. 2014లో టిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటి వరకు కెసిఆర్‌ను దుర్భాషలాడిన టిడిపి ఎంఎల్‌ఏ తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను టిఆర్‌ఎస్‌లో చేర్చుకొని మంత్రి పదవి కట్ట బెట్టడంలో ఫిరాయింపుల పర్వం సంచలనాత్మకంగా మారింది. 2014 శాసనసభలో టిఆర్‌ఎస్‌కు అరకొరగా రెండు సీట్ల మెజారిటీనే ఉందని ఆ పార్టీ సమర్థకులు సర్ది చెప్పుకోవచ్చు. కాని ఇటీవల ఎన్నికల్లో టిఆర్‌ఎస్ నాలుగింట మూడొంతుల మెజారిటీ స్థానాలు గెలిచిన వారంలోనే శాసనమండలిలో టిఆర్‌ఎస్ ఎల్పిలో కాంగ్రెస్ పక్షాన్నే విలీనం చేసుకోవడం అత్యంత ఘోరం. అటు శాసనసభలో కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా దక్కకుండా ఆ పార్టీ ఎంఎల్‌ఏలకు గాలం వేస్తున్నారని ప్రచారం జరుగుతున్న సమయంలోనే ఇది జరిగింది. తద్వారా పరోక్షంగా రాష్ట్రంలో ఏ పార్టీకి, చివరకు ప్రతిపక్ష పార్టీకి కూడా పుట్టగతులు ఉండనీయమనే సంకేతాలు ఇవ్వడం ప్రజాస్వామ్యంలో అత్యంత ప్రమాదకరం.

ఒకవైపు రాష్ట్రాల హక్కులు, కేంద్రంలో అధికారిక వికేంద్రీకరణ కోసం ఫెడరల్ ఫ్రంట్ కడతామంటూ దేశమంతా ప్రచారం చేసుకుంటున్న ముఖ్యమంత్రి కెసిఆర్ మరి స్వంత రాష్ట్రంలో ప్రతిపక్షాన్నే లేకుండా చేసే చర్యల గురించి ఏమని జవాబిస్తారు? బహుశా జవాబు ఇచ్చే పరిస్థితే ఉత్పన్నం కాకూడదనే ఉద్దేశ్యంతోనే ప్రశ్నించే అవకాశాలను కబళించేస్తున్నారేమో?

రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌లోని 52 సవరణను అనుసరించి 1985 పార్టీ ఫిరాయింపుల చట్టం చేయబడింది. చట్టం వున్నప్పటికీ దానిలోని లొసుగులు ఆసరాగా చట్టసభల్లో పార్టీ ఫిరాయింపులకు తావిస్తున్నారు. మరీ ముఖ్యంగా 2014 తరువాత అటు కేంద్రంలో,



ఇటు రాష్ట్రాలలో అధికారంలో ఉన్న పార్టీలు ఏమి చేసైనా సరే అధికారాన్ని తమ చేతుల్లో బందీగా ఉంచుకోవాలనే ధోరణి ప్రబలింది. దీంతో ఫిరాయింపులు విపరీతంగా పెరిగి పోయాయి.

ఫిరాయింపుల చట్టం ప్రకారం స్పీకర్/ చైర్మన్ పరిధిలోనే అనర్హత నిర్ణయం తీసుకోవలసి ఉంటుందని కోర్టులు జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తూ 2015లో హైకోర్టు తీర్పు చెప్పింది. తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. తెలంగాణ స్పీకర్ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి జాప్యం చేస్తున్నారని పిటిషన్ వేయగా రెండునెలల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు కోర్టు సూచించినప్పటికీ స్పీకర్ ఏమాత్రం స్పందించలేదు. ఈరకంగా ఎవరిస్థాయిలో వారు చట్టాలను దుర్వినియోగం చేస్తూన్నారు.

రాజ్యాంగంలో ప్రజాప్రాతినిధ్యచట్టానికి పెద్దపీట వేయబడింది. పార్లమెంట్, అసెంబ్లీలో మెజారిటీ సభ్యులున్న పార్టీ మాత్రమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. అయితే ఏ పార్టీ గుర్తు మీద గెలిచి ప్రజాప్రతినిధులుగా ఎన్నికైయ్యారో ఆ టర్మ్ అయ్యేంత వరకు ఆ పార్టీలోనే వుండాలి. సభ్యులెవరైనా పార్టీ మారాలనుకుంటే పదవికి రాజీనామా పెట్టాలి. ఇది చట్టంలో స్పష్టంగా వుండాల్సిన అవసరం వుంది. కాని నేడు పార్లమెంట్‌లో కొంతమేరకు ఎంపీలు రాజీనామా ఇవ్వగానే కరెక్ట్ ఫార్మాట్‌లో వుంటే రాజీనామాను ఆమోదించడం జరుగుతుంది. కాని అసెంబ్లీలో సంవత్సరాలు తరబడి ఆమోదించక, ఆమోదించకుండా పెండింగ్‌లో పెడుతున్నారు. ఉదాహరణకు 20042009 అసెంబ్లీలో 26 మంది ఎమ్మెల్యేలు టిఆర్‌ఎస్ తరుపున గెలిచారు. అందులో 10 మంది శాసనసభ్యులు ఆకు చాటు పిందె లాగా వ్యవహరించారు. బహిరంగంగా కాంగ్రెస్ సమావేశాలకు వెళ్ళేవాళ్ళు కాదు. కాని ముఖ్యమంత్రి, మంత్రులతో సన్నిహితంగా వుంటూ వారి వారి నియోజకవర్గాల అభివృద్ధికి, వారి వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవడానికి ప్రయత్నించేవారు. ఆ సందర్భంలో టిఆర్‌ఎస్ పార్టీ తరపున 10 మంది ఎమ్మెల్యేలు టిఆర్‌ఎస్‌లో గెలిచి పార్టీ మారారు అని, వారి సభ్యత్వం రద్దు చేయాలని ఆనాడు స్పీకర్‌కు టిఆర్‌ఎస్ పార్టీ ఫిర్యాదు చేసింది. అయితే అప్పటి ప్రభుత్వ కాలంలో అసెంబ్లీ రద్దు అయ్యేవరకు కూడా ఆ ఎమ్మెల్యేలను వేటు వేయలేదు.

కేంద్రంలోవున్న ఎన్‌డిఎ ప్రభుత్వం బహిరంగంగానే ఉత్తరాఖండ్‌లో 356 అధికరణను అనుసరించి అసెంబ్లీని రద్దు చేస్తూ ప్రభుత్వాలపైనే వేటు వేసింది. చివరకు సుప్రీంకోర్టుకు వెళ్ళి బలనిరూపణకు ఆదేశాలు ఇప్పించుకోవాల్సి వచ్చింది. దాంతో తిరిగి అధికారంలోకి హరీశ్‌రావత్ అదే ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టాడు. దీనిని బట్టి ఏ బూర్జువా పార్టీ చట్టాలు ఉల్లంఘనకు అతీతం కాదని అర్థమవుతుంది. జాతీయ, ప్రాంతీయ పార్టీలు ఎవరు అధికారంలో వున్నప్పుడు వారు బహిరంగంగానే చట్టాలను ఉల్లంఘించడాన్ని ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాల్సిన అవసరం వుంది. పార్టీ ఫిరాయింపుల చట్టంలోనున్న లొసుగులు, లోపాలను సవరించు నిబంధనలలో మార్పు తేవాలి. ప్రజాప్రతినిధుల గౌరవ ప్రతిష్టలు పెరగడానికి విలువలున్న రాజకీయాల వైపు అడుగుపడాలి.

2014లో కొత్త రాష్ట్రం ఏర్పడిన తరువాత కెసిఆర్ ప్రభుత్వం టిడిపిలో గెలిచి టిఆర్‌ఎస్‌లో కలిసిన వాళ్ళకు కూడా మంత్రి పదవి, అలాగే కార్పోరేషన్ పదవులు ఇచ్చింది. అంతేగాకుండా 15 మంది టిడిపి ఎమ్మెల్యేలు గెలిస్తే అందులో 12 మంది పార్టీ మారారు. 2/3 మారినట్లుగా స్పీకర్ గుర్తిస్తూ టిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలుగా వారికి గుర్తింపునిస్తూ శాసనసభ బులిటెన్ విడుదల చేయడం శాసనసభ గౌరవాన్ని దిగదార్చింది.

కాల పరీక్షకు నిలబడిన పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో అధికార ప్రతిపక్షాలు పరస్పర పూరకాలు, నాణానికి రెండు వైపులు. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రతిపక్షాలకు ఎంతో ప్రాధాన్యతనిచ్చేవారు. దేశ విశాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని స్వాతంత్ర్యానంతర తొలి క్యాబినెట్‌లో విపక్షాలైనా, సైద్ధాంతిక వైరుధ్యాలు ఉన్నప్పటికీ హిందూ మహాసభ అధ్యక్షులు శ్యామ ప్రసాద్ ముఖర్జీని, ఇతర పార్టీలకు చెందిన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, బల్‌దేవ్ సింగ్‌లను తీసుకున్నారు. కాని ఇప్పటి పాలకులు ప్రతిపక్షం అనే మాటనే భరించే పరిస్థితిలో లేరు. స్వంత పార్టీలో భిన్న స్వరాలను వినేందుకు అసలు సిద్ధంగా లేరు. ప్రజాస్వామ్య నీడలో పరోక్ష నియంతృత్వ పాలనను ముందుకు తీసుకువస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. నాటి పాలకులకు ప్రతిపక్షమంటే గౌరవం ఉంటే, నేడు నీడ కూడా భరించలేకపోతున్నారు.


ఎన్నికలు ఎలా జరిగాయనే అంశాన్ని పక్కనబెడితే, తిరుగులేని మెజారిటీతో రెండవసారి అధికారంలోకి వచ్చిన కెసిఆర్ ఎన్నికలు అయిపోయాక ప్రతిపక్షాలపై "ఆరు నెలలైనా ఓపిక లేదా? అప్పుడే రోడ్ల మీదకు వస్తారా?" అని విరుచుకుపడ్డారు. అదే కెసిఆర్ ఎన్నికలు ఫలితాలు వచ్చిన పది రోజులు కూడా ఓపికపడకుండా పెద్దలసభలో ప్రతిపక్షం ఉనికే లేకుండా చేయడాన్ని ఏమనాలి? మరో వైపు ఎన్నికలంటే సామాన్యునికి అందని ద్రాక్షగా మార్చేశారు. ఎన్నికల్లో పోటీ చేయాలంటే కోట్లు ఉండాల్సిందేననే పరిస్థితికి నెట్టేయడం అత్యంత ప్రమాదకరం. ఇలాంటి దుష్ట పోకడలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యవాదులు, మేధావులు నడుం బిగించాలి. అన్ని రాజకీయ పార్టీలలో చర్చ జరగాలి. చట్టాలను గౌరవించే సాంప్రదాయం కొనసాగాలి. అప్పుడే ప్రజాస్వామ్య మూడు పువ్వులు, ఆరు కాయలుగా మన్నుతుంది.

■ చాడ వెంకటరెడ్డి
సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి




దేశాభివృద్ధికి పల్లెసీమలే పట్టుకొమ్మలు.. జీవధార సదృశ్యాలు. అవి ప్రగతి సాధిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుంది.

- మహాత్మాగాంధీ



డమ్మీస్వామ్యం

- సర్పంచులుగా గ్రామాల్లో భర్తలదే పెత్తనం
- సమీక్షలు, మండల పరిషత్ మీటింగ్‌లకూ ఆయనే



▸▸ కాంట్రాక్టు పనుల్లో నిధుల దుర్వినియోగం

▸▸ మహిళా సర్పంచ్‌లు సంతకాలకే పరిమితం

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ..అది ఏ జిల్లా అయినా.. మహిళా రిజర్వేషన్ ఉన్న ఏ గ్రామ పంచాయతీ అయినా సర్పంచ్‌గా మహిళ డమ్మీనే అవుతోంది. ఆమె పేరు మీద 'సర్పంచ్ కాని సర్పంచ్'గా పెత్తనం అంతా ఆమె భర్తనే చలాయిస్తున్నాడు. అధికారులు కూడా 'ఆమె'ను కాదని 'ఆయన్నే' సర్పంచ్‌గా సంబోధిస్తున్నారు. మండల పరిధిలో జరిగే అధికార కార్యక్రమాల్లోనూ సర్పంచ్‌గా ఆయనదే హవా. ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకున్నా 'ఆమె' తెరవెనుకకే పరిమితమవుతోంది. రాష్ట్రంలోని సర్పంచులలో సగం మహిళలే అయినా కేవలం పేపర్లపై సంతకానికే వారు పరిమితమవుతున్నారు. మండల సర్వసభ్య సమావేశాలకు భార్యల తరపున భర్తలు హాజరవుతున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని కాంట్రాక్టులు నిర్వహిస్తున్నారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. వీటిపై ఆగ్రహించిన హైకోర్టు.. పంచాయతీల అక్రమాలపై ఏసీబీ విచారణకు ఆదేశించింది. ఇక, ఏజెన్సీ గ్రామాల్లో పార్టీ నేతల పెత్తనం నడుస్తోంది. ఈసారి 6,375 పంచాయతీలు మహిళలకు దక్కనున్న నేపథ్యంలో తమ భార్యలు లేదా తల్లులు, ఇతరులను పోటీ చేయించడానికి పురుషులు సన్నద్ధమవుతున్నారు.

గతంలో పురుష పుంగవుల లీలలు కొన్ని..

- మహబూబాబాద్ జిల్లాలోని ఒక గ్రామ మహిళా సర్పంచ్ విద్యావంతురాలైనప్పటికీ ఆమెను పక్కన పెట్టి భర్తే గ్రామ వ్యవహారాలు చూస్తున్నారు. దాదాపు రూ.40 లక్షల విలువైన సీసీ రోడ్లు, కాలువలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తి చేశాడు.
- మంచిర్యాల జిల్లాలోని ఒక గ్రామ సర్పంచ్ భర్త కాంట్రాక్టు పనులు చేస్తూ ప్రస్తుతం ఏ-1 కాంట్రాక్టర్ స్థాయికి ఎదిగారు.
- ఆదిలాబాద్ జిల్లాలోని ఓ పంచాయతీలో రెడ్డి వర్గానికి చెందిన నాయకుడు డబ్బు ఖర్చు చేసి ఎస్టీ మహిళను గెలిపించారు. అక్కడ పంచాయతీ పనులన్నీ ఆయనే చూసుకుంటారు.
- మెదక్ జిల్లాలో మహిళా సర్పంచ్ భర్తే 100కు పైగా మరుగుదొడ్లను నిర్మించినట్లుగా చూపి రూ.10 లక్షలను డ్రా చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. దీనిపై గ్రామస్థులు హైకోర్టును ఆశ్రయించడంతో విచారణకు ఆదేశించింది.

ఖమ్మం జిల్లాలోని ఏజెన్సీ పంచాయతీల్లో రిజర్వుడు మహిళా సర్పంచులు, వారి భర్తల పెత్తనం కాకుండా పార్టీ నేతల పెత్తనం నడుస్తోంది. గిరిజన ప్రతినిధులకు ఒకటి రెండు శాతం కమీషన్లు ఇచ్చేసి, అభివృద్ధి పనుల కాంట్రాక్టర్లను నేతలు అమ్ముకుంటున్నారు.

యాదాద్రి-భువనగిరి జిల్లాలో 90 మంది మహిళా సర్పంచులపై నిధుల దుర్వినియోగ ఆరోపణలు వచ్చాయి. వారి భర్తలే నిధులను స్వాహా చేశారన్న అభియోగాలున్నాయి.

కామారెడ్డి జిల్లాలోని ఒక గ్రామ సర్పంచ్ భర్త రూ.15 లక్షల సీసీ రోడ్లు, రూ.20 లక్షల విలువ చేసే మిషన్ కాకతీయ పనులు చేశారు. సీసీ రోడ్లలో నాణ్యత లేదంటూ గ్రామస్థులు ఫిర్యాదు చేయడం గమనార్హం.

గత పంచాయతీ ఎన్నికల్లో జనగామ జిల్లాలోని ఓ రెండు గ్రామాల్లో మహిళలు సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. అయినా ఐదేళ్ల పాటు వారు ఊర్లోనే లేరు. హైదరాబాద్‌లో ఉంటూ ఉద్యోగాలు చేస్తున్నారు. సర్పంచ్‌లుగా ఐదేళ్లు వారి భర్తలే అక్కడ పెత్తనం చేశారు. ఊర్లో కార్యకలాపాలు, అధికారిక సమీక్షలు, మండల పరిషత్ సమావేశాలకు వారే హాజరయ్యేవారు! ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఓ గ్రామంలో ఓ మహిళ సర్పంచ్‌గా ఎన్నికైంది. ఊర్లో అందరూ 'సర్పంచ్ సాబ్' అంటూ పిలిచేది మాత్రం ఆమె భర్తనే! ఆమె ఎన్నడూ అధికార కార్యక్రమానికి హాజరైంది లేదు. ఆ మధ్య మహబూబ్‌నగర్ జిల్లాలోని ఒక మండల సమావేశానికి మహిళా సర్పంచ్‌ల భర్తలు హాజరయ్యారు. మీడియా ఫొటోలు తీయడంతో అప్పటి నుంచి మొహం చాటేశారు.



రంగారెడ్డి జిల్లా జడ్పీ కార్యాలయం నుంచి పంచాయతీ ఎన్నికల సామాగ్రిని చేవెళ్ల మండల కేంద్రానికి తరలిస్తున్న దృశ్యం

18 ఓట్లు వస్తే సర్పంచ్

▸▸ ఊరి జనాభా 106.. ఓటర్లు 34 మంది

▸▸ రాష్ట్రంలోనే అతిచిన్న పంచాయతీగా దొంగతోపు

హైదరాబాద్, కొత్తగూడెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): 'పట్టుమని పది ఓట్లు సంపాదించలేదు'.. ఎన్నికల్లో చిత్తుగా ఓడిన వారిని ఇలా అంటుంటాం! కానీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం దొంగతోపు గ్రామంలో మాత్రం పది ఓట్లు సాధిస్తే గట్టి పోటీ ఇచ్చినట్లే లెక్క! దానికి అదనంగా ఎనిమిది ఓట్లు.. అంటే మొత్తంగా 18 ఓట్లు సాధిస్తే సర్పంచ్‌గా ఎన్నికైనట్లే! ప్రస్తుతం రాష్ట్రంలో అతిచిన్న గ్రామపంచాయతీ ఇదే! ఊరి జనాభా 106. ఓటర్ల సంఖ్య 34. గ్రామాన్ని నాలుగు వార్డులుగా విభజించారు. అంటే.. ఐదు ఓట్లు వచ్చిన వ్యక్తి వార్డు మెంబర్ అవుతాడన్నట్లే. సర్పంచ్ పదవికి ముగ్గురు రేసులో ఉంటే 10 ఓట్లు వచ్చిన వ్యక్తిదే విజయం అవ్వొచ్చు. ఇదే మండలంలో అడవిరామం అనే మరో చిన్న గ్రామ పంచాయతీ ఉంది. ఈ ఊరి జనాభా 170మాత్రమే. 64మంది ఓటర్లున్నారు. సర్పంచ్ పదవికి ఇద్దరు బరిలో ఉంటే 33 ఓట్లు వచ్చిన వ్యక్తి సర్పంచ్ అవుతాడు.



దొంగతోపు గ్రామం

ఏకగ్రీవంగా ఎన్నుకుందాం!

పెద్ద సంఖ్యలో ఏకగ్రీవం దిశగా పంచాయతీలు.. సర్పంచ్‌తోపాటు వార్డు సభ్యుల ఎన్నిక కూడా

▸▸ గ్రామాభివృద్ధే లక్ష్యంగా ఒక్కటవుతున్న ప్రజలు

▸▸ ఖర్చును నివారించి.. గ్రామాభివృద్ధికి కృషి

▸▸ ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందనుండటమూ కారణం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



పంచాయతీ ఎన్నికల నగారా మోగడంతో గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది. నిన్న మొన్నటి దాకా అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీల గెలుపు కోసం పనిచేసిన గ్రామ స్థాయి నాయకులంతా ఇప్పుడు సర్పంచ్ పదవులపై కన్నేశారు. ఎమ్మెల్యేలు, ఆయా పార్టీల నియోజకవర్గ స్థాయి నేతలు సైతం తమ పరిధిలో మెజారిటీ పంచాయతీలను గెలిపించుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే ఈసారి పెద్ద సంఖ్యలో పంచాయతీలు ఏకగ్రీవమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇటీవలే ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మొత్తం ఖర్చు పెట్టి ఉండటం, ఇంత త్వరగా మళ్లీ ఖర్చు చేయాల్సి వస్తుండటంతో ఏకగ్రీవానికి మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు అసెంబ్లీ ఎన్నికల్లో అధికార టీఆర్ఎస్ ఘనవిజయం సాధించి ఊపుమీదుండటంతో.. పంచాయతీ ఎన్నికలు కూడా ఏకపక్షమవుతాయన్న అభిప్రాయాలు నెలకొన్నాయి. దీంతో పోటీకి దిగి పెద్దమొత్తంలో ఖర్చు చేసేకన్నా.. అవగాహకు రావడం మంచిదనే ఉద్దేశంతో విపక్ష పార్టీల నేతలు ఉన్నారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

మరోవైపు ఏకగ్రీవ ఎన్నిక జరిగిన గ్రామాలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందనుండటంతో ఆయా గ్రామాల ప్రజలు కూడా అందుకు మొగ్గుచూపుతున్నారు. పైగా ఈసారి గిరిజన ప్రాంతాల్లోని పంచాయతీలన్నింటినీ వారికే రిజర్వు చేయడంతో.. ఖర్చును నివారించి ఏకాభిప్రాయంతో తొలి సర్పంచ్‌ను ఎన్నుకోవాలని భావిస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో ఆశావహులు తమను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామాభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు ఇచ్చేందుకు ముందుకు వస్తుండటంతో గ్రామస్థులు వారికే అవకాశం ఇస్తున్నారు. ఎన్నికలకు ఇంకా నోటిఫికేషన్ వెలువడక ముందే రాష్ట్రంలోని పలు గ్రామాల్లో ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి. మరికొన్ని చోట్ల ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

తెలంగాణ భవన్‌కు సర్పంచ్ అభ్యర్థులు!

▸▸ టీఆర్ఎస్ మద్దతు కోసం యత్నాలు

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవికి పోటీ చేయాలని భావిస్తున్న ఔత్సాహికులు టీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం తెలంగాణభవన్‌కు తరలి వస్తున్నారు. కొందరు తమ ఎన్నిక ఏకగ్రీవమయ్యేలా చూడాలంటూ అందుబాటులో ఉన్న నేతలకు వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. అయితే సర్పంచ్ అభ్యర్థులకు మద్దతిచ్చే నిర్ణయాలు ఎమ్మెల్యే స్థాయిలోనే జరిగిపోతున్నాయి. అయినా.. కొందరు నేతలు పార్టీ తరపున మరింత మద్దతు కూడగట్టుకునేందుకు కేటీఆర్‌తోపాటు పలువురికి వినతిపత్రాలు ఇస్తున్నారు. ఇలా రోజూ 50 మంది వస్తున్నారని పార్టీ నేతలు చెబుతున్నారు.

ఇప్పటివరకు ఏకగ్రీవ ఎన్నిక జరిగిన పంచాయతీలు ఇవే..

జిల్లా	మండలం	పంచాయతీ	రిజర్వేషన్	ఎన్నికైన అభ్యర్థి
నాగర్‌కర్నూలు	చారగొండ	గైరాన్ తండా	ఎస్టీ మహిళ	వర్త్యవత్ సుజాత
మహబూబాబాద్	గంగారం	జంగాలపల్లి	ఎస్టీ జనరల్	ఇస్లావత్ బాలకృష్ణ
నిజామాబాద్	భీమ్‌గల్	సంతోష్‌నగర్ తండా	ఎస్టీ జనరల్	ఎం.జి.నాయక్
కుమ్రం భీం	వాంకిడి	లక్ష్మీపూర్	జనరల్ మహిళ	ఎం.శ్యామల
రాజన్న సిరిసిల్ల	గంభీరావుపేట	లక్ష్మీపూర్	ఎస్టీ జనరల్	లకావత్ మంజు
కామారెడ్డి	బాన్సువాడ	కుర్లికుచ్చతండా	ఎస్టీ జనరల్	ఫేర్‌సింగ్
కామారెడ్డి	పిట్లం	పిట్లం	జనరల్	జొన్న విజయశ్రీనివాస్‌రెడ్డి
కామారెడ్డి	లింగంపేట	ముంబాజిపేట తండా	ఎస్టీ జనరల్	బలరాంనాయక్

సర్పంచ్ నుంచి మంత్రి దాకా

▸▸ జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిది విలక్షణ ప్రస్థానం



మహబూబ్‌నగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వేయి మైళ్ల ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే మొదలవుతుంది. రాజకీయాల్లోనైతే ఆ వేయి మైళ్ల ప్రయాణానికి గ్రామ సర్పంచ్ పదవే తొలి అడుగు! మండల పరిషత్ చైర్మన్, జెడ్పీచైర్మన్, ఎమ్మెల్యే, మంత్రి.. ఇలా అంచెలంచెలుగా ఎదిగేందుకు పునాది ఆ పదవే. ఈ విషయంలో మంత్రిగా పని చేసిన టీఆర్ఎస్ నేత, జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ చర్లకోల లక్ష్మారెడ్డినే ఉదాహరణ. లక్ష్మారెడ్డి తన రాజకీయ జీవితాన్ని సర్పంచ్ స్థాయి నుంచే ప్రారంభించారు. ఆయన స్వగ్రామం నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం ఆవంచ. మెడిసిన్ పూర్తయ్యాక 1988 పంచాయతీ ఎన్నికల్లో ఆయన ఆవంచ సర్పంచ్‌గా పోటీచేసి గెలిచారు. అదే ఏడాది మండల పరిషత్ ఎన్నికల్లోనూ మండల ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. జోడు పదవులతో గ్రామంలో పంచాయతీ భవనం, అంతర్గత రోడ్లు, విద్యుత్తు సదుపాయం, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టారు. 1995లో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడిగా పనిచేశారు. 1999లో జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి 22వేల ఓట్లు సాధించారు. టీఆర్ఎస్ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరి 2004లో జడ్చర్ల ఎమ్మెల్యేగా గెలుపొందారు. కేసీఆర్ పిలుపు మేరకు 2008లో రాజీనామా చేసి, ఉప ఎన్నికల్లో నిలబడి పరాజయం పొందారు. 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా జడ్చర్ల నుంచి విజయం సాధించి కేసీఆర్ కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు.

ఏకగ్రీవానికి సై అంటే 10లక్షలు!

తన నియోజకవర్గంలోని గ్రామాలకు జడ్చర్ల ఎమ్మెల్యే సీహెచ్ లక్ష్మారెడ్డి బంపర్ ఆఫర్ ప్రకటించారు. సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామానికి ప్రభుత్వం తరపున ఇచ్చే రూ.10లక్షలతో పాటు తన ఎమ్మెల్యే కోటా నిధుల నుంచి 10లక్షలు ఇస్తానని ఆయన ప్రకటించారు.

\- లక్ష్మారెడ్డి

12 లక్షలు పెరిగిన పంచాయతీ ఓటర్లు

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్దిష్ట గడువు కన్నా ఆలస్యంగా నిర్వహిస్తుండటంతో.. కొత్తగా 12 లక్షల మందికి పైగా ఓటుహక్కు లభిస్తోంది. గత ఏడాది మే 17 వరకు రాష్ట్రంలో మొత్తం 1,37,17,469 మంది గ్రామీణ ఓటర్లు ఉన్నట్లు వెల్లడించింది. అనుకున్న సమయంలో ఎన్నికలు నిర్వహించకపోవడం, ఆ వెంటనే అసెంబ్లీ రద్దు, ముందస్తు ఎన్నికలు, రిజర్వేషన్ల కేటాయింపుపై హైకోర్టులో పిటిషన్లు తదితర పరిణామాల అనంతరం.. జనవరి 1వ తేదీన రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ జారీ చేసింది. ఈ మేరకు డిసెంబరు 19వ తేదీ వరకు రాష్ట్రంలో మొత్తం గ్రామీణ ఓటర్లు 1,49,52,058 మంది ఉన్నారు. అంటే గత ఏడాది మే 17 నుంచి డిసెంబరు 19వ తేదీ మధ్య కాలంలో 12,34,589 మంది ఓటర్లు పెరిగినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది.

ఫిబ్రవరి 10, 11 తేదీల్లో

సహకార ఎన్నికలు!

▸▸ ఓటర్లు 20 లక్షల మంది.. 200 మందికో పోలింగ్ కేంద్రం

▸▸ ఈ నెలలోనే షెడ్యూలు.. కోడ్, ఖర్చు నిబంధనలు లేవు

హైదరాబాద్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సహకార ఎన్నికలకు రంగం సిద్ధమైంది. పంచాయతీ ఎన్నికల షెడ్యూలు మంగళవారం విడుదలవడంతో సహకార ఎన్నికలకు మార్గం సుగమమైంది. ఫిబ్రవరి 10, 11 తేదీల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెలలోనే ఎన్నికల షెడ్యూలు జారీ కానుంది. తొలుత ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు (పీఏసీఎస్), తర్వాత జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీల(డీసీఎంఎస్)కు, అనంతరం తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంకు (టెస్క్యాబ్)కు ఎన్నికలు జరగనున్నాయి. లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు జారీ అయ్యేలోపే సహకార ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికలు జరగనున్న 906 పీఏసీఎస్‌ల పరిధిలో 20 లక్షల మంది రైతులు ఓటర్లుగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రతీ 200 మంది ఓటర్లకు ఒకటి చొప్పున పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. అదనపు రిజిస్ట్రార్ నేతృత్వంలోని సహకార ఎన్నికల అథారిటీ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరగనున్నాయి. సహకార ఎన్నికలకు ప్రత్యేకంగా ఎలాంటి కోడ్ కానీ, ఖర్చుకు సంబంధించిన నిబంధనలు కానీ ఉండబోవని అధికారవర్గాలు వెల్లడించాయి. ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటే తప్ప షెడ్యూలులో ఎలాంటి మార్పు ఉండబోదని సమాచారం. మొత్తం 906 పీఏసీఎస్‌లు, తొమ్మిది డీసీసీబీలతో పాటు టెస్క్యాబ్‌కు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఎన్నికల్లో అక్రమాలను నిరోధించే ఉద్దేశంతో ఈ దఫా ఓటర్ల జాబితాలో ఓటర్ల ఫొటోలను కూడా ముద్రించాలని ఇప్పటికే నిర్ణయించారు. నామినేషన్ల సమయంలో అభ్యర్థులు ఇకపై ఆధార్ వివరాలను, ఆధార్ కార్డు ప్రతిని, పాన్ కార్డు వివరాలను అందించాల్సి ఉంటుంది. పీఏసీఎస్ ఎన్నికలకు ఎస్సీ, ఎస్టీలకు రూ.500, బీసీలకు రూ.750, ఇతరులకు రూ.1000; అర్బన్ బ్యాంకులు, కేంద్ర సహకార సంఘాలు, జిల్లా స్థాయి సంఘాలకు ఎస్సీ, ఎస్టీలకు రూ.1000, బీసీలకు రూ.2 వేలు, ఇతరులకు రూ.4 వేలు చొప్పున నామినేషన్ రుసుమును ఖరారు చేశారు.



కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ పనులు

ముంపు ఊర్లలోనూ పోటాపోటీ!

▸▸ త్వరలో ఖాళీ అయ్యే పల్లెల్లో 'పంచాయితీ'.. పదుల సంఖ్యలో ఆశావహులు

సిద్దిపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల షెడ్యూలు విడుదలవడంతో పల్లెల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. సాధారణ గ్రామాలతోపాటు రేపోమాపో రిజర్వాయర్ల కింద ముంపునకు గురయ్యే పల్లెల్లోనూ తీవ్ర పోటీ నెలకొంది. ఎన్నికల బరిలో నిలిచేందుకు పదుల సంఖ్యలో ఆశావహులు సిద్ధమయ్యారు. ముఖ్యంగా సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ల పరిధిలో ముంపునకు గురవుతున్న గ్రామాల్లో కూడా పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. కొండపోచమ్మ సాగర్ పరిధిలోని బైలంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోకి తానేదార్‌పల్లి, తానేదార్‌పల్లి తండాలు మధిర గ్రామాలుగా ఉన్నాయి. ఊర్లు మునిగినా తునికిబొల్లారంలో యథావిధిగా గ్రామాలను నిర్మిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పోటీ రసవత్తరంగానే ఉంది. గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్‌లో ఈ రెండు గ్రామాలు జనరల్‌గా మారాయి. అయినా ఇక్కడ బీసీలు పోటీకి యత్నిస్తున్నారు. బైలంపూర్‌లో ఆరుగురు పోటీ పడుతుండగా, మామిడ్యాల బరిలో నలుగురు ఉన్నట్లు తెలిసింది. మల్లన్నసాగర్ ముంపు గ్రామాల్లో ఆశావహుల సంఖ్య భారీగా పెరిగింది. సర్పంచ్ పదవికి ఎంత ఖర్చయినా వెనకాడమని అభ్యర్థులు బాహాటంగానే చెబుతున్నారు. వేములఘాట్‌లో 10 మంది పోటీచేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఏటిగడ్డ కిష్టాపూర్‌లోనూ అదే పరిస్థితి ఉంది. లక్ష్మాపూర్‌లో గతంలో బీసీ(జనరల్) కాగా ఇప్పుడూ అదే ఖరారైంది. అక్కడ ఆరుగురు పోటీ చేయడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. రాంపూర్‌లో గతంలో సైతం బీసీ(మహిళ) కాగా ఇప్పుడూ అదే రిజర్వేషన్ ఖరారైంది. అక్కడ నలుగురు పోటీ చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. కొండపాక మండలంలోని ఎర్రవెల్లి పంచాయతీ ఎస్సీ మహిళకు కేటాయించగా 8-10 మంది సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. ములుగు మండలం తునికి బొల్లారం శివారులో, గజ్వేల్ మండలం ముట్రాజ్‌పల్లిలో పునరావాస గ్రామాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ ఐదేళ్లలో పాత గ్రామాలు రిజర్వాయర్ల పరిధిలో ముంపునకు గురైనా కొత్తగా నిర్మితమయ్యే పునరావాస గ్రామాలకు వీరే సర్పంచులుగా ఉండబోతున్నారు. పైగా భూములు కోల్పోవడంతో చేతి నిండా ఉన్న నగదు కూడా వారిని ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆలోచింపజేస్తున్నది.

ఇద్దరు సంతానం మించితే అనర్హులే

▸▸ ఒక కాన్పులో కవలలు పుడితే వెసులుబాటు

▸▸ పంచాయతీ పదవులకు అర్హతలు, అనర్హతలివే

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు పోటీ చేసేందుకు కనీస అర్హతలు ఉన్నాయి. ఇందులో ముఖ్యమైనది సంతానం. పోటీ చేసే అభ్యర్థికి ఇద్దరి కంటే ఎక్కువ మంది సంతానం ఉంటే పోటీకి అనర్హులు. జూన్ 1, 1995 తర్వాత మూడో సంతానం ఉండరాదు. ఒక కాన్పులో ఇద్దరు లేదా ముగ్గురు పుడితే అర్హత ఉంటుంది. ఒక వ్యక్తికి ఇద్దరు పిల్లలు పుట్టాక మొదటి భార్య చనిపోతే, రెండో భార్యకు ఒకరు లేదా ఇద్దరు సంతానం కలిగితే భర్తకు పోటీ చేసే అర్హత ఉండదు. అదే రెండో భార్యకు మాత్రం పోటీ చేసే అర్హత ఉంటుంది.

- పోటీకి కనీస వయసు 21 ఏళ్లు
- ఆ గ్రామ పంచాయతీలో ఓటరుగా ఉండాలి
- వార్డు మెంబర్/ సర్పంచ్‌కు ప్రతిపాదకుడు అదే వార్డు/గ్రామంలో ఓటరుగా ఉండాలి
- రేషన్ డీలర్లు, సహకార సంఘాల వారు అర్హులు.
- స్థానిక సంస్థల్లోని ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పోటీకి అనర్హులు.
- దేవాదాయ సెక్షన్ 15 ప్రకారం ఏర్పాటు చేయబడిన సంస్థల్లోని వారు పోటీకి అనర్హులు.
- ప్రభుత్వం ద్వారా 25 శాతానికి మించి పెట్టుబడి కలిగిన సంస్థలు/ కంపెనీల మేనేజింగ్ ఏజెంట్, మేనేజర్లు, సెక్రెటరీలు పోటీకి అనర్హులు.
- ప్రభుత్వ ఉద్యోగులు రాజీనామా చేసి ధ్రువీకరణను నామినేషన్ల పరిశీలనలోపు ఇస్తే అర్హులు.

బదిలీలకు నెల దాకా బ్రేక్!

▸▸ జిల్లా స్థాయి బదిలీలకు లేని అవకాశం

▸▸ పంచాయతీ ఎన్నికల కోడ్ ఫలితం

▸▸ రాష్ట్రమంతటా వర్తించనున్న కోడ్

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బదిలీలకు బ్రేక్ పడింది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం సీనియర్ ఐఏఎస్‌లతోపాటు జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోల బదిలీలు జరుగుతాయని భావించారు. అయితే పంచాయతీ ఎన్నికల షెడ్యూలు విడుదల కావడం, ఎన్నికల ప్రక్రియ నెలరోజుల దాకా కొనసాగనుండటంతో.. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాతే బదిలీలు జరగనున్నాయి. మరోవైపు మంత్రివర్గ విస్తరణ కూడా రెండు వారాల తర్వాతే జరిగే అవకాశాలున్నాయి. కొత్త మంత్రులు కొలువుదీరాక వారి ఇష్టాఇష్టాలను అనుసరించే అధికారుల నియామకం జరగనుంది. మంత్రివర్గ విస్తరణ జరిగిన రెండు వారాల దాకా రాష్ట్రస్థాయి శాఖలు/కమిషనరేట్/డైరెక్టర్లకు కూడా స్థానచలనం కల్పించే అవకాశాల్లేవు. ఎన్నికల కోడ్ ఉండటంతో జిల్లాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి వీలుగా 29 మంది సీనియర్ ఐఏఎస్‌లకు నోడల్ అధికారులుగా బాధ్యతలు అప్పగించడంతో ఎన్నికల సంఘం కూడా వీరి బదిలీలకు అవకాశం ఇవ్వకపోవచ్చని తెలుస్తోంది. వారితోపాటు 30 జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా రెవెన్యూ అధికారులు, జడ్పీ సీఈవోలు, డీపీవోలతోపాటు 67 మంది ఆర్డీవోలు ఎన్నికల బాధ్యతలు చూస్తున్నారు. జిల్లాలోని యంత్రాంగమంతా పంచాయతీ ఎన్నికలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. దాదాపు 500 దాకా గ్రామీణ మండలాలు ఉండటంతో ఆయా మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. దాంతో వీరికి కూడా ఆ అవకాశం లేదు. ఇదిలా ఉండగా.. పంచాయతీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి రాష్ట్రమంతటికీ వర్తిస్తుందని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది.



సింగరేణి కొత్త ఈడీ జె.ఆల్విన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎండీ ఎన్.శ్రీధర్

సింగరేణి ఈడీగా జె.ఆల్విన్

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కోల్‌మూవ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా డాక్టర్ జె.ఆల్విన్ నియమితులయ్యారు. ఆయన బుధవారం సింగరేణి భవన్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆల్విన్‌కు శ్రీధర్ శుభాకాంక్షలు తెలిపారు. ఎంబీఏ పూర్తి చేసిన ఆల్విన్ 2006లో రైల్వే శాఖలో చేరి దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డివిజనల్ ఆపరేషన్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. కాగా, సింగరేణికి సంబంధించిన సామాజిక మాధ్యమాల్ని వెబ్‌సైట్‌లో ఒకేచోట కనబడేలా రూపొందించిన 'సోషల్ మీడియా వాల్'ను సంస్థ డైరెక్టర్ చంద్రశేఖర్ బుధవారం ప్రారంభించారు.

మిగులు విద్యుత్ రాష్ట్రంగా తెలంగాణ

» జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు



సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను విద్యుత్తు కొరత లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడంతో పాటు మిగులు విద్యుత్తు రాష్ట్రంగా తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు అన్నారు. మంగళవారం విద్యుత్తు సౌధలో సీఎండీని ఉద్యోగులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్తు రంగంలో మరింత అభివృద్ధి సాధించాల్సి ఉందన్నారు.

● వారంలోగా ధ్రువపత్రాల పరిశీలనకు షెడ్యూల్

వివిధ సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లోని టీజీటీ, పీజీటీ పోస్టుల భర్తీలో భాగంగా వారంలో ధ్రువపత్రాల పరిశీలనకు 1:2 జాబితాలను ప్రకటించేందుకు టీఎస్‌ఆర్‌ఈఐఆర్‌బీ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే 960 టీజీటీ, 1972 పీజీటీ పోస్టులకు రాతపరీక్షలు నిర్వహించిన బోర్డు.. అభ్యర్థుల మార్కుల మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. వారం రోజుల్లో ఒక్కో పోస్టుకు ఇద్దరిని చొప్పున ఎంపిక చేసి ధ్రువపత్రాల పరిశీలనకు షెడ్యూల్ జారీ చేసేందుకు బోర్డు ఏర్పాట్లు చేస్తోంది.

సీఎంవో ఓఎస్డీగా ప్రియాంకా వర్గీస్

» మరో కీలక అధికారిణి శాంతికుమారి ఆరోగ్య శాఖలోకే

ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఓఎస్డీగా 2009 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అధికారిణి ప్రియాంకా వర్గీస్ కొనసాగనున్నారు. సీఎంవోలో పాత బృందాన్నే కొనసాగిస్తూ డిసెంబరు 31న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా ఆ జాబితాలో ప్రియాంకా వర్గీస్, మరో అధికారిణి శాంతికుమారి పేర్లు లేవు. ఈ నేపథ్యంలో ప్రియాంకా వర్గీస్‌ను కొనసాగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైద్య శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న శాంతికుమారి కొనసాగింపుపై ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. ఆమె ఇప్పటి దాకా సీఎంవోలో కీలకమైన అధికారిణిగా వ్యవహరిస్తున్నారు. ఏదేమైనా ఆమె ఇక వివిధ రకాల వైద్య పరీక్షల నిర్వహణకు సంబంధించి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించిన నేపథ్యంలో ఆమెకు పూర్తిగా వైద్య ఆరోగ్య శాఖ బాధ్యతలే అప్పగించినట్లు ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటిదాకా సచివాలయంలో సీఎం కార్యాలయం ఉండే సీ బ్లాక్ నుంచే విధులు నిర్వర్తిస్తున్న ఆమె ఇకపై డీ బ్లాక్ నుంచి విధులు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

ఉద్యోగులతో పీఆర్సీ కీలక చర్చలు

» నేడు టీజీవోలు, టీఎన్జీవోలతో భేటీ

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో), తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం(టీఎన్జీవో) నేతలతో 11వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) భేటీ కానుంది. పీఆర్సీ కార్యాలయంలో గురువారం టీజీవోలు, టీఎన్జీవోలతో సమావేశం జరగనుంది. ఆ తర్వాత తెలంగాణ ఉద్యోగుల సంఘంతోనూ చర్చించనుంది. ఉదయం 11.30 గంటలకు టీజీవోలతో, మధ్యాహ్నం 3 గంటలకు టీఎన్జీవోలతో, సాయంత్రం 5.30 గంటలకు తెలంగాణ ఉద్యోగుల సంఘంతోనూ సీఆర్ బిశ్వాల్ నేతృత్వంలోని పీఆర్సీ చర్చలు జరపనుంది. టీజీవోలు, టీఎన్జీవోలతోపాటు ఉపాధ్యాయ సంఘాలతో కూడా పీఆర్సీ ఇప్పటికే ఒకసారి చర్చలు జరిపింది. కాగా 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పీఆర్సీలను ఆలస్యంగా అమలు చేశారు. దీంతో ఉద్యోగులు రెండు పీఆర్సీలను కోల్పోయారు. తెలంగాణలోని మొదటి పీఆర్సీలో ఉద్యోగులకు తగిన న్యాయం చేయాలి. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన నష్టాన్ని పూరించాలి. సాధ్యమైనంత త్వరలోనే ఉద్యోగులకు మంచి పీఆర్సీ అమలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో పీఆర్సీ నివేదికను త్వరగా పభుత్వానికి అందించాలి' అని రెండు సంఘాల నేతలూ పీఆర్సీకి మరోమారు విజ్ఞప్తి చేయనున్నారు. పీఆర్సీ సిఫారసులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉద్యోగులకు ఆమోదయోగ్యంగా ఉండాల్సిందేనని స్పష్టం చేయనున్నారు. ఈ క్రమంలో ఉద్యోగ సంఘాలతో పీఆర్సీ నిర్వహించనున్న చర్చలు కీలకం కానున్నాయని ఉద్యోగులు భావిస్తున్నారు.

● కేసీఆర్ ఫార్ములాపై మోదీకి డౌట్లా?: విజయశాంతి

హైదరాబాద్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సీఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ఫార్ములా ఆయన రాజకీయ ప్రత్యర్థులకు అర్థం కాలేదంటే లాజిక్ ఉంది కానీ, ప్రధాని మోదీకి కూడా బుర్రకెక్క లేదంటే ఆశ్చర్యం కలుగుతోందని కాంగ్రెస్ నాయకురాలు విజయశాంతి అన్నారు. ఇదంతా చూస్తుంటే కేసీఆర్ చేస్తున్న ప్రయత్నంలోనే ఏదో లోపముందనే అనుమానం కలుగుతోందని అభిప్రాయపడ్డారు. బుధవారం ఆమె ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. బీజేపీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఏర్పాటైతే తప్ప ఫెడరల్ ఫ్రంట్‌ను మోదీ గుర్తించే పరిస్థితి కనిపించడం లేదని దుయ్యబట్టారు. ఆంగ్లం, హిందీ భాషల్లో అనర్గళంగా మాట్లాడగల కేసీఆరే స్వయంగా చెప్పినా, ఆ ఫ్రంట్ గురించి ప్రధానికి ఎందుకు అర్థం కాలేదన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న అని వ్యాఖ్యానించారు.

● ఎస్సీ వర్గీకరణ చేపట్టండి: టీఎమ్మార్పీఎస్

న్యూఢిల్లీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని కేంద్ర హన్స్‌రాజ్ గంగారామ్ అహీర్‌ను టీఎమ్మార్పీఎస్ నేతలు కోరారు. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు కె.రాములు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నేతలు ఇటుక రాజు మాదిగ, దండు వీరన్న మాదిగ బుధవారం పార్లమెంటు భవనంలో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రాన్ని అందించారు గతంలో ఇచ్చిన మాట నిలబెట్టుకొని ఎస్సీలకు న్యాయం చేయాలని కోరారు.

● టీఆర్‌ఎస్‌లో చేరను: అజారుద్దీన్

హైదరాబాదు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తాను టీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ స్పష్టం చేశారు. తాను కాంగ్రె‌స్‌లోనే కొనసాగుతానని, టీఆర్‌ఎస్‌లో చేరనని తేల్చి చెప్పారు. ఈ మేరకు బుధవారం తన అధికారిక ట్విట్టర్‌లో ఖాతాలో ఆయన ట్వీట్ చేశారు.

● దరఖాస్తు తిరస్కరణ ప్రభాస్‌కు చెప్పారా?:హైకోర్టు

స్థలం క్రమబద్ధీకరణ కోసం హీరో ప్రభాస్ చేసిన దరఖాస్తును తిరస్కరించినట్లు ఆయనకు సమాచారమిచ్చారా అని హైకోర్టు ప్రభుత్వం తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ముందుకెలా వెళతారని ప్రభుత్వాన్ని నిలదీసింది. ఇందుకు సంబంధించిన వివరాలు కోర్టు ముందుంచాలని స్పష్టం చేసి, తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

ఆ ఓటర్లను తిరిగి చేర్చడంపై మీ వైఖరేంటి?

» కేంద్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం

తొలగించిన ఓటర్లను తిరిగి జాబితాలో చేర్చేందుకు ఒక ప్రత్యేక దరఖాస్తు తేవడంలో మీ వైఖరేంటో చెప్పాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. తమ ఓట్లను తొలగించడాన్ని ప్రశ్నిస్తూ స్థానిక గోషామహల్‌కు చెందిన ప్రీతీ అగర్వాల్, మరో 25 మంది హైకోర్టును ఆశ్రయించారు. సీజే రాధాకృష్ణన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ వ్యాజ్యాన్ని విచారించింది.

ఏదీ వేగం?


అన్నారం బ్యారేజీ సమీపంలో గ్రావిటీ కెనాల్ పనులు పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి కావాలని ఆదేశించారు. ఈలోగా మేడిగడ్డ దగ్గర కాఫర్ డ్యాం నిర్మించి ఏప్రిల్లోనే మోటార్ల వెట్‌రన్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. రోజూ రెండు టీఎంసీలు ఎత్తిపోయాలని చెప్పారు. కుదిరితే ఈ వేసవి అవసరాలకు నీటిని లిఫ్ట్ చేసేందుకు ప్రయత్నించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జూన్‌లో రిజర్వాయర్లు నింపాలని, భారీ మెజారిటీతో గెలిపించిన రైతులు తమ పొలాలకు నీళ్ల కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. కోటి ఎకరాలకు నీళ్లు ఇవ్వాలన్న లక్ష్యాన్ని నెరవేర్చడం కోసం అధికారులు యుద్ధ ప్రాతిపదికన పని చేయాలని పిలుపునిచ్చారు. పనిచేసే కార్మికులను నాలుగు రెట్లు పెంచాలని, మూడు షిఫ్ట్‌ల్లో పని చేయాలని ఆదేశించారు. శ్రీరాంసాగర్ పునర్జీవన ప్రాజెక్టు పనులు జరుగుతున్న తీరుపైనా సీఎం కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాలువల వెంట తనిఖీలు

బుధవారం ఆయన సుందిళ్ల బ్యారేజీ, అన్నారం పంప్ హౌస్‌లను ఏరియల్ వ్యూ ద్వారా తనిఖీ చేశారు. అంతకుముందు కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి అన్నారం బ్యారేజీ వరకు పదిహేను కిలోమీటర్ల మేర కాలువల వెంట ప్రయాణించి పనులను పరిశీలించారు. బ్యారేజీ లోపల రివిట్‌మెంట్ లైనింగ్ పనులను చేపట్టక పోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లైనింగ్ పని చేయకుంటే బ్యారేజీ ఉంటదా? లక్ష కోట్ల ప్రాజెక్టుకు చిన్న చిన్న పనులు చేయకపోవడం వల్ల నష్టం జరగదా? అని నిలదీశారు. మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌస్ పనుల్లా ఇవి లేవని పెదవి విరిచారు. మార్చి 31 వరకు బ్యారేజీలు, పంప్‌హౌస్‌ల పనులను పూర్తి చేసి మోటార్లను సిద్ధం చేయాలని ఆదేశించారు. కాళేశ్వరం వద్ద చేపట్టే కాఫర్ డ్యామ్ ద్వారా వచ్చే జూన్ నాటికి ఎస్సారెస్పీ, మిడ్ మానేరు, ఎల్ఎండీకి నీటికి తరలించేందుకు అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టు ఏజెన్సీ సంస్థలను ఆదేశించారు.

ఆదా కోసం రిస్కు అక్కర్లేదు

ప్రాజెక్టు అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీల అధికారులు నిర్మాణ పనుల గురించి సీఎంకు వివరించారు. సుందిళ్ల బ్యారేజీ పరిధిలో 74 గేట్ల అమరిక పూర్తయిందని, 17 కిలోమీటర్ల మేర ఉన్న కరకట్ట పనులు వేగంగా సాగుతున్నాయని, 89.64 శాతం ఎక్సకవేషన్ పనులు, 76.39 శాతం మట్టి పనులు జరిగాయని వివరించారు. మిగతా పనులు జనవరి చివరి నాటికి పూర్తవుతాయని అధికారులు తెలిపారు. కరకట్ట పరిధిలో రివిట్‌మెంట్ పనుల పురోగతిపై సీఎం ప్రశ్నించగా, 46 శాతం పూర్తయ్యాయని, మార్చి 31 వరకు పూర్తి చేస్తామని చెప్పారు. ఎప్పటికప్పుడు బిల్లులు ఇస్తున్నాం కదా, ఎట్టి పరిస్థితుల్లో ఫిబ్రవరి కల్లా పూర్తి చేయాలి అని సీఎం ఆదేశించారు. కరకట్ట రివిట్‌మెంట్‌కు లైనింగ్ ఎందుకు చేయడం లేదని సీఎం నిలదీశారు. 'కోటిన్నరో, రెండున్నర కోట్లో ఆదా కోసం రిస్క్ అవసరమా?' అని మండిపడ్డారు. ఈ పనులు మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌస్ పనుల్లా లేవంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం వెంట సీఎస్ ఎస్కే జోషి, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, డీజీపీ మహేందర్‌రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు ఉన్నారు.

మెత్తబడ్డ వేములఘాట్ రైతులు

మల్లన్నసాగర్ రిజర్వాయర్ కింద 90 శాతం భూసేకరణ ఇప్పటికే పూర్తయింది. వేములఘాట్ గ్రామస్థులు భూములను ఇవ్వడానికి ససేమిరా అంటున్నారు. ఇక్కడ పెద్ద ఎత్తున పోరాటాలు కూడా జరిగాయి. పలుమార్లు చర్చలు జరిపినా కొలిక్కి రాలేదు. గ్రామ పెద్దలతో నష్టపరిహారం గురించి ఇటీవల చర్చించినట్లు సమాచారం. పరిహారం పెంచడంతో రిజిస్ట్రేషన్ చేయడానికి సిద్ధమయ్యారనే ప్రచారం జరుగుతోంది.

5న సిద్దిపేటకు సీఎం?

సీఎం కేసీఆర్ అతి త్వరలోనే రిజర్వాయర్ల పరిశీలనకు రానున్నారు. 5వ తేదీన ఆయన పర్యటన ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. అనంతగిరి రిజర్వాయర్, రంగనాయక సాగర్ రిజర్వాయర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ పనులను పరిశీలిస్తారు.

హోటళ్లు ప్రోత్సహిస్తాం

ప్రాజెక్టులు పూర్తయ్యాక ఈ ప్రాంతంలో పర్యాటకం అభివృద్ధి చెందుతుందని కేసీఆర్ అన్నారు. కాళేశ్వరం దేవాలయం, అటవీ ప్రాంతం ఉన్నచోట కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే పర్యాటకుల సంఖ్య భారీగా పెరుగుతుందని, 5-10 ఎకరాల్లో హోటళ్లు నిర్మాణం జరిగేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. బహుళజాతి కంపెనీలను భాగస్వాములను చేయాలని ఆలోచిస్తున్నట్లు చెప్పారు.

అన్నారం బ్యారేజీ భేష్

అన్నారం బ్యారేజీ నిర్మాణ పనులు 90 శాతం పూర్తవడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ సంతృప్తి వ్యక్తం చేసి ఇంజనీరింగ్ అధికారులను అభినందించారు. గ్రావిటీ కెనాల్ నిర్మాణంలో మాత్రం అనుకున్న మేర లక్ష్యాన్ని కాంట్రాక్టర్లు, ఏజెన్సీలు చేరలేక పోయాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫిబ్రవరిలో మళ్లీ వచ్చి ప్రాజెక్టులను సందర్శిస్తానన్నారు.


కన్నెపల్లి రిజర్వాయర్ పనుల వివరాలు తెలుసుకుంటున్న సీఎం

పునర్జీవన పనుల్లో జాప్యం సహించం

శ్రీరాంసాగర్ పునర్జీవన పనుల్లో జాప్యం చేస్తే సహించేది లేదని, మార్చి నెలాఖరులోపు రాంపూర్, రాజేశ్వర్‌రావుపేట పంప్ హౌస్ పనులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్‌రావుపేట వద్ద వరద కాలువపై జరుగుతున్న ఎస్సారెస్పీ పునర్జీవన పథకం పంప్ హౌస్ నిర్మాణ పనులను బుధవారం సీఎం కేసీఆర్ పరిశీలించారు. రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌస్ నిర్మాణాలపై సీఎం కేసీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వరద కాలువకు ఇరువైపులా చెరువులు, కుంటలు, చిన్ననీటి వనరులను కాలువ నీటితో నింపాలని సూచించారు. ఏప్రిల్ 7న మరోమారు వస్తానని చెప్పారు. జూన్ నాటికి ఖరీఫ్‌కు నీరు అందించాలన్నారు. 5న అధికారులు, వరద కాలువ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశమై సమీక్షించాలన్నారు.

నీటి ఊటతోనే ఆటంకం

» రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం

దోమలపెంట/నాగర్‌కర్నూల్/మర్రిగూడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నీటి ఊట రావడం వల్లే శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనులకు అంతరాయం ఏర్పడిందని రిటైర్డ్ ఇంజనీర్ల బృందం వెల్లడించింది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని వివిధ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో క్షేత్ర స్థాయిలో ఉత్పన్నమవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు రెండో రోజూ తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం సభ్యులు పర్యటించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి శ్యాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల బృందం బుధవారం దోమలపెంట వద్ద ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను పరిశీలించింది. 44 కిలోమీటర్ల దూరం సొరంగం తవ్వకం పనులు పూర్తి చేయాల్సి ఉండగా ఎంట్రీ పాయింట్లో సీపేజ్ ఆఫ్ వాటర్ కారణంగా పనులకు ఆటంకం కలుగుతున్నట్లు పరిశీలనలో తేలింది. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం చర్లగూడెం రిజర్వాయర్ వద్ద భూనిర్వాసితులు నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని శ్యాంప్రసాద్‌రెడ్డి హామీ ఇవ్వడంతో శాంతించారు.

కేసీఆర్ ఏం చేసినా చరిత్రే

ప్రజల దెబ్బకు ప్రతిపక్షాలు అడ్డం పడ్డాయి.. ఈవీఎంలు కాదు.. వారి బుర్రలే చెడిపోయాయి

» చంద్రబాబు తిట్లను దీవెనలుగా భావిస్తాం:కేటీఆర్

హైదరాబాద్‌సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కేసీఆర్ ఏం చేసినా కొత్త చరిత్రే నని, ఆయన అరుదైన నాయకుడని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇందిర మొదలుకుని, ఎన్టీఆర్, చంద్రబాబు వరకూ ముందస్తుకు వెళ్లిన వారందరికీ చేదు అనుభవాలు ఎదురుకాగా, తెలంగాణలో టీఆర్‌ఎస్‌కు ప్రజలు బ్రహరథం పట్టారని పేర్కొన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి రెండో సారి గెలిపించారని చెప్పారు. గతంలో నాయకులు ప్రజల ఆలోచనలను పసిగట్టలేకపోయేవారని, కానీ కేసీఆర్ మాత్రం ప్రజల హృదయాల్లో కొలువై ఉన్నారన్నారు. అందుకే ఆయన ఏం చేసినా కొత్త చరిత్రే అవుతుందని పునరుద్ఘాటించారు. జలవిహార్‌లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం సనత్‌నగర్ నియోజకవర్గ టీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఈవీఎంలు చెడిపోవడం వల్లే ఓటమి పాలయ్యామని అంటున్న ప్రతిపక్ష నాయకుల బుర్రలే చెడిపోయాయని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజల దెబ్బకు ప్రతిపక్షాలు ఎగిరి అడ్డం పడ్డాయని, ఆయా పార్టీల నాయకులు గిలగిల కొట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఏపీ సీఎం చంద్రబాబు అమరావతిలో కూర్చుని రోజూ మనల్ని తిట్టి పోస్తున్నారని, వాటిని దీవెనలుగా భావిద్దామని అన్నారు. రానున్న రోజుల్లో టీఆర్‌ఎస్ కీలక శక్తిగా ఎదగాలని, పార్లమెంట్ ఎన్నికల్లోనూ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పునరావృతమయ్యేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్‌కు 16 మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచి రాష్ట్రానికి రావాల్సిన ప్రయోజనాలు సాధిస్తారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేసే పథకాలను దేశ వ్యాప్తంగా అమలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఇప్పటికే మూడు రాష్ట్రాలు రైతు బంధును అమలు చేస్తుండగా, దేశ వ్యాప్తంగా అమలు చేయడానికి ప్రధాని మోదీ సిద్ధమవుతున్నట్టు తెలుస్తోందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకున్నారని చెప్పారు. అందుకే ఊహించని రీతిలో తీర్పు ఇచ్చారని అన్నారు.


టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సినీ నటుడు ప్రకాశ్‌రాజ్

'దేశానికే దిక్సూచి తెలంగాణ' ఆవిష్కరణ

తెలంగాణ సంక్షేమ పథకాలు దేశంలోనే అభివృద్ధికి నమూనాగా నిలవటం గర్వంగా ఉందని కేటీఆర్ అన్నారు. బీసీ కమిషన్ ఛైర్మన్ బీఎస్ రాములు రచించిన 'దేశానికి దిక్సూచి తెలంగాణ' పుస్తకాన్ని ప్రగతి భవన్‌లో బుధవారం ఆయన ఆవిష్కరించారు. మరోవైపు.. గవర్నర్ నరసింహన్‌ను కేటీఆర్ బుధవారం కలిశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి పూలమొక్క అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

జనవరి 6 లేదా 8 నుంచి .. ఉచితంగా ఈఎన్‌టీ, దంత పరీక్షలు

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రజలందరికీ ఉచితంగా చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ), దంత పరీక్షలను వచ్చే నెల నుంచి ప్రారంభించాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించిన నేపథ్యంలో అందుకు సంబంధించిన కార్యాచరణపై వైద్య ఆరోగ్యశాఖ దృష్టి పెట్టింది. బుధవారం వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి వనపర్తి, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో పాటు వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో సమావేశమై కసరత్తు మొదలుపెట్టారు. ముందుగా ఎంపిక చేసుకున్న కొన్ని జిల్లాల్లో జనవరి 6 లేదా 8 నుంచి పైలెట్ ప్రాజెక్టుగా ఈఎన్‌టీ, దంత పరీక్షలను నిర్వహించనున్నట్టు సమాచారం. రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఇందుకోసం చెవి, ముక్కు, గొంతు విభాగానికి సంబంధించి 3 ప్రత్యేక బృందాలు, దంత విభాగం నుంచి మరో 3 ప్రత్యేక బృందాలను ఇప్పటికే ఎంపిక చేశారు. ఒక్కో బృందం నుంచి 11 మంది వైద్యులను ఎంపిక చేశారు. ముందుగా పైలెట్ ప్రాజెక్టు ద్వారా పరీక్షలు నిర్వహిస్తే.. క్షేత్రస్థాయిలో ఎటువంటి సమస్యలు ఉత్పన్నమవుతాయో తెలుస్తుందని, వాటిని పరిగణనలోకి తీసుకొని ఫిబ్రవరిలో పూర్తి స్థాయిలో రాష్ట్రమంతా ఈఎన్‌టీ, దంత పరీక్షలను నిర్వహించడం తేలికవుతుందని వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు.

మూడో వంతు విస్తీర్ణంలోనే రబీ సాగు

హైదరాబాద్, జనవరి 02(ఆంధ్రజ్యోతి): రబీ సాగు ఆశాజనకంగా కనిపించటం లేదు. జనవరి నెల వచ్చినప్పటికీ ఇంకా మూడో వంతు విస్తీర్ణంలోనే రబీ పంటలు సాగయ్యాయి. వ్యవసాయ శాఖ బుధవారం విడుదల చేసిన నివేదిక ప్రకారం రబీ సాగు సాధారణ విస్తీర్ణం 33.45 లక్షల ఎకరాలు. అయితే, ఇప్పటివరకు 10.77 లక్షల ఎకరాల్లోనే (32%) పంటల సాగు చేశారు. ఆహార ధాన్యాల సాగు విస్తీర్ణం 26.12 లక్షల ఎకరాలు కాగా.. ఇప్పటివరకు 7.32 లక్షల ఎకరాల్లోనే(28%) సాగైంది. ఆహార ధాన్యాల్లో కీలకమైన వరి పంట సాగు సాధారణ విస్తీర్ణం 17.62 లక్షల ఎకరాలు కాగా.. ఇప్పటి వరకు 1.92 లక్షల ఎకరాల్లో(11%) మాత్రమే వరి సాగైంది. మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 4.15 లక్షల ఎకరాలు కాగా.. ఇప్పటి వరకు 2.25 లక్షల ఎకరాల్లో(54%) సాగైంది. ఇక నూనె గింజల సాగులో కీలకమైన వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 3.57 లక్షల ఎకరాలు కాగా.. ఇప్పటివరకు 2.32 లక్షల ఎకరాల్లో(65%) పంట సాగైంది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. రబీ సీజన్‌లో పంటల సాగుకు సరిపడా వానలు పడలేదు. 18 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది.

మరో రెండు కొత్త జిల్లాలు

» రెండు డివిజన్లు.. 4 కొత్త మండలాలు... నోటిఫికేషన్ జారీ

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మరో రెండు కొత్త జిల్లాలు, కొత్తగా రెండు డివిజన్లు, నాలుగు మండలాలను ఏర్పాటు చేసేందుకు సీఎం కేసీఆర్ అంగీకరించారు. గుండాల మండలాన్ని జనగామ నుంచి యాదాద్రి జిల్లాకు మారుస్తూ జిల్లా, డివిజన్, మండలాల పునర్వ్యవస్థీకరణకు ఆమోదముద్ర వేశారు. ప్రతిపాదిత ఫైలుపై కేసీఆర్ సంతకం చేయడంతో మహబూబ్‌నగర్ జిల్లాను పునర్వ్యవస్థీకరించి 12 మండలాలతో నారాయణ పేటను, జయశంకర్ భూపాలపల్లి జిల్లాను పునర్వ్యవస్థీకరించి 9 మండలాలతో సమ్మక్క సారలమ్మ ములుగును కొత్త జిల్లాలుగా రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. ఆయా జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్వ్యవస్థీకరణపై అభ్యంతరాలు/సూచనలు/సలహాలను ఈ నెల 30వ తేదీ దాకా స్వీకరిస్తారు. ఆ విజ్ఞప్తులను 15 రోజుల్లో పరిశీలించి తుది నోటిఫికేషన్‌ను విడుదల చేస్తారు. దీంతో కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాలు ఫిబ్రవరి 16వ తేదీ తర్వాతే ఏర్పాటు కానున్నాయి. నాగర్‌కర్నూలు జిల్లాలోని నాగర్‌కర్నూలు రెవెన్యూ డివిజన్‌ను పునర్వ్యవస్థీకరించి కోల్లాపూర్‌ను, జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి, జగిత్యాల రెవెన్యూ డివిజన్‌లను పునర్వ్యవస్థీకరించి కోరుట్లను కొత్త డివిజన్లుగా ప్రతిపాదించారు. మరోవైపు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో ముదుచింతలపల్లి, సిద్దిపేట జిల్లాలో నారాయణరావుపేట, నిజామాబాద్ జిల్లాలోని వర్ని మండలాన్ని పునర్వ్యవస్థీకరించి కొత్తగా మోస్రా, చందూరు మండలాలను ప్రతిపాదించారు. జనగామ జిల్లాలోని గుండాల మండలాన్ని యాదాద్రి-భువనగిరి జిల్లాలోకి మారుస్తూ నోటిఫికేషన్ కూడా ఇచ్చారు.

జిల్లా	ప్రతిపాదిత మండలాలు
ములుగు	ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట, సమ్మక్క సారలమ్మ తాడ్వాయి, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, వాజేడు, వెంకటాపురం
నారాయణపేట	నారాయణపేట, దామరగిద్ద, ధన్వాడ, మరికల్, కోస్గి, మద్దూరు, ఉట్కూరు, నర్వ, మాగనూరు, కృష్ణ, మక్తల్, కోయిలకొండ

78ఏళ్ల తర్వాత మళ్లీ అదే ప్రశ్న

» భారత్ ఎవరిది అంటున్నారు!

» దేశానికి ఇది వాంఛనీయం కాదు

» సర్వోదయ భారతే లక్ష్యం కావాలి

» బాపూజీ మనవడు రాజమోహన్ గాంధీ


సభలో ప్రసంగిస్తున్న గాంధీ మనవడు రాజమోహన్ గాంధీ, వేదికపై శాసనమండలి విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్

గుంటూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): 'మహాత్మాగాంధీ హత్యకు ముందు దేశం ఎవరిదన్న ప్రశ్న ప్రజల మధ్య ఉండేది. ఇది హిందూ దేశమని, ఇతర మతస్థులు పాకిస్థాన్‌కి వెళ్లిపోవాలన్న వైషమ్యాలు ఉండేవి. గాంధీ మరణం తర్వాత భారత్ లౌకికదేశంగా మారింది. ఆయన మరణించిన 78ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు భారత్ ఎవరిదన్న ప్రశ్న తలెత్తింది' అని గాంధీ మనవడు, మాజీ ఎంపీ ప్రొఫెసర్ రాజమోహన్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. భారత్ అందరిదీ అనే భావనను పాలకులు ఏర్పరచాలని, ప్రజల మధ్య ఉన్న అంతరాలను తొలగించాలని సూచించారు. 'గాంధీ సిద్ధాంతాలు-నేటి ఆవశ్యకత-తెలుగునాట గాంధీ బాట' అనే అంశంపై బుధవారం గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో పుట్టిన ఆయనకు దేశంలోని అన్ని ప్రాంతాల కంటే ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువమంది మద్దతుదారులున్నారని తెలిపారు. ఆయన సిద్ధాంతాలను ఆచరణలోకి పెట్టేందుకు ప్రయత్నిస్తున్న అందరినీ అభినందిస్తున్నట్లు చెప్పారు. మహాత్మాగాంధీ జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలను వివరించారు. 'ఒక సందర్భంలో ఆశ్రమంలో దళితుల మధ్య తాము ఉండబోమంటూ కుడిభుజంలాంటి మగన్‌లాల్ గాంధీ, ఆయన సతీమణి సంతక్‌బెన్ వెళ్లిపోయారు. కస్తూర్బా కూడా ఆశ్రమం గేట్ల వరకూ వెళ్లి వెనక్కి తిరిగొచ్చారు. మీకు ఇష్టం లేకపోతే వెళ్లిపోవచ్చు. నేను మాత్రం దళితులను బయటకు పంపించబోను' అని బాపూజీ స్పష్టం చేశారని రాజమోహన్ గాంధీ తెలిపారు. ఆ తర్వాత కొద్ది రోజులకు ఆశ్రమం నుంచి వెళ్లిపోయిన వాళ్లు తమ తప్పు తెలుసుకొని తిరిగి వచ్చారని వివరించారు. చంపారణ్ ఉద్యమంలో మహాత్మాగాంధీ అహింసా పద్ధతి నచ్చి సర్దార్ పటేల్ ఆయనకు సహచరుడిగా మారారని అన్నారు. గాంధీ మీద రాసిన పాటలు పాడటం, ఆయనకు జేజేలు పలకడంతోనే ఆగిపోకుండా బాపూజీ సిద్ధాంతాలను నేటి సమాజం ఆచరించేలా చేయాలని అన్నారు. గాంధీ అంటే స్వచ్ఛభారత్ కాదు పరమత సహనం అన్న సత్యాన్ని ప్రజలకు తెలియజేయాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాసనమండలి విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. అమరావతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రూపొందించిన 'తెలుగునాట-గాంధీబాట' పుస్తకాన్ని రాజమోహన్ గాంధీ ఆవిష్కరించారు. తాడికొండకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు నూతక్కి మోహన్‌రావు సతీమణి భాగ్యమ్మను సత్కరించారు.

ఫ్యామిలీ కౌన్సెలింగ్

పరిష్కారం ఉందా?



నేను వేరే మతానికి చెందిన అబ్బాయిని ప్రేమించాను. అతణ్నే పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను. అదే విషయం అమ్మానాన్నలకు చెప్పాను. కానీ వాళ్లు ఒప్పుకోవడం లేదు. బంధుమిత్రులలో పరువు పోతుందంటున్నారు. వాళ్లు చెప్పిన సంబంధం చేసుకోకపోతే చనిపోతామని బెదిరిస్తున్నారు. నేను ప్రేమించిన అబ్బాయిని తప్ప ఎవరినీ చేసుకోనని చెప్పాను. పైగా అతను నా మతంలోకి మారి, నన్ను పెళ్లి చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాడు. అయినా నా తల్లితండ్రులు ఒప్పుకోవడం లేదు. నాకేమో అందరి అంగీకారంతోనే చేసుకోవాలని ఉంది. ఈ సమస్యకి పరిష్కారం ఉందా?

- శాంతి

మీకు ప్రస్తుత పరిస్థితుల పట్ల అవగాహన ఉండే ఉంటుంది. కన్నతీపిని కూడా మరచి ప్రాణాలు బలిగొంటున్న వారిని చూస్తూనే ఉన్నాం. ఈ పరిస్థితుల్లో మీ ప్రేమ సురక్షితంగా పెళ్లి పట్టాలు ఎక్కడం ఎంత తెలివిగా మీరు వ్యవహరిస్తారనే దానిపై ఆధారపడి ఉంటుంది. మీరిద్దరూ ఆర్థికంగా స్థిరపడ్డారో లేదో రాయలేదు. ఎంత చదువుకున్నారో తెలియదు. మీ తల్లితండ్రులకు ఇష్టం లేదని మాత్రమే రాసారు.

మీకు ఇంట్లో ఎవరన్నా మద్దతు ఇస్తారేమో చూడండి. వారి సాయంతో మీ తల్లితండ్రులను ఒప్పించే ప్రయత్నం చేయండి. కాదంటే వారి ఇష్టానికి వ్యతిరేకంగా వెళ్లగలరో లేదో తేల్చుకోండి. ఎలాగైనా ప్రేమించిన వారినే చేసుకోవాలనుకుంటే తగిన అంగబలం, అర్థబలం సమకూర్చుకోండి. చట్టపరంగా రక్షణ తీసుకోండి. అప్పుడు ధైర్యంగా పెళ్లి చేసుకోండి.

• **కె.శోభ** ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్
shobhas292@gmail.com

అవగాహన

ఐ సీయూ!

డిసెంబర్ 24: హైదరాబాద్ లోని గ్లోబల్ ఆస్పత్రి సిబ్బంది మీద రోగి బంధువుల దాడి, ఆస్తి విధ్వంసం...
డిసెంబర్ 28: వైద్యుడిపై రోగి బంధువుల దాడి, గాయాలకు చికిత్స పొందుతున్న వైద్యుడు...

వైద్యులను మానవరూపం లోని భగవంతుడిగా భావించే రోజులు పోయాయా? వైద్యుల మీద దాడులకు పాల్పడే సంస్కృతి ఎందుకు పెరుగుతోంది? 'ఐసియు'లో రోగికి ఏమైనా అయితే వారి బంధువులు 'ఐ సీయూ' అని ఎందుకు విధ్వంసానికి దిగుతున్నారు. అసలు లోపం ఎక్కడుంది? సీనియర్ వైద్యులను సంప్రతించి, కారణాలను విశ్లేషించే ప్రయత్నమిది...



నా దగ్గరకు చికిత్స కోసం ఓ రోగి వచ్చాడు. వ్యాధి గురించి ఆరా తీస్తున్న సమయంలో మరో ఎమర్జెన్సీ కేసు రావడంతో నేను అక్కడి నుంచి వెంటనే వెళ్లవలసిన పరిస్థితి వచ్చింది. ఆ కేసు చూసి, తిరిగి వచ్చి చికిత్స కొనసాగిస్తానని చెప్పి వెళ్లబోతుంటే, రోగితోపాటు వచ్చిన ఓ వ్యక్తి నా మీద దాడి చేయబోయాడు. ఇది ఊహించని పరిణామం. ఈ రోగిది దీర్ఘకాల వ్యాధి. మందులతో చికిత్స చేస్తే నయమవుతుంది. కానీ అవతల వ్యక్తికి ముక్కు నుంచి ఆగకుండా రక్తస్రావం అవుతోంది. వెంటనే చికిత్స చేయకపోతే ప్రాణాపాయం తప్పదు. అలాంటప్పుడు తక్షణ చికిత్స అందించవలసిన రోగికే వైద్యుడిగా నేను తొలి ప్రాధాన్యం ఇస్తాను. వైద్యుడిగా చికిత్స ప్రాధమ్యాలను ఎంచుకునే హక్కు నాకుంది. కానీ ఈ విషయం ఎంతమంది రోగులకు అర్థమవుతుంది? ఇలాంటి అనుభవాలు వైద్యులందరూ ఏదో ఒక సందర్భంలో ఎదుర్కొనేవే! అయితే ఇంతకుముందు పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉండేది. వైద్యులంటే ఎనలేని గౌరవం, నమ్మకం. కానీ కాలక్రమేణా ఈ ధోరణి మారింది. ఇందుకు కారణాలను విశ్లేషిస్తే...

వైద్యులు నేరుగా రోగులతోనే ఇంటరాక్ట్ అవ్వాలి!

రోగుల సంఖ్య పెరుగుతున్నంత త్వరితంగా వైద్యుల సంఖ్య పెరగడం లేదు. దాంతో తక్కువ వైద్యులు ఎక్కువ మంది రోగులను పరీక్షించవలసిన పరిస్థితి. ఫలితంగా రోగుల వైద్య చరిత్ర, గతంలో వ్యాధులు, వాడిన మందులు, చేసిన పరీక్షలు మొదలైన సమాచారం సేకరించడం కోసం వైద్యులు సహాయకులను నియమించుకోవడం పరిపాటైంది. వైద్యుల దగ్గర పని చేసే సహాయకులే వైద్యులకు, రోగులకు మధ్య అనుసంధానకర్తలుగా మారడంతో సమాచారం తారుమారయ్యే అవకాశాలుంటాయి. ఇలాంటి పరిస్థితికి కారణం వైద్యులకు సమయం తక్కువగా ఉండడమే!

వైద్యుడు మానవమాత్రుడే!

ఎలాంటి వ్యాధినైనా నయం చేయగలరనీ, రోగుల ప్రాణాలను ఎలాగైనా కాపాడగలరనీ వైద్యుల పట్ల రోగులకు ఓ భావన ఉంటోంది. కాని వైద్యుడు వ్యాధులను మరమ్మత్తు చేయగలిగే ఓ సాంకేతిక నిపుణుడు మాత్రమే! నూటికి నూరు శాతం వ్యాధులను నయం చేయగలిగే మహత్తు వైద్యులకు ఉండదు. పరిస్థితికి తగ్గట్టు తనకు తెలిసిన పరిజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని ఉపయోగించి చికిత్స చేయడమే వైద్యుల పని. ఆ పనికి తగిన ఫలం అరుదుగా కొన్నిసార్లు ప్రతికూలంగానూ రావచ్చు. అంతమాత్రాన వైద్యులను బాధ్యులుగా చేయడం భావ్యం కాదు.

పరిస్థితి తారుమారు కావచ్చు!

చికిత్స సమయంలో రోగి ఆరోగ్య పరిస్థితి ఏ క్షణం ఎలా మారుతుందో చెప్పలేం! ఊహించని పరిణామాలు కూడా ఎదురు కావచ్చు. అంతర్గత అవయవాలు పని చేయడం మాని, కొత్త కాంప్లికేషన్స్ తలెత్తవచ్చు. కొన్ని సందర్భాల్లో చికిత్సకు రోగి శరీరం స్పందించకపోవచ్చు. తాను సక్రమమైన వైద్యమే అందిస్తున్నా, వైద్యం వికటించవచ్చు. ఇలాంటప్పుడు జరిగే పర్యవసానాలను వైద్యులతోపాటు రోగులూ యథాతథంగా స్వీకరించక తప్పదు.

వైద్యులకు ప్రొటెక్షన్ అవసరం!

రోగులు, వారి సహాయకులు లేదా బంధువుల్లో ఎవరికైనా స్వల్ప విషయాలకే తీవ్రంగా స్పందించే గుణం ఉండవచ్చు. వీళ్లు క్షణికావేశంలో దుందుడుకుగా వ్యవహరిస్తారు. కాబట్టి ఆ పరిస్థితిని ఎదుర్కోవడానికి వైద్యులు లేదా ఆస్పత్రి యాజమాన్యం వ్యక్తిగత రక్షణ కోసం సొంత సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోవాలి.

మహిళా రోగులను ఇలా పరీక్షించాలి!

మహిళా రోగులను పరీక్షించే సమయంలో పక్కనే మహిళా నర్సు లేదా రోగి సంబంధీకులు ఒకరు తప్పక ఉండాలి. ఈ నియమాన్ని వైద్యులు తప్పక పాటించాలి. పరీక్షించే సమయంలో ప్రైవసీ కోసం వారిని బయటకు పంపే అధికారం వైద్యులకు లేదు. ఇలాంటప్పుడు రోగితోపాటు ఉంటామని సంబంధీకులు వైద్యులతో చెప్పవచ్చు.



డాక్టర్ వి. శాతవాహన చౌదరి
ఇ.ఎన్.టి/ ఓటోరైనోలారింజాలజిస్ట్,
అపోలో హాస్పిటల్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్.

వైద్యుల బాధ్యతలు



- వ్యాధి గురించిన సమాచారం, నిర్ధారించిన విధానం మొదలైన విషయాల గురించి రోగి స్పృహలో లేని పక్షంలో వారి బంధువులకు తప్పక తెలియజేయాలి.
- రోగులకు నప్పే ఆరోగ్యబీమా పథకాల గురించిన సమాచారాన్ని రోగులకు తెలియపరచడం ఆస్పత్రి బాధ్యత.
- ఆస్పత్రులు అనుసరించే వైద్యపరమైన పరిశోధనల్లో రోగుల వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచాలి.
- ఒక ఆస్పత్రి నుంచి మరొక ఆస్పత్రికి రోగి ట్రాన్స్‌ఫర్ అవుతున్నప్పుడు కొనసాగించవలసిన మందులు, చికిత్సల చిట్టాను రోగులకు అందచేయాలి.
- రోగి ఆరోగ్య పరిస్థితిని హెచ్చించి, లేదా తగ్గించి కాకుండా, ఉన్నది ఉన్నట్టు చెప్పడం వైద్యుల బాధ్యత.
- చెప్పిన సమయానికే వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలి.
- చికిత్సకు సంబంధించి సరిచేయలేనంత తీవ్రమైన అభిప్రాయభేదాలు తలెత్తితే, పరిస్థితి గురించి స్పష్టంగా వివరించి, వారికి నచ్చిన సలహా అనుసరించే స్వేచ్ఛ కల్పించడం వైద్యులు బాధ్యతగా భావించాలి.
- వైద్యులు ఆస్పత్రిలో తమ హోదా, రుసుము, ఇతర ఛార్జీల వివరాలు కనిపించేలా ప్రదర్శించాలి.
- వైద్యులు ప్రతి ప్రిస్క్రిప్షన్‌లో తమ పేరు, హోదా, రిజిస్ట్రేషన్ వివరాలను తప్పక ముద్రించాలి.

రోగుల హక్కులు

- చికిత్స అందించే వైద్యుల వృత్తిపరమైన హోదా, గుర్తింపులను రోగులు కచ్చితంగా అడిగి తెలుసుకోవచ్చు.
- చికిత్సా పత్రాల ఒరిజినల్ కాపీలు, పరీక్షల ఫలితాలకు సంబంధించిన పత్రాలు అడిగి తీసుకోవచ్చు.
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం, ఎటువంటి ముందస్తు రుసుము



చెల్లించకుండానే ఎలాంటి ఆస్పత్రిలోనైనా అత్యవసర సేవలను పొందవచ్చు.
- వయసు, కులమతాలు, ప్రాంతం, భాష, హెచ్ఐవి, ఇతరత్రా ప్రాణాంతక వ్యాధులు ఆధారంగా చికిత్సలో అసమానతలు పాటించడం చట్టరీత్యా నేరం.
- వ్యాధి గురించిన సెకండ్ ఒపీనియన్ తీసుకునే హక్కు రోగికి ఉంటుంది.
- రోగులకు చికిత్సలకు సంబంధించిన రసీదులను ఆస్పత్రి నుంచి పొందే హక్కు ఉంటుంది.
- రోగులు వైద్యులు సూచించిన మందులను తమకు నచ్చిన ఏ మెడికల్ షాపులోనైనా కొనుగోలు చేసుకోవచ్చు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు కూడా తమకు అందుబాటులో ఉన్న డయాగ్నోస్టిక్ సెంటర్‌లో చేయించుకోవచ్చు.

డాక్టర్లపై ఫిర్యాదు చేయొచ్చు!



వైద్యులు తమ దగ్గరకొచ్చే రోగులకు సమర్థమైన చికిత్స అందించాలనే ఆశిస్తారు. ఆ క్రమంలో చికిత్స అందించాలంటే రోగుల వ్యాధుల సమగ్ర సమాచారం వైద్యులకు తెలిసి ఉండాలి. కానీ ఈ విషయంలో రోగులు కొంత అలక్ష్యం వహిస్తూ ఉంటారు. దాంతో వైద్యులు సరైన చికిత్స అందించడంలో విఫలమవడం సహజం. ఇలా జరగకుండా ఉండాలంటే రోగులు తమకు అందిన వైద్య చికిత్సల పూర్తి సమాచారాన్ని వైద్యులకు కలిసిన వెంటనే చెప్పాలి. ఇలా చేయగలిగితే, చికిత్స సక్రమంగా, సమర్థంగా జరిగి రోగి చికిత్స తాలూకు ఫలితాన్ని పూర్తిగా పొందగలుగుతాడు. కొన్ని సందర్భాల్లో వైద్యులు కూడా తప్పు చేయవచ్చు! ఇలాంటప్పుడు రోగులు పరిస్థితిని తమ చేతుల్లోకి తీసుకోకుండా ఇండియన్ మెడికల్ కౌన్సిల్‌కు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

- **డాక్టర్ ప్రతాప్ రెడ్డి,** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు

భయం వీడి అడగండి!

వైద్యుల పట్ల గౌరవం ఉండడం అవసరమే! కానీ భయం ఉండకూడదు. చికిత్స సమయంలో సాధిస్తున్న పురోగతి గురించి రోగులు ఎప్పటికప్పుడు వైద్యులను అడిగి తెలుసుకోవాలి. అలాకాకుండా ఆస్పత్రికి వచ్చిన తోటి రోగులను ఆరా తీసి, లేనిపోని అపోహలకు లోను కాకూడదు. నా విషయంలో వైద్యులతో ప్రస్తావిస్తే, నాకున్న వ్యాధి దశ చిన్నదనీ, కోలుకునే అవకాశాలు ఎక్కువనీ వివరించారు. ఇలా వైద్యులకు, రోగులకు మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పరుచుకోగలిగితే చికిత్స సులువవుతుంది.

- **ముంతాజ్ బేగం,** బ్రెస్ట్ కేన్సర్ సర్వైవర్, గుంటూరు.

• గోగుమళ్ల కవిత

తిరుప్పావై



చిత్రం: కేశవ్ https://www.facebook.com/keshav61/

భగవానుడికీ, దేవేరికీ పోటీ!

పంతొమ్మిదో పాశురం

కుత్తు విళక్కెరియ క్కోట్టుక్కాల్ కట్టిల్ మేల్
మెత్తెన్ఱ పఞ్చశయనత్తిన్ మేలేరి
కొత్తలర్ పూజ్ఞళల్ నప్పిన్నై కొంగైమేల్
వైత్తుక్కిడన్ద మలర్ మార్పా! వాయ్ తిరవాయ్
మెత్తడజ్ఞణ్ణినాయ్ నీ యున్మణాలనై
ఎత్తనైపోదుమ్ తుయిలెళ ఒట్టాయ్ కాణ్
యెత్తనై యేలుమ్ పిరివాత్ర గిల్లాయాల్
తత్తువ మన్రుత్తగవేలో రెమ్బావాయ్!

మూడు దివ్య పాశురాలలో 'ఇళయ పిరాట్టి' లేదా చిన్న దేవేరి నప్పిన్నాయ్ పురుషకారాన్ని (మధ్యవర్తిత్వాన్ని) ఆండాళ్ అడుగుతోంది. దివ్యదంపతుల పట్ల శరణాగతి ఆచరించేటప్పుడు పురుషకార ప్రపత్తి ప్రాముఖ్యాన్ని విశదం చేసే పాశురాలు ఇవి. ప్రపత్తి ఫలవంతం కావటానికి భగవానుడు, దేవేరి - వారిద్దరి ఆశీర్వాదం అవసరమే! 'ప్రపన్నుడి రక్షణ కోసం ఎవరు ముందుండాలి?' అనే విషయంలో కొన్నిసార్లు భగవానుడు, దేవేరి పోటీపడతారు. దాని వల్ల వైకుంఠ ద్వారాలు తెరచుకోవడంలో ఆలస్యం జరుగుతుంది. ఆండాళ్ తదితర గోపికల విషయంలో జరిగినది అదే! తమ నామసంకీర్తనం చేసేందుకు ఆండాళ్‌నూ, ఆమె చెలులనూ ఆస్థానం లోపలికి ఆహ్వానించవలసినది ఎవరనే ప్రశ్న వల్ల కాలయాపన జరిగింది!

ఈ పాశురం భూమికగా పరాశరభట్టర్ల దివ్య శ్లోకం "నీళాతుంగ స్తనగిరీ తటీ..." ప్రభవించింది. ఈ పాశురం ద్వయమంత్ర ఉత్తరార్ధ భాగానికి సారాంశంగా పేరు పొందింది. శ్రీదేవీ సమేతుడైన శ్రీమన్నారాయణుని కైంకర్యభాగ్యం కోసం ప్రార్థించే పావన పాశురమిది. గొల్ల పిల్లలు దివ్య దంపతులైన కృష్ణస్వామినీ, నప్పిన్నపిరాట్టినీ మేల్కొలుపుతున్నారు. దీపమాలికలు కాంతిప్రభలను విరజిమ్ముతున్న గదిలో, కువలయాపీడాన్ని (కంసుడి ఏనుగును) అణచి ఏర్పరచిన దంతపు కోళ్లు ఉన్న

సౌఖ్యవంతమైన, విశాలమైన శయ్య మీద, పంచవిధాలైన శుభ లక్షణాలు కలిగిన అందమైన, శుభ్రమైన, తెల్లని, మృదువైన, చల్లని పట్టుపరుపు మీద... నప్పిన్నపిరాట్టి వక్షస్థలం ఆధారంగా తన విశాల వక్షస్థలాన్ని ఆనించి... పరమపురుషుడు విశ్రమిస్తున్నాడు. ఆమె కేశపాశాలు వికసించిన విరిదండలతో పాటు పరిమళాలీనుతున్నాయి. "ఓ నీలమేఘశ్యాముడా! అంతటి సౌఖ్యానుభూతి విడిచి లేవకపోతే పోనీ కనీసం పెదవి విప్పి పలుకనైనా పలుకవయ్యా! (నప్పిన్నను ఉద్దేశించి) ఓ యౌవనాంగీ! నల్లని కాటుక కన్నుల సొగసరీ! నీ భర్త విరహం క్షణమైనా సైపజాలకున్నావు. ఆయన నీ పరిష్వంగం వీడవడానికి ఇష్టపడకున్నావు. ఇది నీవంటి దయార్ద్ర హృదయకు న్యాయమా? నీవంటి వారే... ఇతర భగవత్కైంకర్యాభిలాషులు ఉంటారు కదా! వారికి కూడా స్వామి దర్శన సన్నిహిత్యాలను అనుభవించే అదృష్టాన్ని ప్రసాదించు తల్లీ! నీ గాఢపరిష్వంగం సడలించి మాకు కూడా ఆయన దర్శన భాగ్యం ప్రసాదించు!" అని ఆండాళ్ అర్థిస్తోంది.


ఈ పాశురంలో ప్రస్తావించిన పంచముఖ దీపం (కుత్తు విళక్క్) ఆత్మోద్ధారకమైన జ్ఞానదీపానికి ప్రతీక. పట్టు పరుపునకు ఉన్న ఐదు విశేషతలు నాలుగు వేదాలకూ, భగవద్గీతకు చిహ్నాలు. ఈ దివ్య శృంగార భావ నిగూఢమైన పాశురం.. పిరాట్టి పురుషకారానికి నీరాజనం!

ఆండాళ్ తిరువడిగళే శరణం!

• శ్రీదేవీ మురళీధర్

ముత్యాలముగ్గు


గోవిందమ్మ
సిరిసిల్ల



21 చుక్కలు
10 వచ్చేదాకా
మధ్య

ఎస్. వెంకట సామ్రాజ్యం
కృష్ణాజిల్లా, ముస్తాబాద్

13-7 వచ్చేవరకు
మధ్యచుక్క




ఆకుతోట హరిచందన
హసన్‌పర్తి, వరంగల్ అర్బన్

21 చుక్కల మధ్య
11 వచ్చేవరకు



ఐ. సత్య
తాండూర్

17 చుక్కలు
7 వరుసలు
7 వచ్చేవరకు



ముగ్గులు పంపాల్సిన చిరునామా
నవ్య, ముత్యాలముగ్గు,
ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70,
హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.
ఈ-మెయిల్: navya@andhrajyothy.com

ఈ ఏడాదిలో ఇంచుమించు 5 కోట్ల మంది భారతీయులు విదేశాలను చుట్టేస్తారని 'ప్రపంచ పర్యాటక సంస్థ' అంచనా వేసింది. అమెరికా, ఆస్ట్రేలియా, ఇటలీ, ఫ్రాన్స్.... లాంటి దేశాలు వారి జాబితాలో కచ్చితంగా ఉంటాయి. కానీ రొటీన్‌కి భిన్నంగా నూతన సంవత్సరంలో ఎక్కువ మంది వెళ్లాలనుకుంటున్న కొన్ని దేశాలు.....

ఈ సారి అటెళ్దాం



ఇస్తాంబుల్ నగరం

ప్రకృతి ముఖచిత్రం

టర్కీ పేరు విన్నగానే ముందుగా అందరికీ గుర్తొచ్చేది ఆ దేశ రాజధాని ఇస్తాంబుల్. హాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకూ అనేక సినిమాల్లో ఈ నగర అందాలు కనువిందు చేశాయి. అంతెందుకు రెండేళ్ల క్రితం వచ్చిన బాండ్ చిత్రం 'స్కైఫాల్' ఓపెనింగ్ సన్నివేశంలోనూ కనిపిస్తుందీ నగరం. ముఖ్యంగా 'పాముక్కలే' అనే పల్లె అయితే టూరిస్టులకు తెగ ఇష్టం. అక్కడ మీకు 'థర్మల్ పూల్స్' 'వేడి నీటి సరస్సులు) దర్శనమిస్తాయి. కొన్ని వేల ఏళ్ల క్రితం ఆ దేశాన్ని పాలించిన రోమన్ల కాలం నుంచీ ఈ 'పాముక్కలే' సహజసిద్ధమైన స్పాగా ప్రసిద్ధి. ఈ పల్లెకు సమీపంలో ఉన్న 'హీరాపోలిస్' అనే నగరానికి చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యం ఉంది. అందుకే హీరాపోలిస్- పాముక్కలే'లను యునెస్కో సంస్థ ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది. అందుకే 'చర్చ్ ఆఫ్ హోలీ విజ్‌డమ్'గా పేరొందిన 'హేగియా సోఫియా' మ్యూజియం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. దీన్ని నిర్మాణం క్రైస్తవం- ఇస్లాం సంస్కృతులను ప్రతిబింబించేలా ఉంటుంది.

చూడాల్సిన ప్రదేశాలు: సుల్తాన్ అహ్మద్ మసీదు, గ్రాండ్ బజార్, గొరెమ్ పట్టణం

ఎలా వెళ్లాలి: భారత్ నుంచి నేరుగా ఇస్తాంబుల్‌కు విమాన సర్వీసులు ఉన్నాయి. హైదరాబాద్ నుంచి సుమారు 11 గంటల ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఇక న్యూఢిల్లీ, ముంబయిల నుంచి కేవలం ఆరు గంటల్లో ఇస్తాంబుల్ చేరుకోవచ్చు.

భగభగలాడే చల్లని దీవి!

అడవుల్లేని దేశం అది. ఏడాదంతా మంచు పరుచుకొని ఉంటుంది. వందలకు పైగా అగ్నిపర్వతాలను తనలో దాచుకొన్న విశిష్టత దీని సొంతం. అందుకే ప్రపంచంలోని అనేకమంది సందర్శకులు చూడటానికి పోటీపడతారు. ఈ దేశం పేరు ఐస్‌ల్యాండ్. ఇదొక దీవి. దీన్ని ల్యాండ్ ఆఫ్ ఫైర్, ఐస్‌గా అభివర్ణిస్తారు. అట్లాంటిక్ మహాసముద్రాన్ని ఆనుకొని ఉన్న ఈ దేశానికి పర్యాటకమే ప్రధాన ఆదాయ వనరు. ప్రతి నాలుగేళ్లకొకసారి బద్దలయ్యే అగ్నిపర్వతాలు నిప్పులు చిమ్ముతూ ఉంటాయి. ఆ భయానక వాతావరణంలో కూడా హెలికాప్టర్లో చక్కర్లు కొడుతూ వీక్షించవచ్చు. మరికొంత మంది ఆ అగ్నిపర్వతాల సమీపం వరకూ వెళ్లడానికి కూడా ఉత్సాహం చూపుతారు.

చూడాల్సిన ప్రదేశాలు: బ్లూ లాగూన్ (వేడి నీటి సరస్సు), గోల్డెన్ సర్కిల్ జలపాతం, అక్రుయెరీ పట్టణం

ఎలా వెళ్లాలి: ఐస్‌ల్యాండ్‌కు వెళ్లాలంటే కెఫ్లాఫిక్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మన దేశంలోని ప్రధాన విమానాశ్రయాల నుంచి నేరుగా సర్వీసులు లేవు. యూరోప్, ఉత్తర అమెరికాలోని పలు ప్రధాన నగరాల నుంచి కనెక్టింగ్ ఫ్లయిట్స్ ఉంటాయి. లండన్, న్యూయార్క్, సీటిల్ నగరాలను చేరుకొని అక్కడి నుంచి ఐస్‌ల్యాండ్ వెళ్లొచ్చు.



ఐస్‌ల్యాండ్‌లోని ఓ అగ్ని పర్వతం వద్ద పర్యాటకులు



కొరియోన్ ఆర్కియాలజికల్ సైట్

చరిత్రకు సాక్ష్యం!

పర్యాటకానికి అత్యంత ప్రాధాన్యమిచ్చే మిడిల్ ఈస్ట్ దేశాల్లో సిప్రస్ ఒకటి. టర్కీకి దక్షిణ దిక్కులో, చుట్టూ మధ్యధరా సముద్రాన్ని చుట్టుకొని ఉన్న ఈ దేశం పర్యాటకం మీద ఆధారపడింది. ఇక ఈ దేశాన్ని చూడాలంటే వేసవి సెలవులే ఉత్తమం! ముఖ్యంగా అక్కడి అందమైన సాగరతీరాలే పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. సిప్రస్ దేశానికి కేంద్ర బిందువుగా ఉన్న ఒక చారిత్రక నగరాన్ని కచ్చితంగా చూడాల్సిందే. దీని పేరు 'న్యూ పఫోస్'. క్రీస్తు పూర్వం 58వ సంవత్సరంలో రోమన్లు ఈ ప్రాంతాన్ని తమ ఆర్థిక రాజధానిగా చేసుకొని పాలించారు. రాజుల సమాధుల కోసం ప్రత్యేకంగా మరో నగరాన్ని నిర్మించారు. దీని పేరు 'టోంబ్స్ ఆఫ్ కింగ్స్'. ఏప్రిల్ నుంచి అక్టోబర్ నెలల్లో ఈ దేశం పర్యాటకానికి అనువుగా ఉంటుంది.

చూడాల్సిన ప్రదేశాలు: కోరియోన్ ఆర్కియాలజికల్ సైట్, సెయింట్ హిలేరియన్ క్యాసిల్.

ఎలా వెళ్లాలి?: భారత్ నుంచి సిప్రస్‌లోని లార్నకా నగరానికి చేరుకోవాలి. ప్రయాణ సమయం సుమారు ఆరు గంటలు.

ఘన వారసత్వం....

దక్షిణ కొరియా.... రొటీన్ ట్రావెలర్స్‌కు కాకుండా కాస్త కొత్తదనం కోరుకునేవారికి ఈ దేశం సరికొత్త అనుభూతినిస్తుంది. తరతరాల చారిత్రక వారసత్వాన్ని తనలో ఇముడ్చుకున్న దేశం అది. ప్రకృతి అద్భుతాలకు చిరునామాగా నిలిచిన ఈ దేశంలో ఓ క్వారీ ఉంది. ఏ దేశంలోనైనా క్వారీ అంటే కాలుష్యానికి మారుపేరులా ఉంటుంది. కానీ ఆ దేశంలోని పోచియోన్ నగర సమీపంలోని క్వారీకి ఓ ప్రత్యేకత ఉంది. ఈ క్వారీని కొన్నేళ్ల క్రితం అందమైన పార్క్‌గా తీర్చిదిద్దారు. దాంతో ఇది కూడా పర్యాటక కేంద్రంగా మారింది. ఇక అక్కడి జిండో సముద్రం మీద నడవచ్చు తెలుసా? వేసవిలో ఆ దేశానికి వెళ్లారంటే కచ్చితంగా 'జిండో సీ పార్టింగ్'ను చూడాల్సిందే. జిండో దీవి నుంచి మోడో దీవి వరకు సముద్రంలో సహజసిద్ధంగా ఏర్పడే దారి పర్యాటకులకు హాట్‌ఫేవరెట్‌గా మారింది.

చూడాల్సిన ప్రదేశాలు: సియోల్ నగరం, జేజూ నగరం, సియోరక్సన్ జాతీయ పార్కు, గేమ్‌చియోన్ కల్చర్ విలేజ్ హాసియోంగ్ కోట, నార్త్ సియోల్ టవర్

ఎలా వెళ్లాలి: భారత్‌లోని ప్రధాన నగరాల నుంచి సియోల్‌కు విమాన సర్వీసులు ఉన్నాయి. ప్రయాణ సమయం అయిదు గంటలు.



జిండో సీ పార్టింగ్

స్టార్ వెకేషన్

సిడ్నీ నగరం వేసే మంత్రం!

ఆ హార్బర్ నా ఫేవరెట్!

నాకు బాగా నచ్చిన ప్రదేశాల్లో ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరం ఒకటి. వ్యక్తిగతంగా నా మనసుకు చాలా దగ్గరైన నగరం అది. అక్కడి హార్బర్‌ను ఎన్ని సార్లు చూసినా తనివితీరదు. ఎప్పుడూ కొత్తగా ఉంటుంది. నా భార్య అయేషా కూడా ఆస్ట్రేలియాలో స్థిరపడిన భారతీయ కుటుంబానికి చెందిన అమ్మాయి. అందుకే నా క్రికెట్ టూర్లు పూర్తి అయ్యాక, నేను వెళ్లేది అక్కడికే. పెర్త్, మెల్‌బోర్న్ కూడా బాగా ఇష్టం. అంతేకాదు ఇప్పటికే శ్రీలంక, అమెరికా, వెస్టిండీస్ దేశాలను కుటుంబంతో సహా చూసి వచ్చాను.



బ్యాట్‌తో మైదానంలో పరుగుల సునామీ సృష్టించడం శిఖర్ ధావన్ స్టయిల్. అందుకే అతనికి ఎంతో మంది అభిమానులు ఉన్నారు. అంతేకాదు, ట్రావెలింగ్‌లో కూడా శిఖర్ ముందు ఉంటాడు. క్రికెట్ టూర్స్‌కు వెళ్లినప్పుడు కచ్చితంగా అక్కడి ప్రదేశాలను చూసి రాకుండా ఉండలేడు. 'అన్‌డిస్కవర్ ఆస్ట్రేలియా' అనే కార్యక్రమానికి ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నాడు శిఖర్ ధావన్. ట్రావెలింగ్ ఎంత ఇష్టమో అతని మాటల్లోనే....!

అది మర్చిపోలేని ఘటన

నేను ఎక్కడికెళ్లినా రకరకాల ఆహార పదార్థాలు ట్రై చేస్తూ ఉంటాను. ఎలాంటి సంకోచాలు పెట్టుకోను. కానీ ఇలా తినడానికి కాస్త ధైర్యం కావాల్సిందే. "ఎలా తినగలుగుతున్నావు?" అని చాలా మంది ఆశ్చర్యంగా అడుగుతూ ఉంటారు. ఒకసారి దుబాయ్ వెళ్లినప్పుడు ఓ రెస్టారెంట్‌లో మెనూ చూసి కొత్తగా ఉంది కదా అని ఓ ఐటమ్ ఆర్డర్ ఇచ్చాను. పేరు 'ఎస్కార్‌గోట్'. తినేశాకే తెలిసింది అది నత్తలతో తయారుచేసే వంటకం అనీ. "అయ్యో! అని మాత్రం బాధపడలేదు. ఎందుకంటే నాకు రకరకాల ఆహారపదార్థాలు ట్రై చేయడమంటే ఇష్టం. అందుకే లైట్ తీసుకున్నా. ఇప్పటికీ నాకు మర్చిపోలేని సంఘటన ఒకటి ఉంది. దక్షిణాఫ్రికాలో జరిగే క్రికెట్ సిరీస్ కోసం కుటుంబంతో కలిసి వెళ్లాలనుకున్నాం. ముంబయి నుంచి దక్షిణాఫ్రికా వెళ్లాలనేది మా ఆలోచన. మధ్యలో దుబాయ్‌లో ఫ్లయిట్ మారాలి. కానీ, ఆ ఫ్లయిట్ మారేటప్పుడు నన్ను వెళ్లనిచ్చారు. కానీ నా కుటుంబాన్ని ఆపేశారు. ఇదేంటని అడిగితే, పిల్లల జన్మ ధ్రువీకరణ పత్రాలు కావాలన్నారు విమానాశ్రయం అధికారులు.

మరే దేశం వెళ్లినా మాకు ఈ ఇబ్బంది కలగలేదు. పైగా ఆ సిబ్బంది మాతో చాలా దురుసుగా ప్రవర్తించడం బాధించింది. చివరికి నా భార్య, పిల్లలు లేకుండానే ఆ పర్యటన గడిచిపోయింది.

వీటిదే హవా!



అధ్యయనం

మహిళా పర్యాటకులు పెరిగారు. అడ్వెంచర్ టూరిజం ఊపందుకుంది. సెల్ఫ్ డ్రైవ్ చేసుకుంటూ టూర్లు చేసేవారి సంఖ్య రెట్టింపయింది. విలాసవంతమైన గమ్యాలను ఎక్కువమంది ఎంచుకున్నారు. కిందటి ఏడాది తెలుగు రాష్ట్రాల్లో పర్యాటక రంగ ధోరణులూ, మార్పుల గురించి కాక్స్ అండ్ కింగ్స్ హెడ్ (రిలేషన్ షిప్స్) కరణ్ ఆనంద్ చెబుతున్న విశేషాలు:

- హైదరాబాద్ కేంద్రంగా విదేశీ ప్రయాణాల బుకింగ్స్ 2018లో 18 శాతం పెరిగాయి. దేశీయ పర్యటనలకు 28శాతం డిమాండ్ పెరిగింది.
- దేశీయమైన గమ్యాల్లో ఎక్కువమంది ఎంచుకున్న ప్రాంతాల్లో అండమాన్, రాజస్థాన్, గోవా, మనాలీ, కశ్మీర్, సిక్కిం, డార్జిలింగ్ ఉన్నాయి.
- అంతర్జాతీయంగా ఐరోపా దేశాలకు ఏడాదంతా డిమాండ్ కనిపించింది. ఇంగ్లండ్‌లోని లండన్, జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లకు నేరుగా విమానాలు ఉండడం కలిసొస్తోంది. ఎక్కువమంది ఎంచుకున్న విదేశీ గమ్యాల్లో థాయిలాండ్, సింగపూర్, హాంగ్‌కాంగ్, దుబాయ్, మాల్దీవులు టాప్‌లో నిలుస్తున్నాయి.
- కొన్నాళ్ళ క్రితం వరకూ తెలుగు రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది కుటుంబాలతో విహార యాత్రలకు వెళ్ళేవారు. రెండేళ్ళుగా ఈ పరిస్థితి మారిపోయింది. 2018లో వ్యక్తిగత పర్యటనలు చేసేవారి సంఖ్య బాగా పెరిగింది. సైట్ సీయింగ్, రెగ్యులర్ గ్రూప్ టూర్స్ కాకుండా... ఒక వినూత్నమైన అనుభవాన్ని అందుకోవాలని ఎక్కువ మంది ఆశిస్తున్నారు. దీని ఫలితంగా అడ్వెంచర్ టూరిజానికీ, కొత్త రుచులను చవిచూపించే ప్రదేశాలకూ, స్వయంగా వాహనాలు నడుపుకొంటూ (సెల్ఫ్‌డ్రైవ్) వెళ్ళగలిగే గమ్యాలకూ, విలాసవంతమైన వసతులు ఉండే నగరాలకూ గిరాకీ పెరిగింది.
- మహిళా పర్యాటకుల సంఖ్యలో కిందటి ఏడాది 10 శాతం పెరుగుదల నమోదైంది. సోలోగా ప్రయాణాలు చేపట్టిన మహిళలు కూడా పెరిగారు. కుటుంబం, స్నేహితులతో కాకుండా సోలోగా పర్యటించే మహిళలు, ప్రధానంగా అందరూ మహిళలే ఉండే పర్యాటక ప్యాకేజీలను ఎంపిక చేసుకుంటున్నారు.
- హైదరాబాద్‌లో హైటెక్ సిటీ ఉండడం, చాలా కంపెనీలు ఇక్కడి నుంచి కార్యకలాపాలు సాగిస్తూండడంతో 'బిలీజర్' (బిజినెస్ ప్లస్ లీజర్) ట్రావెలింగ్ బాగా పెరుగుతోంది. 2017తో పోలిస్తే 2018లో ఎనిమిది శాతం వృద్ధి నమోదయింది.
- వారాంతాల్లో టూర్లకు చెక్కేయ్యడం మెట్రో నగరాల ట్రెండ్. ఇది తెలుగు రాష్ట్రాల్లో కూడా ఇప్పుడిప్పుడే స్థిరపడుతోంది. వీకెండ్స్‌లో ఎక్కువగా దేశీయమైన గమ్యాలను పర్యాటకులు ఎంచుకుంటున్నారు. దేశంలోని అనేక నగరాలకూ, పట్టణాలకూ తెలుగు రాష్ట్రాల నుంచి ఎయిర్ కనెక్టివిటీ పెరిగింది. వివిధ విమాన యాన సంస్థలు కొత్త రూట్లలో సేవలను 2018లో ప్రారంభించాయి. దేశీయంగా వీకెండ్ ట్రావెలింగ్ ఊపందుకోడానికి ప్రధాన కారణాల్లో ఇదొకటి!

రాష్ట్రపతి ఇంట్లో మనం!

మనదగ్గరే!



దేశానికి ప్రథమ పౌరుడైన రాష్ట్రపతి ప్రతి సంవత్సరం దక్షిణ భారతదేశానికి వచ్చి విడిది చేస్తూ ఉంటారు. అదే సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయం. భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ నుంచి ప్రస్తుత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వరకూ ఇక్కడ బస చేశారు. తాజాగా రామ్‌నాథ్ కోవింద్ కిందటి నెలలో నాలుగు రోజులపాటు ఉండి వెళ్ళారు. రాష్ట్రపతి తిరిగి ఢిల్లీకి వెళ్ళిన తరువాత కొన్ని రోజుల పాటు సందర్శకులను అనుమతించడం ఆనవాయితీగా వస్తోంది.

ప్రవేశం ఉచితం

ఎప్పుడు?: ఈ నెల ఆరో తేదీ వరకూ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య, సాయంత్రం 5 తరువాత గేట్లు మూసేస్తారు.

ఎక్కడుంది?: సికింద్రాబాద్‌లోని బొల్లారంలో

ఎలా వెళ్ళాలి?: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు సుమారు 10 కిలోమీటర్ల దూరంలో బొల్లారం ఉంది. ఆర్టీసీ బస్సుల్లో చేరుకోవచ్చు. బొల్లారంలో లోకల్ ట్రైన్ స్టేషన్ కూడా ఉంది.

విశేషాలు: 90 ఎకరాల్లో, సుమారు 2,500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నఈ భవనాన్ని 1860లో నిజాం నవాబ్ నజీరుద్దుల్లా నిర్మించారు. అప్పట్లో ప్రధాన సైనికాధికారి నివాసంగా ఇది ఉండేది. 1950లో భారత ప్రభుత్వం దీన్ని స్వాధీనం చేసుకుంది. దక్షిణాదిలో రాష్ట్రపతి విడిది కోసం అతిథి గృహంగా మార్చి, దీనికి రాష్ట్రపతి నిలయంగా నామకరణం చేసింది. ఈ భవంతిలో దాదాపు నూటయాభైమంది బస చెయ్యవచ్చు. చుట్టూ చెట్లూ, పూల తోటలూ, ఔషధ మొక్కల ఉద్యానవనంతో ఈ భవనం ఆద్యంతం ఆహ్లాదకరంగా ఉంటుంది.

డైలీ సుడోకు - 414

					2	5		
		2			8			
9				6			2	
1	2				3	9		
	7	8	1		9	6	5	
		9	2				7	3
	6			5				4
			6			7		
		4	3					


ఎలా పూరించాలి?


ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 413 సమాధానం

9	1	5	3	4	7	8	6	2
2	8	3	9	5	6	4	7	1
7	4	6	1	2	8	5	3	9
8	3	2	4	9	1	6	5	7
4	9	7	2	6	5	1	8	3
5	6	1	7	8	3	2	9	4
6	2	9	5	7	4	3	1	8
3	5	4	8	1	9	7	2	6
1	7	8	6	3	2	9	4	5


ABHISHEK AGARWAL ARTS
The Name you can always Trust
HAPPY BIRTHDAY TO OUR HERO
BELLAMKONDA
SAI SREENIVAS
ABHISHEK AGARWAL
PEDDITI RAM


Happy Birthday
BELLAMKONDA
Sai Sreenivas
A.K.Entertainments


STUDIOS
A HAVISH LAKSHMAN KONERU PRODUCTION
HAPPY BIRTHDAY
BELLAMKONDA
SAI SREENIVAS
PEDDITI RAM
PRODUCTION NO.1
SATYANARAYANA KONERU RAMESH VARMA PENMETSA
MULTIDIMENSION VAASU

నిమ్మకూరు మహిమ ఏమో!


బాలకృష్ణ

"ఏడాది క్రితం నిమ్మకూరు వెళ్లా. మా అల్లుడు లోకేశ్ మా గ్రామాన్ని దత్తత తీసుకున్నాడు. ప్రైమరీ హెల్త్ సెంటర్‌ని అప్‌గ్రేడ్ చేశాడు. అప్పుడు నిమ్మకూరు వెళ్లాను... రామారావుగారి బయోపిక్ చేద్దామనుకుంటున్నాని చెప్పాను నా నోటి నుంచి ఎందుకు వచ్చిందో తెలియదు" అని బాలకృష్ణ అన్నారు. 'యన్.టి.ఆర్-కథానాయకుడు'తో ఈ సంక్రాంతికి థియేటర్లలో సందడి చేయడానికి ఆయన సిద్ధమయ్యారు. తన తండ్రి ఎన్టీఆర్ పాత్రలో బాలకృష్ణ నటించిన చిత్రమిది. ఎన్టీఆర్ బయోపిక్ రెండో భాగం 'యన్.టి.ఆర్ - మహానాయకుడు' ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. తొలి భాగం త్వరలో విడుదల కానున్న సందర్భంగా బాలకృష్ణ సినిమా ఎలా మొదలైందనే విషయం గురించి ఓ వీడియో ఇంటర్వ్యూలో మాట్లాడారు. "ఫస్ట్ విష్ణు ఇందూరి నన్ను కలిశాడు. ఎన్టీఆర్‌గారిపై ఓ సినిమా చేద్దామనుకుంటున్నానని చెప్పాడు. అతనూ మా కుటుంబంలో సభ్యుడే. అతను అడిగే సరికి... అలాగే చేద్దామన్నాను. కథంతా రఫ్‌గా ఉంది. సిద్ధం కాలేదు. ఆ ప్రతిపాదనను అలా వదిలేశాం. మళ్ళీ దాని గురించి ఆలోచించలేదు. బహుశా... స్థల మహిమ, క్షేత్ర మహిమ అంటాం కదా! అదేనేమో! నిమ్మకూరులో అడుగుపెట్టాను... అనుకోకుండా నాన్నగారి బయోపిక్ చేస్తానని ప్రకటించాను. అంతా కాకతాళీయంగా... యాదృశ్చికంగా జరిగింది" అన్నారు. ఎన్టీఆర్ బయోపిక్ విడుదల తర్వాత బోయపాటి శ్రీను దర్శకత్వంలో బాలకృష్ణ నటించనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం కోసం బాలకృష్ణ సుమారు 25 కేజీల బరువు తగ్గారని ఫిల్మ్‌నగర్ టాక్. ఎన్.బి.కె. ఫిలిమ్స్ పతాకంపై బాలకృష్ణ నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణ ఫిబ్రవరిలో ప్రారంభం కానుంది.



నన్ను అడగలేదు కానీ...

పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటించిన 'తీన్‌మార్' గుర్తుందా? ఈ చిత్రానికి హిందీ హిట్ 'లవ్ ఆజ్ కల్' మాతృక. ఆ చిత్రానికి ఇంతియాజ్ అలీ దర్శకత్వం వహించారు. ప్రస్తుతం ఆయన సీక్వెల్ తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో కథానాయకుడిగా నటించే అవకాశం కార్తీక్ ఆర్యన్ దగ్గరకు వెళ్ళిందని తెలుస్తుంది. అతనికి జోడీగా 'లవ్ ఆజ్ కల్'లో కథానాయకుడిగా నటించిన సైఫ్ అలీఖాన్ కుమార్తె సారా నటించే అవకాశాలున్నాయని ముంబై గుసగుస. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కార్తీక్ ఆర్యన్‌తో నటించాలనుందని సారా చెప్పడమూ ఇలాంటి గుసగుసలకు బలాన్నిచ్చింది. అయితే... 'లవ్ ఆజ్ కల్ 2'లో కథానాయిక అవకాశం కియారా తలుపు తట్టిందనీ, కార్తీక్ ఆర్యన్‌కి జోడీగా ఆమెను తీసుకోవాలనే ఉద్దేశంలో ఇంతియాజ్ అలీ ఉన్నారనీ ఓ ఆంగ్ల పత్రిక పేర్కొంది. ఈ వార్తలో నిజం లేదని కియారా అద్వాణీ స్పష్టం చేశారు. "ఇంతియాజ్ అలీ దర్శకత్వం వహించబోయే తదుపరి చిత్రంలో కథానాయిక పాత్రకు నన్ను సంప్రతించారని రాశారు. ఈ విషయంలో అందరికీ స్పష్టత ఇవ్వాలని చెబుతున్నా. నన్ను ఎవరూ సంప్రతించలేదు. నన్ను నటించమని అడగలేదు కానీ... ఈ వార్త నిజమైతే బావుండేది. నిజం కావాలని ఆశిస్తున్నా" అని కియారా అద్వాణీ ట్వీట్ చేశారు. మహేశ్‌బాబు 'భరత్ అనే నేను' చిత్రంతో తెలుగు చిత్రసీమకు ఈమె కథానాయికగా పరిచయమైన సంగతి తెలిసిందే. సంక్రాంతి సందర్భంగా ఈ నెల 11న విడుదల కానున్న 'వినయ విధేయ రామ'లో రామ్‌చరణ్ సరసన కథానాయికగా నటించారీమె. ప్రస్తుతం హిందీలో 'అర్జున్‌రెడ్డి' రీమేక్ 'కబీర్ సింగ్', 'గుడ్ న్యూస్' చిత్రాల్లో నటిస్తున్నారు.


అమీ జాక్సన్, జార్జ్ పనాయొటో

సగం పెళ్ళయింది!

నిశ్చితార్థం జరిగితే సగం పెళ్ళయినట్టేనని పెద్దలు చెబుతుంటారు! ఆ లెక్కన అమీ జాక్సన్‌కి సగం పెళ్ళయ్యింది!! ఈ బ్రిటన్ బ్యూటీ నిశ్చితార్థం జనవరి 1న జార్జ్ పనాయొటోతో జరిగింది. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం ఆఫ్రికన్ దేశం జాంబియాలో వైల్డ్ లైఫ్ అడ్వెంచరస్ ట్రిప్‌కి వెళ్ళిన వీరిద్దరూ ఒకటో తేదీన ఉంగరాలు మార్చుకున్నారు. "జీవితంలో జనవరి 1న కొత్త సాహసయాత్ర మొదలైంది. ఐ లవ్యూ జార్జ్. ప్రపంచంలో అత్యంత సంతోషమైన అమ్మాయిగా నన్ను ఉంచినందుకు థాంక్యూ" అని అమీ జాక్సన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. బ్రిటన్‌లో జార్జ్ పనాయొటో ప్రముఖ వ్యాపారవేత్త. మల్టీ మిలియనీర్! గత కొన్నాళ్ళుగా అతడితో అమీ జాక్సన్ డేటింగులో ఉన్నారు. క్రిస్మస్ వేడుకలనూ ఇద్దరూ సెలబ్రేట్ చేసుకున్నారు. తెలుగులో 'ఎవడు', 'అభినేత్రి' చిత్రాల్లో నటించిన అమీ... ఇటీవల విడుదలైన రజనీకాంత్ '2.0'లో సందడి చేశారు.

రజనీకాంత్‌గారు నాకు స్ఫూర్తి

- అశోక్ వల్లభనేని



"బస్సు కండక్టర్ స్థాయి నుంచి సూపర్‌స్టార్ స్థాయికి ఎదిగిన రజనీకాంత్‌గారంటే నాకు చాలా గౌరవం. ఆయన్ని స్ఫూర్తిగా తీసుకుంటా. ఆయన సినిమా 'పేట'ను సంక్రాంతి కానుకగా ఈ నెల 10న తెలుగులో విడుదల చేస్తున్నందుకు ఆనందిస్తున్నా" అని నిర్మాత అశోక్ వల్లభనేని అన్నారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ "మామూలుగా కొన్ని ఊర్ల పేర్లలో 'పేట' అనే పదం కనిపిస్తుంటుంది. మా సినిమాలో టైటిల్ 'పేట' కూడా అలాంటిదే. రజనీకాంత్‌గారు 25 ఏళ్లకు ముందు ఎంత యంగ్‌గా, యాక్టివ్‌గా ఉండేవారో, ఈ సినిమాలో అలా కనిపిస్తున్నారు. రెండు గెటప్పుల్లో కనిపిస్తారు. ఆయన పక్కన త్రిష, సిమ్రన్ నటించారు. రజనీకాంత్‌ని దేవుడిలా భావించే దర్శకుడు కార్తిక్ సుబ్బరాజ్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. అన్నీ అంశాలు మేళవించిన చిత్రంగా చరిత్ర సృష్టిస్తుంది. ఇప్పటికే 50శాతం బిజినెస్ కూడా అయింది నాకు. తెలుగు నుంచి ఎందరు పోటీకి వచ్చినా సరే.. నా మీద ఉన్న నమ్మకంతో సన్ పిక్చర్స్ ఈ చిత్రం హక్కులను రూ.కోటిన్నర తక్కువగా నాకే ఇచ్చారు. అందుకు వారికి ధన్యవాదాలు. సంక్రాంతికి సినిమాలు ఎక్కువగా ఉండటంతో థియేటర్లు ముందు కాస్త తక్కువగా దొరికినా మౌత్ టాక్‌తో తప్పకుండా థియేటర్లు పెరుగుతాయనే నమ్మకం ఉంది. కష్టేఫలి అని నమ్మే వ్యక్తిని నేను. ఈ సినిమాను కూడా ప్రజల్లోకి తీసుకెళ్తాను. ట్రైలర్‌కు ఇప్పటికే మంచి స్పందన వస్తోంది. పాటలు కూడా జనాల్లోకి వెళ్లాయి. అనిరుద్ మంచి సంగీతాన్నిచ్చారు. ఈ నెల 6న హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహిస్తాం. టీమ్ అందరూ ఈ కార్యక్రమానికి హాజరవుతారు. రజనీకాంత్ చేతుల మీదుగా కొన్ని సేవా సంస్థలకు ఆర్థిక సాయాన్ని అందించాలనుకుంటున్నాం" అని అన్నారు. ఈ ఏడాది స్ట్రెయిట్ తెలుగు సినిమాను నిర్మించనున్నట్టు తెలిపారు. పెద్ద హీరో కాల్షీట్ ఇచ్చినట్టయితే వారితో ముందుకు వెళ్తామని, లేని పక్షంలో కథను నమ్ము కుని సినిమాను తీయడానికి సిద్ధంగా ఉన్నాననీ ఆయన చెప్పారు.

రాజన్నా... నిన్నాపగలరా?


మమ్ముట్టి

దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి చేసిన పాదయాత్ర ఆధారంగా రూపొందిన సినిమా 'యాత్ర'. 'ఆనందో బ్రహ్మ' ఫేమ్ మహి వి. రాఘవ్ దర్శకుడు. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మాతలు. వైయస్సార్ పాత్రను మలయాళ అగ్ర నటుడు మమ్ముట్టి పోషించారు. ఫిబ్రవరి 8న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలోని రెండో పాట 'రాజన్నా... నిన్నాపగలరా'ను ఇటీవల విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "తొలి పాట 'సమర శంఖం' చిత్రకథలో తీవ్రతకు అద్దం పడితే... రెండో పాట వైయస్సార్‌గారి పాదయాత్ర వల్ల ప్రజలు ఎంత ఆనందించారనే దానికి అద్దం పట్టింది. సిరివెన్నెలగారు అద్భుతమైన సాహిత్యం అందించారు. ఒక ముఖ్యమంత్రి అభ్యర్థి, మహానాయకుడు నేరుగా బడుగుబలహీన వర్గాల దగ్గరకు వెళితే... వారెంత సంతోషిస్తారనేది పాట రూపంలో చక్కగా మలిచారు. పాటకు శ్రోతల నుంచి అద్భుత స్పందన లభిస్తోంది. వైయస్సార్ పాత్రలో మమ్ముట్టిగారు పరకాయ ప్రవేశం చేసిన ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో ఏకకాలంలో ఫిబ్రవరి 8న విడుదల చేస్తున్నాం" అన్నారు. రావు రమేశ్, జగపతిబాబు, సుహాసిని, అనసూయ, పోసాని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సమర్పణ: శివ మేక.

ఫన్నీ దొంగ.. గోవింద!



సప్తగిరి హీరోగా అరుణ్ పవార్ దర్శకత్వంలో శివ శివమ్ ఫిలిమ్స్ పతాకంపై 'వజ్ర కవచధర గోవింద' చిత్రం తెరకెక్కుతోంది. నరేంద్ర యెడల, జీవీఎన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు అరుణ్ పవార్ మాట్లాడుతూ "మా కథకు 'వజ్ర కవచధర గోవింద' అనే టైటిల్ కరెక్ట్‌గా సరిపోతుంది. ఇందులో సప్తగిరి పాత్ర పేరు గోవిందు. అతను ఫన్నీ దొంగ. అతనికో లక్ష్యం ఉంటుంది. దాని సాధన కోసం ఏం చేశాడనేది ఈ సినిమా. కడుపుబ్బా నవ్వించే అంశాలతో పాటు, మంచి యాక్షన్, ఎమోషన్, ఇతర వాణిజ్య అంశాలు చక్కగా కుదిరాయి" అని అన్నారు. 60 శాతం షూటింగ్ పూర్తయిందని నిర్మాతలు తెలిపారు. వైభవీ జోషి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ నిర్మాత: సాలన బాలగోపాలరావు.

కవ్విస్తూ.. భయపెడుతూ..


శైలజ, సమీర్‌ఖాన్

ఇంటర్నేషనల్ మోడల్స్ సమీర్‌ఖాన్, శైలజ హీరోహీరోయిన్లుగా రూపుదిద్దుకొంటున్న 'కె.ఎస్. 100' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. షేర్ దర్శకత్వంలో వెంకటరెడ్డి ఈ సినిమా నిర్మిస్తున్నారు. చిత్ర విశేషాలను దర్శకుడు వివరిస్తూ 'టైటిల్‌కు తగ్గట్టే వైవిధ్యమైన కంటెంట్‌తో రూపుదిద్దుకొంటున్న సినిమా ఇది. హారర్, సస్పెన్స్, థ్రిల్లర్, రొమాన్స్ అంశాలతో చిత్రం ఉంటుంది. కవ్విస్తూ, భయపెడుతూ ఉత్కంఠతో సినిమా సాగుతుంది. గోవా, హైదరాబాద్, మహారాష్ట్రలోని హిరంబుల్‌లో షూటింగ్ చేశాం. చాలా మంది మోడల్స్ చిత్రంలో నటించారు. టైటిల్ లోగోను త్వరలో విడుదల చేస్తాం. మిగిలిన కార్యక్రమాలు పూర్తి చేసి , సినిమా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు.

'ఉన్మాది'లా ఎందుకు..?


శిరీష, ఎన్.ఆర్. రెడ్డి

"నేరం చేసిన ప్రతి ఒక్కర్నీ వెతికి వెతికి వెంటాడి పట్టుకునే ఓ నిజాయతీ గల పోలీస్ అధికారి ఉన్మాదిలా ఎందుకు మారాడు? తర్వాత అతనేం చేశాడు? అనేది మా చిత్రకథ. నేను హరికృష్ణగారి అభిమానిని. ఈ చిత్రంలో ఒక్కసారైనా ఆయనలా కనిపించాలని ప్రయత్నించా. అలా కనిపిస్తే సక్సెస్ సాధించినట్టే" అన్నారు ఎన్.ఆర్. రెడ్డి. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తూ, దర్శకత్వం వహించిన చిత్రం 'ఉన్నాది'. ఎన్. రామారావు నిర్మాత. శిరీష కథానాయిక. డేవిడ్ సంగీతమందించిన ఈ చిత్రంలో పాటల్ని మంగళవారం నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేశారు. దర్శకుడు ఎన్. శంకర్ ట్రైలర్ విడుదల చేశారు. త్వరలో సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామని ఎన్.ఆర్. రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణుడు పాల్గొన్నారు.

ఉబర్ రాబడి రూ.21.5 కోట్లు

న్యూఢిల్లీ: భారత్‌లో అమెరికాకు చెందిన క్యాబ్ అగ్రిగేటర్ ఉబర్ వ్యాపారం జోరుగా పెరుగుతోంది. 2018 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి ఈ సంస్థ వ్యాపారం రూ.21.5 కోట్లకు చేరుకుంది. 2016-17 సంవత్సరంలో సంస్థ మొత్తం రాబడి రూ.1.04 కోట్లుగా ఉంది. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సమర్పించిన డాక్యుమెంట్ల ద్వారా ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఆన్ డిమాండ్ క్యాబ్ సర్వీసులు అందిస్తున్న ఉబర్ ఇండియా టెక్నాలజీ లాభం 2016-17 సంవత్సరంలో రూ.3.22 లక్షలుండగా.. 2017-18 నాటికి రూ.19.6 లక్షలకు పెరిగింది.

ఆ కంపెనీలకూ వర్తింపజేయాలి

ఎంఎస్ఎంఈని ప్రాధాన్య రంగంగా గుర్తించాలి.. రుణ పునర్‌వ్యవస్థీకరణ పథకంపై ఎంఎస్ఎంఈ ప్రతినిధులు

ముంబై: అప్పుల భారంతో సతమతమవుతున్న సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి కంపెనీలకు (ఎంఎస్ఎంఈ) ఊరట కలిగించేందుకు రిజర్వు బ్యాంకు ప్రకటించిన రుణ పునర్‌వ్యవస్థీకరణ పథకాన్ని వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) కింద నమోదుకాని కంపెనీలకు కూడా వర్తింప చేయాలని ఎంఎస్ఎంఈ వర్గాలు రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ)ను కోరాయి. రూ.25 కోట్ల వరకు ఎంఎస్ఎంఈలకు ఇచ్చిన రుణాలను ఒక సారి పునర్వ్యవస్థీకరించేందుకు ఆర్‌బీఐ మంగళవారం అనుమతిచ్చింది. ఈ రంగాన్ని ప్రాధాన్య రంగంగా గుర్తించాలని సూచించాయి. . "జీఎస్‌టీ కింద నమోదైన, నమోదుకాని అన్ని ఎంఎస్ఎంఈలకు పథకాన్ని అమలు చేయడం వల్ల మరింత ప్రభావం ఉంటుంది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ మూలంగా అనేక కంపెనీలపై ప్రతికూల ప్రభావం పడింది. ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా మారడంతో రుణాలను చెల్లించడంలో జాప్యం జరిగింది" అని భారత ఎంఎస్ఎంఈ సమాఖ్య సెక్రటరీ జనరల్ అనిల్ భరద్వాజ్ అన్నారు. "ఆర్‌బీఐ చేసిన ప్రకటన ఎంఎస్ఎంఈ రంగానికి ఊతం లాంటిది. ఎంఎస్ఎంఈలు తీసుకున్న రుణాలు ఎన్‌పీఏలుగా మారడంతో ఇబ్బందులుపడుతున్నాయని" ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ ఫోరమ్ చైర్మన్ రజ్‌నీష్ గోయెంకా తెలిపారు. "ఎంఎస్ఎంఈలు సులభంగా రుణం పొందే విధంగా ప్రాధాన్యత రంగం హోదా కల్పించాలి. ఈ రంగానికి రుణం అందించే ఫిన్‌టెక్ కంపెనీలకు ప్రోత్సాహకాలివ్వాలి" అని పవర్2ఎస్ఎంఈ వ్యవస్థాపకుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆర్ నారాయణన్ తెలిపారు.

మొండి బకాయిలు మళ్లీ మొదటికి..?

ఆర్‌బీఐ తాజా మార్గదర్శకాలతో దేశంలోని బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ) రూ.10,000 కోట్ల విలువైన ఎంఎస్ఎంఈ రుణాలను పునర్వ్యవస్థీకరించే అవకాశం ఉందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేస్తోంది. ఈ పరిణామంతో దేశీయ బ్యాంకింగ్ రంగంలో మొండి బకాయిల ప్రహసనం మళ్లీ మొదలు కావచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్థిక మాంద్యంతో కుదేలైన కార్పొరేట్ రంగానికి ఊరట కల్పించేందుకు ఒత్తిడిలో ఉన్న రుణాలను పునర్వ్య వస్థీకరించేందుకు ఆర్‌బీఐ గతంలో పలు పథకాలను అందుబాటులోకి తెచ్చింది. కానీ, చాలా బ్యాంకులు మొండి బకాయిల్లోకి మళ్లించాల్సిన రుణ ఖాతాలను దాచిపెట్టేందుకు ఈ పథకాలను దుర్వినియోగపర్చాయి. దాంతో రఘురాజన్ గవర్నర్‌గా ఉన్న సమయంలో ఆర్‌బీఐ బ్యాంకుల ఆస్తుల నాణ్యతపై సమీక్ష జరిపింది. ఆ సమీక్ష ఫలితంగా బ్యాంకింగ్ రంగంలో పెద్ద మొత్తంలో రుణ ఖాతాలు మొండి పద్దుల్లోకి వచ్చి చేరాయి. ఆ తర్వాత కాలంలో (ఉర్జిత్ పటేల్ హయాంలో) ఆర్‌బీఐ కార్పొరేట్ రుణాల పునర్వ్యవస్థీకరణ కోసం ప్రవేశపెట్టిన పథకాలన్నింటినీ ఉపసంహరించుకుంది. అయితే, ప్రభుత్వ ఒత్తిడితో ఆర్‌బీఐ తాజాగా మరోసారి రుణ పునర్వ్యవస్థీకరణ పథకాన్ని ప్రవేశపెట్టింది.

నిపుణుల కమిటీ

ఎంఎస్ఎంఈ రంగం ఎదుర్కొంటున్న సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారాలను సూచించడంతోపాటు ఈ రంగం ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అవసరమైన మార్గాలను తెలియజేసేందుకుగాను ఒక నిపుణుల కమిటీని ఆర్‌బీఐ బుధవారం ఏర్పాటు చేసింది. ఎనిమిది మంది సభ్యులు ఉండే ఈ కమిటీకి సెబీ మాజీ చైర్మన్ యుకె సిన్హా సారథిగా ఉంటారు. ఆర్థిక పరంగా ఈ రంగాన్ని ప్రభావితం చేస్తున్న అంశాలను గురించి ఈ కమిటీ పరిశీలన చేస్తుంది. జూన్‌కు నివేదిక సమర్పిస్తుందని ఆర్‌బీఐ వెల్లడించింది. ఎంఎస్ఎంఈ రంగానికి మద్దతుగా ప్రస్తుతం ఉన్న సంస్థాగత విధానాన్ని సమీక్షిస్తుంది. ఇటీవలి ఆర్థిక సంస్కరణల ప్రభావం ఈ రంగంపై ఏవిధంగా ఉందో అధ్యయనం చేస్తుంది. అంతేకాకుండా ఈ రంగం వృద్ధిని ప్రభావితం చేస్తున్న నిర్మాణాత్మక సమస్యలను గుర్తిస్తుంది. ఎంఎస్ఎంఈ రంగానికి సంబంధించి ప్రపంచవ్యాప్తంగా అమల్లో ఉన్న అత్యుత్తమ విధానాలను సైతం అధ్యయనం చేస్తుంది. అత్యాధునిక టెక్నాలజీ ప్రస్తుతం అందుబాటులో ఉంది. ఈ నేపథ్యంలో ఈ రంగంలో టెక్నాలజీ వినియోగం ద్వారా వృద్ధిని పెంచడానికి ఉన్న అవకాశాలను కమిటీ ఆర్‌బీఐకి తెలియజేయనుంది. దేశ ఆర్థిక వ్యవస్థలో ఎంఎస్ఎంఈ రంగం చాలా ముఖ్యమైనదని, ఈ నేపథ్యంలో ఈ రంగం పనితీరును ప్రభావం చేసే అంశాలు, నిర్మాణాత్మక అవరోధాలను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆర్‌బీఐ పేర్కొంది.



ప్రతినిధులతో ఆర్‌బీఐ గవర్నర్ భేటీ

భారత రిజర్వు బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ వచ్చే వారంలో నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ), సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థల (ఎంఎస్ఎంఈ) ప్రతినిధులతో సమావేశంకానున్నారు. ఇప్పటికే శక్తికాంత దాస్ ప్రభుత్వరంగ బ్యాంకుల సారథులతో రెండుసార్లు, ప్రైవేటు బ్యాంకర్లతో ఒకసారి సమావేశమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వచ్చే వారంలో ఎంఎస్ఎంఈ అసోసియేషన్ ప్రతినిధులతో ఆర్‌బీఐ గవర్నర్ సమావేశం కావాలని నిర్ణయించారు. "ఎంఎస్ఎంఈ అసోసియేషన్లు, ఎన్‌బీఎఫ్‌సీల ప్రతినిధులతో వచ్చే వారంలో సమావేశాలు నిర్వహిస్తాం" అని శక్తికాంతదాస్ ట్విటర్‌లో పేర్కొన్నారు.

అప్రెంటిస్‌లకు పెరగనున్న కొలువులు

హైదరాబాద్‌లో 25 శాతం పెరిగే అవకాశం

హైదరాబాద్ : ఈ సంవత్సరం అప్రెంటిస్(శిక్షణార్థులు)లకు హైదరాబాద్‌లో ఉద్యోగ అవకాశాలు బాగానే పెరగనున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం వీరికి ఉద్యోగ అవకాశాలు ఎంత లేదన్నా 25 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని 'టీమ్‌లీజ్' అనే సంస్థ అంచనా. చాలా కంపెనీలు అభ్యర్థులను కాలేజీల నుంచి ఉద్యోగాల్లోకి తీసుకునే ముందే, అప్రెంటిస్‌లుగా తీసుకుని వారికి పరిశ్రమ అవసరాలకు తగ్గట్టు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తున్నాయి. ఆ శిక్షణ పూర్తయిన వెంటనే చాలా కంపెనీలు వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ ఇటీవల ఈ నైపుణ్యాల శిక్షణ బాగా పెరిగింది. దీంతో ఫార్మా, వ్యవసాయ రంగాలకు చెందిన కంపెనీలు గత సంవత్సరం అప్రెంటిస్‌ల్లో 70 శాతం మందిని వెంటనే ఉద్యోగాల్లోకి తీసుకున్నాయి. ప్రధాన నగరాలతో పోలిస్తే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఇది మరింత ఎక్కువగా ఉంది. ఈ సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆటో, ఫార్మా, వ్యవసాయ, ఐటీ, ఐటీ ఆధారిత సేవల కంపెనీలు, ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ కంపెనీలు అప్రెంటిస్‌లను ఎక్కువగా ఉద్యోగాల్లోకి తీసుకునే అవకాశం ఉందని టీమ్‌లీజ్ తెలిపింది..

ఎగుమతిదారులకు కేబినెట్ నజరానా

3 శాతం వడ్డీ సబ్సిడీకి ఆమోదం

న్యూఢిల్లీ: ఎగుమతులకు ఊతం ఇచ్చే లక్ష్యంతో ప్రభుత్వం ఎగుమతిదారులకు 3 శాతం వడ్డీ రాయితీ ప్రకటించింది. బుధవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని వల్ల వడ్డీ ఈక్వలైజేషన్ స్కీమ్ అమల్లో ఉన్న మిగతా కాలంలో ఎగుమతిదారులకు రూ.600 కోట్ల మేరకు ప్రయోజనం సమకూరుతుందని అధికార ప్రతినిధి ఒకరు చెప్పారు. ఎగుమతులకు ముందు, వెనుక తీసుకునే రూపాయి విలువ రుణాలపూ ఈ వడ్డీ సబ్సిడీ వర్తిస్తుంది. ఈ స్కీమ్‌ను 416 రకాల ఉత్పత్తులకు వర్తింపచేస్తున్నారు. ఇవన్నీ కార్మికులు అధిక సంఖ్యలో పని చేసే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగానికి చెందిన ఉత్పత్తులే కావడం విశేషం.

రబ్బర్ బోర్డు సభ్యుడిగా హరిబాబు



న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): రబ్బర్ బోర్డు సభ్యుడిగా బీజేపీ విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హరిబాబు ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నికను బుధవారం లోక్‌సభ సచివాలయం ఒక బులెటిన్ ద్వారా ప్రకటించింది. బోర్డులో సభ్యుడిగా ఉన్న బీఎస్ యడ్యూరప్ప కర్ణాటక ఎమ్మెల్యేగా ఎన్నికైన నేపథ్యంలో ఏర్పడిన ఖాళీకి ఎన్నిక నిర్వహించారు.

ఎస్ఏఎఫ్ఏ ప్రెసిడెంట్ జగన్ మోహన్ రావు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సౌత్ ఏషియన్ ఫెడరేషన్ ఆఫ్ అకౌంటెంట్స్ (ఎస్ఏఎఫ్ఏ)కు ప్రెసిడెంట్‌గా పివిఎస్ జగన్ మోహన్ రావు బాధ్యతలు స్వీకరించారు. 2019 ఏడాదికి ఆయన ఈ హోదాలో కొనసాగుతారు. 2018లో ఎస్ఏఎఫ్ఏ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన జగన్ మోహన్ రావు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) కేంద్ర కౌన్సిల్ సభ్యుడిగా ఉన్నారు. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అకౌంటెంట్స్ (ఐఎఫ్ఏసీ)కు చెందిన ప్రొఫెషనల్ అకౌంటెంట్స్ ఇన్ బిజినెస్ కమిటీలో సభ్యుడిగా పని చేస్తున్నారు. ఇంకా అనేక ఏజెన్సీలు, కమిటీల్లో సభ్యులుగా ఉన్నారని ఐసీఏఐ తెలిపింది. జగన్ మోహన్ రావుకు ఫైనాన్స్, సెక్రటేరియల్, లీగల్, జనరల్ మేనేజ్‌మెంట్‌లో 30 సంవత్సరాలకు పైగా అనుభవం ఉంది. వివిధ కంపెనీల్లో ఫైనాన్స్ డైరెక్టర్‌గా, సీఎఫ్ఓ, కంపెనీ సెక్రటరీగా ఉన్నారు.



దేశీయ విమానయాన పరిశ్రమకు కొత్త ఊపిరి అందనుంది. ముడి చమురు ధరలు తగ్గుతుండటం, తత్ఫలితంగా విమాన ఇంధన (ఏటీఎఫ్) ధరలు దిగి వస్తుండటంతో అప్పులు, నష్టాలతో కొట్టుమిట్టాడుతున్న ఈ రంగంలోని కంపెనీలకు కాస్త ఊరట లభించనుంది. ఏటీఎఫ్ ధరలు రానున్న కాలంలో మరింతగా దిగివస్తే తీవ్రమైన గడ్డుకాలం నుంచి ఎయిర్‌లైన్స్ పరిశ్రమ బయటపడే అవకాశం ఉంటుందని పరిశ్రమవర్గాలు అంటున్నాయి. విమానయాన భాగ్యం ఆమ్‌ఆద్మీకి కూడా మరింతగా చేరువవుతుందన్న ఆశాభావం వ్యక్తం అవుతోంది.

కొత్త ఏడాది.. కొత్త ఊపిరి

- వరుసగా రెండో నెలా తగ్గిన ఏటీఎఫ్ ధర
- కంపెనీల్లో నష్టాలు తగ్గుతాయన్న ఆశలు
- టికెట్ల ధరలూ తగ్గే చాన్స్

ఆంధ్రజ్యోతి, బిజినెస్ డెస్క్

కొత్త సంవత్సరం ఆరంభం రోజునే ఏటీఎఫ్ ధరను 14.7 శాతం మేర తగ్గిస్తున్నట్టు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రకటించాయి. దీంతో దేశీయ విమానయాన కంపెనీలకు న్యూ ఇయర్ గిఫ్ట్ లభించినట్టయింది. వరుసగా రెండో నెలలోనూ ఏటీఎఫ్ ధర తగ్గడం గమనార్హం. 2008 నవంబరు తర్వాత ఈ స్థాయిలో ధర ఇంతకు ముందెన్నడూ తగ్గలేదు.

ఇంధనం వాటాయే 40 శాతం

ఏటీఎఫ్ ధర తగ్గడం విమానయాన కంపెనీలకు ఎంతో ఊరట కలిగిస్తోంది. నిర్వహణ వ్యయాలు పెరిగిపోవడంతో ఈ కంపెనీలు నష్టాలపాలవుతున్నాయి. దేశీయ విమాన కంపెనీల మొత్తం వ్యయాల్లో ఏటీఎఫ్ వాటాయే 40 శాతం వరకు ఉంటుంది. అధిక ఇంధన ధరకు తోడు రూపాయి విలువ తగ్గిన ఫలితంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో మూడు దిగ్గజ ఎయిర్‌లైన్స్ కంపెనీలు నష్టాలను ప్రకటించాయి. ఇండిగో, జెట్ ఎయిర్‌వేస్, స్పైస్‌జెట్ ఉమ్మడిగా రూ.2,338 కోట్ల నష్టాలను ప్రకటించాయి. క్రితం త్రైమాసికంలో ఇంధన ధరలు అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే 50 శాతం మేర పెరిగాయి. ఫలితంగా కంపెనీలకు నష్టాలు అనివార్యమయ్యాయి.

ఆశావాహంగా అంచనాలు

గత కొన్ని వారాలుగా అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధర తగ్గుముఖంలో ఉంది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ ముడి చమురు ధర 53 డాలర్ల స్థాయిలో కదలాడుతోంది. అయితే ఈ ఏడాదిలో ముడిచమురు ధర 60 డాలర్ల స్థాయిలో ఉండవచ్చన్న అంచనాలు వెలువడుతున్నాయి. ఇదే జరిగితే ఎయిర్‌లైన్స్ కంపెనీల నష్టాలు తగ్గడానికి మరిన్ని అవకాశాలు లభిస్తాయి.

ఏడాదంతా తగ్గింపు ధరలు

విమానయాన కంపెనీల మధ్య పోటీ తీవ్రమవుతోంది. మార్కెట్ వాటాను కాపాడుకోవడానికి, కొత్త కస్టమర్లను ఆకర్షించడానికి అన్ని కంపెనీలు ఆరాటపడుతున్నాయి. అందుకే దాదాపు ఏడాది కాలమంతా ఏదో ఒక తగ్గింపు ధరల ఆఫర్లను అందిస్తున్నాయి. ఇంధన ధరలు పెరుగుతున్న భారం ఒకవైపు సీట్లను నింపుకోవడానికి తగ్గింపు ధరలు మరోవైపు ఉండటంతో కంపెనీలపై మోయలేని భారం పడుతోంది. స్వల్పకాలానికి ఆఫర్లను ప్రకటించడం ద్వారా ఎక్కువ మంది టికెట్లను కొనుగోలు చేస్తున్నారు. దీంతో కంపెనీలకు నిర్వహణ ఆదాయం లభిస్తోంది. కానీ మొత్తంగా చూస్తే ఆర్థిక నష్టమే మిగులుతోంది. టికెట్ల ధరలను పెంచే పరిస్థితి లేని కారణంగా ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఎయిర్‌లైన్స్ కంపెనీలు ఒక్కో ప్యాసెంజర్‌పై రూ.1,120 నష్టపోయినట్టు బోయింగ్ చెబుతోంది. అంతకు ముందు ఏడాది ఇదే కాలంలో ఒక్కో ప్రయాణికుని పై కంపెనీలకు రూ.199 లాభం వచ్చింది.

వరుసగా 51వ నెలలోనూ

దేశంలో విమానయాన రంగం జోరుగా వృద్ధి చెందుతోంది. ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న కారణంగా ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న దేశీయ ఏవియేషన్ మార్కెట్‌గా వరుసగా 51వ నెలలోనూ భారత్ నిలిచింది. ప్రయాణికుల సంఖ్యలో రెండంకెల వృద్ధి నమోదవుతోంది. ఈ ఏడాది జనవరి-నవంబరు మధ్యకాలంలో ప్రయాణికుల వృద్ధి 19 శాతంగా ఉంది.

జెట్ ఎయిర్‌వేస్‌లో రుణ చెల్లింపుల సంక్షోభం

జెట్ ఎయిర్‌వేస్.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సారథ్యంలోని బ్యాంకుల కన్సార్టియం నుంచి తీసుకున్న రుణాలపై డిసెంబరు నెలకు చెల్లించాల్సిన అసలు, వడ్డీ బకాయి పడింది. గత ఏడాది కాలంగా తీవ్ర నిధుల కొరత కారణంగా సంస్థ ఉద్యోగులకు వేతనాలు వాయిదాల పద్ధతిలో చెల్లిస్తున్న విషయం విదితమే. తాజాగా తనకు రుణాలు ఇచ్చిన కన్సార్టియంకు అసలు, వడ్డీ కూడా చెల్లించలేకపోయినట్టు తెలిపింది. జెట్ ఎయిర్‌వేస్‌పై గత డిసెంబరు నుంచి వచ్చే మార్చి చివరికి రూ.1,700 కోట్లు, 2020 ఆర్థిక సంవత్సరానికి రూ.2,444.5 కోట్లు, 2021 ఆర్థిక సంవత్సరానికి రూ.2167.9 కోట్ల రుణ చెల్లింపుల భారం ఉన్నట్టు తెలిపింది.

సెప్టెంబరు త్రైమాసికంలో నష్టాలు (రూ.కోట్లు)

ఇండిగో	జెట్ ఎయిర్	స్పైస్‌జెట్
652	1,297	389

నాలుగు మెట్రో నగరాల్లో కిలో లీటరు ఏటీఎఫ్ సగటు ధర

2016	మే	రూ.44,362
2017	మే	రూ.53,390
2018	మే	రూ.66,509
2018	డిసెంబరు	రూ.69,660
2019	జనవరి	రూ.59,663

విమానాల సంఖ్య డబుల్

దేశీయంగా విమాన ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో విమానాశ్రయాల విస్తరణతోపాటు విమానాల అవసరం కూడా ఏర్పడనుంది. ప్రస్తుతం దేశీయ గగనతలంలో దాదాపు 600 విమానాలు ఎగురుతున్నాయి. వీటి సంఖ్య రానున్న కాలంలో రెండింతలు కానుందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

మరిన్ని ఆఫర్లు

ఏటీఎఫ్ ధరలు తగ్గడం వల్ల విమానయాన కంపెనీల నిర్వహణ వ్యయాలు తగ్గడానికి అవకాశం ఉంటుంది. నష్టాలను పూడ్చుకునే వీలుంటుంది. ఇదే సమయంలో ప్యాసెంజర్ల సంఖ్యను పెంచుకునేందుకు కొత్త ఆఫర్లను కూడా ప్రకటించవచ్చని పరిశ్రమవర్గాలు అంటున్నాయి.

5.98 శాతం

ప్రత్యక్ష పన్నులు–జీడీపీ నిష్పత్తి

పదేళ్లలో అత్యధికం

న్యూఢిల్లీ: గడిచిన ఆర్థిక సంవత్సరం(2017-18)లో ప్రత్యక్ష పన్నులు-స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) నిష్పత్తి 5.98 శాతానికి పెరిగింది. గత పదేళ్లలో ఇదే అత్యంత మెరుగైన నిష్పత్తి అని కేంద్ర ఆర్థిక శాఖ బుధవారం ప్రకటించింది. ఈ నిష్పత్తి 2015-16లో 5.47 శాతంగా, 2016-17లో 5.57 శాతంగా నమోదైంది. భారత్‌ను పన్ను చట్టాలకు లోబడే సమాజంగా మార్చాలన్నదే లక్ష్యమని దేశంలో వ్యక్తిగత ఆదాయంపై పన్ను చెల్లింపులు భారీగా పెరిగాయని 2018 సమీక్ష నివేదికలో ఆర్థిక శాఖ పేర్కొంది. ఈ నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..

- ప్రత్యక్ష పన్నులు-జీడీపీ నిష్పత్తి గత మూడేళ్ల నుంచి నిలకడగా వృద్ధి కనబరుస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో పదేళ్ల అత్యుత్తమ స్థాయి 5.98 శాతానికి చేరుకుంది.
- గత నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో ఆదాయం పన్ను (ఐటీ) రిటర్నుల ఫైలింగ్ 80 శాతం వృద్ధి చెందింది. 2013-14లో 3.79 కోట్ల ఐటీ రిటర్నులు దాఖలు కాగా.. 2017-18లో ఈ సంఖ్య 6.85 కోట్లకు చేరుకుంది.
- ఐటీ రిటర్నులు దాఖలు చేసే వ్యక్తుల సంఖ్య 2013-14లో 3.31 కోట్లుగా నమోదుకాగా.. 2017-18లో 5.44 కోట్లకు చేరుకుంది.
- గడిచిన మూడేళ్లలో అన్ని కేటగిరీల్లోనూ ఆదాయ వెల్లడి విలువ గణనీయంగా పెరిగింది. 2014-15 మదింపు సంవత్సరంలో దాఖలైన రిటర్నులలో అన్ని కేటగిరీల వారు వెల్లడించిన ఆదాయం విలువ రూ.26.92 లక్షల కోట్లుగా నమోదైంది. 2017-18 మదింపు సంవత్సరానికి ఈ విలువ 67 శాతం వృద్ధి చెంది రూ.44.88 లక్షల కోట్లకు చేరుకుంది.
- గత ఏడాది ఏప్రిల్-నవంబరు మధ్యకాలంలో రూ.1.23 లక్షల కోట్ల పన్ను రిఫండ్ చేయడం జరిగింది. అంత క్రితం ఏడాదిలో ఇదే కాలానికి నమోదైన రిఫండ్‌లతో పోలిస్తే 20.8 శాతం పెరిగింది.
- కార్పొరేట్ ఆదాయం పన్ను వృద్ధి రేటు 17.7 శాతం, వ్యక్తిగత ఆదాయం పన్ను వృద్ధి రేటు 18.3 శాతానికి చేరుకుంది.

గరిష్ఠ స్థాయిలో వృద్ధి రేటు

ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరాల్లో (2018-19, 2019-20)నూ భారత వృద్ధి రేటు గరిష్ఠ స్థాయిలోనే నమోదు కానుందని ఆర్థిక శాఖ ధీమా వ్యక్తం చేసింది. 2014-15 నుంచి 2017-18 వరకు సరాసరి వృద్ధి రేటు 7.3 శాతంగా నమోదైంది. 2018-19 ప్రథమార్థంలో జీడీపీ వృద్ధి 7.6 శాతంగా నమోదైంది. ఆర్థిక వ్యవస్థపై పెట్టుబడిదారుల్లో నమ్మకం పెంచేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని వార్షిక సమీక్ష నివేదికలో ఆర్థిక శాఖ పేర్కొంది. వ్యాపార నిర్వహణకు అనుకూలమైన దేశాల్లో భారత్ ర్యాంకింగ్ మరింత మెరుగుపడింది. 2018కి గాను ప్రపంచ బ్యాంక్ విడుదల చేసిన జాబితాలో ఇండియాకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో 77వ స్థానం లభించిందని నివేదికలో ప్రస్తావించింది.

వాట్సప్‌లో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ సేవలు

న్యూఢిల్లీ: ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ వాట్సప్ ద్వారా కొన్ని సేవలు ప్రారంభించింది. అనుమతించిన ఖాతాదారుల వాట్సప్ నెంబరుకు వెల్‌కం కిట్స్, పాలసీ సర్టిఫికెట్లు, ప్రీమియం రసీదులు, ఇంకా అనేక ఇతర సేవలు అందిస్తున్నట్టు తెలిపింది. దేశంలో ఒక జీవిత బీమా కంపెనీ వాట్సప్ ద్వారా ఇలాంటి సేవలు అందించడం ఇదే మొదటిసారని తెలిపింది. పూర్తి సంకేత నిక్షిప్తంగా ఉండే ఈ సమాచార మార్పిడి విషయాలు ఇతరులు చూసే అవకాశం కూడా లేదని పేర్కొంది.

భారతీ యాక్సా కూడా..

భారతి యాక్సా లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీదారులకు వాట్సప్ ద్వారా కొత్త పాలసీలు అందిస్తోంది. రెన్యువల్ పాలసీల ప్రీమియం చెల్లింపు రసీదుల అందజేత ప్రారంభించింది. భారతి యాక్సా ఇంతకు ముందే వాట్సప్ ద్వారా క్లెయిమ్‌ల గురించి తెలియజేసేది.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	డాలర్ రూపాయి	ముడి చమురు
35891.52	10792.50	31,935	38,495	70.18	53.39
363.05	117.60	275	255		

ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

సంక్షిప్తంగా..

ఎన్‌సీసీ

2018 డిసెంబరులో ఎన్‌సీసీకి రూ.2,890.7 కోట్ల విలువైన నాలుగు ఆర్డర్లు లభించాయి. ఇందులో వాటర్, పర్యావరణ విభాగానికి రూ.680.3 కోట్ల విలువైన పనులు, రహదారుల విభాగానికి రూ.2,126.8 కోట్లు, భవన నిర్మాణ విభాగానికి రూ.83.7 కోట్ల విలువైన పనులు లభించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీల నుంచి ఈ పనులు లభించాయని, అవార్డయిన నాటి నుంచి ఏడాదిన్నర, మూడేళ్లలో ప్రాజెక్టులను పూర్తి చేయాల్సి ఉంటుందని కంపెనీ తెలిపింది.

పెన్నార్ గ్రూప్

పెన్నార్ ఇండస్ట్రీస్ వ్యాపార విభాగాలకు, అనుబంధ కంపెనీ అయిన పెబ్స్ పెన్నార్‌కు రూ.309 కోట్ల విలువైన ఆర్డర్లు లభించాయి. ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ, మోడర్న్ కోచ్ ఫ్యాక్టరీ తదితరాల నుంచి పెన్నార్ ఇండస్ట్రీస్‌కు రూ.124 కోట్లు, పెన్నార్ ఇంజినీర్డ్ బిల్డింగ్ సిస్టమ్స్ (పెబ్స్ పెన్నార్)కు రూ.125 కోట్ల ఆర్డర్లు లభించినట్లు పెన్నార్ ఇండస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ (కార్పొరేట్ స్ట్రాటజీ) కెఎం సునీల్ తెలిపారు.

సిండికేట్ బ్యాంకు

ఉద్యోగులకు ఇసాప్‌లు (వాటాల కేటాయింపు) ద్వారా రూ.500 కోట్లు సమీకరించనున్నట్లు సిండికేట్ బ్యాంకు ప్రకటించింది. ఈ నెల ఏడో తేదీన డైరెక్టర్ల కమిటీ సమావేశంలో దీనికి ఆమోదం పొందనున్నట్టు బ్యాంకు తెలిపింది.

మళ్లీ కరెక్షన్

టెక్ వ్యూ

మార్కెట్ 10900కన్నా దిగువన బలహీనంగా ప్రారంభమై రోజంతా కరెక్షన్ కొనసాగిస్తూ చివరికి కీలక స్థాయి 10800కన్నా దిగువన డే కనిష్ఠ స్థాయిలో ముగిసింది. ఈ బలమైన రియాక్షన్‌తో మరోసారి అప్రమత్త ట్రెండ్ సంకేతం ఇచ్చింది. కీలక అవరోధం 11000 వద్ద విఫలం కావడంతో స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌కు కూడా విరామం ఇచ్చింది. అయితే ట్రెండ్ ఇప్పటికీ పాజిటివ్‌గానే ఉంది. కరెక్షన్ ట్రెండ్ ఏర్పడింది.

గురువారం స్థాయిలివే...

నిరోధం: 10820 **మద్దతు:** 10750

- మరింత అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధం 10820 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధ స్థాయిలు 10900, 11000. ఆ పైన బలంగా క్లోజయినప్పుడే మరింత పురోగమించే ఆస్కారం ఉంటుంది.
- మైనర్ మద్దతు స్థాయి 10750 కన్నా దిగజారితే ఇంట్రాడే బలహీనతను ప్రకటిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 10700. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్ మరింతగా కొనసాగుతుంది.
- బ్యాంక్ నిఫ్టీ ప్రధాన మద్దతు స్థాయి 27000కి చేరువవుతోంది. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్ ఏర్పడుతుంది.

■ వి.సుందర్ రాజా

సాధారణంగా మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి: మార్గశిర బహుళ త్రయోదశి

నక్షత్రం : అనూరాధ/జ్యేష్ఠ

భరణి, పుబ్బ, పూర్వాషాఢ; కృత్తిక, ఉత్తర, ఉత్తరాషాఢ నక్షత్ర జాతకులు, ధనుస్సు, మేష రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10792.50 (-177.60)

ట్రెండ్ మార్పు వేళలు : 11.01; 1.53

ధోరణి : నిఫ్టీ ఫ్యూచర్స్ నిస్తేజంగా ప్రారంభమై 9.55 నుంచి 12.25 వరకు మెరుగ్గాను, ఆ తర్వాత 2.10 వరకు నిలకడగాను ట్రేడ్ కావచ్చు. 2.15 నుంచి చివరి వరకు తిరిగి మెరుగ్గా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం : నిఫ్టీ ఫ్యూచర్స్ 9.55 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 12.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2.15 తర్వాత తిరిగి ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవలసి ఉంటుంది.

నిరోధం : 10835, 10870

మద్దతు స్థాయిలు : 10755, 10720

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి

www.thefinanciala strologer.blogspot.in

బులియన్


బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	32,660	---	32,890	32,450	31,850
క్రితం ముగింపు	32,640	32,600	---	32,380	31,670
22 క్యారెట్లు	30,240	---	30,250	30,050	30,390
క్రితం ముగింపు	30,220	30,050	---	30,050	30,210
వెండి (కిలో)	39,300	---	39,500	39,300	41,800
క్రితం ముగింపు	39,500	39,700	---	39,400	41,500

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 5.00 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	439	చిత్తూరు	438
వరంగల్	441	చెన్నై	445
విజయవాడ	453	నమక్కల్	430
గోదావరి	453	బెంగళూరు	445
విశాఖపట్నం	458	ముంబై	494

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	92	విజయవాడ	94
కరీంనగర్	92	గుంటూరు	95
వరంగల్	92	ఒంగోలు	96
మహబూబ్‌నగర్	92	చిత్తూరు	91
కర్నూలు	92	నెల్లూరు	90
విశాఖపట్నం	80	అనంతపురం	87
గోదావరి	92		

బీఓబీ, దేనా, విజయా బ్యాంకుల విలీనానికి

కేబినెట్ ఓకే!

- షేర్ల మార్పిడి నిష్పత్తి ఖరారు
- మెర్జర్ ప్రక్రియలో కీలక అడుగు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ)లో దేనా, విజయా బ్యాంక్‌ల విలీన ప్రక్రియకు కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. అలాగే బీఓబీ షేర్ల మార్పిడి నిష్పత్తిని ఖరారు చేసింది. ఈ విలీన పథకం (స్కీమ్ ఆఫ్ అమాల్గమేషన్)లో భాగంగా విజయా బ్యాంక్ షేర్‌హోల్డర్లకు ప్రతి 1,000 షేర్లకు గాను బీఓబీకి చెందిన 402 షేర్లు లభించనున్నాయి. దేనా బ్యాంక్ షేర్‌హోల్డర్లకు ప్రతి 1,000 షేర్లకుగాను బీఓబీకి చెందిన 110 షేర్లు లభిస్తాయి. బీఓబీ షేర్ల ముఖవిలువ రెండు రూపాయలు కాగా.. విజయా, దేనా బ్యాంక్‌ల షేర్ల ముఖవిలువ రూ.10గా ఉంది. మూడు బ్యాంకుల మైనారిటీ షేర్‌హోల్డర్లకు షేర్ల మార్పిడి సందర్భంగా తలెత్తే ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రత్యేక కేంద్రాన్ని (గ్రీవెన్స్ రిడ్రెసల్ సెల్) సైతం ఏర్పాటు చేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు బీఓబీ సమాచారం అందించింది. విలీన పథకం 2019, ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుంది. ఈ మూడు బ్యాంకుల విలీనంతో ఉద్యోగుల సర్వీసుపై ఎలాంటి ప్రభావం ఉండదని, ఉద్యోగుల తొలగింపు భయాలు అక్కర్లేదని కేబినెట్ సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. అయితే, ఈ విలీనాన్ని బ్యాంక్ ఉద్యోగుల సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

విలీనం తర్వాత మూడో అతిపెద్ద బ్యాంక్

బీఓబీలో విజయా, దేనా బ్యాంక్‌లను విలీనం చేయబోతున్నట్లు గత ఏడాది సెప్టెంబరులో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ విలీనం తర్వాత ఏర్పడబోయే సంస్థ.. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ తర్వాత మూడో అతిపెద్ద బ్యాంక్‌గా అవతరించనుంది. దేశీయ బ్యాంకింగ్ రంగంలో ఇదే తొలి త్రిముఖ విలీన ప్రక్రియ. విలీన బ్యాంక్ మొత్తం ఆస్తులు రూ.6.4 లక్షల కోట్లు, డిపాజిట్లు రూ.8.41 లక్షల కోట్లకు (మొత్తం రూ.14.82 లక్షల కోట్లకు వ్యాపారం) చేరుకోనున్నాయి. గత ఏడాది సెప్టెంబరు 30 నాటికి కేంద్ర ప్రభుత్వం బీఓబీలో 63.74 శాతం, దేనా బ్యాంక్‌లో 80.77 శాతం, విజయా బ్యాంక్‌లో 68.77 శాతం వాటా కలిగి ఉంది. 2017లో ఎస్‌బీఐ తన ఐదు అనుబంధ బ్యాంకులతోపాటు భారతీయ మహిళా బ్యాంక్ (బీఎంబీ)ను విలీనం చేసుకుంది. తద్వారా ప్రపంచంలోని 50 అతిపెద్ద బ్యాంకుల్లో ఒకటిగా అవతరించింది.

ఎన్‌పీఏలతో సతమతం

దేనా బ్యాంక్, బీఓబీలో మొండి బకాయిలు (ఎన్‌పీఏ) అధిక స్థాయిలో ఉండగా.. విజయా బ్యాంక్ పరిస్థితి కాస్త మెరుగ్గా ఉంది. స్థూల ఎన్‌పీఏలు 22 శాతానికి చేరుకున్న నేపథ్యంలో దేనా బ్యాంక్ కార్యకలాపాలపై ఆర్‌బీఐ పలు ఆంక్షలు విధించింది కూడా. ఇక బీఓబీ స్థూల ఎన్‌పీఏలు 12.4 శాతానికి, విజయా బ్యాంక్‌లో 6.9 శాతానికి చేరుకున్నాయి. విలీన బ్యాంక్ స్థూల ఎన్‌పీఏలు దాదాపు 13 శాతంగా ఉండే అవకాశం ఉందని అంచనా.

3 శాతం తగ్గిన బీఓబీ షేరు

బీఎస్ఈలో ట్రేడింగ్ ముగిసేసరికి బీఓబీ షేరు 3.16 శాతం క్షీణించి రూ.119.40 వద్దకు జారుకోగా.. విజయా బ్యాంక్ షేరు రూ.51.05, దేనా బ్యాంక్ రూ.17.95 వద్ద స్థిరపడ్డాయి.



ముఖ్యాంశాలు

1000కి 402
విజయా బ్యాంక్ షేర్ హోల్డర్లకు లభించబోయే బీఓబీ షేర్లు

1000కి 110
దేనా బ్యాంక్ షేర్‌హోల్డర్లకు లభించబోయే బీఓబీ షేర్లు

2019 ఏప్రిల్ 1
విలీన పథకం అమలులోకి రానున్న తేదీ

రూ.14.82 లక్షల కోట్లు
విలీనం తర్వాత ఏర్పడబోయే బ్యాంక్ వ్యాపార విలువ

నెంబర్ 3
విలీనం ద్వారా దేశంలో మూడో అతిపెద్ద బ్యాంక్‌గా అవతరణ

కేంద్రం వాటా (శాతంలో)

బీఓబీ : 63.74
విజయా బ్యాంక్ : 68.77
దేనా బ్యాంక్ : 80.77

డ్రాగన్ దెబ్బకు సెన్సెక్స్ ధమాల్

363 పాయింట్ల నష్టం

ముంబై: స్టాక్ మార్కెట్లో ఐదు రోజుల వరుస ర్యాలీకి బ్రేక్ పడింది. చైనా ఆర్థిక వ్యవస్థ నీరసిస్తోందన్న వార్తల ప్రభావం బుధవారం భారత స్టాక్ మార్కెట్‌నూ కుదిపేసింది. అమ్మకాల హోరుతో సెన్సెక్స్ ఒక దశలో 500 పాయింట్లకుపైగా నష్టపోయింది. చివరికి 363.05 పాయింట్ల నష్టంతో సెన్సెక్స్ 35,891.52 వద్ద, 117.60 పాయింట్ల నష్టంతో నిఫ్టీ 10,792.50 వద్ద ముగిశాయి. చైనా ఆర్థిక వ్యవస్థ మరింత నీరసిస్తోందన్న వార్తలతో అంతర్జాతీయ మార్కెట్లు నష్టాలతో ట్రేడవడం సెంటిమెంట్‌ను బాగా దెబ్బతీసింది. డిసెంబరు నెల ఆటోమొబైల్స్ అమ్మకాలు నిరాశపరచడం, ఉత్పత్తి రంగం జోరు తగ్గడం, డాలర్‌తో రూపాయి మళ్లీ నేల చూపులు చూడడమూ మార్కెట్‌ను నిరాశపరిచాయి. గత ఏడాది నవంబరుతో పోలిస్తే డిసెంబరులో జీఎస్‌టీ వసూళ్లు తగ్గడం మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీసింది. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో కేవలం ఆరు కంపెనీల షేర్లు మాత్రమే బుధవారం లాభాలు నమోదు చేశాయి. 'వచ్చే కొద్ది రోజుల్లో ముడి చమురు ధర, వచ్చే వారం నుంచి వెలువడే క్యు3 ఆర్థిక ఫలితాలు..మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తాయి' అని బీఎన్‌పీ పరిబాస్ అనుబంధ సంస్థ షేర్‌ఖాన్ హెడ్-అడ్వైజరీ హెమాంగ్ జానీ చెప్పారు. ఆటో, మెటల్ కంపెనీల షేర్లలో అమ్మకాలు హోరెత్తాయి. బీఎస్ఈ మెటల్ ఇండెక్స్ అత్యధికంగా 3.45 శాతం నష్టపోయింది. చైనాలో అభివృద్ధి మందగించడంతో ఈ సంవత్సరం ఆరు కీలకమైన లోహాల డిమాండ్ అంతంత మాత్రమేనని సీఎల్ఎస్ఏ ఇచ్చిన నివేదిక ఇందుకు ప్రధాన కారణం. ఆటో ఇండెక్స్ కూడా మూడు శాతం వరకు నష్టపోయింది. ఐటీ, టెక్నాలజీ ఇండెక్స్‌లు మాత్రమే కొద్ది పాటి లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ షేర్లలో వేదాంత, టాటా స్టీల్, ఎం అండ్ ఎం, టాటా మోటార్స్, మారుతి, హీరో మోటోకార్ప్, పవర్‌గ్రిడ్, భారతి ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ, కోల్ ఇండియా కంపెనీల షేర్లు 4.48 శాతం వరకు నష్టపోయాయి. సన్ ఫార్మా, టీసీఎస్, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, యెస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ మాత్రం స్వల్ప లాభాలతో ముగిశాయి.



75 పైసలు నష్టపోయిన రూపాయి

ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు మళ్లీ క్షీణించింది. బుధవారం ఉదయం 17 పైసల లాభంతో రూ.69.60 వద్ద ప్రారంభమైన మారకం రేటు ఒక దశలో రూ.70.23 స్థాయికి పడిపోయింది. చివరికి 75 పైసల నష్టంతో రూ.70.18 దగ్గర ముగిసింది. నాలుగు రోజుల తర్వాత డాలర్‌తో రూపాయి మారకం రేటు నీరసించడం ఇదే మొదటిసారి. ప్రధాన కరెన్సీలతో డాలర్ పుంజుకోవడం, దేశీయ ఈక్విటీ మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి బుధవారం రూపాయి పతనానికి ప్రధాన కారణాలని మార్కెట్ వర్గాలు చెప్పాయి. ముడి చమురు ధర తగ్గకపోతే రూపాయి మరింత నష్టపోయేదని అంచనా.

భారీ నష్టాల్లో ఐషర్ మోటార్స్ షేరు

డిసెంబరు నెలలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకుల అమ్మకాలు 13 శాతం తగ్గడంతో.. ఐషర్ మోటార్స్ కంపెనీ షేరు బుధవారం తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనైంది. బీఎస్ఈలో ఈ కంపెనీ షేరు ఒక దశలో 9.42 శాతం వరకు నష్టపోయి చివరికి 8.71 శాతం నష్టంతో రూ.21,164.05వద్ద ముగిసింది.

– రుణ చెల్లింపుల్లో విఫలమవడంతో జెట్ ఎయిర్‌వేస్ కంపెనీ షేరు నష్టాల బాట పట్టింది. బీఎస్ఈలో ఒక దశలో ఈ కంపెనీ షేరు 7.13 శాతం వరకు నష్టపోయింది. చివరికి 6.16 శాతం నష్టంతో రూ.263.75 వద్ద ముగిసింది.

హెటెరో చేతికి టర్బిస్ ఫార్మా

న్యూఢిల్లీ: ఫార్మా రంగంలోని హెటెరో కంపెనీ యూరోపియన్ అనుబంధ సంస్థ అమారాక్స్ స్పెయిన్‌కు చెందిన టర్బిస్ ఫార్మాను కొనుగోలు చేసింది. ఈ డీల్ విలువ ఎంత అన్నది ప్రకటించలేదు. యూరప్ మార్కెట్‌లో తమ వృద్ధి వ్యూహాలకు ఇది దర్పణమని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎవి నరసారెడ్డి అన్నారు. టర్బిస్ ఫార్మాకు పలు కీలకమైన ఉత్పత్తులతో పాటు విస్తృతమైన మార్కెటింగ్ నెట్‌వర్క్, అనుభవజ్ఞులైన సిబ్బంది ఉన్నారని, దీని వల్ల అమారాక్స్‌కు బలమైన మార్కెటింగ్ నెట్‌వర్క్ సమకూరుతుందని ఆయన చెప్పారు. హెటెరోకు ప్రస్తుతం 126 దేశాల్లో 36 తయారీ విభాగాలున్నాయి.

అప్లే ఏవియేషన్‌లో అశోక్ లేలాండ్‌కు వాటా

వాణిజ్య వాహనాల తయారీ దిగ్గజం అశోక్ లేలాండ్ విమానయాన సంస్థ అప్లే ఏవియేషన్‌లో 27.25 శాతం వాటాలను కొనుగోలు చేసింది. దీంతో ఆ సంస్థలో లేలాండ్ వాటా 76.25 శాతానికి పెరిగింది. ఒక్కోటి రూ.10 ముఖ విలువ గల 10,89,985 షేర్లను రూ.5.10 వంతున కొనుగోలు చేసినట్టు ప్రకటించింది.

పీఎన్‌బీ హౌసింగ్ రూ.1,853 కోట్లు సమీకరణ

గృహరుణాల రంగంలోని పీఎన్‌బీ హౌసింగ్ విదేశీ రుణపత్రాల జారీ ద్వారా 26.5 కోట్ల డాలర్ల (రూ.1853 కోట్ల) నిధులు సమీకరించింది. డిసెంబరు నెల చివరి వారంలో ఈ నిధులు సమీకరించినట్టు తెలిపింది. గృహనిర్మాణ రంగానికి మరింతగా రుణాలు ఇవ్వడానికి ఈ సొమ్మును వినియోగించుకోనున్నట్టు కంపెనీ సీఈఓ సంజయ గుప్తా తెలిపారు.

బీఎస్ఈలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు

ACI INFOCOM .6(.58)7096
AGRO TECH FO 609.05(611.5)672
AISHWARYA TE 2.65(2.67)8048
ALPHAGEO (I) 476(479.95)167
ALU FLUORIDE 122.05(123.85)1976
AMAR RAJA BA 732.65(739.65)6058
ANDHRA BANK 29.45(29.75)91582
ANDHRA CEMEN 5.82(5.96)4575
ANDHRA PETRO 60.75(58.2)187676
ANJANI PORTL 136(130)123
ASTRA MICRO 78.6(78.55)21264
AUROB.PHARMA 722.3(731.7)64865
AVANTEL LTD 223.15(226.55)1401
AVANTI FEEDS 378.5(389)16384
B.N.RATHI SE 27.85(27)1931
BALAJI AMINE 452.3(459.5)1036
BAMBINO AGRO 199.95(199.2)336
BARTRONICSIN 7.23(7.22)3539
BCG 2.68(2.71)54600
BHAGIRA.CHEM 424.1(443.7)6726
BHAGYA INL 31.2(31.35)707
BHARATFIN 998.95(1011.95)32708
BNR UDYOG 14.2(14.48)265
CAMBRIDGE 43.1(41.2)3307
CAT TECHN. .72(.72)1005
CCHHL 7.4(7.44)1435
CCL PRODUCTS 268.75(271.9)252
CELESTIAL 8.45(8.67)5809
CIL SECURITS 18.6(17.8)1
COROM INTER 448.55(450.5)5431
CUBEX TUBING 14.67(14.6)156
CYBERMATE 2.44(2.43)8695
CYIENT 619.35(618.2)2476
DANLAW TECH. 102.6(104.9)1648
DECAN CEMENT 398.95(400.25)51
DHAN ROTO SP 27.8(29)1093
DIAMONPOWER 1.52(1.5)487
DIVI'S LAB. 1471.2(1478.55)12023
DIVYA.GRANIT 87(90.4)640
DQ ENT 8.28(8.15)561
DR.REDDY'S 2600.6(2610.8)19866
EMPEE SUGARS 1.22(1.27)5591
EVEREST ORG. 103.95(103.85)1777
FACOR ALLOYS 2.03(2.14)109600
GATI LTD. 84.45(86.3)81871
GAYATRI PROJ 176.15(179.05)407
GENNEX LAB 3.71(3.7)84266
GMR INFRASTR 15.95(16.45)905990
GODAVARI DRU 23.05(23.2)361
GOLDSTONE EN 16.15(16.8)48874
GRANULES (I) 89.65(90.8)33100
GVK POWERINF 7.88(8.03)379409
HBL P SYS 28.75(28.85)10152
HERITGFOOD 525.4(528.75)2241
HIND.FLUROCA 17.45(17.25)375
IKF TECHNO .31(.31)73110
INCAP LTD. 41(43.1)480
IPAPPM 442.6(447.4)6683
IVRCL LTD 1.03(1.04)118968
KAKATIYA CEM 199.95(201.3)9661
KALLAM 18.15(18.4)3107
KAVERI SEED 568.4(576.1)18977
KCP LTD 89.05(92)11809
KERNEX MICRO 23(23.2)3303
KNR CONST 213.25(210.4)6242
KREBS BIOCHM 112.95(109.45)6
LOKESH MACH 46.9(47.45)583
LOTUS CHOC 24.05(24.4)448
MADHUCON PRJ 6.8(6.62)1629
MOLD-TEK TEC 43.85(42.5)2210
MOSCHIP SEMI 24.1(25.15)33541
MSR INDIA 11.9(11.85)9788
N C L IND. 138.35(139.05)1447
NACLIND 27.1(27.5)3538
NATCO PHARM 699.65(696.95)9116
NCC 89.4(88.85)1597184
NEHA INTER. 4.6(4.68)6308
NETTLINX LTD 50(50.7)19646
NEULAND LAB. 480.4(471.9)905
NIHAR INFO 15.04(14.33)12305
NILE LTD. 380.15(385)442
NTL 1.05(1)4304
OIL COUNTRY 16.75(17.5)8884
OLECTRA 241.65(230.45)72514
PADMALAYA TE 2.4(2.33)665
PALRED 52.2(48.35)54076
PANYAM CEMEN 13.67(13.51)1849
PENNAR STEEL 36.7(36.9)29923
PFL INFOTECH 8.5(8.5)500
PITTIENG 70.5(72.4)17987
POKARNA LTD 162(163.05)1486
PRAJAY ENGS. 9.38(8.95)2
PREMIER EXPL 243.7(240.8)1967
PRSMJOHNSN 88.05(89.6)13976
RAIN 131.85(135.95)51486
RAJ PACKAGIN 27.95(30)511
SAGAR CEM. 695.6(695.6)210
SAMKRG PIST. 190.3(191.7)2368
SANGHI IND. 60.9(60.2)12958
SATVAH.ISPAT 9.55(10)5621
SAVEN TECHNO 24.55(23.4)39821
SIBAR AUTO 38.5(39)11
SMPL .38(.37)13000
SMS PHARMACE 69.85(67.5)232
SREE RAYALA 156.85(157.3)474
STEEL EXCH 14.5(14.7)1248
SURANATP 4.75(4.51)590
SURYACHAKRA .38(.37)14752
SURYAMBA SP 70.05(69.05)1342
SURYLAK.COTT 41.9(42.55)1017
SUVEN LIFE S 236.45(232.35)63383
TAJ GVK HOTL 176.4(178.5)715
TANLA 31.05(30.7)20074
TRANSCORP IN 22.1(22.15)477
TRANSGENE BI 3.34(3.26)2632
TRANSPORT CO 280(283.7)318
USHER AGRO 2.5(2.5)10
VICEROY HOTE 5.2(5.3)17291
VIJAY TEXTIL 42.8(42.9)519
VIMTA LABS 312.4(319.1)1557
VIRAT CRANE 33.75(33.1)2171
VIRINCHI 82.65(83.45)5481
VISAKA IND. 433.35(436.9)823
VISTA PHARMA 29.7(29.35)8043
VIVIMED LABS 36.8(36.95)13115
VST INDUS. 3213.9(3280)51
WATERBASE 162.9(164.5)44795
XLENERGY 1.02(.99)1200
ZEN TECH 77.25(78.7)2123
ZENOTECH 36.55(37.3)2359

ఎన్ఎస్ఈ-500

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 575.1(575.65)4864
AARTIIND 1450.7(1448.6)27836
ABAN 74.1(74.5)413245
ABB 1319.25(1319.2)56713
ABFRL 195.55(199.55)854111
ABGSHIP 2.05(2.05)91114
ACC 1483.95(1488.8)669181
ADANIENT 154.85(157.25)2735262
ADANIPORTS 381.3(389)1506543
ADANIPOWER 50.55(50.85)6174960
ADANITRANS 200.55(200.5)67391
AEGISCHEM 203.95(204)71509
AHLUCONT 324.25(324.8)14414
AIAENG 1652.55(1674.4)13910
AJANTPHARM 1164.35(1181.7)178595
AKZOINDIA 1769.4(1769.55)19951
ALBK 45(46.7)4612405
ALLCARGO 108.6(107.75)86730
ALOKTEXT 4.05(4.05)6300844
AMARAJABAT 733.55(738.8)265053
AMBUJACEM 218.95(222.9)1826162
ANANTRAJ 35.15(36.8)774819
ANDHRABANK 29.65(29.75)1086302
APARINDS 663.15(665.6)3281
APLLTD 580.45(586.85)15441
APOLLOHOSP 1258.75(1266.4)658775
APOLLOTYRE 230.85(234.4)1983510
ARVIND 96.3(98.4)1421931
ASHIANA 118.85(118.45)13551
ASHOKA 123.4(124.95)51243
ASHOKLEY 99.95(102.5)40123864
ASIANPAINT 1383.3(1371.55)1233780
ASTRAL 1141.05(1128.8)37352
ASTRAZEN 1418.75(1443.6)6122
ATUL 3463.1(3443.2)8619
AUROPHARMA 724.35(733.15)1845752
AXISBANK 620.05(627.3)12386281
BAJAJ-AUTO 2692(2726.65)599274
BAJAJCORP 378.05(373.4)54079
BAJAJELEC 506.35(513.55)145547
BAJAJFINSV 6384(6521.95)221274
BAJAJHIND 8.9(9)2715501
BAJAJHLDNG 2950.1(2949.95)15693
BALKRISIND 912.3(928.85)534985
BALLARPUR 5.5(5.45)377682
BALMLAWRIE 198.75(202.7)29411
BALRAMCHIN 104.5(103.4)2216466
BANKBARODA 119.35(123.3)25568039
BANKINDIA 104.8(106.35)16984848
BASF 1534.4(1550.3)7273
BATAINDIA 1112.05(1126.05)493851
BBTC 1305.25(1323.9)57452
BEML 922.9(903.35)4512582
BERGEPAINT 327.3(332.5)1331713
BFUTILITIE 223.9(221.45)1282189
BGRENERGY 60.9(61.75)52426
BHARATFIN 1001.4(1011.85)199322
BHARATFORG 494.9(510.95)1621236
BHARTIARTL 312.65(319.5)5604911
BHEL 73(73.8)8615103
BIOCON 622.8(625.8)1232572
BIRLACORPN 590.8(593.65)24982
BLISSGVS 165.65(163)865211
BLUEDART 3365.9(3413.75)4900
BLUESTARCO 622.4(625.55)8342
BOMDYEING 112.45(115.75)594589
BOSCHLTD 19477.8(19576.5)10810
BPCL 357.95(367.2)9862795
BRFL 9.3(8.9)258508
BRIGADE 214(221)67367
CADILAHC 346.75(350.05)558345
CANBK 275.4(281.5)5644563
CARERATING 972.85(980.1)24749
CASTEXTECH 1.15(1.2)200008
CASTROLIND 147.35(151.15)861100
CCL 270(269.8)34168
CEATLTD 1292.6(1293.6)427845
CENTRALBK 37.25(37.2)1818337
CENTURYPLY 174.9(176.45)345481
CENTURYTEX 905.6(922.4)324587
CERA 2354.8(2367.5)3481
CESC 666.85(671.3)401406
CHAMBLFERT 154.8(147.25)2265585
CHENNPETRO 285(290.55)654505
CHOLAFIN 1236.95(1255.15)284508
CIPLA 514.55(523.05)1243067
CLNINDIA 413.6(417.1)6800
COALINDIA 236.7(241.5)3897893
COLPAL 1301.8(1323.9)396926
COROMANDEL 450.05(451.05)134328
CORPBANK 29.2(29.45)307456
COX&KINGS 160.35(164.1)24439
CRISIL 1625(1619.4)10263
CUB 193.1(193.8)676388
CUMMINSIND 845.9(848.45)387427
CYIENT 621.9(618.3)58774
DABUR 416.4(421.85)2550167
DBCORP 169.9(171.2)27900
DBREALTY 31.2(31.05)2550927
DCBBANK 168.7(169.25)2072140
DCMSHRIRAM 344.2(343.05)95420
DEEPAKFERT 147.8(149.4)192061
DELTACORP 247.2(251.7)588807
DEN 70(70.5)328438
DENABANK 17.9(18)3060490
DHANUKA 442.15(445.1)14883
DHFL 241.7(246.35)7176965
DISHTV 38.35(38.05)3352297
DIVISLAB 1470.9(1475.45)247208
DLF 173.1(180.3)6604177
DREDGECORP 463.15(469.75)3446364
DRREDDY 2601.05(2607.05)417551
DYNAMATECH 1534.85(1490.6)686
ECLERX 1092.55(1075.15)1409
EDELWEISS 180.25(183.15)774141
EICHERMOT 21162.3(23195.1)481497
EIDPARRY 205.95(206.3)38105
EIHOTEL 188.55(195.6)108911
ELECTCAST 21.2(21.35)97705
ELGIEQUIP 257.3(259.25)7870
EMAMILTD 422.7(418.05)1138318
ENGINERSIN 125(126.65)1098546
EROSMEDIA 86.05(87.15)269995
ESCORTS 707.1(719.8)4236232
ESSDEE 23.2(22.1)49302
ESSELPACK 110.8(109.4)444140
EVEREADY 183.55(185.9)97070
EXIDEIND 261.4(267.5)795469
FCONSUMER 45.35(45.9)676148
FDC 172.8(173.05)23362
FEDERALBNK 94.8(93)18353855
FINCABLES 453.35(454.6)13236
FINPIPE 533.95(548.95)13277
FLFL 396.85(407.05)14100
FORTIS 140.5(140.2)681165
FSL 48.4(48.6)2471654
GAIL 350.3(362.15)3528488
GATI 84.6(86.45)284017
GDL 123.15(125.1)139711
GEPIL 815.9(821.3)2205
GESHIP 319.95(314.35)100094
GET&D 289(298.7)24628
GILLETTE 6484.8(6467.7)2680
GLAXO 1497.55(1498)6845
GLENMARK 683.05(692.15)583438
GLOBOFFS 13.9(14.4)3918
GMDCLTD 90.05(90.45)60487
GMRINFRA 15.95(16.4)9110731
GODFRYPHLP 868.05(879.8)235187
GODREJCP 806.65(807.35)1265919
GODREJIND 538.25(543.6)258586
GODREJPROP 669.8(660.3)896038
GPPL 102.05(102.35)55698
GRANULES 89.9(90.8)535316
GREAVESCOT 116.45(119.25)906456
GREENPLY 137.45(139.15)28409
GRINDWELL 554.35(559.25)6398
GRUH 321.4(322.15)203054
GSFC 111.9(116.3)2200537
GSKCONS 7515.85(7571.55)65849
GSPL 176.05(175.4)1386895
GUJFLUORO 911.6(904.2)54406
GUJGASLTD 669.55(669.05)19362
GULFOILLUB 836.75(804.95)25114
GVKPIL 7.85(8)1278567
HATHWAY 30.7(30.75)81428
HAVELLS 691.8(694.8)1228486
HCC 13.55(13.5)21363626
HCL-INSYS 25.55(25.55)1224151
HCLTECH 946.35(959.85)1135048
HDFC 1980.65(2009)2001170
HDFCBANK 2128.5(2148.1)2033558
HDIL 25.95(26.5)6147986
HEIDELBERG 150.75(152.95)66487
HEROMOTOCO 3046.55(3127.6)597712
HEXAWARE 330.75(332.3)2016439
HFCL 21.2(21.3)1307545
HIMATSEIDE 214.7(215.45)33070
HINDALCO 214.55(222.75)10991026
HINDCOPPER 50.8(52.1)486138
HINDPETRO 256.55(256.7)10666940
HINDUNILVR 1784.6(1801.1)1598707
HINDZINC 272.75(277.85)336931
HMT 20.95(20.45)917
HMVL 127.5(126.2)3674
HONAUT 21689.9(21885.8)608
HOTELEELA 15.75(15.25)696237
HSIL 235(236.25)59657
HTMEDIA 40.1(39.85)155293
IBREALEST 86.95(88.5)2092382
IBULHSGFIN 842.3(844.75)3995428
ICICIBANK 364.6(363.75)18243156
ICRA 3198.15(3196.45)118
IDBI 61.35(61.45)2957494
IDEA 36.75(37.75)10619192
IDFC 42.15(43.45)2402002
IFBIND 847.75(853.95)1788
IFCI 14.6(15.05)7357468
IGARASHI 562.45(565.85)5083
IIFL 499(499.9)21752
IL&FSTRANS 12.65(13.3)2013487
INDHOTEL 141.85(146)1035845
INDIACEM 93.85(96)4111460
INDIANB 245.85(251.35)3143838
INDOCO 218.95(217.95)8328
INDUSINDBK 1576.6(1595.6)1164974
INEOSSTYRO 691.6(696.45)1460
INFRATEL 264.25(262.25)1115095
INFY 669.05(665.05)7416655
INGERRAND 606.05(614.05)21362
INOXLEISUR 246.75(246.2)68203
INOXWIND 75.95(77.1)24205
INTELLECT 223.3(228.9)246527
IOB 14.9(15)562219
IOC 137.25(137.7)11509773
IPAPPM 443.25(446.8)40598
IPCALAB 799.85(816.35)60411
IRB 159.05(164.85)1566046
ITC 280.6(282.7)9934187
J&KBANK 38.85(38.6)818355
JAGRAN 115.25(115.05)24724
JAICORPLTD 114.1(117.1)2276481
JBCHEPHARM 311.4(311.25)42498
JBFIND 22.85(22.5)68622
JCHAC 1744.35(1811.75)4728
JETAIRWAYS 263.55(280.8)11588833
JINDALPOLY 234.4(234.4)13802
JINDALSTEL 158.2(162.9)11623258
JISLJALEQS 67.55(69)4223267
JKCEMENT 727.15(719.25)72539
JKIL 130.6(132.75)67200
JKLAKSHMI 314.3(311.4)202819
JKTYRE 104.4(103.8)634144
JMFINANCIL 89.75(92.8)348500
JPASSOCIAT 7.4(7.75)44623170
JPINFRATEC 3.85(3.9)1067493
JPPOWER 2.1(2.1)2461363
JSWENERGY 70.45(69.75)652239
JSWHL 2660.8(2291.95)31580
JUBILANT 708.75(712.15)75984
JUBLFOOD 1239.15(1250.85)2793859
JUSTDIAL 495.65(500.1)976779
JYOTHYLAB 203.95(211.4)78416
KALPATPOWR 379.8(391.25)22625
KANSAINER 481.95(493.45)131959
KEC 299.05(302.4)86472
KESORAMIND 83.75(86.8)229273
KIRLOSENG 204.95(204.8)8014
KITEX 110.05(111.1)30326
KOLTEPATIL 257.7(260.95)300435
KOTAKBANK 1240.6(1250.45)1713677
KPIT 216.05(217.1)833337
KRBL 291.25(280.25)242746
KSCL 566.65(576.3)267347
KSK 1.65(1.6)919952
KTKBANK 111.55(113.25)1576890
KWALITY 8.05(8.25)1320821
L&TFH 150.5(153.15)4695402
LAKSHVILAS 86.45(86.85)161018
LAOPALA 216.65(218.75)7048
LAXMIMACH 5714.9(5761.15)760
LICHSGFIN 476.15(486.55)1119301
LT 1425.5(1441.9)2058504
LUPIN 832.8(841.45)1115202
M&M 741.7(773.35)10596260
M&MFIN 466.1(471.8)937198
MAGMA 106.95(110.5)33655
MAHINDCIE 248(255.1)128236
MAHLIFE 399.45(405.7)127499
MANAPPURAM 92.4(92.5)1809319
MANPASAND 86.4(88.55)233896
MARICO 372.85(372.3)1160137
MARKSANS 27.95(28.2)736321
MARUTI 7267.85(7476.8)891844
MAYURUNIQ 399.9(398.75)11696
MCLEODRUSS 114.8(115.75)66387
MERCK 3035.95(3156.65)24618
MHRIL 210.9(213.2)65612
MINDACORP 149.9(148)89556
MINDTREE 860.5(863.4)892157
MMTC 30.25(30.9)952424
MOIL 169.65(170.85)97463
MONSANTO 2595.85(2611.35)451
MOTHERSUMI 163.75(165.45)2466757
MOTILALOFS 676.55(661.75)148663
MPHASIS 989.4(1005.6)152577
MRF 66635.5(66801.2)7531
MRPL 73.95(75.05)918289
MTNL 17.85(19.4)18865273
MUTHOOTFIN 502.25(512.5)973749
NATCOPHARM 698.7(694.35)165072
NATIONALUM 63.95(65.55)3437321
NAUKRI 1430.45(1439)89499
NAVKARCORP 55.65(56.9)189046
NCC 89.6(88.9)20485313
NETWORK18 40.25(40.3)487662
NHPC 25.65(25.95)2384454
NIITTECH 1153.3(1151.5)931011
NITINFIRE 1.9(1.85)60306
NLCINDIA 68.25(69.25)235338
NMDC 96.8(95.75)13102744
NTPC 147(148.7)4334233
OBEROIRLTY 447.45(454.7)389093
OFSS 3710.95(3729.45)34252
OIL 172.4(175.75)722532
OMAXE 213.55(213.6)327557
ONGC 147.05(148.5)17436694
ORIENTBANK 95.5(97.7)8366881
ORIENTCEM 82.5(84.55)167103
ORISSAMINE 967.75(984.35)15560
PAGEIND 24591.15(24847.2)29590
PARSVNATH 7.55(7.55)23051
PCJEWELLER 82.8(85.9)11767620
PEL 2343.75(2395.3)607051
PERSISTENT 625.2(626.1)205680
PETRONET 228.8(229)2741873
PFC 104.05(107.4)7598420
PFIZER 2819.95(2871.55)18423
PFS 17.15(17.45)359077
PGHH 9895(9903.75)2809
PHOENIXLTD 574.5(576.45)24421
PIDILITIND 1107.65(1101.95)410838
PIIND 864.1(864.2)87402
PNB 77.85(79.8)27192314
POWERGRID 195.25(200)4430566
PRAJIND 113.65(111.2)875822
PRESTIGE 231.6(235.7)475496
PRSMJOHNSN 88.1(89.2)94476
PTC 91(92.9)916019
PUNJLLOYD 4.1(4.15)654842
PURVA 74.05(74.35)184005
PVR 1587.55(1594.6)237215
RADICO 400.3(402.5)285054
RAIN 131.5(135.5)307926
RAJESHEXPO 572.45(572.15)337617
RALLIS 177(180.5)200943
RAMCOCEM 638.1(641.25)98006
RAMCOSYS 273.45(279.2)9291
RATNAMANI 936(947.25)12056
RAYMOND 817.3(842.95)453950
RCF 63.9(64.3)1001224
RCOM 13.85(14.35)92048688
RECLTD 119.05(120.65)6262554
REDINGTON 87.2(88.55)40864
RELAXO 738.95(738.65)6435
RELCAPITAL 221.8(230.4)5476449
RELIANCE 1106.4(1121)7144970
RELINFRA 305.95(316.6)3467764
RENUKA 10.9(11.05)411621
REPCOHOME 389.1(400.7)298268
RIIL 340.8(350.9)556929
RKFORGE 527.25(530.85)5784
RNAVAL 13.85(14)800346
ROLTA 8.35(8.35)1587306
RPOWER 27.75(28.85)11568301
RTNPOWER 3.45(3.45)1517098
RUCHISOYA 8.15(8.55)438073
SADBHAV 209.5(210.6)540809
SADBHIN 99.9(99.6)2913
SAIL 54(55.75)12322286
SANOFI 6234.25(6339.95)907
SBIN 293.9(299.6)25559853
SCHAEFFLER 5691.5(5646.2)11092
SCHNEIDER 100.3(101.2)54449
SCI 46.7(48.05)413100
SHARDACROP 300.25(303.75)9729
SHILPAMED 381.85(392.6)17806
SHK 172(171.55)26968
SHOPERSTOP 527.4(532.55)21753
SHREECEM 16939.95(16973.25)13931
SHRIRAMCIT 1600.3(1591.3)8897
SIEMENS 1056.55(1062.65)581675
SIMPLEXINF 196.95(199.8)7966
SINTEX 11.8(12)1327687
SITINET 10.85(11.2)22575
SJVN 25.75(25.6)692721
SKFINDIA 1907.25(1906.4)3515
SMLISUZU 661.6(673.3)4297
SNOWMAN 34.85(35.2)71449
SOBHA 473.55(461.15)161281
SOMANYCERA 337.3(329.85)43922
SONATSOFTW 301.55(302.45)74736
SOUTHBANK 15.45(15.65)14015266
SPARC 190.35(189.25)731913
SREINFRA 34.6(36)2085649
SRF 1992.15(1989)467887
SRTRANSFIN 1195.4(1229.75)1588301
STAR 458.4(466.15)727613
STCINDIA 139.5(144.55)304941
SUNDARMFIN 1461.4(1420.4)28518
SUNDRMFAST 533.9(544.6)45227
SUNPHARMA 440.05(433.55)9656878
SUNTV 604.6(607.85)1205671
SUPREMEIND 1127.15(1151.6)43682
SUVEN 236(232.2)392417
SUZLON 5.35(5.45)13545713
SWANENERGY 97.7(100.1)326180
SYMPHONY 1154.35(1182)8476
SYNDIBANK 39.15(39.8)4955011
SYNGENE 552.2(557.45)26904
TAKE 149.95(149.55)64971
TATACHEM 700.85(705.3)763954
TATACOFFEE 97.25(98.75)167118
TATACOMM 521.35(522.25)761027
TATAELXSI 1024.8(1026.75)827581
TATAGLOBAL 214.6(219.1)1081778
TATAMOTORS 168.55(173.45)13410104
TATAMTRDVR 90.45(93.1)2573415
TATAPOWER 74.85(76.7)2504768
TATASPONGE 836.95(848.45)113725
TATASTEEL 493.65(515.75)11747350
TATASTLBSL 38.65(39.95)1633317
TBZ 64.4(65.9)63045
TCS 1923.3(1902.8)2100463
TECHM 712.05(719.1)2576769
TEXRAIL 58.65(59.4)202343
THERMAX 1141.55(1130.7)21336
THOMASCOOK 232.3(233.85)69127
TIDEWATER 5402.9(5402.1)372
TIMKEN 605.85(610.9)40758
TITAN 932.15(928)2672587
TNPL 250.85(257.2)48649
TORNTPHARM 1777.75(1775.55)108547
TORNTPOWER 255.75(259.5)736827
TREEHOUSE 4.6(4.65)5809
TRIDENT 67.45(68.2)452887
TRITURBINE 116.45(109.25)986691
TTKPRESTIG 7500.7(7488.85)1583
TTML 4(4.05)490639
TV18BRDCST 37.65(38.4)2764365
TVSMOTOR 535.25(564.55)3650090
TVSSRICHAK 2500.35(2502.8)859
TVTODAY 369.1(373.55)6212
UBL 1355.45(1362.7)272136
UCOBANK 22.1(22.7)4000028
UFLEX 279.45(280.9)58086
ULTRACEMCO 4006.1(4009.2)143828
UNICHEMLAB 191.15(191.6)28700
UNIONBANK 88.2(88.3)11020333
UNITECH 2.1(2.1)2434130
UPL 756.5(753.5)1308043
VAIBHAVGBL 721.75(723.9)3918
VAKRANGEE 36.05(34.95)7519295
VEDL 193.15(202.1)18935386
VIDEOIND 3.2(3.35)94282
VIJAYABANK 51.05(50.85)984010
VINATIORGA 1597.55(1631.7)11427
VIPIND 505.2(515.65)167416
VOLTAS 537.85(555.45)926605
VRLLOG 288.25(292.75)10620
VSTIND 3188.65(3276.35)1290
VTL 1108.1(1104.85)49690
WABAG 260.05(260.95)423472
WABCOINDIA 6853.15(6874.8)384
WELCORP 135.5(139.85)224191
WELSPUNIND 61.35(60.5)782890
WHIRLPOOL 1396.85(1404.6)80048
WIPRO 325.55(326.65)3308303
WOCKPHARMA 517.75(528.75)1114110
WONDERLA 268.3(272.1)16054
ZEEL 470.25(480.25)2687773
ZEELEARN 35.8(36.05)50493
ZYDUSWELL 1350.7(1366.5)5411

5 స్టార్ కుంభమేళా



ప్రయాగ్‌రాజ్ సిద్ధం.. 100 హెక్టార్లలో టెంట్ సిటీ

పుణ్యస్నానాలకు కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు



అర్ధ కుంభమేళాకు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ సిద్ధమవుతోంది. కనీవినీ ఎరుగని రీతిలో యోగి సర్కారు ఏర్పాట్లు చేస్తోంది. 15 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరిస్తారనే అంచనాల మేరకు భక్తుల కోసం 5-స్టార్ గుడారాలు ఏర్పాటు చేసింది. 100 హెక్టార్ల స్థలంలో ఏకంగా ఓ 'టెంట్ సిటీ'నే నిర్మించింది. ఎన్నారైలు, విదేశీయుల కోసం 1,200 డీలక్స్, సూపర్ డీలక్స్ కాటేజీలు, విల్లాలను సిద్ధం చేసింది. ఇతర ప్రాంతాల్లో, రైల్వే స్టేషన్ల సమీపంలో బసచేసేందుకు సదుపాయాల కల్పన, కుంభమేళా ప్రాంతానికి చేరేందుకు వీలుగా రవాణా ఏర్పాట్లు చేస్తోంది. గతంలో సీదాసాదాగా జరిగే ఏర్పాట్లకు భిన్నంగా ఈసారి పర్యాటక హంగులను అద్దుతోంది. ప్రధాన వేదిక వద్ద లైట్ అండ్ సౌండ్ లేజర్ షోలను ఇప్పటికే ప్రారంభించింది. నది మధ్యలో తాత్కాలిక ద్వీపాలను ఏర్పాటు చేసి.. భక్తులు శ్రాద్ధ కర్మలు చేసేందుకు వీలు కల్పిస్తోంది.



ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణీసంగమం వద్ద జనవరి 15 (మకర సంక్రాంతి)న అర్ధకుంభమేళా ప్రారంభం కానుంది. ఆ రోజు బృహస్పతి మేషరాశిలో, సూర్య, చంద్రులు మకరంలో ప్రవేశిస్తారు. మహాశివరాత్రి రోజైన మార్చి 4న అర్ధకుంభమేళా ముగుస్తుంది. ఈ మధ్యకాలంలో ప్రత్యేకంగా పేర్కొన్న రోజుల్లోనే పుణ్యస్నానాలు ఆచరించాల్సి ఉంటుంది.

నదిలోనే వారణాసికి..

కుంభమేళాకు వచ్చే భక్తులు వారణాసికి కూడా వెళ్తుంటారు. రోడ్డు మార్గాల్లో వారికి ఇబ్బందులు లేకుండా.. నదిలోనే 60 కిలోమీటర్ల మేర ఆహ్లాదంగా ప్రయాణం సాగేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం ప్రత్యేక లాంచీలు, పడవలను సిద్ధం చేస్తోంది. 'ఎయిర్-బోట్' సేవలనూ జనవరి 26 నుంచి అందుబాటులోకి తేనుంది. ఎయిర్‌బోట్ గంటకు సగటున 80 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఈ లెక్కన ప్రయాగ్‌రాజ్ నుంచి గంటలోపు వ్యవధిలోనే కాశీకి చేరుకోవచ్చు. ఇందుకోసం కాశీలోని కాళీఘాట్, సరస్వతి ఘాట్, సుజవాన్ ఘాట్, నైనీ బ్రిడ్జ్‌ల వద్ద పడవల పార్కింగ్‌లను నిర్మించారు.

కుంభమేళా అంటే..

హిందూ పంచాంగం ప్రకారం సూర్యుడు, చంద్రుడు, బృహస్పతి ఆయా రాశుల్లో ఉన్న సమయంలో అర్ధ కుంభమేళాలను నిర్వహిస్తారు. ఇవి ప్రయాగ్‌రాజ్, హరిద్వార్, ఉజ్జయినీ, నాసిక్‌లలో మూడేళ్లకోసారి జరుగుతాయి. చివరి అర్ధ కుంభమేళాను మహా కుంభమేళాగా పిలుస్తారు. కుంభస్నానాలు ఆచరిస్తే జన్మజన్మల పాపాలూ తొలగిపోతాయని పురాణ ప్రతీతి.

– సెంట్రల్ డెస్క్



ప్రయాణం సులభమే..

తెలుగు రాష్ట్రాల భక్తులు రైలు, గగన మార్గాల్లో ప్రయాగ్‌రాజ్ చేరుకోవచ్చు. బమ్‌రౌలీలోని విమానాశ్రయం నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న త్రివేణి సంగమానికి చేరుకోవచ్చు. కుంభమేళా జరిగే ప్రాంతానికి సమీపంలో నాలుగు రైల్వే స్టేషన్లు (అలహాబాద్ జంక్షన్, ప్రయాగ్‌రాజ్, ప్రయాగ్‌రాజ్‌సిటీ, ధారాగంజ్) ఉన్నాయి. వాటికి తెలుగు రాష్ట్రాల నుంచి ప్రత్యేక రైళ్లను నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

2800 కోట్లు	కుంభమేళా నిర్వహణకు ఉత్తరప్రదేశ్ సర్కారు కేటాయించిన బడ్జెట్
1.22 లక్షలు	కుంభమేళాకు వచ్చేవారి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన టాయిలెట్ల సంఖ్య
40,000	కుంభమేళా నేపథ్యంలో ప్రయాగలో ఏర్పాటుచేసిన ఎల్‌ఈడీ దీపాల సంఖ్య.

2000

భక్తుల బస కోసం నిర్మించిన గుడారాలు. వీటిలో చాలా రకాలున్నాయి. ప్రీమియం విల్లా గుడారాల్లో ఒక రాత్రి బసకు రూ.35 వేలు వసూలు చేస్తారు. కాటేజ్ టెంట్లయితే ఒక రాత్రి బసకు రూ.12,000 నుంచి 16,000 దాకా.. డార్మిటరీలకు రూ.350 నుంచి రూ.3500 దాకా వసూలు చేస్తారు.





అందాల బొమ్మకు అరవై ఏళ్లు

ఇష్టమైన హీరో ఎవరు? నచ్చిన వ్యక్తి ఎవరు? అని అమ్మాయిలను అడిగితే ఒక్కొక్కరు ఒక్కో పేరు చెబుతారు. కానీ ఇష్టమైన బొమ్మ అని అడిగితే? దాదాపు ప్రతిఒక్కరి నోటి నుంచి వచ్చే పేరు.. బార్బీడాల్! అంతలా అమ్మాయిల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుంది ఈ అందాల బొమ్మ. 1959లో న్యూయార్క్‌లోని అమెరికన్ టాయ్ ఫెయిర్‌లో తొలిసారి దర్శనమిచ్చిన బార్బీ ఈ ఏడాది మార్చి 9న 60వ పుట్టిన రోజును జరుపుకోబోతోంది. ఆరు దశాబ్దాల్లో ఎన్ని వివాదాలు చుట్టుముట్టినా అమ్మాయిల మనసులోంచి బార్బీని దూరం చేయలేకపోయాయి. అందుకే ఏటా 6 కోట్లకు పైగా బార్బీలు అమ్ముడవుతున్నాయి.

పారిశ్రామిక వ్యర్థాలతో రోడ్లు

తక్కువ ఖర్చులో దృఢంగా నిర్మాణం.. ఐఐటీహెచ్ పరిశోధకుల ప్రతిభ

రోజురోజుకూ పెరిగిపోతున్న వాహనాల రద్దీతో రోడ్లు దెబ్బతిని గుంతలు ఏర్పడుతున్నాయి. కోట్లు ఖర్చు పెట్టినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. రోడ్ల మరమ్మత్తు చేయడం.. గుంతలేర్పడటం కామనైపోయింది. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు ఐఐటీ హైదరాబాద్ సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ శిరీష్ సరిడే సరికొత్త పరిష్కారాన్ని కనిపెట్టారు. పర్యావరణానికి హాని కలగకుండా విద్యుత్తు కర్మాగారాల నుంచి వెలువడే ఫ్లై యాష్ (బూడిద)ను ఉపయోగించి పటిష్ఠమైన రోడ్లు వేయడానికి విద్యార్థులతో కలిసి పరిశోధనలు జరిపారు. ఈ బూడిదను సిమెంట్‌గా మార్చేందుకు ప్రొఫెసర్ చల్లా సుబ్రమణ్యం సహకారం అందించారు. ఆరేళ్ల పరిశోధనల అనంతరం పాత రోడ్లకు మరమ్మత్తులు చేసేప్పుడు వెలికితీసే



80 శాతం పాత తారు, కంకర, 20 శాతం కొత్త కంకర వాడటంతో ప్రయోగాత్మకంగా చక్కని ఫలితాలు సాధించారు. పాడైపోయిన తారు, కంకరకు కొన్ని రసాయనాలు కలిపి దృఢమైన రోడ్లు నిర్మించేందుకు కృషి చేశారు. రెండేళ్ల క్రితం ఏపీఆర్‌డీసీ ఎండీ జగన్నాథరావు సహకారంతో ఏపీలోని నూజివీడు-మైలవరం మధ్యలో అర కిలోమీటర్ మేర రహదారి పనులకు ఈ మిశ్రమాన్ని వినియోగించారు. సానుకూల ఫలితాలు సాధించారు. ఇద్దరు ఐఐటీహెచ్ ప్రొఫెసర్లతోపాటు పరిశోధక విద్యార్థులు దీప్తి అవిర్నేని, మహేశ్ జల్లు, ప్రణవ్ పెద్దింటి ఈ పరిశోధనలో పాలు పంచుకున్నారు. కొత్త రోడ్లు నిర్మించే చోట ఈ మిశ్రమాన్ని వాడితే 20 శాతం ఖర్చు తగ్గడంతో పాటు పర్యావరణానికి మేలు కూడా జరుగుతుందని ప్రొఫెసర్లు తెలిపారు. 2 నెలలకు ఒకసారి ఈ రోడ్డును విద్యార్థులతో కలిసి పరిశీలిస్తున్నారు.

– కంది



మెమొరీ కిడ్

- ప్రపంచ స్థాయిలో భారత సంతతి విద్యార్థి ప్రతిభ
- 2 బంగారు పతకాలు సాధించిన ధ్రువ్ మనోజ్

హాంకాంగ్‌లో జరిగిన వరల్డ్ మెమొరీ చాంపియన్‌షిప్‌లో సింగపూర్‌కు చెందిన భారత సంతతి విద్యార్థి రెండు బంగారు పతకాలు సాధించాడు. 'నేమ్స్ అండ్ ఫేసెస్', 'రాండమ్ వర్డ్స్' విభాగాల్లో ధ్రువ్ మనోజ్ (12) సత్తా చాటాడు. చిన్న పిల్లల విభాగంలో 56 మంది పోటీలో పాల్గొనగా అతడు రెండు బంగారు పతకాలు సాధించి రికార్డు సృష్టించాడు. అరగంటలో 1155 బైనరీ నంబర్లను, 15 నిమిషాల్లో 87 పేర్లు, ముఖాలను గుర్తుపెట్టుకున్నాడు.

తండ్రి డ్రైవర్.. కొడుకు లీడర్

డబ్ల్యూఈఎఫ్‌లో అత్యున్నత స్థానానికి ఎదిగిన తెలంగాణ యువకుడు రంజిత్‌రెడ్డి విజయగాథ



పుత్రుడు పుట్టినప్పుడు కాదు.. చుట్టూ ఉండేవారందరూ ఆ పుత్రుణ్ని పొగిడినప్పుడు తల్లిదండ్రులకు నిజమైన ఆనందం!! వరంగల్ అర్బన్‌జిల్లాకు చెందిన చల్లా జయపాల్ రెడ్డి, శకుంతల దంపతులు ఇప్పుడు అలాంటి ఆనందాన్నే అనుభవిస్తున్నారు! అవును మరి.. చల్లా జయపాల్ రెడ్డి ఓ సాధారణ ఆర్టీసీ డ్రైవర్. అయినా పిల్లలకు స్వేచ్ఛనిచ్చి వారు కోరిన చదువులు చదివించారు. ఫలితంగా.. ఆయన కుమారుడు రంజిత్ రెడ్డి వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ కొత్తగా ప్రారంభించిన బిజినెస్ ఎంగేజ్‌మెంట్ ఆపరేషన్ బృంద నాయకుడి స్థాయికి ఎదిగాడు. హన్మకొండ డిపోలో అసిస్టెంట్ క్లర్కుగా పని చేస్తున్న జయపాల్ రెడ్డి.. తన కుమారుడి విజయప్రస్థానాన్ని చూసి ఎంతో మురిసిపోతున్నారు. "అందరిలాగా నేను కూడా నా పిల్లలు ఇంజనీర్, డాక్టర్ కావాలని ఆశపడేవాడిని. వారికి అవి ఏమాత్రం ఇష్టం ఉండేవి కావు. దీంతో పిల్లల ఇష్టాలకే ప్రాధాన్యమిచ్చాను. మా అమ్మాయి స్వప్న ఎంబీఏ చదివి ఇప్పుడు అధ్యాపకురాలిగా పనిచేస్తోంది. రంజిత్ ఇంటర్ తర్వాత బిజినెస్ మేనేజ్‌మెంట్ చదివాడు. ఎప్పుడన్నా బంధువులను కలిస్తే.. 'మావాడు బీటెక్, మావాడు ఎంబీబీఎస్' అని గొప్పగా చెబుతుండేవారు. నేను ఎంబీఏ, బీబీఎం అని చెప్తే.. అవేం చదువులంటూ ఎగతాళి చేసేవారు. వారి మాటెలా ఉన్నా నా భార్య శకుంతల నాకు చేదోడువాదోడుగా నిలిచింది. ఇంట్లో కుట్టు పని, చీరల అమ్మకం ద్వారా ఆర్థికంగా నాకు వేణ్నీళ్లకు చన్నీళ్ల తోడుగా ఉంది." అని ఆయన వివరించారు. కాగా.. సంప్రదాయ విధానాలకు భిన్నంగా ఆలోచించడం, ఆచరించడం వల్లనే అందుకే వరల్డ్ ఎకనామిక్ ఫోరంలాంటి ప్రతిష్ఠాత్మక సంస్థలో అవకాశం వచ్చిందంటున్నారు చల్లా రంజిత్ రెడ్డి. " ఎంతో కష్టపడి చదివి స్విట్జర్లాండ్‌లో ప్రతిష్ఠాత్మక లూసానే విశ్వవిద్యాలయంలో సీటు సంపాదించాను. తాత్కాలికంగా అక్కడ ఖర్చుల కోసం ఎన్నో పార్ట్ టైమ్ జాబ్‌లు చేశాను. వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో ఉద్యోగాలు ఉన్నాయంటే దరఖాస్తు చేసుకున్నాను. ఏటా అక్కడ జాబ్‌ల కోసం ఏకంగా లక్షా ముప్పై వేల మంది దరఖాస్తు చేసుకుంటారట. అంటే ప్రతి ఉద్యోగానికీ 130 నుంచి 3000 మంది అభ్యర్థులు పోటీపడతారు. నన్ను దాదాపు రెండున్నర గంటలపాటు ఇంటర్వ్యూ చేశారు. నాకున్న నైపుణ్యాలతో పాటు నేను ఎదిగిన తీరు వారిని ఇంప్రెస్ చేసి ఉంటుంది. అందుకే తాము కొత్తగా ఏర్పాటు చేసిన బిజినెస్ ఎంగేజ్‌మెంట్ ఆపరేషన్ టీమ్ లీడర్‌గా అవకాశం ఇచ్చారు. వారి నమ్మకాన్ని నిలబెడతా" అని రంజిత్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.

– వరంగల్ అర్బన్, ఆంధ్రజ్యోతి

నేతల భజనలో న్యాయమూర్తులు!

లా-లోచనం
Law lochanam

తమ తీర్పులతో జనం తలరాతలు నిర్ణయించే న్యాయమూర్తులు రాజకీయ నాయకులను పొగడ్తలతో ముంచెత్తడం ఇటీవల చర్చనీయాంశమైంది. రాజ్యాంగానికి బద్ధులైన జడ్జీలు సమాజానికి జవాబుదారీ కావాలని జస్టిస్ చిన్నపరెడ్డి అభిలషించగా, న్యాయనిర్ణేతల వ్యవహార శైలిపై ప్రజలు తీర్పు చెప్పాల్సి రావటం దురదృష్టకరమని లార్డ్ డెన్నింగ్ అభిప్రాయపడ్డారు. వాద ప్రతివాదాలు, న్యాయ నిర్ణయం మినహా తీర్పులో అసంబద్ధ వ్యాఖ్యానాలు చేయడం జడ్జిలకు తగదని ప్రముఖ రాజ్యాంగ నిపుణులు శీర్వాయ్ హితవు చెప్పారు. పాక్ తనను ముస్లిమ్ రాజ్యంగా ప్రకటించుకున్న రీతిలోనే భారత్ సైతం హిందూ సామ్రాజ్యంగా ప్రకటించుకోవాలని వ్యాఖ్యానించి ఇటీవల మేఘాలయా హైకోర్టు న్యాయమూర్తి సేన్ వార్తల్లోకెక్కారు. అంతటితో ఆగక ఇందుకు మోడీయే తగిన వ్యక్తి అంటూ ప్రకటించి 'స్వామి భక్తి'ని చాటుకున్న ఈ జడ్జి, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రకటించడం విడ్డూరం. ప్రజోపయోగ వ్యాజ్యాల ఆవిష్కర్తగా పేరుపొందిన జస్టిస్ భగవతి గతంలో ఇందిరాగాంధీ అఖండ విజయాన్ని కీర్తిస్తూ, అభినందనలందజేస్తూ సుప్రీం న్యాయమూర్తి హోదాలో లేఖ రాయటంపై అప్పట్లో పెద్ద దుమారమే రేగింది. జడ్జీలు తమ వ్యక్తిగత అభిమానాన్ని బహిరంగం చేసి, రాజకీయ నాయకులకు భజన చేయటం, న్యాయవ్యవస్థ కళ తప్పేందుకు దారి తీస్తుందని గత సీజేఐ కపాడియా వాపోయారు.

ఇక జడ్జిలు పబ్లిసిటీ కోసం పాకులాడటం, ప్రచారం కోసం వివాదాస్పద తీర్పులు సమాజంపై వెదజల్లటం మరో అంశం. తమకు సంక్రమించిన న్యాయనిర్ణయాధికారాన్ని ఏకపక్షంగా విస్తరింపజేసుకుని, ప్రభుత్వ కార్యకలాపాలలో తల దూర్చటం, ప్రభుత్వ విధి విధానాలను ప్రభావితం చేయటం ఏమాత్రం ఆహ్వానించదగిన పరిణామం కాదు. ఇందుకు ఉదాహరణగా మళ్లీ జస్టిస్ సేన్ మహాశయులే నిలుస్తారు. సహచర న్యాయమూర్తులందరి తరఫున గంపగుత్తగా వకాల్తా పుచ్చుకున్న ఈ న్యాయమూర్తి తనకై తాను స్వీకరించిన (సూమోటో) వ్యాజ్యంలో రిటైరైన జడ్జిలకు పది వేలు,



పదవిలో ఉన్న వారికి ఎనభై వేల చొప్పున నెలసరి ఫోను బిల్లులు ప్రభుత్వమే భరించాలని హుకుం జారీ చేశారు.

భారత్‌లో న్యాయమూర్తుల ప్రవర్తనపై నియంత్రణ దిశలో చట్టాలేవీ లేవు. రాజకీయ నాయకులతో అంటకాగటం, స్వలాభం ఇమిడివున్న కేసుల్లో తమకై తాము తీర్పులు చెప్పటం, ప్రభుత్వ ఆర్థిక, విధివిధానాలపై ప్రభావం చూపే ధర్మనిర్ణయాలు ప్రకటించటం, వంటి చర్యలతో కొందరు న్యాయమూర్తులు న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను మంటగలపటం విచారకరం. ఇలాంటివి 'సంప్రదాయం'గా మారకూడదని ఆశిద్దాం.

– వేదాంతం సీతారామావధాని,
భారత సుప్రీంకోర్టు మాజీ సెక్రటరీ జనరల్,
ఈమెయిల్: sitharam.avadhani@gmail.com



2019 చాలా 'హాట్' గురూ!

వాతావరణంపై 'ఎల్‌నినో' ఎఫెక్ట్ : డబ్ల్యుఎంఓ

ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది ఉష్ణోగ్రతలు ఒకింత పెరిగే అవకాశాలున్నాయని ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యుఎంఓ) వెల్లడించింది. వచ్చే నెల చివరికల్లా దేశవ్యాప్తంగా చలితీవ్రత తగ్గుముఖం పట్టొచ్చని అంచనా వేసింది. ఈ సమాచారంతో కేంద్ర భూవిజ్ఞాన శాఖ కార్యదర్శి ఎం.రాజీవన్ ఏకీభవించారు. ఎల్‌నినో ప్రభావం ఏప్రిల్ - మే వరకు ఉండొచ్చన్నారు. దీంతోపాటు తీవ్రరూపు దాల్చిన భూతాపం(గ్లోబల్ వార్మింగ్) కారణంగా 2019 సంవత్సరంలో వేసవి, శీతాకాలాల్లో ఉష్ణోగ్రతలు సాధారణానికి మించి నమోదు కావచ్చని ఆయన అన్నారు. రుతుపవనాల గమనం, వర్షపాతం నమోదుపై ఇప్పుడే ఒక అంచనాకు రాలేమని భారత వాతావరణ శాఖ అధికారి ఒకరు పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని ఉద్యోగార్థులకు ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నూతన సంవత్సర కానుక అందజేసింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న **1386** పోస్టుల భర్తీ కోసం ఏపీపీఎస్సీ ప్రకటనలు విడుదల చేసింది. ఇందులో అత్యధిక మంది ఎదురు చూస్తున్న గ్రూప్-1, గ్రూప్-2 పోస్టులు కూడా ఉన్నాయి. నాన్ లోకల్ ఓపెన్ కేటగిరీ కిందకు వచ్చే పోస్టులకు తెలంగాణ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు సంబంధించిన వివరాలను చూద్దాం.



జెఇఇ మెయిన్ ముచ్చటగా మూడు వ్యూహాలు

కొత్త సంవత్సరం వస్తూనే పరీక్షకు సన్నద్ధం చేస్తోంది. ప్రతిష్ఠాత్మక ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన జెఇఇ మెయిన్ మొదటి విడత పరీక్ష రాయాలి. ఇంటర్ పరీక్షల తరవాత జరగాల్సిన ఈ పరీక్ష, ప్రాక్టికల్స్ కంటే ముందుకు వచ్చింది. సన్నద్ధతకు తగ్గట్టు వ్యూహం రూపొందించుకుని, పక్కాగా అమలు చేస్తే ఫస్ట్ టైమే కోరుకున్న స్కోర్‌ను పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. అందుకు మూడు వ్యూహాలను ప్రతిపాదిస్తున్నారు. వీటిలో ఏది తమకు అనుకూలమో చూసుకుని ఎంపిక చేసుకోవచ్చు.

మొదటి వ్యూహం

పేపర్‌లోని మూడు సబ్జెక్టులపై పట్టు ఉన్న అభ్యర్థులకు ఉద్దేశించిన వ్యూహమిది. ఒక్కో సబ్జెక్టులో 30 చొప్పున మూడింటిలో కలిపి 90 ప్రశ్నలు ఉంటాయి. మూడు గంటల వ్యవధి ఉంటుంది. కెమిస్ట్రీతో ఆరంభించండి. ఆ సబ్జెక్టుకు 40 నిమిషాలు కేటాయించుకోండి. నిర్దేశించుకున్న సమయంలోనే కెమిస్ట్రీలో వచ్చే 30 ప్రశ్నలకు సమాధానాలు కనుగొనే ప్రయత్నం చేయండి. ఆ లోపు పూర్తికాని పక్షంలో రాని ప్రశ్నలను చివర్లో రివ్యూ చేసుకునేందుకు పక్కన పెట్టేయండి. తదుపరి గంట సమయాన్ని ఫిజిక్స్‌లో అడిగే 30 ప్రశ్నలకు కేటాయించుకోండి. పరీక్ష గడువు మూడు గంటలు అంటే 180 నిమిషాలు. కెమిస్ట్రీ, ఫిజిక్స్ కోసం వంద నిమిషాలు పూర్తయింది. అంటే ఇంకా ఉన్నది 80 నిమిషాలు మాత్రమే. ఆ సమయాన్ని తెలివిగా ఉపయోగించుకోండి. మేథ్స్‌కు 70 నిమిషాలు తీసుకున్నప్పటికీ ఇంకా పది నిమిషాలు మిగులుతుంది. ఆ పది నిమిషాలను మూడింటికి సమంగా లేదా విడిచిపెట్టిన వాటిలో కొద్దిగా ట్రై చేస్తే వస్తాయనుకునే వాటికి ఉపయోగించుకోండి.

ప్రశ్నల సరళి

Name of Chapter	2018	2017	2016	2015
Physics				
Electrodynamics	8	6	10	6
Heat and Thermodynamics	4	3	3	3
Mechanics	8	7	8	11
Modern Physics	5	8	3	5
Optics	2	3	3	3
SHM & Wave	3	3	3	2
Mathematics				
Algebra	11	11	12	9
Calculus	10	9	10	9
Coordinate Geometry (2-D)	4	5	4	5
Coordinate Geometry (3-D)	3	2	2	4
Trigonometry	2	3	2	3
Chemistry				
Physical Chemistry	12	12	11	8
Organic Chemistry	11	10	9	8
Inorganic Chemisgtry	7	8	10	14

రెండో వ్యూహం

బోర్డు పరీక్షలపై పూర్తి స్థాయిలో, జెఇఇ మెయిన్‌పై అంతంతగా దృష్టి నిలిపే విద్యార్థులకు ఉద్దేశించిన వ్యూహమిది. ప్రశ్న పత్రం మొత్తాన్ని పదిహేను నిమిషాలకు తక్కువ కాకుండా సమయం తీసుకుని ఒకసారి స్కాన్ చేయండి. ఇంటర్ రెండేళ్ళ కోర్సులో భాగంగా మేథ్స్‌లో చేసిన ప్రశ్నలను గుర్తించండి. వాటిలో మొదటి ఏడాదిలో అడిగిన వాటికి 75 నిమిషాలు, మిగిలిన సమయాన్ని రెండో ఏడాదిలో ఇప్పటి వరకు చేసిన వాటిని పూర్తికానిచ్చేయండి. రానివాటిని పూర్తిగా విస్మరించండి.

మూడో వ్యూహం

మూడు సబ్జెక్టుల్లో పట్టులేని విద్యార్థులకు ఉపకరించే వ్యూహమిది.

- **మొదటి దశ:** యావత్తు పేపరును 15 నిమిషాల సేపు స్కాన్ చేయండి. సులువు, మోడరేట్, కష్టం ప్రాతిపదికన ప్రశ్నలను విభజించుకోవడమే కాదు, పెన్ను తీసుకుని పేపర్‌పై రాసుకోండి. సులువుగా ఉన్న వాటికి సొల్యూషన్ లేదంటే సమాధానం కనుగొనేందుకు నిమిషానికి మించి సమయం పట్టదు. కొద్దిగా ఎక్కువ కాలిక్యులేషన్లు అవసరమైన వాటిని మోడరేట్‌గా గుర్తించండి. ఏమాత్రం తెలియని ప్రశ్నలను కష్టం పరిధిలోకి తీసుకోండి.
- **రెండో దశ:** మొదట సులువుగా ఉన్న ప్రశ్నలకు సమాధానాలు గుర్తించండి. ముందే అనుకున్నట్టు సులువు అని భావించిన ఏ ప్రశ్నకూ నిమిషానికి మించి సమయం ఇచ్చుకోవద్దు. నిమిషంలోపు సమాధానం రాకుంటే పక్కన పెట్టేయండి. చివర్లో రివ్యూ చేసుకోవచ్చు.
- **మూడో దశ:** మోడరేట్‌గా భావించిన ప్రశ్నలకు సమాధానం కోసం రెండు నిమిషాలకు మించి సమయం తీసుకోవద్దు. అలాగే కనుగొన్న సమాధానంపై పూర్తి స్థాయిలో విశ్వాసం కుదరనిపక్షంలో వాటిని పక్కన పెట్టేయండి. చివర్లో చూసుకోవచ్చు.
- **నాలుగో దశ:** కష్టంగా అని భావించిన ప్రశ్నలను ఇప్పుడు తీసుకోండి. ఒక్కోదానికి మూడు నిమిషాలు తీసుకోండి.
- **అయిదో దశ:** రివ్యూ కోసం టిక్కు పెట్టుకున్న ప్రశ్నలను సులువు, మోడరేట్, కష్టం ప్రాతిపదికన ఇప్పుడు కంప్లీట్ చేయండి.

ఈ మూడింటిలో ఏ వ్యూహం మీకు సూటవుతుందో చూసుకోండి. మీ ప్రిపరేషన్, మీరు ఇచ్చుకునే ప్రాధాన్యం తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని వ్యూహాన్ని ఎంపిక చేసుకోండి. మైనస్ మార్కులనూ గుర్తుపెట్టుకోండి. కరెక్ట్‌గా గుర్తిస్తే నాలుగు మార్కులు వస్తాయి. తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు మైనస్ అవుతుంది. తెచ్చుకున్న మార్కుల నుంచి మైనస్ రూపంలో కట్‌కావడం అంటే ఇబ్బందికరమే. అందువల్ల ఆచి తూచి మరీ ప్రశ్నలకు సమాధానాలను గుర్తించాలి. కచ్చితత్వం చాలా ముఖ్యం. వేగానికి మించి ఇది ప్రధానం. వ్యూహం ఎంపికలో ఈ విషయం కూడా దృష్టిలో పెట్టుకోవాలి. ఇప్పటి వ్యూహం ఫలితం ఈ నెలాఖరు తెలుస్తుంది. రెండో విడతకు మరో 70 రోజుల గడువు ఉంటుంది. మన వ్యూహం సరైనదా కాదా అన్నది తెలుస్తుంది. వ్యూహం అన్నది ఎప్పుడైనా మన ఆలోచన, ఉద్దేశాలకు దగ్గరగా ఉండాలి. వీటికి మించి మరేదైనా వ్యూహం ఉంటే దాన్ని ఎంపిక చేసుకుని అమలు చేయవచ్చు.

ఏపీపీఎస్సీ ఉద్యోగాలు

గ్రూప్-1 సర్వీసులు — పోస్టులు 169

పోస్టులు: డిప్యూటీ కలెక్టర్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (సివిల్), డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్ (మెన్), డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ / అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్లు తదితరాలు...
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీ. కొన్ని పోస్టులకు కమిషన్ నిర్దేశించిన ఇతర అర్హతలు ఉండాలి. అవి.. డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ / అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్.
వయసు: 18 - 42 ఏళ్ల మధ్య ఉండాలి (జూలై 1, 2018 నాటికి). యూనిఫామ్ పోస్టులకు వయోపరిమితి వేర్వేరుగా ఉంటుంది. అవి..
డీఎస్పీ పోస్టులకు: 21 - 28 ఏళ్లు, డీఎస్పీ జైల్స్ (పురుషులు): 18 - 28 ఏళ్లు, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్: 21 - 28 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరిండెంట్: 18 - 26 ఏళ్లు. యూనిఫామ్ పోస్టులకు నిర్దేశించిన విధంగా శారీరక ప్రమాణాలు కూడా తప్పనిసరి.
ఎంపిక: ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, మెయిన్ ఎగ్జామినేషన్, ఓరల్ టెస్ట్ (ఇంటర్వ్యూ) ఆధారంగా. మొత్తం ప్రక్రియకు 825 మార్కులు కేటాయించారు. స్క్రీనింగ్ టెస్ట్‌లో రెండు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపర్‌లో 120 ప్రశ్నలు 120 మార్కులకు ఉంటాయి. మెయిన్స్‌లో లాంగ్వేజెస్‌తో కలిపి ఏడు పేపర్లు ఉంటాయి. అవి.. తెలుగు (150 మార్కులు), ఇంగ్లీష్ (150 మార్కులు), పేపర్-1 జనరల్ ఎస్సే (150 మార్కులు), పేపర్-2 హిస్టరీ-జాగ్రఫీ (150 మార్కులు), పేపర్-3 పాలిటీ (150 మార్కులు), పేపర్-4 ఎకానమీ (150 మార్కులు), పేపర్-5 సైన్స్ అండ్ టెక్నాలజీ (150 మార్కులు). ఇంటర్వ్యూకు 75 మార్కులు కేటాయించారు.
ప్రిలిమినరీ ఎగ్జామ్ తేదీ: మార్చి 10, 2019.
మెయిన్ ఎగ్జామ్ తేదీ: 2019 జూన్ 10 నుంచి 22 వరకు.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
ఫీజు: అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250; ఎగ్జామినేషన్ ఫీజు రూ.120.
దరఖాస్తు ప్రక్రియ ప్రారంభ తేదీ: జనవరి 7, 2019.
ఫీజు చెల్లించడానికి చివరి తేదీ: జనవరి 27, 2019.
దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 28, 2019.

పాలిటెక్నిక్ లెక్చరర్ — పోస్టులు 405

సబ్జెక్టులు / బ్రాంచీలు: ఆర్కిటెక్చరల్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, బయో-మెడికల్ ఇంజనీరింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, సిరామిక్ టెక్నాలజీ, కెమికల్ టెక్నాలజీ, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఇంగ్లీష్, గార్మెంట్ టెక్నాలజీ, జియాలజీ, మెరైన్ ఇంజనీరింగ్, మ్యాథమేటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ఫార్మసీ, ఫిజిక్స్, టెక్స్‌టైల్ టెక్నాలజీ.
అర్హత: సంబంధిత బ్రాంచీలు / సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత. కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ లెక్చరర్ పోస్టులకు కామర్స్‌లో మాస్టర్స్ డిగ్రీ, ఇంగ్లీష్‌లో టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ హయ్యర్ గ్రేడ్ ఉండాలి.
వయసు: 18 - 42 ఏళ్ల మధ్య ఉండాలి (జూలై 1, 2018 నాటికి).
ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్, కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్/ మెయిన్ ఎగ్జామినేషన్, ఓరల్ టెస్ట్ (ఇంటర్వ్యూ) ఆధారంగా. మొత్తం ప్రక్రియకు 500 మార్కులు కేటాయించారు. రాత పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. అవి పేపర్-1 జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ (150 మార్కులు), పేపర్-2 ఎంచుకున్న సబ్జెక్ట్ (300 మార్కులు). ఇంటర్వ్యూకు 50 మార్కులు కేటాయించారు.
మెయిన్ ఎగ్జామినేషన్ తేదీ: 2019 జులైలో.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
ఫీజు: అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250; ఎగ్జామినేషన్ ఫీజు రూ.120.
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: ఫిబ్రవరి 6, 2019.
ఫీజు చెల్లించడానికి చివరి తేదీ: ఫిబ్రవరి 26, 2019.
దరఖాస్తుకు చివరితేదీ: ఫిబ్రవరి 27, 2019.

డిగ్రీ కాలేజ్ లెక్చరర్ — పోస్టులు 308

సబ్జెక్టులు: ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ, ఒరియా, హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, కామర్స్, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, స్టాటిస్టిక్స్, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, జియాలజీ.
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీతోపాటు నెట్ / స్లెట్ (లేదా) పీహెచ్‌డీ ఉత్తీర్ణత.
వయసు: 18 - 42 ఏళ్ల మధ్య ఉండాలి (జూలై 1, 2018 నాటికి).
ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్, కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్ / మెయిన్ ఎగ్జామినేషన్, ఓరల్ టెస్ట్ (ఇంటర్వ్యూ) ఆధారంగా. మొత్తం ప్రక్రియకు 500 మార్కులు కేటాయించారు. రాత పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. అవి పేపర్-1 జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ (150 మార్కులు), పేపర్-2 ఎంచుకున్న సబ్జెక్ట్ (300 మార్కులు). ఇంటర్వ్యూకు 50 మార్కులు కేటాయించారు.
మెయిన్ ఎగ్జామ్ తేదీ: 2019 మే 21, 22 తేదీల్లో.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
ఫీజు: అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250; ఎగ్జామినేషన్ ఫీజు రూ.120.
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: ఫిబ్రవరి 5, 2019.
ఫీజు చెల్లించడానికి చివరి తేదీ: ఫిబ్రవరి 25, 2019.
దరఖాస్తుకు చివరితేదీ: ఫిబ్రవరి 26, 2019.

ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ — పోస్టులు 43

జోన్ల వారీగా ఖాళీలు:
జోన్-1: 07, **జోన్-2:** 22, **జోన్-3:** 08, **జోన్-4:** 06
అర్హత: బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ (బీఎఫ్ఎస్సీ).
వయసు: 18 - 42 ఏళ్ల మధ్య ఉండాలి (జూలై 1, 2018 నాటికి).
ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్, కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్ / మెయిన్ ఎగ్జామినేషన్ ఆధారంగా. మొత్తం ప్రక్రియకు 450 మార్కులు కేటాయించారు. రాత పరీక్షలో మూడు పేపర్లు ఉంటాయి. అవి పేపర్-1 జనరల్ స్టడీస్ & మెంటల్ ఎబిలిటీ (150 మార్కులు), పేపర్-2 ఫిషరీస్ సైన్స్-1 (150 మార్కులు), పేపర్-3 ఫిషరీస్ సైన్స్-2 (150 మార్కులు).
మెయిన్ ఎగ్జామినేషన్: 2019 మే 21, 22 తేదీల్లో.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: జనవరి 17, 2019.
ఫీజు చెల్లించడానికి చివరి తేదీ: ఫిబ్రవరి 7, 2019.
దరఖాస్తుకు చివరితేదీ: ఫిబ్రవరి 8, 2019.

అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ (ఏపీ ఫిషరీస్ సబ్-సర్వీస్) — పోస్టులు 10

జోన్ల వారీగా ఖాళీలు:
జోన్-1: 01, **జోన్-2:** 06, **జోన్-3:** 02, **జోన్-4:** 01
అర్హత: ఫిషరీస్ టెక్నాలజీలో పీజీ డిప్లొమా (లేదా) ఫిషరీస్ టెక్నాలజీలో డిప్లొమా, నేవిగేషన్ పాలిటెక్నిక్ (లేదా) ఇన్‌ల్యాండ్ / మెరైన్ ఫిషరీస్ క్లాసెస్ కోర్సు సర్టిఫికెట్ (లేదా) జువాలజీ ప్రధాన సబ్జెక్టుగా బీఎస్సీ (లేదా) బీఎఫ్ఎస్సీ (లేదా) బీఎస్సీ (ఎఫ్‌జడ్‌సీ), బీఎస్సీ (ఫిషరీస్) ఉత్తీర్ణత.
వయసు: 18 - 42 ఏళ్ల మధ్య ఉండాలి (జూలై 1, 2018 నాటికి).
ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్, కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్ / మెయిన్ ఎగ్జామినేషన్ ఆధారంగా. మొత్తం ప్రక్రియకు 300 మార్కులు కేటాయించారు. రాత పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. అవి పేపర్-1 జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ (150 మార్కులు), పేపర్-2 సబ్జెక్ట్ (150 మార్కులు).
మెయిన్ ఎగ్జామ్ తేదీ: మే 27, 2019.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేదీ: జనవరి 18, .2019.
ఫీజు చెల్లించడానికి చివరి తేదీ: ఫిబ్రవరి 7, 2019.
దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 8, 2019.

డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ (ఏపీ ఇన్ఫర్మేషన్ సర్వీస్) — పోస్టులు 5

జోన్ల వారీగా ఖాళీలు:
జోన్-1: 01, **జోన్-2:** 02, **జోన్-3:** 01, **జోన్-4:** 01
అర్హత: ఎలక్ట్రానిక్స్ (లేదా) టెలీకమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ.
వయసు: 18 - 42 ఏళ్ల మధ్య ఉండాలి (జూలై 1, 2018 నాటికి).
ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్, కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్ / మెయిన్ ఎగ్జామినేషన్ ఆధారంగా. మొత్తం ప్రక్రియకు 450 మార్కులు కేటాయించారు. రాత పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. అవి పేపర్-1 జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ (150 మార్కులు), పేపర్-2 సబ్జెక్ట్ (300 మార్కులు).
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభ తేదీ: జనవరి 22, 2019.
దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 12, 2019.

గ్రూప్-2 సర్వీసులు — పోస్టులు 446

పోస్టులు: అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ తదితరాలు.
ఎగ్జిక్యూటివ్ పోస్టులు - 154, నాన్ ఎగ్జిక్యూటివ్ - 292
అర్హత: ఏదైనా డిగ్రీ. కొన్ని పోస్టులకు కమిషన్ నిర్దేశించిన ఇతర అర్హతలు ఉండాలి. అవి.. అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్), అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (లా డిపార్ట్‌మెంట్), సీనియర్ అకౌంటెంట్, జూనియర్ అకౌంటెంట్.
వయసు: 18 - 42 సంవత్సరాల మధ్య ఉండాలి (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సై పోస్టుకు 18 - 28 మధ్య). యూనిఫామ్ పోస్టులకు నిర్దేశించిన విధంగా శారీరక ప్రమాణాలు కూడా తప్పనిసరి.
ఎంపిక: స్క్రీనింగ్, మెయిన్స్ పరీక్షల ద్వారా. మొత్తం ప్రక్రియకు 600 మార్కులు కేటాయించారు. ఇందులో స్క్రీనింగ్ పరీక్ష 150 మార్కులకు ఉంటుంది. మెయిన్స్‌లో మూడు పేపర్లు ఇస్తారు. అవి.. పేపర్-1 జనరల్ స్టడీస్ మెంటల్ ఎబిలిటీ (150 మార్కులు), పేపర్-2 హిస్టరీ-పాలిటీ (150 మార్కులు), పేపర్-3 ఎకానమీ (150 మార్కులు).
స్క్రీనింగ్ టెస్ట్ తేదీ: మే 5, 2019.
మెయిన్ ఎగ్జామ్ తేదీ: 2019 జులై 18, 19 తేదీల్లో.
దరఖాస్తు రుసుము: అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు 250, ఎగ్జామ్ ఫీజు రూ.80 చెల్లించాలి. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: జనవరి 10, 2019
దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 31, 2019
ఫీజు చెల్లించడానికి చివరి తేదీ: జనవరి 30, 2019

వెబ్‌సైట్: https://psc.ap.gov.in/

Bulletin Board

Design courses

The Indian Institute of Art and Design in collaboration with Kingston School of Art,London offers undergraduate programmes in Fashion Design, Fashion Business Management, Communication Design and Interior Architecture & Design. It also offers postgraduate programmes in Fashion Design and Fashion Business Management. The last date to apply is April 17, 2019. For more details, visit www.iiad.edu.in.

Cybersecurity courses

Western Sydney University has launched the Bachelor of Cybersecurity and Behaviour to address the global skills shortage in cybersecurity and intelligence. Admissions are open and students can apply through authorised Western Sydney University agent representatives in India. For more information, visit:www.westernsydney. edu.au/international /agents or email:N.Anand@westernsydney.edu.au. The last date for submission of the application is January 20, 2019.

Video competition

Students from schools across India will have an opportunity to win a student experience to a leading Australian university by participating in the annual Film Fly Experience Australia schools video competition. The competition will run from December 21, 2018, to March 29, 2019. The competition is open to students between grades 9 to 12 from schools across India. For more details, visit: www.studyin-australia. gov.au/ffeaustralia.

Competitive exams

Uttar Pradesh-based education startup EduGorilla has announced the launch of its comprehensive and innovative test series catering to over 20 categories of competitive examinations. For details, visit: https://test-series.edugorilla.com.

Elite scholarships

The University of Strathclyde, Glasgow offers Faculty of Science Postgraduate Elite Scholarships to International students. The last date to submit applications is September 16, 2019. For further information, email science-enquiries@strath.ac.uk



ఆంధ్రజ్యోతి

స్పోర్ట్స్

15

నిజామాబాద్ • గురువారం 3 జనవరి 2019

స్వర్గంలో క్రికెట్ విరాజిల్లు..

అచ్రేకర్ సర్ సమక్షంలో స్వర్గంలో కూడా క్రికెట్ విరాజిల్లుతుంది. చాలామంది విద్యార్థుల్లాగే నేను కూడా సర్ పర్యవేక్షణలో క్రికెట్‌లో ఏబీసీడీలు నేర్చుకున్నాను. నా జీవితంలో ఆయన పాత్ర ఎంతన్నది మాటల్లో చెప్పలేను. నేను ఈస్థాయిలో నిలబడ్డానంటే అందుకు పునాది ఆ సారే.

- సచిన్ టెండూల్కర్



గురు అచ్రేకర్‌తో సచిన్, కాంబ్లీ

సిడ్నీ మైదానంలో ఇప్పటిదాకా ఆస్ట్రేలియా, భారత్ మధ్య 11 టెస్టులు జరిగాయి.

11

ఇందులో ఐదు టెస్టులను ఆస్ట్రేలియా గెలవగా.. భారత్ ఒకేఒక మ్యాచ్ (1978లో ఇన్నింగ్స్, 2 పరుగుల తేడాతో) నెగ్గింది. మిగతా ఐదు మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. ఇరుజట్ల మధ్య ఇక్కడ చివరిసారిగా 2015లో జరిగిన టెస్టు డ్రా అయింది.



5

ఆస్ట్రేలియా గడ్డపై ఓ టెస్ట్ సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా కపిల్ దేవ్ (1991-92 సిరీస్‌లో 25 వికెట్లు) రికార్డును సమం చేసేందుకు బుమ్రా ఐదు వికెట్ల దూరంలో ఉన్నాడు. ఇప్పటికే ముగిసిన మూడు టెస్టుల్లో కలిపి బుమ్రా 20 వికెట్లు పడగొట్టాడు.

కొత్త సంవత్సరాన కోహ్లీ సేన చరిత్ర సృష్టించేందుకు తహతహలాడుతోంది. ఏడు దశాబ్దాలుగా పదిసార్లు ఆస్ట్రేలియాలో పర్యటించినా మూడుసార్లు టెస్ట్ సిరీస్‌లు డ్రా చేసుకొని ఏడుసార్లు పరాజయాలు చవిచూసిన భారత్‌కు కంగారూలపై టెస్ట్ సిరీస్ గెలుపొందే గొప్ప అవకాశం ముంగిట నిలిచింది. సిరీస్‌లో 2-1 ఆధిక్యంతో ఆత్మవిశ్వాసంలో ఉన్న టీమిండియా గురువారం ఆరంభమయ్యే నాలుగోదైన చివరి టెస్ట్‌లో హాట్‌ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది..అయితే చివరి నిమిషంలో భారత్‌ను గాయాల సమస్య వేధిస్తోంది. సీనియర్ పేసర్ ఇషాంత్ శర్మ ఇప్పటికే వైదొలగగా, మేటి స్పిన్నర్ అశ్విన్ గాయం నుంచి కోలుకోకపోవడంతో మ్యాచ్‌లో ఆడేది అనుమానంగా ఉంది..ఇక బాల్ టాంపరింగ్ ఉదంతంతో గత ఏడాది అవమానాలపాలైన ఆస్ట్రేలియా ఈ టెస్ట్ విజయంతో కొత్త సంవత్సరాన్ని ఘనంగా మొదలుపెట్టాలనే పట్టుదలగా ఉంది.

గోల్డెన్ చాన్స్


చరిత్ర సృష్టించేందుకు భారత్ తహతహ

ఆస్ట్రేలియాతో చివరి టెస్ట్ నేటినుంచి

ఉ. 5 గం.నుంచి సోనీ సిక్స్, సోనీ టెన్ 3లో..

ఇషాంత్ దూరం

అశ్విన్ కూడా అనుమానం



విరాట్ కోహ్లీ

సిడ్నీ: టెస్ట్‌ల్లో టీమిండియాది నెంబర్‌వన్ ర్యాంక్. కానీ విదేశాల్లో మాత్రం టెస్ట్ సిరీస్‌లు గెలవడంలో విఫలమవుతోంది. నిరుడు కోటి ఆశలతో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌ల్లో పర్యటించినా టెస్ట్ సిరీస్‌ల్లో పరాజయమే ఎదురైంది. ఎంత మేటి అయినా.. విదేశాల్లో భారత్ టెస్ట్ సిరీస్‌లు కైవసం చేసుకోలేదన్న అపప్రదతో ఆసీస్‌గడ్డపై కాలు మోపిన కోహ్లీ సేన.. తొలి టెస్ట్ విజయంతో ఆ విమర్శలకు జవాబిచ్చింది. రెండో టెస్ట్‌ను చేజార్చుకున్నా పుంజుకొని మూడో టెస్ట్‌లో నెగ్గడమే కాదు ప్రస్తుతం నాలుగో మ్యాచ్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతూ చరిత్ర సృష్టించేందుకు సన్నద్ధమైంది.

గాయాలతో ఆందోళన

పరిస్థితులన్నీ అనుకూలంగా ఉన్నా ఆఖరి క్షణంలో టీమిండియాను గాయా ల బెడద వెంటాడుతోంది. చివరి టెస్ట్‌కు ప్రకటించిన 13మంది జట్టులో ఆఫ్ స్పిన్నర్ అశ్విన్‌ను చేర్చినా..అతడు బరిలోకి దిగేది అనుమానంగానే ఉంది. పొత్తికడుపు గాయంనుంచి అశ్విన్ పూర్తిగా కోలుకోలేదని విరాట్ వెల్లడించాడు. మొదటి టెస్ట్ తర్వాత అశ్విన్ గాయం తిరగబెట్టడంతో తరువాతి రెండు మ్యాచ్‌లకు అతడు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. సిడ్నీ పిచ్ సంప్రదాయంగా స్పిన్నర్లకు సహకరించేది కావడంతో ఒకవేళ అశ్విన్ ఆడకపోతే భారత్‌కు అది దెబ్బే. సిరీస్ నిర్ణాయక మ్యాచ్ అయినా..ఎడమ పక్కటెముకల నొప్పితో బాధపడుతున్న ఇషాంత్‌ను ఆడించడం ద్వారా రిస్క్ తీసుకోకూడదని జట్టు మేనేజ్‌మెంట్ భావిస్తోంది. 'టెస్ట్ క్రికెట్‌లో అశ్విన్ మాకెంతో కీలకం. దీర్ఘకాలిక అవసరాల దృష్ట్యా అతను 100 శాతం ఫిట్‌నెస్‌తో ఉండాల్సి ఉంటుం ది. నిర్ణీత సమయానికి కోలుకోకపోవడంతో అతడు కూడా నిరాశ చెందాడు' అని విరాట్ చెప్పాడు. బుధవారంనాటి విలేకరుల సమావేశంలో కోహ్లీ అలా చెప్పినా.. అనంతరం ప్రకటించిన 13మంది జట్టులో అనూహ్యంగా అశ్విన్ పేరు చేర్చారు. అయితే తుది జట్టులో అతడి స్థానంపై టాస్‌కు ముందు నిర్ణయం తీసుకోనున్నారు.అశ్విన్‌ను ఆడించలేకపోతే అతడి బదులు బరిలోకి దించేందుకు ఎడమ చేతి రిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు 13మందిలో చోటు కల్పించారు. పేస్ విభాగానికి సంబంధించి బుమ్రా, షమికి తోడుగా ఉమేశ్ యాదవ్‌ను చేర్చారు. రోహిత్ శర్మ అందుబాటులో లేకపోవడంతో కేఎల్ రాహుల్‌కు మళ్లీ అవకాశం దక్కింది. దాంతో గత టెస్ట్‌లో ఇన్నింగ్స్ ప్రారంభించిన హనుమ విహారి తిరిగి తన ఆరో స్థానంలో రానున్నాడు. అశ్విన్ ఫిట్‌నెస్‌తో సంబంధం లేకుండా భారత్ నలుగురు బౌలర్లతో ఆడాలనుకుంటే.. ముగ్గురు పేసర్లు, ఒక స్పిన్నర్ లేదా ఇద్దరు ఫాస్ట్ బౌలర్లు, ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగుతుందా అన్నది చూడాలి. నెట్స్‌లో అటు బ్యాటింగ్ ఇటు బౌలింగ్‌లో హార్దిక్ తీవ్రంగా చెమటోడ్చినా అతడికి అవకాశాలు మాత్రం కన్పించడంలేదు. మెల్‌బోర్న్‌లో ఆడిన జట్టుతోనే భారత్ బరిలోకి దిగాలనుకుంటే రెండో స్పిన్నర్‌గా విహారిపై విరాట్ ఆధారపడే అవకాశాలున్నాయి. మరోవైపు సంప్రదాయానికి భిన్నంగా ఆస్ట్రేలియా తుది 11మంది జట్టును బుధవారంనాడు ప్రకటించకపోవడం గమనార్హం. టాస్‌కు ముందు మాత్రమే తమ జట్టును వెల్లడిస్తామని కెప్టెన్ టిమ్ పెయిన్ తెలిపాడు. బహుశా భారత్ ఇద్దరు పూర్తిస్థాయి స్పిన్నర్లతో ఆడుతుందో లేదో తెలిశాకే ఆసీస్ జట్టును ఖరారు చేయనున్నట్టు భావిస్తున్నారు.

హ్యాండ్స్‌కోంబ్‌కు చాన్స్

గత టెస్ట్‌లో షాట్ సెలెక్షన్‌లో విఫలమై విమర్శలపాలైన మిచెల్ మార్ష్ స్థానంలో బ్యాట్స్‌మన్ పీటర్ హ్యాండ్స్‌కోంబ్ ఆసీస్ జట్టులోకి రానున్నాడు. మరో బ్యాట్స్‌మన్ స్థానానికి ఓపెనర్ అరోన్ ఫించ్, లెగ్‌స్పిన్ ఆల్‌రౌండర్ మార్నస్ లబుషేన్ మధ్య తీవ్ర పోటీ ఏర్పడింది. ఫించ్‌కు చాన్స్ లభించకపోతే మార్కస్ హ్యారిస్‌తో కలిసి ఉస్మాన్ ఖవాజా ఇన్నింగ్స్ ప్రారంబిస్తాడు. లబుషేన్ మిడిలార్డర్‌లో వస్తాడు. ఈ మార్పు చేర్పుల తర్వాతనైనా.. ఈ సిరీస్‌లో ఒక్క ఆసీస్ బ్యాట్స్‌మన్ కూడా సెంచరీ చేయని లోటును ఆఖరి టెస్ట్‌లోనైనా తీరుతుందేమో చూడాలి.

పదిసార్లూ నిరాశే..

1947-48 నుంచి ఆస్ట్రేలియాలో భారత జట్టు పర్యటిస్తోంది. అయితే మూడుసార్లు టెస్ట్ సిరీస్‌లను డ్రా చేసుకున్న భారత్‌కు ఏడుసార్లు సిరీస్ పరాజయాలే ఎదురయ్యాయి. కానీ ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది. గతంలో ఏ కెప్టెన్‌కూ సాధ్యంకాని రీతి లో సిరీస్‌లో ఆధిక్యంతో విరాట్ చివరి టెస్ట్‌ను ఆరంభిస్తున్నాడు. ఇప్పటికే మేటి బ్యాట్స్‌మన్‌గా, గొప్ప సారథిగా మన్ననలు అందుకుంటున్న కోహ్లీ..సిరీస్ గెలిస్తే అతడి కీర్తిప్రతిష్ఠలు మరింత సమున్నతమవుతాయి.

చరిత్ర ముఖ్యం కాదు..

చరిత్ర సృష్టించడం ముఖ్యం కాదు. సిడ్నీలో గెలిచి ఆస్ట్రేలియాపై తొలి టెస్ట్ సిరీస్ సాధించడాన్ని గొప్పగా భావిస్తా. నాలుగేళ్ల క్రితం భారత జట్టు పరివర్తన ఇక్కడే ప్రారంభమైంది. అప్పట్లో మా టెస్ట్ ర్యాంక్ ఏడు. ప్రస్తుతం మా ర్యాంక్ ఒకటి. గతేడాదిని విజయంతో ముగించాం. కొత్త సంవత్సరాన్ని కూడా విజయంతో ప్రారంభించాలనుకుంటున్నాం. **- కోహ్లీ**



టిమ్ పెయిన్

పిచ్-వాతావరణం

సిడ్నీ వికెట్ అందరికీ అనుకూలంగా ఉంటుందని క్యూరేటర్ జస్టిన్ గ్రోవ్స్ చెబుతున్నాడు. తొలిరోజు పేసర్లకు సహకరించినా బ్యాట్స్‌మెన్‌కూ చక్కగా అనుకూలించనుంది. ఆపై స్పిన్నర్లు ప్రభావం చూపవచ్చు. తొలి మూడు రోజులు ఎండగానే ఉంటుంది. కానీ నాలుగు, ఐదు రోజుల్లో వర్షాలకు అవకాశముంది.

జట్లు (అంచనా)

భారత్: విరాట్ కోహ్లీ (కెప్టెన్), మయాంక్ అగర్వాల్, రాహుల్, పుజారా, రహానె, విహారి, పంత్, జడేజా, షమి, అశ్విన్, ఉమేష్ యాదవ్, బుమ్రా.

ఆస్ట్రేలియా: టిమ్ పెయిన్ (కెప్టెన్), మార్కస్ హ్యారిస్, ఖవాజా, షాన్ మార్ష్, హ్యాండ్స్‌కోంబ్/ఫించ్, ట్రావిస్ హెడ్, లబుషేన్, కమిన్స్, స్టార్క్, లియాన్, హాజెల్‌వుడ్.

3

గతేడాది ఆస్ట్రేలియా గడ్డపై ఆ జట్టు తరపున టెస్టుల్లో నాలుగు సెంచరీలు నమోదవగా.. వీటిలో మూడు శతకాలు సిడ్నీ మైదానంలోవే కావడం విశేషం. ఈ మూడు సెంచరీలను ఇంగ్లండ్‌తో టెస్టుల్లో ఉస్మాన్ ఖవాజా, షాన్ మార్ష్, మిచెల్ మార్ష్ బాదారు.

సచిన్ గురువు అచ్రేకర్ కన్నుమూత

క్రికెట్ లోకం ఘన నివాళి

ముంబై: దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు క్రికెట్‌లో ఓనమాలు నేర్పించిన గురువు రమాకాంత్ అచ్రేకర్ కన్ను మూశారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న 87 ఏళ్ల అచ్రేకర్ బుధవారం ముంబైలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. 'అచ్రేకర్ సర్ మనల్ని వీడి వెళ్లిపోయారు. ఈ సాయంత్రం ఆయన కన్నుమూశారు' అని రమాకాంత్ కుటుంబసభ్యులు మీడియాకు వెల్లడించారు. 1932లో జన్మించిన అచ్రేకర్ పదకొండేళ్ల వయసులో క్రికెట్ ఆడడం మొదలుపెట్టారు. మొదట్లో న్యూహిందూ స్పోర్ట్స్ క్లబ్, యంగ్ మహారాష్ట్ర లెవన్, గుల్‌మెహర్ మిల్స్, ముంబై పోర్ట్‌లాంటి క్లబ్ జట్లకు ఆడిన అచ్రేకర్.. 1963-64లో మొయినుద్దౌలా టోర్నీలో స్టేట్ బ్యాంక్ తరపున హైదరాబాద్‌పై ఒక ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఆడారు. తన కెరీర్‌లో ఒకేఒక ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఆడినా.. క్రికెట్ దేవుడిగా నీరాజనం అందుకున్న సచిన్‌లాంటి స్టార్‌ను తయారుచేయడంలో కీలకపాత్ర పోషించారు. సచిన్‌తో పాటు మాజీ క్రికెటర్లు వినోద్ కాంబ్లీ, ప్రవీణ్ ఆమ్రే, సమీర్ డిఘే, బల్వీందర్ సింగ్ సంధులకు క్రికెట్ పాఠాలు నేర్పారు. క్రికెట్‌లో అచ్రేకర్ సేవలను గుర్తించిన ప్రభుత్వం 1990లో ద్రోణాచార్య, 2010 పద్మశ్రీ పురస్కారాలతో సత్కరించింది.

ఆయన శిష్యరికం.. ప్రత్యేకం



దేశంలో ఎందరో క్రికెట్ కోచ్‌లు ఉండొచ్చు. కానీ రమాకాంత్ అచ్రేకర్ స్టయిల్ వేరు. క్రికెట్ ప్రపంచానికి 'కోహినూర్'లాంటి ఆటగాడు సచిన్ టెండూల్కర్‌ను అందించిన ఘనత ఆయనది. 1983 వరల్డ్ కప్‌ను భారత్ గెలుచుకోవడంతో దేశమంతా క్రికెట్ క్లబ్బుల ఆవిర్భావం మొదలైంది. వాటిల్లో ముంబై శివాజీ పార్క్ జింఖానాలో అచ్రేకర్ ఆధ్వర్యంలో ప్రారంభమైన అకాడమీ ఎంతో ఖ్యాతిగాంచింది. కాటన్ చొక్కా, సాధారణ ట్రౌజర్‌తోపాటు 'జువెల్ థీఫ్'లో దేవానంద్ తరహా క్యాప్ ధరించి అత్యంత సాధారణంగా ఉండే రమాకాంత్‌లో క్రికెట్ పరిజ్ఞానం అపారం. ఆయన శిష్యరికం లభించడం ఆషామాషీ కాదు. నిబంధనల విషయంలో అచ్రేకర్ ఎంతో నిక్కచ్చిగా ఉంటారు. అవసరమైన అర్హతలు లేకపోతే ఆయన అకాడమీలో చోటు లభించడం దుర్లభం. అందులో చోటు దక్కిందంటే ఇక ఆ ఆటగాడి దశ తిరిగినట్టే. శిక్షణ అంశాలేకాదు ఆటకు సంబంధించి ఆయన తెలియజేసే విషయాలు అకాడమీలోని క్రికెటర్లకు జీవితాకాలం ఉపయోగపడతాయి. ప్రతి ఏడాది గురుపూర్ణిమ రోజున సచిన్ సహా శిష్యరికం చేసిన ప్రముఖ క్రికెటర్లంతా అచ్రేకర్‌ను కలవడం సంప్రదాయంగా మార్చుకున్నారు. 2013లో తన రిటైర్మెంట్ రోజున సచిన్ మాట్లాడుతూ 'నేను బాగా ఆడానని సర్ ఎప్పుడూ అనేవారు కాదు. ఎందుకంటే ఆ ప్రశంసతో నాలో ఉదాసీనత ఏర్పడుతుందని ఆయన భావన. సర్ ఇకపై నేను ఏ మ్యాచ్‌లు ఆడేది లేదు. కెరీర్‌లో బాగా ఆడావు అన్న మీ నోటిమాటకోసం ఎదురు చూస్తున్నా' అని అనడం అచ్రేకర్ పట్ల సచిన్ గురుభక్తికి తార్కాణంగా నిలుస్తుంది. అచ్రేకర్ మృతిపట్ల మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, భారత క్రికెట్ బోర్డుతోపాటు మాజీ క్రికెటర్లు కాంబ్లీ, చంద్రకాంత్ పండిట్, అజిత్ అగార్కర్, ప్రవీణ్ ఆమ్రే తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.



భారతరత్నను గురువుకి చూపుతున్న సచిన్

ఏదైనా సాధ్యమే!

పని చేసే అమ్మలకు సెరెనా స్ఫూర్తి సందేశం



పెర్త్: నూతన సంవత్సరం సందర్భంగా 'ఏదైనా సాధ్యమే' అంటూ పని, కుటుంబ బాధ్యతలను చక్కబెట్టుకొస్తున్న అమ్మలు, నాన్నలకు టెన్నిస్ స్టార్ సెరెనా విలియమ్స్ స్ఫూర్తిదాయక సందేశాన్నిచ్చింది. తన కుమార్తె అలెక్సిస్ ఒలింపియాను ఎత్తుకుని ఎక్సర్‌సైజ్‌లు చేస్తున్న ఫొటోను సెరెనా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసింది. 'ఏదైనా సాధ్యమే. ఈ ఏడాది తొలి మ్యాచ్ కోసం నేను సిద్ధమవుతున్నా. కానీ, అలసి పోయిన నా కుమార్తె అమ్మ ప్రేమను కోరుకుంటోంది. నేను నా కూతుర్ని ఎత్తుకునే వామప్ చేస్తున్నాననేది దీని అర్థం. ఈ విషయంలో వర్కింగ్ మామ్స్, డాడ్స్, గృహిణులే నాకు స్ఫూర్తి' అని సెరెనా పోస్టు చేసింది. 'మీ స్టోరీల ద్వారా నేనూ చేయగలనని తెలుసుకున్నాను. అందరికీ హృదయపూర్వక ధన్యవాదాల'ని చెప్పింది.

మెరిసిన శ్రీకాంత్

ఢిల్లీపై నెగ్గిన బెంగళూరు



అహ్మదాబాద్: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో కిడాంబి శ్రీకాంత్, హి ర్యాంగ్ వు మెరవడంతో బెంగళూరు ర్యాప్టర్స్ గెలిచింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు ర్యాప్టర్స్ 2-1తో ఢిల్లీ డాషర్స్‌పై నెగ్గింది. ట్రంప్‌గా ఎంచుకున్న తొలి రెండు మ్యాచ్‌ల్లో ఇరుజట్లూ అనూహ్యంగా ఓడడంతో స్కోరు సమమైంది. అయితే, పురుషుల సింగిల్స్‌లో బరిలోకి దిగిన కిడాంబి ర్యాప్టర్స్‌ను ఆధిక్యంలో నిలిపాడు. శ్రీకాంత్ 15-6, 12-15, 15-10తో టామీ సుగియార్తోపై గెలిచాడు. తొలి గేమ్‌లో కిడాంబి జోరు ముందు నిలవలేక పోయిన సుగియార్తో.. రెండో గేమ్‌లో పుంజుకుని 1-1తో స్కోరు సమం చేశాడు. కానీ, నిర్ణాయక మూడో గేమ్‌లో ఇరువురు షట్లర్లు తీవ్రంగా పోరాడినా 8-4తో ఆధిక్యంలోకి దూసుకెళ్లిన శ్రీకాంత్.. 15-10తో నెగ్గి ర్యాప్టర్స్‌కు ఒక పాయింట్ అందించాడు. లీగ్‌లో వరుసగా మూడో విజయాన్ని సాధించాడు. తర్వాత జరిగిన మహిళల సింగిల్స్‌లో హి ర్యాంగ్ వు 12-15, 15-3, 15-8తో చి సిన్ లిపై గెలిచి.. 2-0తో బెంగళూరు విజయాన్ని ఖరారు చేసింది. కాగా, ఆఖరి మ్యాచ్‌గా జరిగిన పురుషుల డబుల్స్‌లో మనీపోంగ్ జోంగ్‌జిట్-చి బియో జోడీ 15-7, 11-15, 15-14తో మహమ్మద్ అహసాన్-హెంద్ర సెథియావాన్‌పై నెగ్గి ఢిల్లీకి ఓదార్పును అందించింది. అంతకు ముందు పురుషుల సింగిల్స్‌గా జరిగిన తొలి మ్యాచ్‌లో సాయి ప్రణీత్ 15-12, 14-15, 15-13తో హెచ్‌ఎస్ ప్రణయ్‌పై నెగ్గి బెంగళూరుకు 1-(-1)తో శుభారంభం అందించాడు. అయితే ఈ మ్యాచ్‌ను ఢిల్లీ ట్రంప్‌గా ఎంచుకోవడంతో ఒక పాయింట్ కోత పడింది. కానీ, బెంగళూరు ట్రంప్‌గా ఎంచుకున్న మిక్స్‌డ్ డబుల్స్‌లో మార్కస్ ఎలీస్-లారెన్ స్మిత్ జోడీ 13-15, 9-15తో మనీపోంగ్ జోంగ్‌జిట్-ఎవగీనియా చేతిలో పరాజయంపాలైంది. తర్వాత జరిగిన మ్యాచ్‌లో శ్రీకాంత్ నెగ్గి ర్యాప్టర్స్‌ను లీడ్‌లోకి తీసుకొచ్చాడు.

పీబీఎల్‌లో నేడు

పుణె x చెన్నై (రా. 7 గం.)

స్టార్ స్పోర్ట్స్-1లో

హైదరాబాద్ ఆశలు గల్లంతు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఈ రంజీ సీజన్‌లో హైదరాబాద్ నాకౌట్ ఆశలు గల్లంతయ్యాయి. ఆంధ్రతో తమ ఆఖరి గ్రూప్-బి రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ డ్రాతో గట్టెక్కింది. అక్షత్‌రెడ్డి (98 బంతుల్లో 10 ఫోర్లు, సిక్సర్‌తో 65), హిమాలయ్ అగర్వాల్ (93 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 60 నాటౌట్) అర్ధ సెంచరీలతో రాణించడంతో.. ఓవర్‌నైట్ స్కోరు 33/0తో చివరి రోజైన బుధవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ ఆట ముగిసే సమయానికి 5 వికెట్లకు 251 పరుగులు చేసి మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. దీంతో ఈ విభాగంలో అక్షత్‌రెడ్డి సేన 8 మ్యాచ్‌ల్లో 17 పాయింట్లతో ఆరో స్థానానికి పరిమితమైంది. ఓపెనర్లు తన్మయ్ అగర్వాల్ (18), ఠాకూర్ తిలక్‌వర్మ (34) స్వల్ప స్కోర్లకే అవుటయ్యాక.. సందీప్ (45)తో మూడో వికెట్‌కు కెప్టెన్ అక్షత్‌రెడ్డి 84 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి ఆదుకున్నాడు. ఇక చివర్లో హిమాలయ్.. టెయిలెండర్ల సహకారంతో వికెట్ల పతనం అడ్డుకున్నాడు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 271, ఆంధ్ర 502/7 (డిక్లేర్డ్) స్కోర్లు చేశాయి. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా ఆంధ్రకు 3, హైదరాబాద్‌కు ఒక పాయింట్ లభించింది.



క్వార్టర్స్‌లో నిఖత్ జరీన్

విజయనగర (కర్ణాటక): జాతీయ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ పతకానికి అడుగు దూరంలో నిలుస్తూ క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. 64కిలోల విభాగం ప్రీక్వార్టర్స్‌లో నిఖత్ 5-0తో ఏపీ బాక్సర్ లిఖితపై గెలిచింది. తెలంగాణకు చెందిన ప్రసన్న లక్ష్మి (60 కి), ఏపీ అమ్మాయి జ్యోతి (57 కి) ప్రీక్వార్టర్స్‌లో ప్రత్యర్థి చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించారు.



పంత్.. స్లెడ్జింగ్ చేసింది నువ్వే కదా?

కాన్‌బెర్రా: భారత్-ఆస్ట్రేలియా క్రికెటర్ల మధ్య జరుగుతున్న మాటల యుద్ధం ప్రస్తావన ఆసీస్ ప్రధాని స్కాట్ మోరిసన్ వరకు చేరింది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఇరు జట్ల సభ్యులను మోరిసన్ విందుకు ఆహ్వానించారు. ప్రధాని అధికారిక నివాసానికి చేరుకున్న తర్వాత టీమ్ మేనేజర్ సునీల్ సుబ్రమణియం భారత క్రికెటర్లను మోరిసన్‌కు పరిచయం చేశారు. ఈ సందర్భంగా రిషభ్ పంత్‌ని పరిచయం చేయగా మోరిసన్ వెంటనే 'స్లెడ్జింగ్ చేసింది నువ్వే కదా. నీ మాటలను స్వాగతిస్తున్నాం. మేము పోటీతత్వాన్ని ఆస్వాదిస్తాం' అని అన్నారు. దీనికి పంత్ నేనే అని తల ఊపి.. చిన్నగా నవ్వుతూ బదులిచ్చాడు.

ప్రొ కబడ్డీలో నేడు

క్వాలిఫయర్ -2 (రాత్రి 8 గం.)

గుజరాత్ x యూపీ యోధ

స్టార్ స్పోర్ట్స్ -2, స్టార్ మా గోల్డ్‌లో..

ప్రధాని అభ్యర్థిగా మమత!



దాదాపుగా ప్రకటించిన తృణమూల్

కోల్‌కతా, జనవరి 2: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత మమతా బెనర్జీని 2019 సార్వత్రిక ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ తమ ప్రధాని అభ్యర్థిగా దాదాపుగా ప్రకటించింది. లౌకి క, ప్రగతిశీల భారతావని నిర్మాణం కోసం ఆమె సారథ్యంలో కలసి పని చేద్దామని పార్టీ ఎంపీ, మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీ ఓ వీడియో సందేశంలో పేర్కొన్నారు. పార్టీ ఆవిర్భవించి 21 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ వీడియో సందేశమిచ్చారు. ప్రధాని పీఠంపై కన్నేసిన మమత- ఆ దిశగా ప్రాంతీయ పార్టీలను చేరదీస్తున్నారు. రాష్ట్రాల వారీగా బీజేపీని- అక్కడ బలంగా ఉన్న ప్రాంతీయ పార్టీలే ఎదుర్కోవాలని, ఆ ప్రాంతీయ పార్టీలకు జాతీయ పక్షాలు, మిగిలిన పార్టీలు మద్దతివ్వాలని ప్రతిపాదించినది ఆమే! ఈ మధ్యే మమతను తెలంగాణ సీఎం కేసీఆర్ కూడా కలిశారు. రాహుల్‌గాంధీని ప్రధాని అభ్యర్థిగా కాంగ్రెస్‌తో పాటు డీఎంకే లాంటి కొన్ని పార్టీలు ప్రొజెక్ట్ చేస్తున్నాయి. దీంతో మమత కాంగ్రె స్-సారథ్య మహాకూటమికి కొద్దినెలలుగా దూరంగా మసలుతున్నారు.. ఈ దశలో ప్రధాని అభ్యర్థిగా ఆమెను తృణమూల్ ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. "2019 ఓ పెద్ద మార్పు తీసుకొచ్చే ఏడాది కావాలి. కార్మికుల కోసం, పీడిత ప్రజల అభ్యున్నతి కోసం ఓ కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని అభిషేక్ బెనర్జీ తన సందేశంలో పేర్కొన్నారు.

గ్రీన్‌కార్డు పరిమితి ఎత్తేస్తారా?

నేడు కాంగ్రెస్‌లో కీలక బిల్లు.. అమలైతే మనోళ్లకే లాభం

వాషింగ్టన్, జనవరి 2: విదేశీయులకు తమ దేశ పౌరసత్వం ఇచ్చే గ్రీన్‌కార్డుల మంజూరుపై అమెరికాలో ఇపుడు కీలక చర్చ జరుగుతోంది. ఇంతవరకూ ఏ దేశానికైనా 7శాతానికి మించి పౌరసత్వం ఇవ్వరాదన్నది నిబంధన. ఈ 7% పరిమితి(పెర్ కంట్రీ లిమిట్) ఎత్తేయాలని కొన్నాళ్ళుగా డిమాండ్లు వస్తున్నాయి. అయితే ఈ కోటా ఎత్తేస్తే ఎక్కువగా లాభపడేది భారత్, చైనాలేనని, గ్రీన్‌కార్డుల్లో సింహభాగం అంటే దాదాపు 90%వారికే దక్కుతుందని అమెరికా కాంగ్రెస్‌కు పనిచేసే స్వతంత్ర అధ్యయన సంస్థ- కంగ్రెషనల్ రిసెర్చ్ సర్వీస్(సీఆర్ఎస్)' ఓ నివేదికలో హెచ్చరించింది. డిసెం బరు 21న ఈ సంస్థ సమర్పించిన నివేదిక ఇపుడు భారతీయ అమెరికన్లలో హాట్ టాపిక్ అయ్యింది. ఈ నివేదిక నేపథ్యంలో గురువారం (జనవరి 3) నుంచి ప్రారంభమయ్యే అమెరికా కాంగ్రెస్ సమావేశాల్లో గ్రీన్‌కార్డుల పరి మితి ఎత్తివేతను కోరుతూ అనేకమంది సభ్యులు బిల్లు ప్రవేశపెట్టనున్నారు. అమెరికా మార్కెట్‌లో వివక్షను రూపుమాపాలన్నది వారి యత్నం. ఇది చట్టంగా రూపుదాల్చితే, అమెరికాలో గ్రీన్‌కార్డు కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న భారతీయుల పంట పండినట్లే. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్ బాగా లాభపడే అవకాశం ఉంది. ప్రస్తుత ఇమిగ్రేషన్ విధానం వల్ల భారత ప్రొఫెషనల్స్ బాగా నష్టపోతున్నారు. అధికారిక గణాంకాల ప్రకారం... నిరుడు ఏప్రిల్ నాటికల్లా గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్న మొత్తం భారతీయుల సంఖ్య 3,06,601. ప్రస్తుత కోటా పద్ధతి వల్ల గ్రీన్‌కార్డు కోసం భారతీయులు కనీసం తొమ్మిదేళ్ల నుంచి 150 సంవత్సరాల దాకా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉంది.

వందేమాతరానికి జనగణమన!

ఎంపీ సచివాలయంలో పాడక్కర్లేదని కొత్త సర్కారు నిర్ణయం

భోపాల్, జనవరి 2: ప్రతి నెలా మొదటి పనిదినాన మధ్యప్రదేశ్ సచివాలయంలో వందేమాతర గీతం ఆలపించాలన్న ఆదేశాలను కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టింది. ఈ నిర్ణయం దురదృష్టకరమని మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మండిపడ్డారు. 13 ఏళ్ల కిందట ఆయన నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వమే 'వందేమాతరం సంప్రదాయం' ప్రవేశపెట్టింది. కాంగ్రెస్ నిర్ణయమెలా ఉన్నా తమ పార్టీ ఎమ్మెల్యేలు 109 మందీ ఈ నెల 7న సచివాలయంలో వందేమాతరం ఆలపిస్తామని, తర్వాతే ప్రమాణ స్వీకారం చేస్తామని చౌహాన్ ప్రకటించారు. మరోవైపు బీజేపీ విమర్శలను ముఖ్యమంత్రి కమల్‌నాథ్ ఖండించారు. వందేమాతరం ఆలపించకపోతే దేశభక్తులు కాదా అని ప్రశ్నించారు.

నేటి నుంచి ఇండియన్ సైన్స్ కాంగ్రెస్

జలంధర్‌లో ప్రారంభించనున్న ప్రధాని

న్యూఢిల్లీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక 106వ భారత సైన్స్ కాంగ్రెస్ గురువారం ప్రారంభం కానుంది. పంజాబ్‌లోని జలంధర్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ లాంఛనంగా ప్రారంభించనున్నారు. లవ్లీ ప్రొఫె షనల్ వర్సిటీలో 7 వరకు జరిగే ఈ సైన్స్ కాంగ్రెస్‌లో 'భవిష్యత్తులో భారత దేశం-శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం' ప్రధానాంశంగా అనేక అంశాలపై విస్తృత చర్చలు జరగనున్నాయి. సైన్స్ కాంగ్రెస్‌లో భాగంగా జనవరి 4న బాలల సైన్స్ కాంగ్రెస్, 5న మహిళా సైన్స్ కాంగ్రెస్, 6న సైన్స్ కమ్యూనిటీస్, 7న ముగింపు కార్యక్రమం జరగనుంది. ఈ సైన్స్ కాంగ్రెస్‌లో నోబెల్ గ్రహీతలు, ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు హాజరుకానున్నారు. కేంద్ర మంత్రి హర్ష వర్ధన్ బుధవారమే జలంధర్ వచ్చి, కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు

24 మంది అన్నాడీఎంకే ఎంపీల సస్పెన్షన్

న్యూఢిల్లీ, జనవరి 2: అన్నాడీఎంకే పార్టీకి చెందిన 24 మంది పార్లమెంటు సభ్యులను లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ సస్పెండ్ చేశారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో భాగంగా బుధవారం రాఫెల్ ఒప్పందంపై చర్చ జరుగుతుండగా.. అన్నాడీఎంకే ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నిరసనలు తెలిపారు. కాగితాలు విసిరేసి సభలో గందరగోళం సృష్టించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన స్పీకర్.. 374(ఏ) నిబంధన ప్రకారం 24 మంది అన్నాడీఎంకే సభ్యులను 5 సిట్టింగ్‌ల పాటు సస్పెండ్ చేశారు. అనంతరం లోక్‌సభను గురువారానికి వాయిదా వేశారు.

నెట్‌లో నెగ్గితేనే ఎస్సీ విద్యార్థులకు ఫెలోషిప్

న్యూఢిల్లీ, జనవరి 2: ఇప్పటివరకు జాతీయ అర్హత పరీక్ష(నెట్)తో సంబంధం లేకుండా ఎస్సీ విద్యార్థులు ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సుల ఫెలోషిప్ పొందే వెసులుబాటు ఉండేది. ఇకపై వారంతా 'నెట్‌లో నెగ్గితేనే ఫెలోషిప్‌కు అర్హులంటూ కేంద్ర సామాజిక న్యాయ, సాధికారతా శాఖ కొత్త నిబంధన తీసుకొచ్చింది. ఈమేరకు యూజీసీకి మార్గదర్శకాలు జారీ చేసింది. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్/నెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినవారే జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్‌నకు అర్హులని పేర్కొంది.

రాఫెల్ తీర్పును సమీక్షించాలి

సుప్రీంలో యశ్వంత్, శౌరి పిటిషన్

న్యూఢిల్లీ, జనవరి 2: రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు వ్యవహారంపై డిసెంబరు 14న ఇచ్చిన తీర్పును సమీక్షించాలంటూ కేంద్ర మాజీ మంత్రులు యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరి, సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ బుధవారం నాడు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. "కేంద్రం సంతకం చేయకుండా, తప్పుడు వివరాలతో సీల్డు కవర్లో ఇచ్చిన అఫిడవిట్‌ను ప్రాతిపదికగా చేసుకుని సుప్రీం బెంచ్ ఆ తీర్పు ఇచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన వివరాలపై మా వాదన వినేందుకు అవకాశం ఇవ్వలేదు. ఇది న్యాయవిఘాతమే" అని వీరు ముగ్గురూ తమ రివ్యూ పిటిషన్లో ఆరోపించారు. "తీర్పులో చాలా లోపాలున్నాయి. ఎఫ్ఐఆర్ నమోదు చేసి సీబీఐ చేత విచారణ జరపాలని ఓ పిల్‌లో కోరాం. దాన్ని ధర్మాసనం స్పృశించనే లేదు.ఫలితంగా- ఒప్పందంలోని వివాదాస్పద అంశాలపై విచారణ జరగడానికి ఆస్కారం లేకుండా పోయింది. రాఫెల్ ఒప్పందంపై విచారణ జరపాల్సిందిగా అక్టోబరు 4నే సీబీఐని మేం సంప్రదించాం. అయితే సీబీఐ ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంతో ఆ ఎఫ్ఐఆర్ కోసం కోర్టును ఆశ్రయించాం. సంస్థాగత దర్యాప్తు లేకుండా చేసి కోర్టు తప్పిదం చేసిందని భావించాల్సి వస్తోంది. పిటిషనర్లు ఇచ్చిన ఫిర్యాదుపై ఏం విచారణ జరిపినదీ సీబీఐ వెల్లడించడానికి కూడా ఆస్కారం లేకుండా పోయింది" అని అందులో పేర్కొన్నారు. 36 యుద్ధవిమానాల కొనుగోలులో అక్రమాలు జరిగినట్లు ఆరోపిస్తూ దాఖలైన అన్ని ప్రజాహిత దావాలను డిసెంబరు 14న కొట్టేస్తూ ఈ ప్రక్రియకు సుప్రీంకోర్టు క్లీన్‌చిట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ కేసు విచారణను బహిరంగ కోర్టులో జరపాలని కూడా యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరి, ప్రశాంత్ భూషణ్ కోరారు.

పర్రీకర్ బెడ్‌రూమ్‌లో రాఫెల్ పత్రాలు!

న్యూఢిల్లీ, జనవరి 2: రాఫెల్ కుంభకోణంలో కాంగ్రెస్ చేతికి సరికొత్త అస్త్రం దొరికింది. ఈ ఒప్పందానికి సంబంధించిన అన్ని పత్రాలు తన బెడ్‌రూమ్‌లోనే ఉన్నాయంటూ ఒకప్పటి రక్షణమంత్రి, ప్రస్తుత గోవా సీఎం మనోహర్ పర్రీకర్ చెప్పినట్లు ఆ రాష్ట్ర ఆరోగ్య మంత్రి విశ్వజిత్ రాణే చేసిన వ్యాఖ్యలతో కూడిన ఆడియో క్లిప్‌ను ఆ పార్టీ విడుదల చేసింది. బుధవారం కాంగ్రెస్ ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా పార్లమెంట్ ఎదుట దాన్ని మీడియాకు విడుదల చేశారు. అందులోని గొంతు విశ్వజిత్‌దిగా చెబుతున్నప్పటికీ ఆ విషయం ఇంకా నిర్ధారణ కాలేదు. ఆయన ఎవరితో మాట్లాడుతున్నారో కూడా రూఢీ కాలేదు. గతవారం జరిగిన కేబినెట్ భేటీలో సీఎం పర్రీకర్ ఈ వ్యాఖ్యలు చేశారని పేర్కొన్న సుర్జేవాలా... దీనిపై ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ కాపలాదారుడే దొంగ అన్న విషయం ఇప్పుడు స్పష్టంగా తెలిసిపోయిందని ప్రధానిని ఉద్దేశించి ఆయన పరోక్షంగా విమర్శించారు. 'పర్రీకర్

కేబినెట్‌లో సీఎం చెప్పారు.. మరొకరితో సంభాషణలో గోవా మంత్రి వెల్లడి



బెడ్‌రూమ్‌లో రాఫెల్ స్కాంకు సంబంధించి ఏ రహస్యాలు దాచిపెట్టారో ప్రజలకు మోదీ సమాధానం చెప్పాలి. పర్రీకర్‌ను చూసి చౌకీదార్ ఎందుకు భయపడుతున్నారు. మోదీ కొన్ని ప్రత్యేక ఇంటర్వ్యూలలో మాత్రమే మాట్లాడుతున్నారు. మీడియా అడిగే ప్రశ్నలకు మాత్రం సమాధానం చెప్పడం లేదు. దేశ కాపలాదారుడే కొన్ని రహస్యాలను దాచారని ఈ కొత్త సాక్ష్యం స్పష్టం చేస్తోంది. పత్రాలను బహిర్గతం చేయడంలో ఆయనకున్న అభ్యంతరం ఏమిటి? ఈ స్కాంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) వేయకపోవడానికి ఇదే కారణమా?' అని సుర్జేవాలా ప్రశ్నించారు. 'రాఫెల్ ఒప్పందంలో అవినీతి జరిగింది. దానికి సంబంధించిన పత్రాలు పర్రీకర్ వద్ద ఉన్నాయి. వాటిని తన బెడ్‌రూమ్‌లో దాచుకున్న ఆయన.. తనకు వ్యతిరేకంగా ఎవరూ ఏమీ చేయలేరని అందరినీ భయపెడుతున్నారు.' అని ఆరోపించారు. ఈ ఒప్పందం దేశంలోనే అతిపెద్ద స్కాం అని తాము చెబుతున్నదంతా ఆ పత్రాలు బయటకొచ్చిన రోజు నిజమని రుజువు అవుతుందన్నారు. ఈ వ్యవహారానికి ప్రధానమంత్రే జవాబుదారీ అని, దాచిన ఫైళ్లను పర్రీకర్ బహిర్గతం చేయాలని సుర్జేవాలా డిమాండ్ చేశారు. కాగా, ఈ ఆరోపణలను గోవా మంత్రి విశ్వజిత్ కొట్టిపారేశారు. రాఫెల్ పత్రాల గురించి పర్రీకర్ ఎన్నడూ అలాంటి వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేశారు. ఎడిట్ చేసిన ఆడియో టేపులతో కేబినెట్‌కు, సీఎంకు మధ్య చిచ్చు పెట్టడానికే కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. దీనిపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని పర్రీకర్‌కు లేఖ రాసినట్లు చెప్పారు. రాఫెల్ ఒప్పందంలో వాస్తవాలను మసకబార్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని పర్రీకర్ ఆరోపించారు.

> మన ముఖ్యమంత్రి అమితాసక్తి కలిగించే కీలక వ్యాఖ్య చేశారు. రాఫెల్‌కు సంబంధించిన ప్రతి పత్రం తన బెడ్‌రూమ్‌లో ఉందని చెప్పారు. దేన్నో దాచడానికే ఆయన వాటిని తనవద్ద ఉంచుకున్నారు. ఈ ఒప్పందానికి సంబంధించిన సమాచారం అంతా తన ఫ్లాట్‌లోనే ఉందన్నారు.
>
> *- ఓ అజ్ఞాత వ్యక్తితో గోవా మంత్రి విశ్వజిత్ రాణే*



అంతా పచ్చి దగా!

'పర్రీకర్ టేపు'లతో స్పష్టంగా తేలింది.. రాఫెల్‌పై జేపీసీ వేయాల్సిందే

విమానాల సంఖ్య 36కు ఎందుకు తగ్గింది?.. ధర 1600 కోట్లకు ఎలా పెరిగింది?

- **దమ్ముంటే మోదీ బదులివ్వాలి**
- **లోక్‌సభలో రాహుల్ సవాల్**
- **తిప్పికొట్టిన కేంద్ర మంత్రి జైట్లీ**

న్యూఢిల్లీ, జనవరి 2: రాఫెల్‌పై అధికార, విపక్షాల మధ్య 'యుద్ధం' జరిగింది. 'రాఫెల్ ఫైళ్లన్నీ నా పడక గదిలో ఉన్నాయి' అని మాజీ రక్షణ మంత్రి, గోవా ముఖ్యమంత్రి మనోహర్ పర్రీకర్ మరొకరితో అన్నట్లుగా విడుదలైన ఆడియో విపక్షాల చేతికి కొత్త అస్త్రంగా మారింది. లోక్‌సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ రెచ్చిపోయారు. 'ఆడియో టేపులు వినిపిస్తా' అని హెచ్చరించారు. దీంతో బీజేపీ సభ్యులు మండిపడ్డారు. అటు స్పీకర్ సుమిత్రా మహాజన్ సైతం రాహుల్‌ను నిలువరించారు. టేపులు నిజమైనవో కావో నిర్ధారించుకోవాల్సిన అవసరముందన్నారు. దీంతో రాహుల్ వెనక్కి తగ్గినప్పటికీ.. టేపుల్లో ఉన్న సంభాషణలను చదివి వినిపించేందుకు సిద్ధమయ్యారు. దీనినీ బీజేపీ సభ్యులు అడ్డుకున్నారు. రాఫెల్ అంశంపై 193వ నిబంధన కింద బుధవారం లోక్‌సభలో రాహుల్ చర్చ ప్రారంభించారు. మోదీకి మూడు ప్రశ్నలు సంధిస్తూ.. దమ్ముంటే సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. "యుద్ధ విమానాల సంఖ్యను 126 నుంచి 36కు ఎవరు తగ్గించారు? అత్యవసరం పేరిట కొంటున్నామన్నప్పుడు ఇప్పటిదాకా ఒక్క విమానం కూడా మన చేతికి ఎందుకు రాలేదు? ఒక్కో విమానం ధర



రూ.526 కోట్ల నుంచి 1600 కోట్లకు ఎలా పెరిగింది?" అని నిలదీశారు. "దేశం మొత్తం నేరుగా ప్రధానమంత్రినే ప్రశ్నిస్తోంది. ఈ ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పాలి" అని రాహుల్ డిమాండ్ చేశారు.

అనిల్ అంబానీ అలియాస్ ఏఏ

రాఫెల్ ఆఫ్‌సెట్ కాంట్రాక్టును హెచ్ఏఎల్ నుంచి అనిల్ అంబానీకి కట్టబెట్టారని రాహుల్ మరోసారి ఆరోపించారు. దీనిపై స్పీకర్ సుమిత్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'సభలో లేని వ్యక్తి పేరు ప్రస్తావించవద్దు' అని చెప్పడంతో, 'సరే ఆయన్ను ఏఏ అని పిలుస్తా' అంటూ దాడి కొనసాగించారు. దీనిపైనా బీజేపీ సభ్యులు మండిపడటంతో 'ఏంటి మిస్టర్ అంబానీ బీజేపీ సభ్యుడా?' అని ఎద్దేవా చేశారు. "మొత్తం వ్యవహారాన్ని గోవా మంత్రి బయట పెట్టారు. రాఫెల్ ఫైళ్లు తన ఫ్లాట్‌లో ఉన్నాయని కేబినెట్ సమావేశంలోనే చెప్పినట్లు తెలిపారు. రాఫెల్‌లో ఏదో కొంత తేడా జరిగిందనుకున్నాం. కానీ, ధర సంగతి బయటపడింది! 'ఏఏ' విషయం బయటపడింది. ప్రక్రియలో తప్పులు బయటపడ్డాయి. దాల్ మే కాలా నహీ.. పూరా దాల్ కాలా హై (కొంచెం తేడా కాదు.. మొత్తానికి మొత్తమే దగా)" అని రాహుల్ విరుచుకుపడ్డారు. దీనిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాల్సిందేనని డిమాండ్ చేశారు. "రాఫెల్ అంశం కోర్టు పరిధిలోకి రాదని మాత్రమే సుప్రీం స్పష్టం చేసింది. జేపీసీ అవసరం లేదని చెప్పలేదు" అని తెలిపారు. కావేరీ వివాదంపై అన్నా డీఎంకే సభ్యులు చేస్తున్న ఆందోళనల మధ్యే రాహుల్ కేంద్రంపై తన దాడి కొనసాగించారు. తమ ప్రశ్నలను ఎదుర్కొనే ధైర్యం మోదీకి లేదని... అందుకే పార్లమెంటుకు ముఖం చాటేస్తున్నారని విమర్శించారు. రక్షణ మంత్రి అన్నా డీఎంకే సభ్యుల ఆందోళన వెనుక 'రక్షణ' పొందుతున్నారని అన్నారు.



జేమ్స్ బాండ్ చెప్పినట్లు...

> రాహుల్ జేమ్స్‌బాండ్ సినిమాలు బాగా చూస్తున్నట్లుంది. ఒకసారి జరిగితే... దానంతటది జరిగినట్లు. రెండోసారి జరిగితే యాదృచ్ఛికంగా జరిగినట్లు. మూడోసారి కూడా జరిగిందంటే... అది కుట్రే! అని జేమ్స్‌బాండ్ చెబుతారు. కాంగ్రెస్ హయాంలో బోఫోర్స్, నేషనల్ హెరాల్డ్, అగస్టా వెస్ట్‌ల్యాండ్ కుంభకోణాలు చోటు చేసుకున్నాయి!
>
> *- అరుణ్ జైట్లీ, రక్షణ మంత్రి*



బాండ్ చెప్పింది అది కాదు..

> అరుణ్‌జైట్లీ జేమ్స్‌బాండ్ డైలాగ్‌ను వక్రీకరించారు. ఒకసారి జరిగితే... దానంతటది జరిగినట్లు. రెండోసారి జరిగితే యాదృచ్ఛికంగా జరిగినట్లు. మూడోసారి కూడా జరిగిందంటే... అది శత్రువుల పని! అనేది బాండ్ డైలాగ్. అంతేతప్ప జైట్లీ చెప్పినట్లుగా కుట్ర కాదు.
>
> *- సౌగతా రాయ్, తృణమూల్ ఎంపీ*

'మిస్టర్ క్యూ' మాటేమిటి: జైట్లీ

రాఫెల్‌పై రాహుల్ పదేపదే అవాస్తవాలు చెబుతున్నారని ఆర్థిక మంత్రి జైట్లీ మండిపడ్డారు. "గతంలో నాకూ, ఫ్రాన్స్ అధ్యక్షుడికీ మధ్య జరిగిన సంభాషణ అంటూ తప్పుడు వివరాలు బయటపెట్టారు. ఇప్పుడూ ఒక టేపును బయటపెట్టారు. కానీ, అది నిజమైనదో కాదో అని రాహుల్ కూడా భయపడుతున్నారు" అని ఎద్దేవా చేశారు. అనిల్ అంబానీ గురించి రాహుల్ 'ఏఏ' అని ప్రస్తావించడంతో జైట్లీ అందుకు పోటీగా 'క్యూ' మాటెత్తారు. బోఫోర్స్ కేసులో నిందితుడైన ఒటావియో ఖత్రోకీ సోనియా కుటుంబానికి సన్నిహితుడని పరోక్షంగా గుర్తు చేశారు. రాఫెల్‌పై సందేహమేమీ లేదని సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తు చేశారు. ఇక దీనిపై జేపీసీ వేసే ప్రసక్తేలేదన్నారు. కాంగ్రెస్ కుదుర్చుకున్న ఒప్పందంతో పోల్చితే ఒక్కో విమానం ధర 9 శాతం తగ్గిందని తెలిపారు. విమానాలు అందించేందుకు చాలా సమయం పడుతుందని హెచ్ఏఎలే చెప్పిందన్నారు. 'కొందరు వ్యక్తులు, కుటుంబాలకు డబ్బుల గురించి మాత్రమే తెలుస్తుంది. దేశ భద్రత గురించి తెలియదు' అంటూ సోనియా కుటుంబంపై విమర్శలు గుప్పించారు.



ఎగిరిన కాగితపు విమానాలు!

రాఫెల్‌పై చర్చ సందర్భంగా అధికార, విపక్ష సభ్యులు రచ్చ రచ్చ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విపక్ష సభ్యులు కాగితాలను విమానాల్లా మార్చి సభలో ఎగురవేశారు. 'చౌకీదార్ చోర్ హై' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీనికి పోటీగా బీజేపీ సభ్యులు 'అమ్మా బేటా చోర్ హై' అని నినదించారు. అధికార, విపక్షాల పోటాపోటీ ఆందోళనలు, నినాదాల మధ్య స్పీకర్ సభను రెండుసార్లు వాయిదా వేశారు. 'మీరంతా చిన్న పిల్లలా' అంటూ ఎంపీలపై మండిపడ్డారు. మూడోసారి తిరిగి సమావేశమయ్యాక జైట్లీ సమాధానమిచ్చారు.

నెలాఖర్లోగా కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక!

న్యూఢిల్లీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ , మేనెలల్లో జరుగునున్న లోక్ సభ ఎన్నికలు, కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు జనవరి నెలాఖరులోపే పార్టీని సంస్థాగతంగా అన్ని స్థాయిల్లో సమాయత్తం చేయాలని, బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి దాకా అన్ని నియామకాలూ నెలాఖర్లోపే చేసెయ్యాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ మేరకు అగ్ర నేతలు.. పార్టీ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులకు ఆదేశాలిచ్చారు. అభ్యర్థుల తాత్కాలిక ఎంపిక, పొత్తుల ఖరారు కూడా అప్పట్లోగానే జరిగిపోవాలని అభిప్రాయపడ్డారు. బీజేపీకి అర్థబలం, అంగబలం మెండుగా ఉన్నందున- క్రింది స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేసి జనంలోకి వెళ్లడం ద్వారానే గట్టి సవాల్ ఇవ్వగలమని వారు అంటున్నారు. కోర్ కమిటీ నేతలు ఏకే ఆంటోనీ గులాంనబీ ఆజాద్, ఖర్గే, మొయిలీ, అంబికా సోనీ, జైరామ్ రమేశ్, చిదంబరం, అహ్మద్ పటేల్ మొదలైన వారి సారథ్యంలో ఢిల్లీలోని గురుద్వారా రికాబ్ గంజ్ లో దాదాపు రెండు గంటల పాటు జరిగిన వార్ రూమ్ సమావేశంలో పార్టీ నేతలకు రాబోయే రోజుల్లో అమలు చేయాల్సిన కార్యాచరణ ప్రణాళికను, మార్గదర్శక సూత్రాలను ప్రకటించారు. దాదాపు అన్ని రాష్ట్రాలకు సంబంధించి ఏఐసిసి ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జేడీ శీలం, గిడుగు రుద్రరాజు, శైలజా నాథ్, తెలంగాణ నుంచి మధు యాష్కీ, వంశీచంద్ రెడ్డి, సంపత్ కుమార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

దమ్ముంటే ముఖాముఖి చర్చకు రా!

మోదీకి రాహుల్ సవాల్

న్యూఢిల్లీ, జనవరి 2: లోక్‌సభలో జరిగిన చర్చలో ఆడియో టేపుల బాంబు పేల్చిన కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ- బుధవారం రాత్రి మీడియా సమావేశం ఏర్పాటు చేసి కేంద్రంపై తన దాడిని తీవ్రం చేశారు. "ఒక్క 20 నిమిషాలు చాలు.. దమ్ముంటే నాతో ముఖాముఖి చర్చకు రమ్మనండి. నేనడిగే వాటికి బదులివ్వమనండి-చూద్దాం!" అని ఆయన ప్రధాని మోదీకి సవాల్ విసిరారు. నాతో చర్చకొచ్చే ధైర్యం ఆయనకు లేదు అని హేళన చేశారు. "రాఫెల్ ఒప్పందంపై జేపీసీ విచారణ గనక జరిగితే రెండే పేర్లు బయటికొస్తాయి. ఒకటి మోదీ కాగా రెండోది అనిల్ అంబానీ" అని రాహుల్ పునరుద్ఘాటించారు. మాజీ రక్షణమంత్రి, ప్రస్తుత గోవా సీఎం మనోహర్ పర్రీకర్ బెడ్రూంలో దాచిన రాఫెల్ ఫైల్లో ఏముందో తేలాలని డిమాండ్ చేశారు. "పర్రీకర్ దేశ ప్రధానిని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు.. అసలు పర్రీకర్ దగ్గరున్న ఫైల్లో ఏముంది? ఆ డాక్యుమెంట్లేమిటి? మోదీపై, దేశ భద్రతపై వాటి ప్రభావమెంత? అన్నది తేలాలి" అని రాహుల్ పేర్కొన్నారు. ఒక్కో రాఫెల్ యుద్ధవిమానం ధర 1600 కోట్లని రాహుల్‌కెవరు చెప్పారోనన్న కేంద్ర మంత్రి జైట్లీ హేళనపై ఆయన స్పందించారు. "మొత్తం డీల్ రూ.58,000 కోట్లని సాక్షాత్తూ ప్రభుత్వమే చెప్పింది. కొంటున్నది 36 యుద్ధవిమానాలు. మరి 58,000ని 36తో భాగహారిస్తే ఎంత వస్తుంది? 1611 రాదా?" అని రాహుల్ ఎదురు ప్రశ్న వేశారు.

అయ్యప్ప గుడిలోకి ఇద్దరు మహిళలు

బుధవారం తెల్లవారుజామున స్వామి దర్శనం

శబరిమల/తిరువనంతపురం, జనవరి 2: శబరిమల గుడిలోకి మహిళల ప్రవేశాన్ని అడ్డుకోరాదంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన మూడు నెలల తర్వాత .. తొలిసారి ఇద్దరు నిషేధిత వయస్కులైన మహిళలు అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించగలిగారు. బుధవారం తెల్లవారుజామున 3.38 గంటల సమయంలో.. ఇంకా చీకట్లు కమ్ముకునే ఉన్న సమయంలో కేరళకు చెందిన కనకదుర్గ (44), బిందు (42) నల్లని దుస్తులు, ముఖాన్ని కప్పేలా ముసుగులు ధరించి.. దాదాపు పాతిక మంది మఫ్టీ పోలీసుల భద్రతతో గుడిలోకి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం పోలీసులు వారిని గుర్తుతెలియని ప్రాంతానికి తరలించారు. వారికి ముప్పు పొంచి ఉన్నందున వారి నివాసాల వద్ద భద్రత ఏర్పాటు చేశారు. కనకదుర్గ, బిందు ఆలయంలోకి వెళ్తున్న దృశ్యాలను స్థానిక టీవీ చానళ్లు ప్రసారం చేయడంతో ఈ విషయం ప్రపంచానికి తెలిసింది. కేరళ సీఎం పినరయి విజయన్ ఈ వార్తను ధ్రువీకరించారు. కాగా.. అయ్యప్ప ఆలయంలోకి నిషేధిత వయస్కులైన మహిళలు వచ్చిన విషయం తెలియగానే.. ఆలయ ప్రధాన పూజారి అక్కడున్న భక్తులను బయటకు పంపి గర్భగుడి తలుపులు మూసేశారు. గంటసేపు శుద్ధిపూజలు నిర్వహించి ఆ తర్వాత మళ్లీ భక్తుల దర్శనార్థం ద్వారాలు తెరిచారు. అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశంపై దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి. శబరిమల కర్మ సమితి, అంతర్జాతీయ హిందూ పరిషత్.. గురువారం కేరళ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఇది హిందువులపై పట్టపగలు అత్యాచారం లాంటిదని.. రాష్ట్రప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని కేంద్ర మంత్రి అనంత్‌హెగ్డే అన్నారు. అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశం సీఎం తలబిరుసుతనానికి నిదర్శనమని కాంగ్రెస్ నేత రమేశ్ చెన్నితల విమర్శించారు. సీపీఎం సర్కారు అయ్యప్ప భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని కేరళ బీజేపీ అధ్యక్షుడు పీఎస్ శ్రీధరన్‌పిళ్లై ఆగ్రహం వ్యక్తం చేశారు. పినరయిని ఆధునిక ఔరంగజేబుగా అభివర్ణించారు.



ఆలయాన్ని సంప్రోక్షణ చేస్తున్న పూజారులు

గతంలో ఒకసారి విఫలయత్నం

అయ్యప్పస్వామిని బుధవారం తెల్లవారుజామున దర్శించుకున్న బిందు అమ్మిని..సీపీఐ(ఎంఎల్) కార్యకర్త. కోళికోడ్ జిల్లాలోని కోయిలాండిలో ఒక కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఇక, కనకదుర్గ.. మలప్పురంలోని అంగడిపురంలో పౌరసరఫరాల విభాగంలో ఉద్యోగిని. వీరిద్దరూ గత ఏడాది డిసెంబరులో కూడా అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు ప్రయత్నం చేశారు. కానీ.. భక్తులు అడ్డుకోవడంతో వారి ప్రయత్నం విఫలమైంది. ఈసారిమాత్రం తమను ఎవరూ అడ్డుకోలేదని బిందు తెలిపారు. తామిద్దరమూ హక్కుల కార్యకర్తల్లా కాక యాత్రికులుగానే ఆలయానికి వెళ్లామని ఆమె వివరించారు.

దేశమంతా రైతుబంధు?

ఎకరాకు, పంటకు రూ 4వేలు.. 2 పంటలకూ 8వేలు

- **అదనంగా లక్ష దాకా వడ్డీ లేని రుణం!**
- **మోదీ సర్కార్ వరం?.. ఈవారంలో ప్రకటించే అవకాశం**

న్యూఢిల్లీ, జనవరి 2: సార్వత్రిక ఎన్నికలకు దేశ రైతాంగానికి వరాల మూట ప్రకటించే దిశగా నరేంద్ర మోదీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. తాజా సమాచారం ప్రకారం.. తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు పథకాన్ని యథాతథంగా దేశవ్యాప్తంగా అమలు చేయనున్నారు. అంటే పంటకు ఎకరాకు 4000 రూపాయల చొప్పున ఏడాదికి 2 పంటలకు 8000 రూపాయల మొత్తాన్ని రైతుల ఖాతాల్లో నేరుగా జమచేయాలని (డీబీటీ), దీనికి తోడు లక్ష రూపాయల దాకా వడ్డీలేని పంటరుణాన్ని ఇవ్వాలని భావిస్తోంది. బ్యాంకులు ఇప్పటికే 4% రుణాన్ని వసూలు చేస్తున్నాయి. దీన్ని జీరో శాతం చేయడానికి కేంద్రం ప్రయత్నిస్తోంది. దేశవ్యాప్తంగా రైతుబంధు పథకం అమలుకు దాదాపు 2లక్షల కోట్ల రూపాయల దాకా ఖర్చవుతుందని అంచనా. వడ్డీలేని రుణాలకు దాదాపు 30వేల కోట్లు ఖర్చు చేయాలి. ఇప్పటిదాకా ఎరువుల సబ్సిడీ కింద ఇస్తున్న రూ 70 వేల కోట్ల స్కీమును, మరికొన్ని చిన్న చిన్న వ్యవసాయ సహాయ పథకాలను ఇందులో కలిపేస్తారు. దీనికి సంబంధించిన ప్రకటన ఈ వారంలోనే వెలువడే అవకాశం ఉంది. కాగా- ఎరువుల సబ్సిడీ ఎప్పట్నుంచో అమలవుతూనే ఉంది. దీన్ని ఎత్తేసి రాష్ట్రాలన్నింటినీ ఈ డీబీటీ స్కీంలోకి తేవాలి. వ్యవసాయం రాష్ట్ర జాబితాలో ఉన్న అంశం. ఇప్పటికే చాలా రాష్ట్రాలు రకరకాల వ్యవసాయ సహాయ పథకాలను అమలు చేస్తున్నాయి. వాటిని అర్థంతరంగా ఎత్తేయడం కుదరదు. ఈ దశలో రైతుబంధు తరహా స్కీముకు 70:30 నిష్పత్తిలో భారం భరించాలన్నది కేంద్రం సూచన. మొత్తం భారాన్ని కేంద్రమే భరించాలన్నది రాష్ట్రాల వాదన. ఎక్కువ రాష్ట్రాలు తమ పార్టీ ఆధీనంలోనే ఉన్నందున పెద్ద ఇబ్బందేమీ ఉండదని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంచనావేస్తోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.